సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 265

సోమవారం 16-12-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'



చైనాపై భారత్‌దే పైచేయి

ఆసియా కప్ జూనియర్ మహిళల హాకీ టైటిల్ నిలబెట్టుకున్న భారత్ -14లో



స్టాక్స్‌పై 'టీనేజీ' పాఠాలు

యుక్త వయసు నుంచే ఈక్విటీ మార్కెట్‌పై అవగాహన -15లో



లొంగుబాటా.. దాడులా?

లొంగిపోతారో లేదా తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారో తేల్చుకోవాలని నక్సలైట్లను అమిత్ షా హెచ్చరించారు.


- వివరాలు 6లో



మహా కేబినెట్ విస్తరణ

మహారాష్ట్రలో బీజేపీ సారథ్యంలోని మహాయుతి సంకీర్ణ ప్రభుత్వం 39 మందితో మంత్రివర్గాన్ని విస్తరించింది.

- వివరాలు 6లో



అసెంబ్లీ పునఃప్రారంభం

అసెంబ్లీ శీతాకాల సమావేశాలు సోమవారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. అసెంబ్లీ, మండలి ఉదయం 10:30కు భేటీ కానున్నాయి.

- వివరాలు 2లో



జాకీర్ ఆరోగ్యం అత్యంత విషమం


ప్రఖ్యాత తబలా దిగ్గజం జాకీర్ హుస్సేన్ ఆరోగ్యం విషమించింది. అమెరికాలోని ఓ ఆస్పత్రిలో ఆయన చికిత్స పొందుతున్నారు.

- వివరాలు 6లో

వెజి 'ట్రబుల్' సాగు!

రాష్ట్రంలో గత పదేళ్లలో గణనీయంగా పడిపోయిన కూరగాయల సాగు

ఉల్లిగడ్డ నుంచి ఆకుకూరల దాకా ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిందే..



2013-14లో కూరగాయల సాగు.. 5.46 లక్షల ఎకరాలు..

ఈ ఏడాది వానాకాలం సాగు 1.13 లక్షల ఎకరాలు

పదేళ్లలో తగ్గిన సాగు 80%

- ఇందులోనూ అవసరానికి మించి టమాటా, వంకాయల ఉత్పత్తి
- రవాణా ఖర్చు, మధ్య దళారులతో పెరుగుతున్న ధరలు..
- ధరల్లో హెచ్చుతగ్గులు, ప్రభుత్వ ప్రోత్సాహలేమి, మార్కెటింగ్ సమస్యలే కారణం
- పెరిగిపోతున్న పట్టణీకరణ, రియల్ వెంచర్లతో పట్టణాల శివారు గ్రామాల్లో సాగుపై ప్రభావం

సాగునీటి వసతితో వరి సాగుకు మొగ్గుతున్న రైతులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కూరగాయల సాగు గణనీయంగా పడిపోయింది. డిమాండ్, సరఫరాలో అంతరం ఏటికేడు పెరుగుతోంది. అవసరమైన కూరగాయల్లో సగానికి పైగా ఇతర రాష్ట్రాల నుంచే దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. రవాణా ఖర్చులు, మధ్య దళారుల కారణంగా కూరగాయల ధరలు ఎక్కువగా ఉంటున్నాయి. తాజావి కాకుండా నిల్వ కూరగాయలే జనానికి అందుతున్నాయి. కూరగాయల సాగులో సమస్యలు, ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడం, పట్టణ ప్రాంతాలు విస్తరించడం, శివారు భూములన్నీ రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారిపోతుండటంతోపాటు సాగునీటి వసతి పెరిగి రైతులు వరి సాగువైపు దృష్టిపెట్టడం వంటివి కూరగాయల సాగు తగ్గిపోవడానికి కారణమవుతున్నాయి. రిజర్వుబ్యాంక్ ఇటీవల విడుదల చేసిన హ్యాండ్‌బుక్‌లో ఈ విషయాన్ని స్పష్టం చేసింది.

పదేళ్లలో 80శాతం తగ్గిపోయి..

రాష్ట్రంలో ఏటా 2 కోట్ల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతున్నాయి. అందులో ఈసారి ఖరీఫ్‌లో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం 12.96 లక్షల ఎకరాలే. మిగతా అంతా వరి, పత్తి వంటి పంటలే. ఉద్యాన పంటల్లోనూ పండ్ల తోటలు 4 లక్షల ఎకరాల్లో,

మిగతా 3వ పేజీలో ▶

ఏటా రాష్ట్రానికి అవసరమైన కూరగాయలు సుమారు 40 లక్షల టన్నులు

2024-25 వానాకాలంలో ఉత్పత్తి 21 లక్షల టన్నులు



నిలకడైన ధర లేక ఇబ్బంది అవుతోంది

కూరగాయలకు మార్కెట్లో నిలకడైన ధర లేకపోవడం వల్ల నష్టపోవాల్సి వస్తోంది. దగ్గరలో మార్కెట్ అందుబాటు లేక రవాణా, ఇతర ఖర్చులు పెరుగుతున్నాయి. హార్టికల్చర్ శాఖ నుంచి ఎలాంటి సబ్సిడీలు కూడా అందడం లేదు. అందుకే ప్రస్తుతం కూరగాయలు సాగు చేయడం లేదు. - లింగారెడ్డి, రైతు, రెంజర్ల

జమిలి ఎన్నికల బిల్లులు వాయిదా



లోక్‌సభ బిజినెస్ జాబితా నుంచి తొలగింపు

- నిధుల కేటాయింపు అంశంపై నేడు లోక్‌సభలో చర్చ నేపథ్యంలోనే బిల్లుల వాయిదా!
- శీతాకాల సమావేశాలు ముగిసే ఈ నెల 20లోగా సభ ముందుకు రెండు బిల్లులు

6లో

పేపర్-1 కఠినం.. పేపర్-2 మధ్యస్థం

గ్రూప్-2 మొదటి రోజు పరీక్షలు ప్రశాంతం

- జనరల్ స్టడీస్ పేపర్ కఠినంగా వచ్చిందన్న అభ్యర్థులు.. అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చేందుకు సమయం సరిపోలేదని వెల్లడి
- దరఖాస్తు చేసిన వారిలో 46 శాతం మందే హాజరు
- నేడు మరో రెండు పేపర్ల పరీక్ష

16లో



జీవో 59తో రూ.6 వేల కోట్లు!

ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణ పెండింగ్ దరఖాస్తులు పరిష్కరిస్తే పెద్ద ఎత్తున ఆదాయం

కేబినెట్ సబ్ కమిటీకి నివేదించిన రెవెన్యూ శాఖ

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిలిచిపోయిన జీవో 59 అమలు

పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న వేల మంది దరఖాస్తుదారులు

డబ్బులు పూర్తిగా చెల్లించినా రిజిస్ట్రేషన్ కాక తిప్పలు..

- రిజిస్టరైన వాటిపై 'స్టే' విధించిన సర్కారు!
- కొన్నింటికి తనిఖీలు పూర్తయినా రాని డిమాండ్ నోటీసులు..
- మరికొన్నిచోట్ల కలెక్టర్ల స్థాయిలోనే దరఖాస్తులు పెండింగ్
- దీనిపై నిర్ణయం తీసుకుంటే ఖజానాకు కాసులు.. ప్రజలకు ప్రయోజనం

3లో

అప్పులపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం



రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నాం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- రైతులకు వివిధ పథకాలతో రూ.50,933 కోట్లు అందించాం
- భూమిలేని పేదలకు రూ.12 వేలు.. ఈ నెల 28న శ్రీకారం
- రాష్ట్రంలో 4 విమానాశ్రయాల ఏర్పాటుకు కసరత్తు

2లో

రూ. 12వేల సాయానికి అర్హుల ఎంపిక ఎలా? 2లో

క్లుప్తంగా...

'ఎయిమ్స్'లో ఇద్దరికి చోటు

పాలక మండలి సభ్యులుగా చామల, డీకే అరుణ




బీబీనగర్: యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ ఎయిమ్స్ వైద్య కళాశాల పాలక మండలి సభ్యులుగా భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో పాటు మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ఎంపికైనట్లు శనివారం రాత్రి లోక్‌సభ సచివాలయం నుంచి అధికారికంగా బులెటిన్ విడుదల చేశారు. దేశంలోగల 12 ఎయిమ్స్ ఆసుపత్రులకు 24 మంది లోక్‌సభ ఎంపీలను పాలక మండలి సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు పేర్కొన్నారు. ఒక్కో ఎయిమ్స్‌కు ఇద్దరు చొప్పున ఎంపీలను పాలక మండలి సభ్యులుగా నియమించారు.

అధ్యక్ష రేసులో లేను: బండి



కరీంనగర్ కార్పొరేషన్: బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి రేసులో తాను లేనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. తనకు ఇప్పటికే పార్టీ నాయకత్వం పెద్ద బాధ్యతలు అప్పగించిందని, ఆ బాధ్యతలను సమర్థవంతగా నిర్వర్తించేందుకు ప్రయత్నిస్తున్నానని తెలిపారు. ఆదివారం కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తనకు పార్టీ పగ్గాలు ఇస్తారనేది ఊహాగానమేనని అన్నారు. ఇలాంటి ప్రచారాల వల్ల తనకు, పార్టీకి నష్టం కలిగించేందుకు కొన్ని శక్తులు కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి మార్పుపై పార్టీ హైకమాండ్ ఇంకా నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. బీజేపీలో సమష్టి నిర్ణయం తీసుకున్నాకనే అధ్యక్ష పదవిపై ప్రకటన చేస్తారని పేర్కొన్నారు.

నేటి భవితలో..

- టాప్ స్టోరీ:
  ఏఎఫ్‌క్యాట్ 2025: ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్: ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో చేరాలనుకునే యువతకు చక్కటి మార్గంగా నిలుస్తోంది.. ఎయిర్‌ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్(ఏఎఫ్‌క్యాట్)! జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ పరీక్షలో స్కోరు, తర్వాత మలిదశలో నిర్వహించే ఎంపిక ప్రక్రియల్లో విజయం సాధిస్తే.. ఎయిర్‌ఫోర్స్‌లో ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ విభాగాల్లో ఉన్నత కొలువులు సొంతం చేసుకోవచ్చు! తాజాగా.. ఏఎఫ్‌క్యాట్(1)-2025 నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో.. ఏఎఫ్‌క్యాట్‌తో భర్తీ చేసే పోస్టులు, అర్హతలు, ఎంపిక విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు..
- విద్య, ఉద్యోగ సమాచారం.

నేటి భవిత పేజీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ఇదండీ జగత్



నేడు అసెంబ్లీ పునఃప్రారంభం

నేడు ప్రశ్నోత్తరాలు.. సంతాపాలు, రెండు బిల్లులు, స్వల్పకాలిక చర్చ

- బెల్టుషాపుల మూసివేత, పెండింగ్ బిల్లులు, టీజీఐఐసీ పార్కులపై ప్రభుత్వ సమాధానం
- స్పోర్ట్స్ యూనివర్సిటీతో పాటు మరో బిల్లు ప్రవేశపెట్టనున్న సర్కారు
- పర్యాటక విధానంపై అసెంబ్లీ, మండలిలో స్వల్పకాలిక చర్చ

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ శీతాకాల సమావేశాలు సోమవారం పునఃప్రారంభం కానున్నాయి. శాసనసభతోపాటు మండలి కూడా ఉదయం 10:30 గంటలకు భేటీ కానున్నాయి. ఈనెల 9వ తేదీన ప్రారంభమైన శీతాకాల సమావేశాలు తొలిరోజు భేటీ అనంతరం సోమవారానికి వాయిదా పడిన విషయం తెలిసిందే. రెండోరోజు ఎజెండాలో భాగంగా రెండు సభల్లోనూ తొలుత ప్రశ్నోత్తరాలు ఉంటాయి. అనంతరం మాజీ ఎమ్మెల్యేలు కొమిరెడ్డి జ్యోతి, ఊకె అబ్బయ్య, డి.రామచంద్రారెడ్డిల మృతి పట్ల అసెంబ్లీలో సంతాప తీర్మానాలను ప్రభుత్వం ప్రవేశపెడుతుంది. వీరికి సంతాపం తెలిపిన అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ వర్సిటీ, తెలంగాణ విశ్వ విద్యాలయాల బిల్లు(సవరణ)-2024ను ప్రవేశపెడతారు. ఈబిల్లులపై చర్చించి ఆమోదం తెలిపిన అనంతరం 'తెలంగాణ రాష్ట్రంలో పర్యాటక విధానం'పై స్వల్పకాలిక చర్చ ఉంటుంది.

శాసనమండలిలోనూ ప్రశ్నోత్తరాల అనంతరం మాజీ ఎమ్మెల్సీ ఎస్.ఇంద్రసేనారెడ్డి మృతి పట్ల సంతాప తీర్మానం, అనంతరం పర్యాటక విధానంపై స్వల్పకాలిక చర్చ జరుగుతుంది. ఈ మేరకు సోమవారం ఎజెండాను అసెంబ్లీ కార్యదర్శి వి.నర్సింహాచార్యులు విడుదల చేశారు.

పలు కీలక ప్రశ్నలు: అటు అసెంబ్లీ, ఇటు మండలిలో పలు కీలక ప్రశ్నలపై రాష్ట్ర ప్రభుత్వం సమాధానం ఇవ్వనుంది. గ్రామ పంచాయతీల్లో బీటీ రోడ్లు, మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల క్రమబద్ధీకరణ, స్థానిక సంస్థలకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు, ముదిరెడ్డిపల్లి చెరువులో నీటి కాలుష్యం, రాష్ట్రంలో నూతన టీజీఐఐసీ పార్కుల ఏర్పాటు, పర్యాటకానికి ప్రోత్సాహం, ఓయూలో బీఈ విద్యార్థుల డిటెన్షన్, రాష్ట్రంలోని బెల్టుషాపుల మూసివేత, ఐవీఎఫ్ కేంద్రాలు, జీరో ఎన్‌రోల్‌మెంట్ పాఠశాలలపై సభ్యులు అడిగే పలు ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం సమాధానం ఇవ్వడంతోపాటు ఈ అంశాల్లో అనుసరించే విధానాలను వెల్లడించనుంది. మండలిలో రాష్ట్రంలో టైగర్ రిజర్వుల అభివృద్ధి, ప్రతి జిల్లా కేంద్రంలో బీసీ భవనాల నిర్మాణం, కొత్త రేషన్‌కార్డుల జారీ, తేనెటీగలు, పట్టు పురుగల పరిశోధన కేంద్రం ఏర్పాటు, వివిధ ప్రభుత్వ శాఖల్లోని ఖాళీల భర్తీ, రేషన్ డీలర్ల గౌరవ వేతనం, చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం, తెలంగాణలో టీటీడీ ఆస్తులు, కొత్త బీసీ గురుకులాల ఏర్పాటు, జిల్లాల పునర్వ్యవస్థీకరణలపై ప్రభుత్వం సమాధానం ఇస్తుంది.



సమావేశాలు ఎప్పటివరకు?

అసెంబ్లీ శీతాకాల సమావేశాలను ఎప్పటివరకు కొనసాగించాలన్న దానిపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సోమవారం నిర్ణయం తీసుకోనున్నారు. ప్రశ్నోత్తరాల అనంతరం స్పీకర్ చాంబర్‌లో జరిగే సభా వ్యవహారాల సలహా కమిటీ భేటీలో సభను ఏఏ రోజుల్లో, ఎన్ని రోజుల పాటు నడిపించాలన్న దానిపై చర్చించిన అనంతరం అధికారికంగా ప్రకటిస్తారు. శీతాకాల సమావేశాలు ఈ వారం మొత్తం సాగే అవకాశాలున్నాయని తెలుస్తోంది. దీనిపై బీఏసీలో తుది నిర్ణయం జరగనుంది. ఈసారి అసెంబ్లీ సమావేశాలు కొత్త ఆర్‌వోఆర్ చట్టం, కులగణన, రైతు భరోసా తదితర అంశాల ఎజెండాగా కొనసాగుతుందని తెలుస్తోంది.

రూ.12వేల సాయానికి అర్హుల ఎంపిక ఎలా?

తొలి విడతగా ప్రతి భూమి లేని కుటుంబానికి రూ. 6వేలు

భూమిలేని వ్యవసాయ కుటుంబాల లెక్క ఎలా తీసుకుంటారు?

రాష్ట్రంలో 40 లక్షల కుటుంబాలకు భూమి లేదని అంచనా

30 లక్షల కుటుంబాలను అర్హులుగా గుర్తించినా ఏటా రూ.3,600 కోట్ల భారం పడే అవకాశం

అసెంబ్లీ సమావేశాల్లో అర్హుల ఎంపికపై స్పష్టత వచ్చే అవకాశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భూమిలేని ప్రతీ కుటుంబానికి ఏటా రూ.12వేల ఆర్థిక సాయాన్ని అందించే పథకానికి ఈ నెల 28న శ్రీకారం చుట్టబోతున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించిన నేపథ్యంలో అర్హుల ఎంపికపై జోరుగా చర్చ సాగుతోంది. ఏడాదిలో రెండు విడతలుగా ఈ మొత్తాన్ని చెల్లిస్తామని, తొలి విడతగా ఈనెల 28న అర్హుల బ్యాంకు ఖాతాల్లో జమచేయనున్నట్లు భట్టి చెప్పారు. రాష్ట్రంలో వ్యవసాయ భూమి ఉన్న రైతులకు ఎకరాకు ఏటా రూ. 12వేల చొప్పున ఆర్థిక సాయం అందించే కార్యక్రమం ఇప్పటికే కొనసాగుతోంది. రైతులతోపాటు రైతు కూలీలకు కూడా సాయం అందజేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. గత సెప్టెంబర్‌లో రూ.12వేల సాయం ప్రకటన చేసిన భట్టి ఆదివారం ఖమ్మంలో ఈ మేరకు స్పష్టత ఇచ్చారు. ఈ నెల 28న తొలివిడతగా రూ. 6వేలు ఇస్తామని ప్రకటించారు. సోమవారం నుంచి పునఃప్రారంభమవుతున్న శాసనసభ సమావేశాల్లో భూమిలేని పేదలను గుర్తించి, ఎంత మందికి పథకాన్ని అమలు చేయాలనే అంశంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

భూమిలేని పేదలు ఎందరు?

రాష్ట్రంలో రైతు కుటుంబాలు 64 లక్షల వరకు ఉండగా, భూమిలేని కుటుంబాలు, కూలీ నాలీ చేసుకునే వారు కలిపి 50 లక్షల వరకు ఉన్నట్లు అంచనా. అయితే రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం కింద 53.06 లక్షల కుటుంబాల్లోని వారికి జాబ్‌కార్డులున్నాయి. వారిలో 34.52 లక్షల కుటుంబాల వారే ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుంటున్నట్లు ఇటీవల ఓ సర్వేలో తేలింది. జాబ్‌కార్డు ఉన్న వారిలో కూడా కొందరు చిన్న, సన్నకారు రైతులు ఉంటారు. అయితే, భూమిలేని కుటుంబాలను గుర్తించేందుకు ఇప్పటివరకు పూర్తిస్థాయి సర్వే ఏదీ జరగలేదు. 2014లో జరిపిన సకుటుంబ సర్వే వివరాలు వెల్లడి కాకపోగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల చేపట్టిన కులగణనతో కూడిన కుటుంబసర్వే ఇంకా పూర్తికాలేదు. అయితే మండలాల స్థాయిలో ఉన్న లెక్కల ప్రకారం సుమారు 40లక్షల కుటుంబాలను భూమిలేని కుటుంబాలుగా ప్రభుత్వం గుర్తించినట్లు సమాచారం. ఏ పథకానికైనా రేషన్‌కార్డును ప్రాథమిక అర్హతగా చెబుతున్న ప్రభుత్వం.. రైతు రుణమాఫీ తరహాలో కుటుంబంలో ఒక్కరినే ఇందుకు అర్హులుగా గుర్తిస్తుందా అనేది తెలియాల్సి ఉంది. గుంట భూమి ఉన్న రైతుకు కూడా రైతుభరోసా పథకాన్ని వర్తింపజేస్తున్న ప్రభుత్వం.. ఈ పథకంలో లబ్ధి పొందని వారందరినీ భూమిలేని కుటుంబాలుగా పరిగణనలోకి తీసుకుంటుందేమోనని రైతు కూలీ సంఘాల నేతలు పేర్కొంటున్నారు.

30 లక్షల కుటుంబాలకు ఇచ్చినా..

భూమిలేని కుటుంబాలను ప్రభుత్వం ఏ ప్రాతిపదికన గుర్తించినా... కనీసం 30 లక్షల కుటుంబాలను అర్హులుగా తేల్చే అవకాశం ఉందని సమాచారం. ఈలెక్కన ఒక్కో కుటుంబానికి తొలివిడత రూ. 6వేల చొప్పున బ్యాంకు ఖాతాల్లో వేస్తే రూ.1,800 కోట్ల భారం ప్రభుత్వంపై పడే అవకాశం ఉంది. ఈలెక్కన సంవత్సరానికి రూ. 3,600 కోట్లు అవసరమవుతాయి. అర్హుల గుర్తింపుపై స్పష్టత వస్తే ఈ లెక్కల్లో తేడా ఉండే అవకాశం ఉంది.

అర్హులందరికీ ఇవ్వాలి

సారంపల్లి మల్లారెడ్డి, సీపీఎం నేత

కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు భూమిలేని కుటుంబాలకు, రైతు కూలీలకు రూ.12వేల ఆర్థిక సాయాన్ని చిత్తశుద్ధితో అమలు చేయాలి. రైతు రుణమాఫీలో కోతలు పెట్టినట్టుగా ఈ పథకం కింద పేదలకు అన్యాయం చేయొద్దు. రాష్ట్రంలో 60 లక్షల వ్యవసాయ కుటుంబాలు ఉంటే, 40 లక్షల కుటుంబాలు భూమి లేని పేదలే. వీరందరికీ ఆర్థిక సాయాన్ని అందించాలి.

బీఆర్‌ఎస్ అప్పులపై తప్పుడు ప్రచారం

- రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నాం: డిప్యూటీ సీఎం భట్టి
- రైతులకు వివిధ పథకాలతో రూ.50,933 కోట్లు అందించాం
- భూమిలేని పేదలకు రూ.12 వేలు.. ఈనెల 28న శ్రీకారం



ఖమ్మంలో విలేకరులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఖమ్మం మయూరిసెంటర్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎడాపెడా అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసి, ఇప్పుడు ఆ అప్పులపై తప్పుడు ప్రచారం చేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్ల కాలంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.7,11,911 కోట్ల అప్పులు చేసి ప్రజలపై తీరని భారం మోపిందన్నారు. రాష్ట్రానికి తెచ్చిన అప్పులను బీఆర్‌ఎస్ నాయకులు దోచుకుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన అప్పులతో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూనే వాళ్లు తెచ్చిన అప్పులు తీరుస్తున్నామని పేర్కొన్నారు. ఖమ్మం డీసీసీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రాన్ని బీఆర్‌ఎస్ పార్టీనే అప్పుల పాలు చేయగా.. ఇప్పుడు హరీశ్‌రావు, కేటీఆర్ గాయిగత్తర చేస్తున్నారని మండిపడ్డారు. వాస్తవాలను శ్వేతపత్రం ద్వారా విడుదల చేసి ప్రజల ముందు ఉంచామని భట్టి గుర్తుచేశారు. రానున్న సంక్రాంతికి రైతు భరోసా డబ్బు సైతం జమ చేస్తామని, ఇప్పటివరకు మొత్తం రూ.50,953 కోట్లను రైతుల కోసం ఖర్చు చేశామని వివరించారు.

పేదలకు రెండు విడతలుగా సాయం

ఈ నెల 28న కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా భూమి లేని నిరుపేదలకు రూ.12 వేల చొప్పున రెండు విడతలుగా సాయం అందించే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుడతామని భట్టి విక్రమార్క ప్రకటించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు వరంగల్, రామగుండం, ఆదిలాబాద్, కొత్తగూడెంలో విమానాశ్రయాలు నెలకొల్పేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేసి రైతులకు వారంలోపే డబ్బులు, సన్నాలకు బోనస్‌ను సైతం అందిస్తున్నామని తెలిపారు. అన్ని జిల్లాలను కలుపుతూ రీజినల్ రింగ్ రోడ్డు ఏర్పాటు చేస్తామన్నారు. ఓఆర్ఆర్-ట్రిపుల్ ఆర్ మధ్య ఇండస్ట్రియల్, హౌసింగ్ క్లస్టర్లు ఏర్పాటు చేసి భవిష్యత్ తరాలకు అందిస్తామని చెప్పారు. వసతి గృహాల్లో నూతనంగా పెంచిన డైట్ చార్జీలతో ప్రభుత్వంపై ఏడాదికి రూ. 541 కోట్ల భారం పడుతుందని చెప్పారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో డైట్ చార్జీలు పెంచలేదని, అందుకే అన్నంలో పురుగులు వంటివి వచ్చాయని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వంపై, సీఎం రేవంత్‌రెడ్డిపై తప్పుడు కథనాలు ప్రచురిస్తే నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. తాము అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 56 వేల మంది నిరుద్యోగులకు నియామక పత్రాలు అందించామని చెప్పారు.

జగిత్యాలలో మళ్లీ బీఆర్‌ఎస్ జెండా ఎగరేస్తాం

పార్టీ మారిన ఎమ్మెల్యే ఏ ముఖం పెట్టుకుని అసెంబ్లీకి వెళ్తాడు: ఎమ్మెల్సీ కవిత



గజమాలతో కవితకు సన్మానం

జగిత్యాల రూరల్: బీఆర్‌ఎస్ పార్టీ టికెట్‌పై గెలిచి, మరో పార్టీలోకి వెళ్లిన ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఏ ముఖం పెట్టుకుని అసెంబ్లీకి హాజరవుతారని ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. ఆదివారం జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ వద్ద ఆమె మాట్లాడుతూ.. జగిత్యాల బీఆర్‌ఎస్‌కు అడ్డా అని అన్నారు. కేసీఆర్‌కు ఎమ్మెల్యేలతో పని లేదని, బీఆర్‌ఎస్ సైనికులనే ఎమ్మెల్యేలను చేస్తారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి రూపాన్ని, బతుకమ్మను దూరం చేసిందని విమర్శించారు. మహిళలకు ఇచ్చిన హామీల అమలులో సీఎం రేవంత్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ఏడాది కాలంగా ఏ ఒక్క గ్రామంలో రూపాయి అభివృద్ధి పనులు చేయలేదని ధ్వజమెత్తారు. రానున్న రోజుల్లో ప్రజల సహకారంతో జగిత్యాలలో బీఆర్‌ఎస్ జెండా ఎగురవేస్తామని తెలిపారు. కేసీఆర్ బొమ్మతో గెలిచిన స్థానిక ఎమ్మెల్యే.. పైసల కోసం పార్టీ మారారని ఆరోపించారు. రానున్న రోజుల్లో గ్రామ గ్రామాన తెలంగాణ తల్లి విగ్రహాలను ప్రతిష్టిస్తామని ప్రకటించారు. అనంతరం, ధరూర్ చౌరస్తా వద్ద తెలంగాణ తల్లి విగ్రహ స్థాపనకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ శ్రీలం ప్రియాంక, మాజీ జెడ్పీటీసీ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన కొండా దంపతులు

ఎమ్మెల్సీ అంశంపై చర్చ?

సాక్షి, హైదరాబాద్: వరంగల్ జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, ఆమె భర్త కొండా మురళి (మాజీ ఎమ్మెల్సీ) ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. మధ్యాహ్నం జూబ్లీహిల్స్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో కలిసిన కొండా దంపతులు వరంగల్ జిల్లాతో పాటు రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితుల గురించి చర్చించారు. కొండా మురళికి మరోమారు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని వారు కోరినట్టు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

గురుకుల విద్యాసంస్థల్లో సీఎం, మంత్రుల పిక్నిక్

ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థులు మరణించినా స్పందించని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పిక్నిక్‌ను తలపించేలా హడావుడి చేశారని బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా గురుకుల విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను బీఆర్‌ఎస్ గురుకులబాట ద్వారా బయట పెట్టడంతో పాటు కేసీఆర్‌కు నివేదిక ఇచ్చిందన్నారు. గురుకులాలకు వెళ్లిన బీఆర్‌ఎస్ నేతలపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టిందని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తోపాటు పార్టీ నేతలు ఎర్రోళ్ల శ్రీనివాస్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, రవీందర్‌రెడ్డితో కలిసి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆదివారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ప్రభుత్వాన్ని నిలదీస్తారనే ఉద్దేశంతోనే సీఎం రేవంత్ గురుకుల విద్యా సంస్థల్లో హడావుడి చేశారని మండిపడ్డారు. గురుకల విద్యా సంస్థలు, సంక్షేమ హాస్టళ్ల స్థితిగతులపై తనతో సీఎం రేవంత్ బహిరంగచర్చకు రావాలని ప్రవీణ్‌కుమార్ సవాల్ చేశారు.

నేడు రాష్ట్ర కేబినెట్ భేటీ

- ఆర్‌ఓఆర్, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లులపై చర్చ
- రైతు భరోసా విధివిధానాలు ఖరారు చేసే చాన్స్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మంత్రివర్గం సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు అసెంబ్లీ కమిటీ హాల్‌లో సమావేశంకానుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ భేటీలో... కొత్త రెవెన్యూ చట్టం 'రికార్డ్స్ ఆఫ్ రైట్స్ (ఆర్‌ఓఆర్)'బిల్లు, పంచాయతీ రాజ్ చట్ట సవరణ బిల్లులపై చర్చించి ఆమోదించనున్నారు. అనంతరం ఈ బిల్లులను శాసనసభలో ప్రవేశపెట్టనుంది. ఇద్దరికి మించి పిల్లలు ఉన్నవారు కూడా పంచాయతీ ఎన్నికల్లో పోటీచేసేందుకు అనుమతించేలా పంచాయతీరాజ్ చట్టానికి సవరణలు ప్రతిపాదించనున్నట్టు తెలిసింది. ఇక రైతు భరోసాపై కేబినెట్ సబ్ కమిటీ చేసిన సిఫార్సులపై చర్చించి విధివిధానాలను మంత్రివర్గం ఖరారు చేయనుంది. వీటిపై శాసనసభలో చర్చ నిర్వహించనుంది. మరోవైపు యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణం, ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోలు ఒప్పందంపై జస్టిస్ మదన్ బీ లోకూర్ కమిషన్ సమర్పించిన విచారణ నివేదికను సైతం కేబినెట్ పరిశీలించి శాసనసభలో ప్రవేశపెట్టేందుకు అనుమతించనుంది. 'ఫార్ములా-ఈ'రేసింగ్ వ్యవహారంలో మాజీ మంత్రి కేటీఆర్‌పై కేసు నమోదు చేసేందుకు గవర్నర్ అనుమతించిన నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

సీఎంతో మంత్రి పొంగులేటి భేటీ..

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం సీఎం రేవంత్‌తో భేటీ అయ్యారు. సుదీర్ఘంగా సాగిన ఈ సమావేశంలో ఆర్‌ఓఆర్ బిల్లు తదితర అంశాలపై చర్చించినట్టు తెలిసింది. ఇక ధరణిపై ఏర్పాటైన కమిటీ సభ్యులు కోదండరెడ్డి, ప్రొఫెసర్ సునీల్ ఆదివారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలసి బిల్లులోని అంశాలను వివరించారు.

రేవంత్ చేతిలో కీలుబొమ్మలా టీపీసీసీ చీఫ్


ఎమ్మెల్యే కేపీ వివేకానంద

సాక్షి, హైదరాబాద్: రేవంత్‌రెడ్డి తప్పిదాలపై నిలదీయాల్సిన టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్.. సీఎం చేతిలో కీలుబొమ్మలా మారాడని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద విమర్శించారు. గతంలో పీసీసీ అధ్యక్షులుగా పనిచేసిన నాయకులు కాంగ్రెస్ ముఖ్యమంత్రుల పనితీరును బహిరంగంగా విమర్శించిన ఘటనలు అనేకం ఉన్నాయన్నారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో కలిసి వివేకానంద ఆదివారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌కు రాయాల్సిన లేఖను పొరపాటున బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు రాసి ఉంటారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ఆర్థికరంగంపై అబద్ధాలు ప్రచారం చేస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు ఆర్‌బీఐ హ్యాండ్‌బుక్ చదువుకోవాలన్నారు. సీఎం రేవంత్ మెప్పు కోసమే టీపీసీసీ అధ్యక్షుడు కేసీఆర్‌కు లేఖ రాశారని బాల్క సుమన్ విమర్శించారు.

సీఎం రేవంత్ తెలంగాణ ద్రోహి

ఆయన ఏనాడూ జై తెలంగాణ అనలేదు

ప్రజా యుద్ధనౌక గద్దర్ లేకుండా ఏ ఉద్యమాలూ లేవు: హరీశ్‌రావు



గద్దర్ పాటల పుస్తకావిష్కరణలో మాజీ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట జోన్: సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ద్రోహి అని, ఆయన ఏనాడూ జై తెలంగాణ అనలేదని బీఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో ప్రజా యుద్ధనౌక గద్దర్ సాహిత్య పుస్తకావిష్కరణ సభలో హరీశ్‌రావు పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి అవార్డుల పేరుతో తన మరకలను కడిగేసుకొనే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ తల్లి చేతిలో బతుకమ్మను తీసేసి, విగ్రహ రూపాన్ని మార్చడం నచ్చకనే కవి నందిని సిధారెడ్డి ప్రభుత్వ ఇవ్వజూపిన నజరానా, ఇంటి స్థలాన్ని తిరస్కరించారని తెలిపారు. రూ.కోటి రూపాయలు ముఖ్యం కాదని, మూడు కోట్ల తెలంగాణ ప్రజల ఆదరాభిమానాలే ముఖ్యమని చాటిన నందిని సిధారెడ్డి ఎంతో గొప్పవారని అభినందించారు.

మలిదశ ఉద్యమంలో కీలక పాత్ర

తెలంగాణ ఉద్యమానికి గద్దర్ ప్రజాగొంతుకగా నిలిచారని హరీశ్‌రావు అన్నారు. ఆయన లేనిది ఏ ఉద్యమం లేదు.. మలిదశలోనూ గద్దర్ కీలక పాత్ర పోషించారు అని కొనియాడారు. గద్దర్ పోరాటం భావితరాలకు తెలిసేలా పుస్తకాలు ముద్రించటం మంచి ఆలోచన అని ప్రశంసించారు. తండ్రి పోరాటాన్ని, గొప్పతనాన్ని రేపటి తరాలకు అందించి నిజమైన వారసుడు అనిపించుకున్నారని గద్దర్ కుమారుడు సూర్యకిరణ్‌ను అభినందించారు. గద్దర్ పాట ఉన్నంత కాలం ప్రజల మధ్య ఆయన సజీవంగా ఉంటారన్నారు. సిద్దిపేటలో గద్దర్ విగ్రహం ఏర్పాటు చేసే ఆలోచన అభినందనీయమని, గద్దర్ జీవిత చరిత్రతో కూడిన డాక్యుమెంటరీ తయారీ చేయాలని, అందుకు తన పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.

అనుభవ లేమి.. అసమర్థత.. అవినీతి

ఈ మూడింటి కలబోతే ముఖ్యమంత్రి రేవంత్

తనలాగే అందరూ జైలుకు వెళ్లాలని భావిస్తున్నారు: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: డబ్బు సంచులతో రెడ్ హ్యాండెడ్‌గా దొరికి జైలుకు వెళ్లొచ్చిన తనలాగే అందరూ జైలు జీవితాన్ని అనుభవించాలని సీఎం రేవంత్‌రెడ్డి భావిస్తున్నట్లు కనిపిస్తోందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఓ నేషనల్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోను ఆదివారం 'ఎక్స్'లో షేర్ చేసిన కేటీఆర్.. ఓ ప్రభుత్వ పథకం వల్ల తమ సంస్థపై ప్రభావం పడే అవకాశం ఉందని అని చెప్పినందుకు ప్రతిష్టాత్మక ఎల్ అండ్ టీ కంపెనీ సీఎఫ్‌ఓను జైలుకు పంపిస్తానని సీఎం బహిరంగంగా బెదిరించడం ఏంటని ప్రశ్నించారు. ఇలాంటి పనికిమాలిన ప్రకటనలతో పారిశ్రామిక వర్గాలకు ఏం సందేశం ఇవ్వాలని అనుకుంటున్నారని నిలదీశారు. పెట్టుబడులను ఆకర్షించడానికి ఇదేనా మీరు అనుసరిస్తున్న వ్యూహం అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ప్రశ్నించారు.

తగ్గిన రవాణాశాఖ వృద్ధి రేటు: పదేళ్ల పాటు కేసీఆర్ పాలనలో అద్భుతంగా పురోగమించిన తెలంగాణ రాష్ట్రం.. అనుభవరాహిత్యం, అసమర్థత, అవినీతి కలగలసిన రేవంత్ రెడ్డి పాలనలో నేడు అన్ని రంగాల్లో తిరోగమిస్తోందని కేటీఆర్ ధ్వజమెత్తారు. తెలంగాణలో రిజిస్ట్రేషన్లు తగ్గి, ఆదాయం తిరోగమనంలో ఉందని 'ఎక్స్'లో సందేశం పోస్ట్ చేశారు. రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి రవాణా శాఖ ఆదాయం ఒక ముఖ్యమైన సూచీ అని, ప్రజల ఆర్థిక పరిస్థితులు బాగుంటే బైకులు, కార్లే కాక ఇతర భారీ వాహనాల అమ్మకాలు, రిజిస్ట్రేషన్లు వృద్ధిని చూపిస్తాయని పేర్కొన్నారు. పొరుగున ఉన్న అయిదు రాష్ట్రాలు ఈ ఏడాది రవాణా శాఖ ఆదాయంలో 8 నుంచి 32% వృద్ధిని నమోదు చేస్తే.. తెలంగాణ ఒక్కటే గత ఏడాది కంటే తక్కువ వృద్ధి సాధించిందని తెలిపారు. రాష్ట్రంలోని విఫల ప్రభుత్వ పనితీరుకు ఇది అద్దం పడుతోందని విమర్శించారు. పాలన గాలికొదిలేసి కక్షసాధింపు చర్యలకే పూర్తి సమయం కేటాయిస్తే ఫలితాలు ఇలా కాక మరెలా ఉంటాయని ప్రశ్నించారు.

అభివృద్ధిని ఓర్వలేకే అసత్య ప్రచారం

మా ఏడాది పాలనలో ప్రజలు ఆనందంగా ఉన్నారు

మీరు గడీల పాలనతో ప్రజలకు కన్నీరే మిగిల్చారు.. కేసీఆర్‌కు టీపీసీసీ చీఫ్ బహిరంగ లేఖ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బీఆర్‌ఎస్ అసత్య ప్రచారం చేస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. తొలి ఏడాది కాంగ్రెస్ పాలన అనంతరం ప్రజలు ఆనందంగా ఉన్నారన్న వాస్తవాన్ని తెలుసుకోవాలని సూచించారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆదివారం బహిరంగ లేఖ రాశారు. ఉద్యమ పార్టీ అంటూ గొప్పలు చెప్పుకునే బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణ వెనుకబాటుకు గురైందని ఆరోపించారు. సెంటిమెంట్‌ను అడ్డం పెట్టుకుని రెండు సార్లు అధికారం చేపట్టి, గడీల పాలనతో ప్రజలకు కన్నీరు మిగిల్చారని విమర్శించారు. కేసీఆర్ పాలనను ఫామ్‌హౌస్‌కు పరిమితం చేశారని ధ్వజమెత్తారు. 'మీ పాలనకు ప్రజలు చరమగీతం పాడినా మీలో, మీ కుటుంబ సభ్యుల్లో, మీ పార్టీ నేతల్లో ఎలాంటి మార్పు రాలేదు. ప్రజలు మాకు అధికారం కట్టబెట్టడాన్ని ఓర్వలేక అసత్యాలను ప్రచారం చేస్తున్నారు. ఇదే పంథాలో కొనసాగితే ప్రజలు మీకు తగిన సమయంలో బుద్ధి చెప్తారు' అని అన్నారు.

ఉద్యోగాల భర్తీని అడ్డుకొనే కుట్ర

రాష్ట్రాన్ని కేసీఆర్ తన కుటుంబ సభ్యుల కబంధ హస్తాల్లో బంధించి చేసిన ఆరాచకాన్ని ప్రజలు ఎన్నటికీ మరవలేరని పీసీసీ చీఫ్ అన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే తాము 54 వేలకు పైగా ఉద్యోగాల భర్తీ చేస్తే.. వాటిని అడ్డుకొనేందుకు బీఆర్‌ఎస్ నేతలకు కుట్రలకు పాలడుతున్నారని ఆరోపించారు. 'మీ అవినీతి, అజ్ఞాన చర్యలతో రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల మనుగడ ప్రమాదంలో పడింది. కాళేశ్వరం ప్రాజెక్టు మీకు, మీ అనుచరులకు ఏటీఎంలా మారిందనేది అక్షర సత్యం. రాష్ట్రం ఏర్పాటయ్యే నాటికి రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్ ఉంటే.. మీరు దిగిపోయేసరికి రూ.7 లక్షల కోట్ల అప్పు ఉన్నది వాస్తవం కాదా? రైతులకు రుణమాఫీ ఎగ్గొట్టిన మీకు, మమ్మల్ని విమర్శించే హక్కు లేదు' అని మండిపడ్డారు.

క్లుప్తంగా...

ముగిసిన నిఖేశ్‌కుమార్ ఏసీబీ కస్టడీ

- అక్రమాస్తులపై నాలుగు రోజులు ప్రశ్నించిన అధికారులు
- సేకరించిన ఆధారాలతో మరింత లోతుగా దర్యాప్తు

సాక్షి, హైదరాబాద్: ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న కేసులో అరెస్టయిన నీటి పారుదలశాఖ ఏఈఈ నిఖేశ్‌కుమార్ ఏసీబీ కస్టడీ ఆదివారంతో ముగిసింది. నాలుగు రోజులపాటు ఆయనను ఏసీబీ అధికారులు ప్రశ్నించారు. ఈ విచారణలో సేకరించిన సమాచారం ఆధారంగా దర్యాప్తును మరింత ముమ్మరం చేసేందుకు సిద్ధమవుతున్నారు. నిఖేశ్‌కుమార్ ఎక్కడెక్కడ ఆస్తులు కూడ బెట్టాడు? ఎవరెవరిని బినామీలుగా మార్చుకున్నాడు? ఆయన అవినీతిలో ఇంకెవరికైనా భాగస్వామ్యం ఉందా? అనే అంశంపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఇప్పటికే పలువురు సాక్షుల వాగ్మూలాలు సైతం నమోదు చేశారు. నీటిపారుదల శాఖలో నిఖేశ్‌కుమార్‌తో అంటకాగిన అధికారులపై ఆరా తీస్తున్నట్టు తెలిసింది. అతడికి బినామీలుగా ఉన్న వారికి నోటీసులు జారీ చేయనున్నారు. ఏఈఈ స్థాయి వ్యక్తి అనతి కాలంలోనే వందల కోట్ల ఆస్తులు కూడబెట్టడంలో అంతర్గతంగా అధికారులతోపాటు అప్పటి ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులెవరైనా అండగా ఉన్నారా? అన్న కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాన్స్‌కోకు ఉత్తమ ఎల్డీసీ పురస్కారం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ విద్యుత్ సరఫరా సంస్థ (ట్రాన్స్‌కో) పరిధిలోని లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎల్డీసీ)కి జాతీయ స్థాయిలో అత్యుత్తమ ఎల్డీసీ పురస్కారం లభించింది. ఐఐటీ ఇండోర్‌లో జరిగిన నేషనల్ పవర్ సిస్టమ్ కాన్ఫరెన్స్‌లో 'ఎల్డీసీ ఎక్సలెన్స్ అవార్డు'ను ట్రాన్స్‌కో సీఎండీ డి.కృష్ణ భాస్కర్ అందుకున్నారు. ఆయనకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇంధనశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా అభినందనలు తెలిపారు.

20 వరకు ఇంధన పరిరక్షణ వారోత్సవాలు

- బీఈఈ మీడియా సలహాదారు ఎ.చంద్రశేఖరరెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 14 నుంచి 20 వరకు జాతీయ ఇంధన పరిరక్షణ వారోత్సవాలను నిర్వహించనున్నామని బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ (బీఈఈ) దక్షిణాది రాష్ట్రాల మీడియా సలహాదారు ఎ.చంద్రశేఖరరెడ్డి తెలిపారు. రెడ్కో ఎండీ వి.అనీలతో కలిసి ఆయన రాష్ట్ర ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాను కలిసి ఇంధన పొదుపుపై బీఈఈ రూపొందించిన ఓ నివేదికను అందజేశారు. రాష్ట్రంలో ఇంధన పొదుపు చర్యలకు సహకారం అందిస్తున్నందుకు గాను బీఈఈ, ఈఈఎస్ఎల్‌కు సందీప్‌కుమార్ సుల్తానియా కృతజ్ఞతలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, హరిత ఇంధనం, ఇంధన సామర్థ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని చెప్పారు.

గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రాజగంగారెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంది. సంఘ నేతలు కార్యవర్గ వివరాలను ఆదివారం మీడియాకు వెల్లడించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా రేకులపల్లి రాజగంగారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సిద్ధగోని గిరిధర్, కోశాధికారిగా బి.తుకారాం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాజగంగారెడ్డి మాట్లాడుతూ, ఉమ్మడి సర్వీసు రూల్స్ కోసం ప్రయత్నం చేసి ప్రధానోపాధ్యాయులకు పదోన్నతులు కల్పించే దిశగా ప్రయత్నం చేస్తామని తెలియజేశారు. అదేవిధంగా ప్రధానోపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో విద్యార్థులు కనీస సామర్థ్యాలు సాధించేందుకు కృషి చేయాలని, విద్యా సంబంధమైన పర్యవేక్షణ పటిష్టంగా నిర్వహించాలని తెలిపారు. విద్యారంగ సమస్యల సాధనకు సానుకూల దృక్పథంతో పనిచేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు.

జీవో 59తో రూ.6 వేల కోట్లు!

పెండింగ్ దరఖాస్తులు పరిష్కరిస్తే పెద్ద ఎత్తున ఆదాయం | కేబినెట్ సబ్ కమిటీకి నివేదించిన రెవెన్యూ శాఖ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సుమారు ఏడాది నుంచి పెండింగ్‌లో ఉన్న జీవో 59ను అమలు చేయడం ద్వారా ప్రభుత్వ ఖజానాకు పెద్ద ఎత్తున ఆదాయం రానుంది. ఈ జీవో కింద వచ్చిన 50వేలకుపైగా దరఖాస్తులను పరిష్కరించడం ద్వారా సుమారు రూ.6 వేల కోట్ల వరకు ఖజానాకు సమకూరుతుందని రెవెన్యూ శాఖ అంచనా వేసింది. ఆదాయ వనరుల సమీకరణపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘానికి దీనిపై నివేదిక కూడా సమర్పించింది. ఈ జీవో అమలును నిలిపివేయడానికి ముందువరకు రూ.534 కోట్ల ఆదాయం వచ్చిందని.. మిగతా దరఖాస్తుల పరిష్కారం ద్వారా మరో రూ.500 కోట్లు వస్తాయని పేర్కొన్నట్టు తెలిసింది. ఇదే జీవో కింద అధిక విలువ గల భూములను క్రమబద్ధీకరిస్తే ఇంకో రూ.5,500 కోట్లు వస్తాయని... జీవో 76, 118 దరఖాస్తుల పరిష్కారం ద్వారా అదనంగా రూ.300 కోట్లు అందుతాయని వివరించినట్టు సమాచారం.

ఏడాది నుంచి ఎదురుచూపులే..

జీవో 59 కింద భూముల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్నవారు ఏడాది నుంచి ఎదురు చూపులు చూస్తున్నారు. ఈ జీవోను అడ్డుపెట్టుకుని గత ప్రభుత్వ హయాంలో కొందరు అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలున్నా... ఎలాంటి పలుకుబడి లేని సాధారణ ప్రజలు మాత్రం వీటి పరిష్కారం ఇంకెప్పుడు అంటూ ఆందోళన చెందుతున్నారు. ఈ జీవో కింద పరిశీలన పూర్తయి డిమాండ్ నోటీసు మేరకు డబ్బులు పూర్తిగా చెల్లించినవారు, పాక్షిక మొత్తం చెల్లించినవారు, తనిఖీలు పూర్తిచేసుకున్న వారు, కన్వేయన్స్ డీడ్‌లు వచ్చిన తర్వాత కూడా ప్రభుత్వం విధించిన స్టేతో ఆ భూములపై ఎలాంటి లావాదేవీలు నిర్వహించడానికి వీల్లేనివారు వేల మంది ఉన్నారు. వారంతా కాంగ్రెస్ సర్కారు నిర్ణయం పట్ల ఆశతో ఉన్నారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాల్సిందేనని, అదే క్రమంలో అర్హులైన వారికి భూములపై హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రక్రియ కొనసాగుతుండగానే..

జీవో 59 కింద ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణ కోసం 2022, 2023 సంవత్సరాల్లో రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో కలిపి 31 వేలు, మిగతా అన్ని జిల్లాల్లో 26 వేల వరకు.. మొత్తంగా 57 వేల వరకు దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ప్రభుత్వం 32,788 దరఖాస్తులను ఆమోదించి సదరు లబ్ధిదారులకు డిమాండ్ నోటీసులు జారీ చేసింది. 10వేల మందికిపైగా ప్రభుత్వం నిర్ణయించిన ధర చెల్లించి కన్వేయన్స్ డీడ్ (రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు) కూడా పొందారు. డిమాండ్ నోటీసుల మేరకు డబ్బులు కట్టినా.. కన్వేయన్స్ డీడ్‌లు జారీకానివారు మరో 3 వేల మందికి పైగా ఉన్నారు. ఈ ప్రక్రియ కొనసాగుతుండగానే ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడం జరిగింది. గత ఏడాది డిసెంబర్ 7న కాంగ్రెస్ సర్కారు ఏర్పాటవగా.. అదే నెల 11వ తేదీ నుంచి ఈ జీవోకు సంబంధించిన పోర్టల్‌ను నిలిపివేశారు. ఆ జీవో కింద అప్పటికే చేసిన క్రమబద్ధీకరణలను నిలిపివేస్తున్నట్టు ప్రకటించారు. ఈ జీవోను అడ్డుపెట్టుకుని విలువైన భూములను బీఆర్ఎస్ నేతలు క్రమబద్ధీకరించుకున్నారనే ఆరోపణలతో ఈ చర్య తీసుకున్నట్టు ప్రకటించింది. అయితే అలాంటివన్నీ ముందే జరిగిపోయాయని... సాధారణ ప్రజల దరఖాస్తులే ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని దరఖాస్తుదారులు పేర్కొంటున్నారు. హక్కులు కల్పించని కారణంగా ఈ భూములు ఇటు తమవి కాకుండా, అటు ప్రభుత్వానివి కాకుండా మిగిలిపోతున్నాయని పేర్కొంటున్నారు.

కేబినెట్ సబ్ కమిటీకి రెవెన్యూ శాఖ నివేదించిన గణాంకాలివే..

జీవో 59 కింద వచ్చిన మొత్తం దరఖాస్తులు:	పరిశీలన పూర్తయినవి:	2022లో ఆమోదం పొందినవి:	2023లో ఆమోదం పొందినవి:	అధిక విలువగల భూములకు సంబంధించినవి:
57,661	55,997	23,189	8,771	828

డిమాండ్ నోటీసులు జారీచేసిన దరఖాస్తులు:	ఇందులో మొత్తం సొమ్ము చెల్లించినది:	కన్వేయన్స్ డీడ్ (రిజిస్ట్రేషన్) చేసినవి:	పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం ద్వారా వచ్చే మొత్తం
32,788	13,726	10,553	రూ.500 కోట్లు

అధిక విలువ గల భూముల క్రమబద్ధీకరణతో వచ్చే మొత్తం:	జీవో 76, 118 దరఖాస్తుల ద్వారా వచ్చే మొత్తం:
రూ.5,500 కోట్లు	రూ.300 కోట్లు

అసలు జీవో 59 ఏంటి?

తెలంగాణ ఏర్పాటయ్యాక ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు కట్టుకుని ఉంటున్న పేదలకు ఆ భూములను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు 2014 డిసెంబర్ 30న తొలిసారి జీవో 59 విడుదల చేసింది. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. 2022, 2023 సంవత్సరాల్లో ఆ జీవోలో స్వల్ప మార్పులు చేస్తూ పొడిగింపు ఉత్తర్వులు జారీ చేశారు. చివరిగా 2023లో విడుదల చేసిన జీవో ప్రకారం... క్రమబద్ధీకరణ కోసం 125 నుంచి 250 గజాల వరకు స్థలాలకు మార్కెట్ విలువలో 25 శాతం... 250 గజాల నుంచి 500 గజాల ఉన్న స్థలాలకు 50శాతం, 500–750 గజాల స్థలాలకు 75శాతం, 750 గజాల పైన ఉంటే మార్కెట్ విలువలో 100 శాతం సొమ్ము చెల్లించాలి. క్రమబద్ధీకరణ సంబంధించిన మరో జీవో 58 ప్రకారం... 125 చదరపు గజాలలోపు భూమిలో నిర్మాణాలుంటే ప్రభుత్వం ఉచితంగా క్రమబద్ధీకరిస్తుంది. తొలుత 2014 జూన్ 2 నాటికి ఆక్రమణలో ఉన్న భూములను క్రమబద్ధీకరిస్తామని జీవోలో పేర్కొన్నా.. 2023లో విడుదల చేసిన జీవోలో దరఖాస్తు చేసుకునే నాటికి ఆక్రమణలో ఉన్నా క్రమబద్ధీకరిస్తామని సర్కారు పేర్కొంది.

ఉత్తర 'రింగు' ఇంకాస్త ఆలస్యం

- డిసెంబర్ చివరి నాటికి టెండర్లు కష్టమే...
- ఇప్పటికీ రోడ్డుకు జారీ కాని నంబరు
- అది రాకుంటే పర్యావరణ అనుమతుల్లో ఆలస్యం
- ఆ అనుమతులు వస్తేనే నిర్వాసితుల ఖాతాల్లో పరిహారం జమ



సాక్షి, హైదరాబాద్: రీజినల్ రింగురోడ్డు (ట్రిపుల్ ఆర్) ఉత్తరభాగానికి టెండర్లు పిలిచేందుకు ఏర్పాట్లు చేస్తున్నా, నిర్వాసితులకు పరిహారం అందించే విషయంలో మాత్రం స్పష్టత రావటం లేదు. టెండర్లు పిలిచే నాటికే పరిహారం అందిస్తారని ఆశించినా, అందుకు కనీసం మరో రెండుమూడు నెలల సమయం పట్టే సూచనలు కనిపిస్తున్నాయి. పరిహారం అందించిన తర్వాతే భూమిని స్వాధీనం చేసుకోవాలంటూ జాతీయ రహదారి ప్రాజెక్టులపై ఇటీవల ఎన్‌హెచ్ఏఐ అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి కోమటిరెడ్డి స్పష్టంగా ఆదేశించారు. కానీ, ప్రస్తుతం ఎన్‌హెచ్ఏఐ చేపట్టే ప్రాజెక్టుల్లో అత్యంత కీలకమైన ట్రిపుల్ ఆర్ పరిహారం విషయంలో మాత్రం దానికి విరుద్ధంగా జరుగుతోంది.

జాప్యమెందుకు?

ట్రిపుల్‌ఆర్ ఉత్తర భాగాన్ని ఎన్‌హెచ్ఏఐ చేపడుతున్న విషయం తెలిసిందే. ఈ భాగానికి టెండర్లు పిలిచేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇటీవలే కన్సల్టెన్సీ సంస్థ టెండర్ డాక్యుమెంట్‌ను సిద్ధం చేసి ఎన్‌హెచ్ఏఐకి సమర్పించింది. డిసెంబరు చివరికల్లా టెండర్లు పిలిచేందుకు ఏర్పాట్లు చేస్తోంది. డిసెంబరు చివరి నాటికి లేదా జనవరి మొదటి వారంలో టెండర్లు పిలుస్తారని ఓ సందర్భంలో మంత్రి కోమటిరెడ్డి పేర్కొన్నారు. ఉత్తర భాగానికి అటవీ అనుమతులు కూడా వచ్చాయని ఆయన అధికారికంగా వెల్లడించారు. కానీ, ఇప్పటి వరకు పర్యావరణ అనుమతులు మాత్రం రాలేదు. అవి రాకుండా అవార్డులు పాస్ చేసే వీలు లేదని అధికారులు చెబుతున్నారు. పర్యావరణ అనుమతులు రావాలంటే, ఆ రోడ్డుకు నంబరు కేటాయించాల్సి ఉంటుంది. ట్రిపుల్‌ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే కేటగిరీలో నిర్మిస్తున్నందున దానికి ఎక్స్‌ప్రెస్ వే నంబరు రావాల్సి ఉంది. ఇప్పటి వరకు నంబరు కేటాయించలేదు.

ఉన్నతస్థాయి కమిటీ భేటీ అయితేనే...

దేశవ్యాప్తంగా జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలకు నంబర్లు కేటాయించాలంటే నీతి ఆయోగ్, కేంద్ర ఆర్థికశాఖ అధికారులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీ అనుమతివ్వాల్సి ఉంటుంది. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఇప్పటి వరకు ఆ కమిటీ ఇంకా భేటీ కాలేదు. దాదాపు ఏడాదిన్నరగా పెండింగ్‌లో ఉన్న రోడ్లన్నింటికి సంబంధించి ఒకేసారి నంబర్లు కేటాయించే కసరత్తు చేస్తున్నందున, అన్నింటికి కలిపి ఒకేసారి సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు తెలిసింది. ఈ నంబరు కేటాయింపులో జరుగుతున్న జాప్యం.. ఇప్పుడు పరిహారం చెల్లింపులో ఆలస్యానికి కారణమైంది. ప్రస్తుతం అటవీ శాఖకు సంబంధించి ప్రాథమిక అనుమతి లభించింది. సేకరించే అటవీ భూముల్లో పనులు చేపట్టేందుకు ఇది అనుమతిస్తుంది. దీని కాలపరిమితి ఏడాది మాత్రమే. ఈలోపు అటవీశాఖకు పరిహారం, ప్రత్యామ్నాయ భూకేటాయింపు, అక్కడ చెట్ల పెంపకానికి అయ్యే వ్యయంపై స్పష్టత ఇవ్వాల్సి ఉంటుంది. ఆ కసరత్తు జరిగితేనే పూర్తిస్థాయి అనుమతులు వస్తాయి. అటవీశాఖ పూర్తి అనుమతులు, పర్యావరణ అనుమతులు రాకుండా కూడా టెండర్లు పిలుచుకునే వీలుంటుంది. కానీ, టెండర్లు తెరవాలంటే మాత్రం ఆ అనుమతులు వచ్చి ఉండాలి. ఇక పరిహారం మొత్తాన్ని రైతుల ఖాతాల్లో డిపాజిట్ చేయాలంటే మాత్రం విధిగా పర్యావరణ అనుమతులు వచ్చి ఉండాలి. దాని విషయంలో జాప్యం పరిహారం అందకుండా చేస్తోంది. ఇప్పటికిప్పుడు రోడ్డు నంబరు కేటాయించినా, ఆ తర్వాత పర్యావరణ అనుమతుల జారీ కసరత్తు పూర్తయ్యేందుకు కనీసం రెండు నెలల సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. వెరసి మరో రెండుమూడు నెలల సమయం పట్టే వీలుందని వారు చెబుతున్నారు.

చిరంజీవితో అల్లు అర్జున్ భేటీ

- గంటపాటు చర్చలు
- నాగబాబునూ కలిసిన బన్నీ



చిరంజీవితో అల్లు అర్జున్ దంపతులు

బంజారాహిల్స్ (హైదరాబాద్): తన మావయ్య, సీనియర్ నటుడు చిరంజీవిని ఆదివారం ఉదయం సినీ నటుడు అల్లు అర్జున్ కలిశారు. రెండు రోజుల క్రితం బన్నీని అరెస్టు చేయడం, చంచల్‌గూడ జైలుకు తరలించడం, శనివారం ఉదయం బెయిల్‌పై విడుదల కావడం తదితర అంశాలపై వీరిద్దరూ గంటపాటు చర్చించారు. సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనలో జైలు నుంచి విడుదలైన తరువాత తొలిసారి చిరంజీవిని అర్జున్ కలుసుకున్నారు. అర్జున్ తన భార్య స్నేహా రెడ్డితో కలిసి ఒక కారులో, ఆ వెనుక అల్లు అరవింద్ మరో కారులో చిరు నివాసానికి వచ్చారు. ఈ భేటీలో ఏమి మాట్లాడుకున్నారన్న దానిపై ఎవరూ మాట్లాడలేదు. బన్నీ వెళ్లిపోయిన తర్వాత ఇంకో రెండు గంటలపాటు అల్లు అరవింద్ చిరంజీవి నివాసంలోనే ఉన్నారు. కాగా, అనంతరం అల్లు అర్జున్ నాగబాబు ఇంటికి వెళ్లి ఆయనతో భేటీ అయ్యి కాసేపు ముచ్చటించారు.

పవన్ కలవలేదు... : ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, నటుడు పవన్‌కల్యాణ్ శనివారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో విజయవాడ నుంచి హైదరాబాద్ చేరుకున్నారు. ఉదయం వరకు జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–33లోని తన ఇంట్లోనే ఉన్నారు. ఉదయం 10.30 గంటలకు తిరిగి ప్రత్యేక విమానంలో విజయవాడ వెళ్లిపోయారు. అల్లు అర్జున్ పవన్ కల్యాణ్‌ను కలుస్తారని, లేదా పవన్‌కల్యాణ్ అల్లు అర్జున్ ఇంటికి వెళ్లి పరామర్శిస్తారని వార్తలు చక్కర్లు కొట్టాయి. పవన్ కళ్యాణ్ అల్లు అర్జున్‌ను కలవడానికే హైదరాబాద్‌కు వచ్చారంటూ సోషల్ మీడియాలో వార్తలు వెలువడ్డాయి. తీరా చూస్తే వీరిద్దరి మధ్య ఎలాంటి కలయిక లేకుండానే పవన్ వెళ్లిపోయారు.

శ్రీతేజ్ త్వరగా కోలుకోవాలి

'దురదృష్టకర ఘటన తర్వాత ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి శ్రీ తేజ్ గురించి నేను చాలా ఆందోళన చెందుతున్నాను. లీగల్ ప్రొసీడింగ్స్ నేపథ్యంలో ప్రస్తుతం ఆ బాలుడిని కానీ, ఆ కుటుంబాన్ని కానీ సందర్శించవద్దని సలహా ఇచ్చారు. చికిత్స పొందుతున్న అతడు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా. ఆ బాలుడి వైద్య ఖర్చులను, ఆ కుటుంబ అవసరాలను తీర్చే బాధ్యతను తీసుకుంటానన్న మాటకు నేను కట్టుబడి ఉన్నాను. వీలైనంత త్వరలో ఆ బాలుడిని, అతడి కుటుంబాన్ని కలుస్తాను' అని అల్లు అర్జున్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

మంచు ఫ్యామిలీలో మరో వివాదం

- నా కుటుంబాన్ని విష్ణు హత్య చేసే కుట్ర : మంచు మనోజ్
- జనరేటర్‌లో పంచదార కలిపిన డీజిల్ పోశారంటూ ఆరోపణ
- ఈ మేరకు ప్రకటన విడుదల



జల్‌పల్లిలోని మంచు టౌన్‌షిప్

పహాడీషరీఫ్(హైదరాబాద్): సినీనటుడు మంచు మోహన్‌బాబు ఇంట్లో మరో వివాదం నెలకొంది. జల్‌పల్లి మంచు టౌన్‌షిప్‌లోని జనరేటర్‌లో విష్ణు, అతని అనుచరులు పంచదార కలిపిన డీజిల్ పోశారంటూ మనోజ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జనరేటర్ పరిసరాల్లో విష్ణు, అనుచరులు తిరుగుతున్న దృశ్యాలకు సంబంధించిన సీసీ ఫుటేజీని మనోజ్ విడుదల చేశారు. తనతోపాటు తన తల్లి, భార్య, పిల్లలను హత్య చేసేందుకు విష్ణు కుట్ర పన్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. శనివారం తన తల్లి పుట్టిన రోజు ఉండడంతో కేక్ ఇచ్చే నెపంతో.. సోదరుడు విష్ణు, అతని అనుచరులు రాజ్ కొండూర్, కిరణ్, విజయ్‌రెడ్డితో పాటు మరికొంత మంది బౌన్సర్లు ఇంట్లోకి వచ్చారన్నారు. తాను సినిమా చిత్రీకరణలో ఉండగా, తన కుమారుడి స్కూల్‌లో ఉన్న ఈవెంట్‌కు తన సతీమణి హాజరైందన్నారు. అలా తాము లేని సమయంలో విష్ణు, అతని అనుచరులు జనరేటర్‌లో పంచదార కలిపిన డీజిల్ పోశారన్నారు. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి ఆందోళనకు గురవ్వాల్సి వచ్చిందని వివరించారు. ఇలాంటి చర్యతో భారీ అగ్నిప్రమాదం సంభవించే అవకాశముందన్నారు. ఇంట్లో అమ్మ, తొమ్మిది నెలల కుమార్తె, కుమారుడు, అత్తమామలు ఉన్నారన్నారు. జనరేటర్లకు సమీపంలో వాహనాలు పార్కు చేసి ఉన్నాయని, అక్కడే గ్యాస్ కనెక్షన్ ఉందని తెలిపారు. విష్ణు టీమ్ ఇంటి నుంచి వెళ్లిపోతూ తన వద్ద పనిచేసే వారిని అక్కడి నుంచి పంపించి వేసిందన్నారు. అమ్మ పుట్టిన రోజున నా దంగల్ కోచ్‌ను బెదిరించి, ఇలాంటి ఘటనకు పాల్పడడం తన హృదయాన్ని కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను, తన కుటుంబం భయంభయంగా గడుపుతోందని, ఈ ఘటనపై పోలీసులు చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నానన్నారు. ఈ విషయమై సోమవారం పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తానని వెల్లడించారు. కాగా ఈ నెల 8న గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారంటూ మనోజ్ పహాడీషరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేయడం.. మనోజ్ దంపతులతో తనకు ప్రాణహాని ఉందని మోహన్‌బాబు పరస్పరం ఫిర్యాదు చేసుకున్న విషయం తెలిసిందే. 10వ తేదీన రాత్రి మనోజ్‌ను ఇంట్లోకి రాకుండా అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకోవడం.. కవరేజీకు వెళ్లిన మీడియా ప్రతినిధులపై మోహన్‌బాబు దాడి చేసిన ఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న రాచకొండ పోలీస్ కమిషనర్ విష్ణు, మనోజ్‌లను తీవ్రంగా హెచ్చరించి బైండోవర్ చేశారు. వయో వృద్ధుడి కోణంలో మోహన్‌బాబుకు కోర్టు విచారణ నుంచి మినహాయించింది. గొడవ సద్దుమణిగిందనుకున్న తరుణంలో మళ్లీ వివాదం రాజుకోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

జర్నలిస్టు రంజిత్‌ను పరామర్శించిన మోహన్‌బాబు



జర్నలిస్టు రంజిత్‌ను పరామర్శిస్తున్న మోహన్ బాబు

పంజగుట్ట (హైదరాబాద్): సినీ నటుడు మోహన్‌బాబు చేతిలో గాయపడి సోమాజిగూడ యశోదా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జర్నలిస్టు రంజిత్‌ను ఆదివారం సాయంత్రం మోహన్‌బాబు, ఆయన కుమారుడు మంచు విష్ణు పరామర్శించారు. గత ఐదురోజుల క్రితం జల్‌పల్లిలో ఉన్న మోహన్‌బాబు ఇంటి వద్ద జరిగిన వివాదాన్ని కవర్ చేసేందుకు వెళ్లిన టీవీ–9 జర్నలిస్టు రంజిత్‌పై మోహన్‌బాబు మైక్‌తో దాడి చేసిన విషయం విదితమే. ఈ దాడిలో పుర్రెకు ఫ్రాక్చర్ అయిన రంజిత్‌కు మూడు రోజులక్రితం వైద్యులు శస్త్రచికిత్సచేసి ప్లేట్ వేశారు. దీంతో జర్నలిస్టు సంఘాల నాయకుల నుంచి, రాజకీయ నాయకుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఈ క్రమంలో మోహన్‌బాబు ఆస్పత్రికి వచ్చి రంజిత్ ఆరోగ్యపరిస్థితి తెలుసుకుని అతని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మోహన్‌బాబు వెళ్లిపోయిన తరువాత రంజిత్‌ను డిశ్చార్జి చేసినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. కాగా, మీడియా ప్రతినిధిని తాను ఉద్దేశపూర్వకంగా కొట్టలేదని, ఆవేదనలో, అయోమయ పరిస్థితుల్లో అలా జరిగిందని మోహన్‌బాబు వివరణ ఇచ్చినట్లు సమాచారం. ఈ సందర్భంగా ఆయన జర్నలిస్టులకు క్షమాపణలు చెప్పినట్లు, రంజిత్ కుటుంబానికి అండగా ఉంటానని తెలిపినట్లు తెలిసింది.

వెజి'ట్రబుల్' సాగు!

▶ మొదటి పేజీ తరువాయి

సుగంధ ద్రవ్యాల సాగు 3 లక్షల ఎకరాల్లో, ఆయిల్ పామ్ 2 లక్షల ఎకరాల్లో, ఆగ్రో ఫారెస్ట్రీ లక్ష ఎకరాల్లో, పూలు, ఇతర వాణిజ్యపర ఉద్యాన పంటలు కలిపి లక్షన్నర ఎకరాల్లో సాగయ్యాయి. రాష్ట్రంలోని నాలుగున్నర కోట్ల జనాభాకు అవసరమైన కూరగాయల సాగు జరుగుతున్నది కేవలం 1.13 లక్షల ఎకరాల్లో మాత్రమే. నిజానికి 2013–14లో తెలంగాణలో 5.46 లక్షల ఎకరాల్లో కూరగాయలు సాగు కాగా.. తర్వాతి నుంచి ఏటా తగ్గిపోతూ వచ్చింది. ఈసారి 1.13 లక్షల ఎకరాలకే పరిమితమైంది. అంటే పదేళ్లలో 4.33 లక్షల ఎకరాల మేర (80శాతం) కూరగాయల సాగు తగ్గింది. ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకున్న నిల్వ కూరగాయలనే జనం వాడాల్సి వస్తోంది. కూరగాయల సాగులో రాష్ట్రం దేశంలో 15 స్థానానికి, ఉత్పత్తిలో 14వ స్థానానికి పడిపోవడం గమనార్హం.

ఏటా 40 లక్షల టన్నులు అవసరం

రాష్ట్ర జనాభా వినియోగం కోసం ఏటా 40 లక్షల మెట్రిక్ టన్నుల కూరగాయలు అవసరం. హార్టికల్చర్ విభాగం లెక్కల ప్రకారం 1.13 లక్షల ఎకరాల్లో ఉత్పత్తి అవుతున్న కూరగాయలు 21 లక్షల టన్నులు మాత్రమే. ఇందులోనూ వంకాయ, టమాటాలను అవసరానికి మించి పండిస్తున్నారు. పచ్చిమిర్చితో పాటు బెండ, దొండ, ఉల్లి, బంగాళాదుంప, చిక్కుడు, పొట్లకాయ, సొరకాయ, బీరకాయ, కాలీఫ్లవర్, క్యాబేజీ, క్యారెట్‌తోపాటు పాలకూర, తోటకూర, కొత్తిమీర, పుదీనా వంటివి కూడా ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. రవాణా ఖర్చు కారణంగా రాష్ట్రంలో కూరగాయల ధరలు ఎక్కువగా ఉంటున్నాయి.

ప్రోత్సాహకాలు, నిల్వ సదుపాయాలు లేక..

కూరగాయల సాగు చేసే రైతులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడం, కోల్డ్ స్టోరేజీ సదుపాయాల కొరత, పండించిన కూరగాయలకు సరైన మార్కెట్ కల్పించకపోవడం వంటి సమస్యలతో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లుతున్నారు. కూరగాయల విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల ధరలతోపాటు కూలీల ఖర్చులు పెరగడం, పంటలకు గిట్టుబాటు ధరలు లభించకపోవడం కూడా కూరగాయల సాగు పట్ల రైతులకు ఆసక్తి తగ్గడానికి కారణమని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు.

తెలంగాణలో కూరగాయల సాగు తీరు

సంవత్సరం	సాగు విస్తీర్ణం (లక్షల ఎకరాల్లో)
2013-14	5.45
2014-15	4.40
2015-16	4.24
2016-17	3.08
2017-18	3.44
2018-19	3.49
2019-20	2.85
2020-21	2.21
2021-22	1.81
2022-23	1.37
2023-24	1.16
2024-25	1.13

పెరిగిన వరి, పత్తి, మొక్కజొన్న సాగు విస్తీర్ణం

తెలంగాణలో కూరగాయల సాగు తగ్గిపోగా వరి సాగు విస్తీర్ణం బాగా పెరిగింది. భూగర్భ జలాలు, సాగు నీటి సదుపాయాలు పెరగడం దీనికి కారణం. ఈ ఏడాది వానకాలం సీజన్‌లో వరి 66 లక్షల ఎకరాల్లో, పత్తి 44 లక్షల ఎకరాల్లో సాగవడం గమనార్హం. యాసంగిలోనూ 60 లక్షల ఎకరాల్లో వరి వేశారు. దీనితో పాటు మొక్కజొన్న, మిర్చి వంటి పంటల సాగు కూడా గణనీయంగా పెరుగుతోంది. కూరగాయల సాగు మరింతగా క్షీణిస్తోంది. నిజానికి కాళేశ్వరం ప్రాజెక్టు కింద ఉన్న ఎల్లంపల్లి, మిడ్‌మానేరు, కొండపోచమ్మ సాగర్, మల్లన్న సాగర్, ఖమ్మం పరిధిలో సీతారామ ప్రాజెక్టు వంటివి అందుబాటులోకి వచ్చాక... రాష్ట్రంలో వరితోపాటు కూరగాయల సాగు కూడా పెరుగుతుందని వ్యవసాయశాఖ అధికారులు భావించారు. కానీ దీనికి భిన్నంగా జరుగుతోంది. కూరగాయలు ఎక్కువగా పండించే.. రంగారెడ్డి, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ వంటి జిల్లాల్లో కూడా సాగు తగ్గుముఖం పడుతుండటం ఆందోళనకరంగా మారింది.

దేశంలో రాష్ట్రం స్థానం

కూరగాయల సాగులో	ఉత్పత్తిలో
15	14

హైదరాబాద్‌లో తగ్గిన కూరగాయల వినియోగం

హైదరాబాద్‌లో కూరగాయల వినియోగంపై జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ, నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ సంయుక్తంగా జరిపిన సర్వేలో ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సగటున నెలకు ఒక్కొక్కరు 8.08 కిలోల కూరగాయలు(ఉల్లిపాయలతో కలిపి) వినియోగిస్తున్నట్లు తేలింది. అంటే రోజుకు 269 గ్రాములు అన్నమాట. దేశ సగటు కంటే ఇది 56 గ్రాములు తక్కువ. మన దేశ పరిస్థితుల మేరకు.. ప్రతి ఒక్కరూ రోజుకు 325 గ్రాముల కూరగాయలు తీసుకోవాలని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) సూచించడం గమనార్హం. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రోజుకు 2,006 టన్నులు అంటే నెలకు 60,182 టన్నులు, ఏడాదికి 7,22,186 టన్నుల కూరగాయలు అవసరమని అంచనా. కానీ ఏటా హైదరాబాద్‌కు 6 లక్షల టన్నుల కూరగాయలు మాత్రమే వస్తున్నట్టు అంచనా. ఇందులోనూ 80శాతం ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్నవే. సరిపడా కూరగాయలు రాకపోవడం, ధరలు ఎక్కువగా ఉండటంతో వినియోగం తక్కువగా ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.



లాభాలపై గ్యారంటీ లేదు

కూరగాయలు పండిస్తే పెట్టిన పెట్టుబడికి అదనంగా వచ్చే లాభాలపై ఎలాంటి గ్యారంటీ లేదు. ఒకవైపు వాతావరణ పరిస్థితులు. మరోవైపు చీడపీడల బెడద. అన్నీ తట్టుకొని సాగుచేసినా.. మహారాష్ట్ర నుంచి దిగుబడి అవుతున్న కూరగాయలతో పోటీపడలేకపోతున్నాం. మొన్నటి వరకు మంచి ధర పలికిన టమాటా, కొత్తిమీర ధరలు ఇప్పుడు బాగా తగ్గాయి. దిగుబడి వస్తున్న సమయంలో ధర తగ్గిపోవడంతో నష్టపోవాల్సి వస్తోంది.
- సాతాళే విజయ్‌కుమార్, కూరగాయల రైతు, గుడిహత్నూర్



కూరగాయల సాగు ఖర్చులు బాగా పెరిగాయి

కూరగాయలకు చీడపీడల సమస్య ఎక్కువ. పురుగు మందులు, ఎరువులు, ఇతర సాగు ఖర్చులు పెరిగిపోతున్నాయి. కొన్నిసార్లు పెట్టుబడి కూడా తిరిగిరాని పరిస్థితులు ఎదురవుతున్నాయి. దీంతో క్రమంగా కూరగాయల సాగు తగ్గించుకుంటూ వస్తున్నాం. సూపర్ మార్కెట్లు పెరగడం, ఇతర ప్రాంతాల నుంచి టోకుగా తెప్పించుకుంటుండటంతో.. స్థానికంగా మార్కెటింగ్ సమస్య వస్తోంది.
- ముత్యంరెడ్డి, రైతు, బుస్సపూర్, బాల్కొండ నియోజకవర్గం



అల్ప మానవులు అదృష్టాన్ని నమ్ముతారు.
బలవంతులు కార్య కారణాలను నమ్ముతారు.
– రాల్ఫ్ వాల్డో ఎమర్సన్

సాక్షి
సోమవారం, 16 డిసెంబర్ 2024

మంచినీళ్ల కుండ

‘చదువని వాడజ్ఞుండగు! చదివిన సదసద్వివేక చతురత గలుగున్!’ అంటాడు పోతన తన ఆంధ్ర మహా భాగవతంలో. చదవకపోతే ఏమీ తెలీదు, చదువుకుంటేనే మంచీ చెడుల వివేకం కలుగుతుంది; అందుకే, ‘చదువంగ వలయు జనులకు! చదివించెద నార్యులొద్ద, చదువుము తండ్రీ!’ అని ప్రహ్లాదుడికి తండ్రి హిరణ్యకశ్యపుడితో చెప్పిస్తాడు. నిజంగానే ఆ గురువుల దగ్గరి చదువేదో పూర్తికాగానే, ‘చదివించిరి నను గురువులు! చదివితి ధర్మార్థ ముఖ్య శాస్త్రంబులు! నే/ జదివినవి గలవు పెక్కులు! చదువులలో మర్మ మెల్ల జదివితి తండ్రీ!’ అని జవాబిస్తాడు ప్రహ్లాదుడు. కొడుకుకు కలిగిన వివేకం తండ్రి కోరుకున్నదేనా అన్నది పక్కనపెడితే, చదువనేది భిన్న ద్వారాలు తెరుస్తుందన్నది నిజం. ప్రహ్లాదుడు పుట్టు వివేకి కాబట్టి, తనకు కావాల్సిన సారాన్ని గ్రహించగలిగాడు. అందరికీ అలాంటి గుణం ఉంటుందా? అందుకే, ‘చదువులన్ని చదివి చాలవివేకియౌ/ కపటికెన్నెట్లు కలుగు ముక్తి/ దాలిగుంటగుక్క తలచిన చందము’ అన్నాడు వేమన. ‘చదువులెల్ల చదివి సర్వజ్ఞుడై యుండి’నప్పుడు కూడా ఉండే బలహీనతలను ఎత్తిపొడిచాడు. ఆత్మసారం తెలుసుకోవడమే ముఖ్యమన్నాడు.

అతడు ‘బాగా చదువుకున్నవాడు’ అంటే లోకాన్ని బాగా అర్థం చేసుకున్నవాడు, పరిణత స్వభావం ఉన్నవాడు, గౌరవనీయుడు, ఒక్క మాటలో వివేకి అని! వివేకం అనేది ఎన్నో గుణాలను మేళవించుకొన్న పెనుగుణమే కావొచ్చు. అయినా అదొక్కటే చాలా? ‘చదువది యెంతగల్గిన రసజ్ఞత యించుక చాలకున్న నా/ చదువు నిరర్థకమ్ము’ అన్నాడు భాస్కర శతకకర్త మారవి వెంకయ్య. ‘బదునుగ మంచి కూర నలపాకము చేసిననైన నందు నిం/పొదవెడు నుప్పులేక రుచి బుట్టగ నేర్చునటయ్య భాస్కరా!’ అని ప్రశ్నించాడు. కూరకు రుచి తెచ్చే ఉప్పులాగే జీవితంలో ‘యించుక’ రసజ్ఞత ఉండాలి. చాలామందిలో ఆ సున్నితం, ఆ సరస హృదయం లోపించడం వల్లే సంబంధాలు బండబారుతున్నాయి. అందుకే వివేకం, రసజ్ఞతలను పెంచే చదువు ముఖ్యం. ఈ చదువు తరగతి చదువు కాదని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. తరగతి గదిలోనే ఇవి అలవడితే అంతకంటే కావాల్సింది ఏముంది! ప్రపంచంలోకి దారి చూపే చదువు, ప్రపంచాన్ని చేరువ చేసే చదువు సాహిత్య రూపంలో ఉంటుంది. ఆ సాహిత్యం మంచి పుస్తకం రూపంలో హస్తభూషణమై ఉంటుంది.

మనుషుల వివేకాన్ని కొలవదలిచినవాళ్లు ‘ఇప్పుడు ఏం చదువుతున్నారు?’ అని అడుగుతారు. చదవడం మాత్రమే సరిపోదు, ఆ చదువుతున్నది ఏమిటి? ‘నీ దగ్గర ఎన్ని పుస్తకాలు ఉన్నాయన్నది విషయం కాదు, నీ దగ్గరున్న పుస్తకాలు ఎంత మంచివి అన్నదే ముఖ్యం’ అంటాడు గ్రీకు తత్వవేత్త సెనెకా. మంచిని ఎలా కొలవాలి? ‘మనల్ని గాయపరిచే, పోటుపొడిచే పుస్తకాలే మనం చదవాలి. తల మీద ఒక్క చరుపు చరిచి మేలుకొలపకపోతే అసలంటూ ఎందుకు చదవడం’ అంటాడు రచయిత ఫ్రాంజ్ కాఫ్కా. చదవడమే పెద్ద విషయం అయిన కాలంలో, దానికి ఇన్ని షరతులా అన్న ప్రశ్న రావడం సహజమే. ఎందుకంటే, ‘నేషనల్ లిటరసీ ట్రస్ట్’ నివేదిక ప్రకారం, భారతీయ చిన్నారుల్లో చదవడం దాదాపు సంక్షోభం స్థాయికి పడిపోయింది. 5–18 ఏళ్లవారిలో కేవలం మూడింట ఒక్కరు మాత్రమే తమ ఖాళీ సమయంలో చదవడాన్ని ఆనందిస్తామని చెప్పారు. కేవలం 20 శాతం మంది మాత్రమే, ప్రతిరోజూ ఏదో ఒకటి చదువుతున్నామని జవాబిచ్చారు. చదివే అలవాటును పెంచకపోతే, వికాసానికి దారులు మూస్తున్నట్టే!

ఆధునిక తరానికి చదవడం మీద ఉత్సాహం కలిగించేలా, అయోమయ తరానికి రసజ్ఞత పెంచేలా ‘హైదరాబాద్ బుక్ ఫెయిర్’ డిసెంబర్ 19 నుంచి 29 వరకు పాటు కాళోజీ కళాక్షేత్రం (ఎన్టీఆర్ స్టేడియం)లో జరగనుంది. మధ్యాహ్నం పన్నెండు నుంచి రాత్రి తొమ్మిది వరకు ఇది కొనసాగుతుంది. తెలుగు, ఆంగ్లం, ఉర్దూ, హిందీలో పేరున్న భిన్న ప్రచురణకర్తలు, విక్రేతలు, రచయితల స్టాళ్లు సుమారు 350 వరకు ఏర్పాటవుతాయి. నూతన పుస్తకాల ఆవిష్కరణలు, ఉపన్యాసాలు ఉంటాయి. 1985 నుంచి జరుగుతున్న ఈ బుక్ ఫెయిర్‌ను ఈసారి పదిహేను లక్షల మంది సందర్శిస్తారని అంచనా. ‘మనం అనేక పండుగలు చేసుకుంటాం. కానీ పుస్తకాల పండుగ ప్రత్యేకమైనది. పెద్ద జాతరలో మంచినీళ్ల కుండ లాంటిది బుక్ ఫెయిర్. ఏ రకమైనా కావొచ్చుగాక, అసలు పుస్తకాల వైపు రాగలిగితే మనిషికి వివేకం, వివేచన పెరుగుతాయి. జీవిత సారాన్ని అందించేదే కదా పుస్తకమంటే! ‘ఏడు తరాలు’ లాంటి నవలకు మనం ఎట్లా కనెక్ట్ అయ్యాం! పుస్తకాలు, అక్షరాలు లేకపోతే మనం ఎక్కడుండేవాళ్లం? అందుకే ఈసారి నచ్చిన, మెచ్చిన, ప్రభావితం చేసిన పుస్తకం అంటూ పుస్తకం కేంద్రకంగా కొన్ని సెషన్లు నిర్వహిస్తున్నాం’ అని చెబుతున్నారు బుక్ ఫెయిర్ అధ్యక్షుడు ‘కవి’ యాకూబ్. అయితే, పుస్తకాల దుకాణాల కన్నా, దగ్గర్లోని బజ్జీల బండికి గిరాకీ ఎక్కువ అనే వ్యంగ్యం మన దగ్గర ఉండనే ఉంది. అన్నింటిలాగే ఇదీ ఒక ఔటింగ్, ఒక వినోదం, బయటికి వెళ్లడానికి ఒక సాకు... లాంటి ప్రతికూల అభిప్రాయాలు ఉండనే ఉన్నాయి. ఏ వంకతో వెళ్లినా దేవుడి దగ్గరికి వెళ్లగానే భక్తిగా కళ్లు మూసుకున్నట్టు, పుస్తకం చూడగానే ఆర్తిగా చేతుల్లోకి తీసుకుంటున్నప్పుడు ఏ కారణంతో వెళ్తేనేం? కాకపోతే వ్యక్తిత్వానికి సరిపడే, వివేకం–రసజ్ఞతలను పెంచే పుస్తకాలను ఎంపిక చేసుకోవడమే పెద్ద పని. దానికోసం కొంత పొల్లు కూడా చదవాల్సి రావొచ్చు. కానీ క్రమంగా ఒక ఇంట్యూషన్ వృద్ధి అవుతుంది. అదే చదువరి పరిణతి.

ఎవరిని ఎలా పిలవాలి?

కామెంట్



కరణ్ థాపర్

టేబుల్‌కు ఎదురుగా ఉన్న వ్యక్తులు ఇద్దరూ సమానమే అన్న అంచనాతో (భ్రమతో?) ఇంటర్వ్యూ మొదలవుతుంది. అప్పుడు మాత్రమే, ఇంటర్వ్యూ చేసేవాళ్లకు శోధించేందుకు, అవసరమైతే వ్యతిరేకించేందుకు ఇరువురి సమానత్వం ఒక హక్కును కల్పిస్తుంది. అవతలి వ్యక్తి నీ కంటే పెద్ద స్థాయివాడు కాదని అనుకున్నప్పుడే, అవసరమైనప్పుడు వారి మాటలను అడ్డుకునేందుకు సందేహించాల్సిన అవసరం ఉండదు. అందుకే ఎంపీలు, మంత్రులు, అధికారులను... మిస్టర్, మిసెస్, మిస్ అనో... ప్రభుత్వంలో ఉంటే మినిస్టర్ అనో సంబోధించడం ఉచితంగా ఉంటుంది. అదే సెలబ్రిటీలను చేసే ఛాట్ షో ఇంటర్వ్యూల విషయానికి వస్తే ఇవన్నీ మారిపోతాయి. వాళ్లను ‘మిస్టర్’ అంటే దూరం జరిగినట్టు అవుతుంది. అప్పుడు పేరు పెట్టి పిలవడం ఉత్తమం.

ఆ మధ్య నాకు ఒక లేఖ అందింది. అందులో చాలా ఆసక్తికరమైన ప్రశ్న ఒకటుంది. సమాధానం ఇలా బహిరంగంగానే ఇస్తే మేలు అనిపించింది. ‘‘ఇంటర్వ్యూ చేసే వారిని మీరు రకరకాలుగా సంబోధించడాన్ని గమనించాను’’ అంటూ మొదలైంది ఈ లేఖ. ‘‘కొంతమందిని మిస్టర్ ఎక్స్ అంటారు.. ఇంకొంతమందిని ‘మినిస్టర్’ అంటూ వారి పదవితో సంబోధించారు. మరికొన్ని సందర్భాల్లో వాళ్ల పేరుతో పిలిచారు. కానీ ఎప్పుడూ ‘సర్’ అని పిలవడం మాత్రం చూడలేదు. ఎందుకలా? అసలు ఎవరిని ఎలా పిలవాలో మీరు ఎలా నిర్ణయిస్తారు?’’

సర్ అంటే వేరే!

ఈ ప్రశ్నలు చూసిన వెంటనే నా ఆలోచనలు రెండు దశాబ్దాల వెనక్కు వెళ్లాయి. ఆ రోజు జీవితంలో మొట్టమొదటిసారి ఓ ప్రముఖుడిని ఇంటర్వ్యూ చేయబోతున్నాను. తర్వాత బ్రిటన్ హోమ్ శాఖ మంత్రి అయిన డేవిడ్ వాడింగ్టన్ ఇంటర్వ్యూ అది. 1983లో మార్గరెట్ థాచర్ మంత్రివర్గంలో ఇమ్మిగ్రేషన్ శాఖల మంత్రిగా ఆయన పని చేశారు. ప్రస్తుత ‘బీబీసీ’ ఛైర్మన్ సమీర్ షా అప్పట్లో నా బాస్. బీబీసీ కార్యక్రమం ‘ఐ విట్‌నెస్’ ప్రొడ్యూసర్ ఆయన.

ఇంటర్వ్యూ కోసం స్టూడియోలోకి వెళుతూండగా సమీర్ మాట్లాడుతూ, ‘‘ఒక్క విషయం గుర్తుంచుకో కరణ్’’ అన్నారు. ‘‘ఆయన్ని మిస్టర్ వాడింగ్టన్ అనైనా పిలువు. లేదా మినిస్టర్ అను. సర్ అని మాత్రం పిలవొద్దు’’ అని సలహా ఇచ్చారు. బ్రిటిష్ ఇంగ్లీషులో ‘సర్’కు ఉన్న అర్థం వేరు కావడమే దీనికి కారణం. దానివల్ల ఇంటర్వ్యూలో వాడింగ్టన్ హోదాను ఇంటర్వ్యూ చేసేవాడికన్నా ఎక్కువ అనుకునేలా చేస్తుంది. ఇంటర్వ్యూ చేసేవాడు, ఇచ్చే మనిషి ఇద్దరూ సమానమే అన్న అంచనాతో(లేదా భ్రమ?) ఈ ఏర్పాటు అన్నమాట. ఇంటర్వ్యూ చేసేవాళ్లకు శోధించేందుకు, అవసరమైతే వ్యతిరేకించేందుకు ఇరువురి సమానత్వం ఒక హక్కును కల్పిస్తుంది. అలాగే అవతలి వ్యక్తి నీ కంటే పెద్ద స్థాయివాడు కాదని తెలిస్తే అవసరమైనప్పుడు వారి మాటలను అడ్డుకునేందుకూ సందేహించాల్సిన అవసరం ఉండదు.

వాస్తవానికి ఆ ఇంటర్వ్యూ బ్రిటిష్ ఇమ్మిగ్రేషన్ నిబంధనల అంశంపై సాగింది. ఆనాటి నిబంధలు ఆసియా ప్రాంత వాసులకు ఇబ్బందికరంగా ఉండేవి. హాట్ టాపిక్ కాబట్టి ఇంటర్వ్యూ కూడా అదే స్థాయిలో ఉండటం సహజం. వాడింగ్టన్ సమాధానాలు నాకు సంతృప్తి కలిగించే అవకాశమే లేదు. అందుకే సమీర్ నన్ను పరోక్షంగా హెచ్చరిస్తూ ఆ మాటలు అన్నారు. ఆయన్ని నేను సంబోధించే విధానం నా స్థితిని బలహీనం చేయకూడదన్నది సమీర్ ఉద్దేశం. కాబట్టి... సర్ అన్న సంబోధన లేకుండా పోయింది.



అప్పటి నుంచి ఇప్పటివరకూ నాకు సమీర్ మాటలే పరమ ధర్మంలా మిగిలాయి. అధికారంలో ఉన్న వ్యక్తి ఎవరిని ఇంటర్వ్యూ చేస్తున్నా... ఎంపీలు, మంత్రులు, పారిశ్రామికవేత్తలు, అధికారులు, ప్రముఖులు ఎవరైనా సరే... మిస్టర్, మిసెస్, మిస్ అని కానీ... ప్రభుత్వంలో ఉంటే మినిస్టర్ అని కానీ సంబోధించడాన్ని ఒక నియమంగా పెట్టుకున్నాను. ఇలా ఎందుకో చెబుతాను.

‘‘సర్... మీరు చెబుతున్నది కరెక్ట్ కాదు’’ అని ప్రతిసారీ చెప్పలేం. ‘సర్’ అని సంబోధిస్తూంటే... ఇలా చెప్పే అవకాశం గట్టిగా చెప్పలేకపోవచ్చు. అదే ‘మినిస్టర్’ అని సంబోధిస్తున్నాం అనుకోండి... ఎప్పుడు కావాలంటే అప్పుడు ‘‘సారీ, మీరు తప్పు చెబుతున్నారు’’ అనేయవచ్చు. ‘సర్’ అంటే ఒకపక్క ఉన్నత స్థానం కల్పిస్తూ... ఇంకో పక్క తప్పు అంటున్నాం. పరస్పర విరుద్ధం ఇవి. ‘మినిస్టర్’ అంటున్నప్పుడు మీరు చెబుతున్నది తప్పు అనేందుకు పెద్దగా ఇబ్బంది పడనక్కరలేదు.

సన్నిహిత సంభాషణల్లో... పేరుతో!

అయితే... ఛాట్ షో ఇంటర్వ్యూల విషయానికి వస్తే ఇవన్నీ మారిపోతాయి. అవతలి వ్యక్తి గ్లామర్, సెలబ్రిటీ స్థాయిని బట్టి కదా ఇంటర్వ్యూకు ఎంచుకున్నాను. అది వర్తమాన అంశాలకు సంబంధించిన ఇంటర్వ్యూ కాదు. విధాన నిర్ణయాల గురించి గుచ్చిగుచ్చి అడిగేది కాదు. వారి జీవిత ఘట్టాలు, జ్ఞాపకాలకు సంబంధించినది కాబట్టి, వారి వ్యక్తిత్వాన్ని పరిచయం చేసే షో కాబట్టి... ‘మిస్టర్’, ‘మిస్’ అంటే వారికి దూరం జరిగినట్టు అవుతుంది. ఇది చర్చను ముందుకు పోనీయదు. అలాంటి సందర్భాల్లో వారిని పేరుతో పిలుస్తూంటాను. అందుకే జావేద్(అఖ్తర్), షారుఖ్(ఖాన్), మాధురీ (దీక్షిత్), షర్మిలా (ఠాగూర్), విక్రమ్(సేథ్), సచిన్ (టెండూల్కర్) అన్న పేర్లతో సంబోధన ఉంటుంది.

ఒక్కోసారి పరిస్థితి వికటించే అవకాశం కూడా ఉంది. నేను ఇంటర్వ్యూ చేసేవాళ్లలో కొంతమంది నాకు బాగా పరిచయమైన రాజకీయ నేతలు కూడా ఉంటూంటారు. ఉదాహరణగా చెబుతున్నా... అలాంటి వారిని ‘మిస్టర్ థరూర్’ అని సంబోధించాల్సి వస్తుంది. నాకు వ్యక్తిగతంగా ఆయన శశిగానే తెలిసినప్పుడు ‘మిస్టర్ థరూర్’ అని పిలవడం ఎబ్బెట్టుగా ఉంటుంది. వీలైనంత వరకూ పేరు పెట్టి పిలవకుండా, ఇంటిపేరుతో కలిపి పిలవడం ద్వారా బ్యాలెన్స్ చేస్తూంటాను. ఇది ఫార్మల్‌గానూ ఉంటుంది, అలాగే వ్యక్తిగత సాన్నిహిత్యాన్ని సూచించేందుకూ ఇబ్బందిగా ఉండదు.

నేను చేయని పనల్లా ఒక్కటే! మంత్రిని పేరు పెట్టి పిలవను. వాళ్లు నాకు తెలిసినప్పటికీ పీయూశ్, కపిల్ అంటూ పేర్లతో పిలవను. ఫార్మల్ ఇంటర్వ్యూలో ఇలా పిలవడం అంత మంచిది కాదు. వీక్షకులు వెంటనే సాన్నిహిత్యాన్ని పసిగట్టేస్తారు.

నాకు వచ్చిన ప్రశ్నకు సమాధానం దక్కిందనే అనుకుంటున్నాను. ఇదెంత అర్థవంతంగా ఉందో నిర్ణయించుకోవాల్సింది మాత్రం మీరే!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్, రాజకీయాంశాల వ్యాఖ్యాత

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

అనుకుంటే చాలు!



శుద్ధమైన చైతన్యం అనేది అర్థవంతమైన మానసిక కాకతాళీయతకు మూలం.

– దీపక్ చోప్రా, ఆధ్యాత్మిక బోధకుడు

మార్పు రెండు రకాలు



రెండు దశాబ్దాలుగా చైనా వెళ్తున్నాను. క్రమంగా సమాజం మరింత మర్యాదతో, తెలివితో, ఆత్మ విశ్వాసంతో ప్రవర్తించడం గమనించాను. నేరాలు కూడా బాగా తగ్గాయి. అదే ఇండియాలోనేమో అందుకు పూర్తి వ్యతిరేకంగా జరుగుతోంది.

– జయంత్ భండారీ, ఇన్వెస్టర్

రిస్కు తీసుకోలేక...



కౌటిల్యుడి ఆలోచనలో ప్రాదేశిక వ్యాప్తి కూడా రాజ్య ధర్మాల్లో ఒకటి. కానీ భారత ప్రధానమంత్రులు రిస్కు తీసుకోవడానికి సిద్ధంగా లేక, ప్రాదేశిక లాభాలను నిర్లక్ష్యం చేశారు. కేవలం యూఎస్ఎస్ఆర్ సంరక్షణ వల్లే ఇండియా 20వ శతాబ్దాన్ని మనగలిగింది. ఇప్పుడది ‘సార్వభౌమత్వం’ అనే తప్పుడు భావనను ఎగతాళి చేసే అమెరికా, చైనా రెండింటినీ ఎదుర్కోవాల్సి ఉంది.

– జోసెఫ్ టి. నూనీ, రచయిత

మంచి మనిషి



మా అమ్మకు అనారోగ్యంగా ఉందన్న కారణంగా, క్లినిక్ నుంచి ఇంటి దగ్గర దింపడానికి ఆటో డ్రైవర్ డబ్బులు తీసుకోలేదు. మీకు జీవితంలో అన్నీ సమృద్ధిగా దొరకాలి సర్!

– గౌతమ్ ఎస్ మెంగ్లే, మీడియా పర్సనాలిటీ

బంధానికి బీటలు?



ఇప్పుడు బంగ్లాదేశ్‌గా పిలుస్తున్న తూర్పు పాకిస్తాన్ ఏర్పాటులో ఇండియా కీలక పాత్ర పోషించింది. పశ్చిమ పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా జరిగిన బంగ్లా స్వాతంత్ర్య పోరాటానికి మద్దతిచ్చింది. కానీ కాలక్రమంలో ఈ బంధం బీటలు వారడం బాధిస్తోంది. కొన్నిసార్లు బంగ్లాదేశ్ చర్యలు నమ్మకద్రోహంలా అనిపిస్తున్నాయి.

– సాజిద్ యూసుఫ్ షా, న్యాయవాది

తిండి ఖర్చు



ప్రపంచ బ్యాంక్ ప్రకారం, దారిద్ర్య రేఖకు ఎగువన ఉండాలంటే మనకు రోజుకు 2.15 డాలర్లు కావాలి. ఆ రెండు డాలర్లలో ఒక డాలర్ పోషణకు వెళ్తుంది. కానీ మధ్యతరగతి వాళ్లు సుమారుగా 3–5 డాలర్లు రోజూ తిండి కోసం వెచ్చిస్తారు. అదే ధనికులైతే, 40–50 డాలర్లు వెచ్చిస్తారు. ఇది కేవలం తిండికే! బట్లర్ సేవలు, మద్యం లాంటివి కాకుండా!!

– చిరాగ్ బడ్‌జాత్యా, ఆంట్రప్రెన్యూర్

ఫోన్ల బెడద



అంతర్జాతీయ నంబర్ల నుంచి ఆర్థిక మోసాల ఫోన్ కాల్స్ చాలా రెట్లు పెరిగాయి. రోజుకు సగటున 5–7 కాల్స్ వస్తున్నాయి. అదొక బెడద. దానికి ప్రాధాన్యం ఇచ్చి పరిష్కరించాలి.

– ప్రియాంకా చతుర్వేది, రాజ్యసభ సభ్యురాలు

ఇన్ బాక్స్

అజరామరుడు

మనస్సులోని భావాలను సాహిత్యంతోనూ, గళంతోనూ నిర్భయంగా వెల్లడించి, సమ సమాజ సాధన కోసం పోరాటం చేసిన మహా కవి బోయి భీమన్న. వీరిదైన ప్రత్యేక శైలితో పలు కోణాల్లో సాహిత్యాన్ని నవీన ప్రక్రియలతో సృష్టించారు. బడుగుల, దళితుల దుర్భర పరిసరాలు, జీవితాలను ఉన్నది ఉన్నట్లుగా కళ్ళకు కట్టినట్లు రచనలు చేశారు. వారి సమస్యలకు పరిష్కారాలను కూడా ధర్మ సంబద్ధంగా రాశారు.

డా॥ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ (నాటి తూర్పు గోదావరి) జిల్లా మామిడికుదురు గ్రామంలో పేద దళిత కుటుంబంలో ఆయన జన్మించారు. ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి ఉన్నత విద్యను పూర్తి చేశారు. భీమన్న పదకొండేళ్ల ప్రాయం నుండే సాహిత్య రచనలు చేసిన అద్భుత ప్రతిభాశాలి. అస్పృశ్యతను కూకటివేళ్ళతో పెకిలించాలని మహాత్మాగాంధీ, అంబేడ్కర్‌లు చేసిన ప్రసంగాలతో కార్యోన్ముఖుడై కలం అనే ఆయుధంతో అక్షర బాట పట్టారు. తాను పశువుల కాపరిగా, పాలేరుగా పని చేసిన అనుభవాలతో ‘పాలేరు’ నాటకం రాశారు. ఇది అప్పట్లో సునామీ సృష్టించింది. చాలామంది తల్లి తండ్రులు తమ పిల్లలను పాలేరుతనం మాన్పించి పాఠశాల బాట పట్టించారు. వీరి ‘గుడిసెలు కాలిపోతున్నై’ కవితా సంకలనం ఉప్పెన సృష్టించడంతో 1975లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారు.



బోయి భీమన్న

భీమన్న స్వాతంత్ర్య సమర సమయంలో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. కొంత కాలం జర్నలిస్టుగా, ఉపాధ్యాయునిగా రాష్ట్ర శాసన మండలి సభ్యునిగా పనిచేశారు. ఆంధ్ర విశ్వ విద్యాలయం ‘కళా ప్రపూర్ణ’, వారణాసి విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ బిరుదులతో సత్కరించగా... భారత ప్రభుత్వం 1973లో పద్మశ్రీ, 2001లో పద్మ భూషణ్ అవార్డులతో ఘన సన్మానం చేసింది. దాదాపుగా 70కి పైగా రచనలను తెలుగు, ఆంగ్ల భాషల్లో చేశారు. తన ఎనభై ఏళ్ల సాహితీ జీవితంలో పద్యం–గేయం–వచనం–నాటకం–సంగీత నృత్య రూపకం –విమర్శ–లేఖలు... ఇలా విభిన్న సాహిత్య ప్రక్రియల్లో ఆయన రచనలు వెలువడ్డాయి. ఆయన కృషి అజరామరం.

– చంద్రశేఖర్ గంటి; మామిడికుదురు, డా॥ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

(నేడు బోయి భీమన్న వర్ధంతి)

అంగట్లో అక్షర పురస్కారాలు!

అభిప్రాయం



పైడిపాల

విద్యకు సాటి వచ్చే ధనం లేదనేది సుభాషితం. కాని నేటి వ్యాపార యుగంలో ధనం అన్ని రంగాలనూ శాసిస్తున్నట్టే... విద్య మీద కూడా ఆధిపత్యాన్ని చలాయిస్తూ దాన్ని అంగడి సరుకుగా దిగజారుస్తోంది. నేడు సాధారణ డిగ్రీలు మొదలుకొని విద్యారంగంలో అత్యున్నత అర్హతలకు సంబంధించిన పట్టాల వరకు కొనగలిగిన స్తోమత ఉన్నవారికి లభించడం ఈ దుఃస్థితికి నిదర్శనం. ముఖ్యంగా విదేశాలలోనూ, ఉత్తర భారతదేశంలోనూ పుట్ట గొడుగుల్లా వెలుస్తున్న నకిలీ విశ్వవిద్యాలయాలు విక్రయిస్తున్న ఈ డిగ్రీలను ప్రచార వ్యామోహం గల సంపన్నులు తమ పేర్లకు అలంకారాలుగా తగిలించుకొని, అవి తమ ప్రతిభాచిహ్నాలుగా చాటుకుంటున్నారు. ఊరేగింపులు, అభినందన సభలు, విందులు, వినోదాలు ఏర్పాటు చేసుకొని అవి తమ కీర్తి కిరీటాలుగా జనాన్ని భ్రమపెడుతున్నారు. ప్రముఖ నిర్మాత కాట్రగడ్డ మురారి తనకో విదేశీ సంస్థ డాక్టరేట్‌ను ఇవ్వజూపితే ‘డాక్టరేట్ ఇంత తేలికా?’ అని నిజాయతీగా వ్యాఖ్యానించడమే కాదు, తెచ్చుకున్న ఆ డాక్టరేట్ బిరుదును ఎప్పుడూ తన పేరు ముందు, కనీసం ‘నవ్విపోదురు గాక’ పుస్తక రచయితగా కూడా ఉపయోగించలేదు. అలా ప్రలోభాలకు లొంగకుండా అర్హత లేని బిరుదులను తోకలుగా ఉపయోగించని వారు అరుదు. నకిలీ విద్యార్హతలతో ఆత్మవంచనకు, పరవంచనకు పాల్పడుతున్న పెద్దమనుషులే ఎక్కువ.

డాక్టరేట్ల సంతర్పణకు కాణాచులుగా మన విశ్వ విద్యాలయాలను చెప్పుకోవాలి. పీహెచ్‌డీ పట్టాల కోసం పరిశోధనలు ఉద్యోగాలకో, పదోన్నతులకో అవసరం కావడంతో నాటి ప్రమాణాలు దిగజారుతున్నాయి. ఈ జాతరలో పరిశోధక విద్యార్థులు అడ్డదారులను వెతుక్కుంటుంటే పర్యవేక్షకులు వారి కోర్కెలకు అనుగుణంగా తోడ్పడి లబ్ధి పొందుతున్నారు. ‘కాదేదీ కవితకనర్హం’ అన్నట్లు పరిశోధన ఆవశ్యకత లేని, కేవలం ‘మెథడాలజీ’ చట్రంలో ఇమిడ్చి పీహెచ్‌డీ పట్టాను పొందే సులభమైన, ఎందుకూ పనికిరాని అంశాన్ని పరిశోధక విద్యార్థికి సూచించడం... విద్యార్థి ఆర్థికంగా ఆశపెడితే సిద్ధాంత గ్రంథాన్ని తామే అన్నీ రాసి ఇవ్వడం కొందరు పర్యవేక్షక గురువులు చేస్తున్న నిర్వాకాలు. విశ్వవిద్యాలయాల వెలుపల సిద్ధాంత గ్రంథ రచనకు ధరను మాట్లాడుకొని రాసిపెట్టడం వృత్తిగా కలిగిన నిరుద్యోగ మేధావులు కూడా ఉండడంతో కొందరు పరిశోధకులు వారు అడిగిన డబ్బిచ్చి శ్రమ పడకుండా ‘డాక్టర్లు’ అనిపించుకుంటున్నారు.




తెలుగే కాదు, ఆంగ్లం, హిందీ వంటి ఇతర భాషల్లోనూ, సాంఘిక విజ్ఞాన శాస్త్ర విభాగాల్లోనూ పరిశోధనల స్థాయి భిన్నంగా లేదు. కొందరు ప్రబుద్ధులు ఎలాగోలా ‘పీహెచ్‌డీ’ అనిపించుకుంటే చాలని పూర్వుల కృషిని కొల్లగొట్టి రాసిన సిద్ధాంత గ్రంథాలకు కూడా అయ్యవార్ల ఆశీస్సులతో ఆమోద ముద్రను వేయించుకొని ‘మమ’ అంటున్న సందర్భాలు కూడా లేక పోలేదు. అయితే పరిశోధనలన్నీ కాకి బంగారం బాపతేననీ, యోగ్యతకూ నిజాయతీకి స్థానం లేదనీ అనడం కువిమర్శే అవుతుంది.

విశ్వవిద్యాలయాలు వివిధ రంగాలలో– ప్రతిభామూర్తులను గుర్తించి వారికి గౌరవ డాక్టరేట్లను, కళా ప్రపూర్ణ వంటి బిరుదులనూ ప్రకటించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే వాటిని కానీ, కొన్ని ప్రామాణిక సంస్థలు ఇస్తున్న బిరుదులను కానీ విశ్వనాథ, శ్రీశ్రీ, జాషువా, పుట్టపర్తి, సినారె, ఆరుద్ర వంటి దిగ్దంతులెవరూ ఎప్పుడూ, ఎక్కడా భుజకీర్తులుగా వినియోగించుకోలేదు. ఏనుగులపై ఊరేగించినా, గురుతుల్యుల చేత గండ పెండేరాలతో సన్మానింపబడినా వారు వాటిని స్వోత్కర్షగా వాడుకోలేదు. కానీ నేడు కీర్తి కాంక్షతో అభినవ కృష్ణదేవరాయలం అనుకునే కవి పోషకులు, ‘అంతా కవులము కామా’ అనుకునే చిల్లర కవులు ఎక్కువయ్యారు. వారు ఆశ్రిత కవులకు ‘కవిరత్న’, ‘కవిశేఖర’, ‘కవితిలక’ వంటి బిరుదులను ప్రదానం చేసి శాలువాలను కప్పడం... వీరు మరునాడు స్థానిక పత్రికలలో ఆ సత్కారాల గురించి ఘనంగా రాయించుకోవడం ప్రహసనమైపోయింది. ఇటీవల కొన్ని సంస్థలు ఏకంగా కొందరు స్థానిక కవులకు ‘గౌరవ డాక్టరేట్’లను కూడా ప్రదానం చేస్తున్నాయి. కొంతనయం– పద్మ పురస్కారాలను కూడా ప్రకటించడం లేదు! ఏ హక్కు, అధికారం లేకుండా ఎవరు పడితే వారు ఇలా బిరుదులనివ్వడం, ప్రతిభాశూన్యులైన కవులు కూడా వాటిని అలంకారాలుగా ప్రదర్శించడం సమాజానికి హానికరం. దీనికి నియంత్రణ అవసరం!

ఇటీవల ప్రముఖ క్రికెట్ క్రీడాకారుడు రాహుల్ ద్రావిడ్‌కు బెంగుళూరు విశ్వవిద్యాలయం వారు ‘గౌరవ డాక్టరేట్’ను ప్రకటిస్తే ఆయన సున్నితంగా తిరస్కరించడమే గాక ‘అవసరమనుకుంటే ‘నేను థీసిస్‌ను సమర్పించి డాక్టరేట్ తీసుకుంటాను కాని ఉచితంగా కాదు’ అని వ్యాఖ్యానించడం అభినందనీయం. ఆదర్శవంతులు ముఖ్యంగా రాజకీయ, చిత్ర రంగాలకు చెందిన ప్రముఖులు ఎటువంటి ప్రలోభాలకూ లోను కాకుండా గౌరవ డాక్టరేట్ల ప్రత్యేకతను కాపాడుతారని ఆశిద్దాం.


వ్యాసకర్త విశ్రాంత తెలుగు ఉపన్యాసకులు,
మొబైల్: 94891 06162

భిన్న మార్గాలు



రమణ మహర్షి వద్దకు ఎందరెందరో వారి ధర్మ సందేహాలను తీర్చుకునేందుకు వచ్చేవారు. ఒక భక్తుడు ‘సూర్యమార్గము, చంద్ర మార్గము అనగానేమి? వానిలో ఏది సులభతరము?’ అని ప్రశ్నించాడు.

మహర్షి అతనితో – ‘సూర్య మార్గము జ్ఞానము, చంద్ర మార్గము యోగము. శరీరములోని 72,000 నాడులను శుద్ధం గావించిన తరువాత సుషుమ్నలో ప్రవేశించి మనసు సహస్రారము వరకు పోవుననీ, అక్కడ అమృతం స్రవించుననీ చెప్పుచున్నారు. ఇవన్నియు మానసిక భావనలు. మానవుడు ఇంతకు ముందే ఎన్నో ప్రపంచ భావనలతో మునిగి ఉన్నాడు. ఈ యోగ రూపమున ఇపుడు మరిన్ని ఇతర భావనలు చేరినవి. వీని అన్నిటి ఉద్దేశము మానవుని భావనా విముక్తుని గావించి, శుద్ధాత్మగా– అనగా ఆలోచనా రహితమయిన శుద్ధ చైతన్యముగా ఉండునట్లు చేయుటయే. నేరుగా దానిని ఏల చేయరాదు? ఇంతకు ముందే ఉన్న బరువులకు కొత్త బరువులను చేర్చనేల?’ అని జవాబిచ్చాడు (పుటలు 314, 315– శ్రీ రమణ మహర్షితో సంభాషణలు).



జ్యోతిర్మయం

దీన్ని బట్టి యోగ మార్గం కంటే జ్ఞానమార్గమే సులభతరమని మహర్షి చెప్పినట్టు అర్థమవుతుంది. సాధారణ విషయాలు మాట్లాడేవారు నాలుగు యోగా క్లాసులకు హాజరయ్యేసరికి యమ, నియమాలు, ఆసనాలు, ప్రాణాయామం, ధారణ అంటూ ఎన్నెన్నో విషయాలను గూర్చిన ఆలోచనలను తమ మెదళ్ళకు ఎక్కించుకొంటారు. ఎవరికీ లేని జ్ఞానం అబ్బిందని మురిసిపోతుంటారు. ఆ ఆలోచనలన్నీ ఎప్పుడు సమసి పోతాయో, ఎప్పుడు సమాధి స్థితి (ఆలోచనా రహిత స్థితి) కలుగుతుందో చెప్పలేం. ఈ లోపల వారికి సిద్ధులు కల్గినా, ఇక వారి గతి అధోగతే.

కాబట్టి ఏది నిత్యం, ఏది అనిత్యం? ఏది సత్యం, ఏది అసత్యం అని యోచన చేయాలన్నా యోగ మార్గాన్ని ఎంచుకోవటమే మేలు. త్వరగా ఆలోచనా రహిత చైతన్యం అనుభవంలోకి వస్తుంది. ‘నేను ఎవరు?’ అనే ప్రశ్నకు సమాధానం లభిస్తుంది. దాన్నే ఆత్మ సాక్షాత్కారం అంటారు.

– రాచమడుగు శ్రీనివాసులు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** బ.పాడ్యమి ప.1.14 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** ఆరుద్ర రా.3.01 వరకు, తదుపరి పునర్వసు, **వర్జ్యం:** ఉ.11.43 నుండి 1.15 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.15 నుండి 1.01 వరకు, తదుపరి ప.2.29 నుండి 3.11 వరకు, **అమృతఘడియలు:** సా.5.11 నుండి 6.45 వరకు, ధనుర్మాసం ప్రారంభం; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 6.22, **సూర్యాస్తమయం:** 5.24.

క్లుప్తంగా...

ముంగిస కరవడంతో మహిళ మృతి

చిలుకూరు: మూడు నెలల క్రితం ముంగిస కరవడంతో గాయపడిన మహిళ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందింది. ఈ ఘటన సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం ఆర్లెగూడెం గ్రామంలో జరిగింది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్లెగూడెం గ్రామానికి చెందిన చేపల ఉమ (38) మూడు నెలల క్రితం ఇంట్లో పాము, ముంగిస కొట్లాడుకోవడం చూసి భయపడి పరుగెత్తింది. ఆ సమయంలో ముంగీస ఆమె కాలుపై కరిచింది. గాయానికి వెంటనే చికిత్స పొందింది. కొన్నిరోజులు బాగానే ఉన్న ఉమ నాలుగు రోజుల క్రితం అనారోగ్యానికి గురైంది. శనివారం శ్వాస పీల్చుకోవడం కష్టంగా మారడంతో కుటుంబ సభ్యులు కోదాడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు శరీరంలో విషం ఎక్కినట్లు గుర్తించారు. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లగా.. ఆదివారం తెల్లవారుజామున మృతిచెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పాముకాటుకు బాలిక మృతి


సంగీత

దౌల్తాబాద్: పాము కాటుకు గురై ఓ బాలిక మృతిచెందింది. ఈ ఘటన వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండల పరిధిలోని నందారం గ్రామంలో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బిచ్చపు సంగీత (17) శనివారం రాత్రి ఇంట్లో కుటుంబసభ్యులతోపాటు నిద్రపోయింది. అప్పటికే ఇంట్లోకి దూరిన పాము అర్ధరాత్రి సంగీతను కాటు వేసింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి తాండూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స నిర్వహిస్తుండగానే పరిస్థితి మరింత విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిరచేందుకు సిద్ధమయ్యారు. ఈ తరుణంలో 108 అంబులెన్స్ సిబ్బంది గంటన్నర ఆలస్యం చేశారని, దీంతో తన కూతురు మృతి చెందిందని తల్లి రంగమ్మ ఆవేదన వ్యక్తం చేసింది.

కోడెల తరలింపుపై విచారణ జరపాలి

- ఏనుగుల రాకేశ్‌రెడ్డి డిమాండ్

సాక్షి, హైదరాబాద్: వేములవాడ దేవస్థానం కోడెలను కబేళాకు తరలించి మంత్రి కొండా సురేఖ అపచారానికి పాల్పడ్డారని బీఆర్‌ఎస్ నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి విమర్శించారు. కోడెలను సొమ్ము చేసుకునేందుకు మంత్రి అనుచరులు అక్రమాలకు పాల్పడ్డారని అన్నారు. కోడె మొక్కులకు ప్రసిద్ధి చెందిన వేములవాడ దేవస్థానం నుంచి కోడెలను కబేళాకు తరలించడంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి భర్తరఫ్ చేయడంతో పాటు ఘటనతో సంబంధం ఉన్న వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలన్నారు. వేములవాడ ఆలయం సొమ్ము రూ.2 కోట్లు కాంగ్రెస్ సభ కోసం వినియోగించారని రాకేశ్ రెడ్డి విమర్శించారు.

కొత్తగా 500 బస్సులు

కొనుగోలుకు ఆర్టీసీ నిర్ణయం

- అద్దె ప్రాతిపదికన కాకుండా సొంతంగా సమకూర్చుకోనున్న సంస్థ
- 'మహాలక్ష్మి'రద్దీ నేపథ్యంలో చర్యలు
- నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు



సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ కొత్తగా 500 బస్సులను కొనుగోలు చేయాలని నిర్ణయించింది. మహాలక్ష్మి పథకం వల్ల ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ బస్సుల్లో రద్దీ విపరీతంగా పెరిగిన విషయం తెలిసిందే. ఈ పథకం అమలులోకి రాకముందుతో పోలిస్తే ప్రస్తుతం బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య దాదాపు రెట్టింపైంది. ఈ సంఖ్య 35 లక్షల నుంచి 66 లక్షలకు పెరిగింది. దీంతో బస్సులు చాలక ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ సమస్యను అధిగమించేందుకు కొత్తగా 500 బస్సులు కొనుగోలు చేయాలని సంస్థ నిర్ణయించింది. ఈమేరకు ప్రభుత్వానికి ప్రతిపాదించబోతోంది.

కనీసం 4 వేలు అవసరం..

ప్రయాణికుల సంఖ్య పెరుగుతూ బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో వంద శాతం దాటుతోంది. ప్రత్యేక సందర్భాల్లో అది 106 శాతాన్ని మించుతోంది. ఇప్పటికే చాలా బస్సులు పాతవై మరిన్ని ఇబ్బందులు వస్తున్నాయి. పాత బస్సుల్లో దాదాపు వేయి వరకు తొలగించాల్సి ఉంది. దీంతో ఇప్పటికిప్పుడు నాలుగు వేల బస్సుల అవసరం ఉంది. కానీ అన్ని సమకూర్చుకునే పరిస్థితి ఆర్టీసీకి లేదు. దీంతో కొన్నికొన్ని బస్సులు పెంచుకుంటూపోవాలని సంస్థ భావిస్తోంది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నగరంలో అన్నీ ఎలక్ట్రిక్ బస్సులే తిరిగేలా చూడాలని ఆదేశించటంతో ఆమేరకు చర్యలు ప్రారంభించింది. కేంద్రప్రభుత్వం కొత్తగా ప్రారంభించిన పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద ఎలక్ట్రిక్ బస్సులు కోరుతోంది. 2800బస్సులు మంజూరు చేయాలని దరఖాస్తు చేసింది. అవన్నీ సబ్సిడీ ద్వారా సరఫరా అవుతాయి. ఆర్టీసీ సొంతంగా వాటిని కొనదు. జీసీసీ పద్ధతిలో ప్రైవేటు సంస్థలు వాటిని టెండర్ల ద్వారా పొంది ఆర్టీసీకి అద్దెకిస్తాయి. అవి దశలవారీగా ఆర్టీసీకి చేరుతాయి. అవి వచ్చే కొద్దీ వాటి సంఖ్యకు సమానంగా నగరంలోని డీజిల్ బస్సులను జిల్లాలకు తరలిస్తారు. జిల్లాలకు తరలే బస్సుల్లో ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులే ఎక్కువగా ఉంటాయి. వాటిని ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సులుగా మార్పుచేసి జిల్లాల్లో వాడతారు. దీని వల్ల కొంత కొరత తీరుతుంది. ఇక సొంతంగా కొత్త బస్సులు 500 కొంటే చాలావరకు సమస్య పరిష్కారమవుతుందని సంస్థ భావిస్తోంది. వాటి కొనుగోలుకు సాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరబోతోంది.

హైదరాబాద్‌లో తిరుగుతున్న డీజిల్ బస్సులను జిల్లాలకు తరలించి వాటి స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను అద్దెకు తీసుకోవాలన్న నిర్ణయంతో పెద్ద సంఖ్యలో సిబ్బంది మిగిలిపోనున్నారు. అద్దె బస్సులకు డ్రైవర్లు, మెకానిక్‌లు ప్రైవేటు వారే ఉండనున్నందున ఆర్టీసీ సిబ్బంది జిల్లాలకు తరలాల్సి ఉంటుంది. జిల్లాల్లో ఉన్న ఖాళీలు భర్తీ కాగా, మిగతావారు అదనంగా మారతారు. ఇప్పుడు కొత్తగా కొనే ఐదొందల బస్సులకు దాదాపు

ఆ సిబ్బంది కొత్త బస్సులకు...

1,300 మంది సిబ్బంది అవసరమవుతారు. ఆ అదనపు సిబ్బందిని ఈ బస్సులకు వినియోగించుకోవటం ద్వారా సర్దుబాటు చేస్తారు. ఇక మరో 3 వేల మందిని కొత్తగా నియమించుకునే ప్రతిపాదన పెండింగులో ఉంది. అలా వచ్చే వారిని కూడా ఈ కొత్త బస్సులతోపాటు ఇతరత్రా ఖాళీల్లో భర్తీ చేస్తారు.

నేటి నుంచి యాదగిరీశుడి ధనుర్మాసోత్సవాలు

- జనవరి 13న రాత్రి 7 గంటలకు గోదా కళ్యాణం
- ఉత్సవాల నేపథ్యంలో ఉదయం పూజా వేళల్లో మార్పులు



యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో సోమవారం నుంచి ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. వచ్చే నెల 14వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగుతాయి. జనవరి 13వ తేదీన గోదా దేవి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. ఈ నెల 26న స్వామివారి జన్మ నక్షత్రం స్వాతి వేడుకను నిర్వహించనున్నారు. గోదాదేవి ఆలపించే తిరుప్పావై, మార్గళి పర్వాల నిర్వహణకు ఆలయ అర్చక బృందం సిద్ధమైంది. గోదాదేవి రచించిన పాశురాల పఠనం కోసం ప్రత్యేక అర్చక బృందాన్ని ఇప్పటికే రప్పించారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా వేకువజామున ఆలయ పూజా వేళల్లో మార్పులు చేసినట్లు ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. సోమవారం నుంచి జనవరి 14వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 3.30 గంటలకు ఆలయాన్ని తెరిచి, 3.30 నుంచి 4 గంటల వరకు సుప్రభాత సేవ నిర్వహిస్తారు. 4 గంటల నుంచి 5 గంటల వరకు తిరువారాధన, బాలభోగం ఆరగింపు, 5 గంటల నుంచి 5.45 వరకు తిరుప్పావై సేవాకాలం, తీర్థ ప్రసాదాల గోష్టి జరుగుతుంది. 5.45 నుంచి 6.45 గంటల వరకు స్వామి వారికి నిజాభిషేకం, 6.45 నుంచి 7.15 గంటల వరకు సహస్రనామార్చన, 7.15 గంటల నుంచి సర్వ దర్శనాలు ఉంటాయని వివరించారు.

ఉత్తర భాగం హాలులో తిరుప్పావై..

ప్రతి రోజూ ఉదయం 5 గంటల నుంచి 5.45 గంటల వరకు శ్రీస్వామి వారి ఆలయ ముఖ మండపంపైన ఉత్తర భాగంలో ఉన్న హాల్‌లో తిరుప్పావై కార్యక్రమం నిర్వహిస్తారు. శ్రీరంగనాథుడిని గోదాదేవి స్మరిస్తూ చేసిన పాశురాలు పఠిస్తారు. జనవరి 13వ తేదీన రాత్రి 7 గంటలకు గోదా కళ్యాణం, 14న ఉదయం 11.30 గంటలకు ఒడి బియ్యం సమర్పించే కార్యక్రమాలు నిర్వహిస్తారు.

శ్రమదోపిడీకి గురవుతున్నాం


డిమాండ్లు పరిష్కరించాలంటూ ధర్నాలో నినాదాలు చేస్తున్న సర్వశిక్ష ఉద్యోగులు

- రెగ్యులర్ చేయాలని సర్వశిక్ష ఉద్యోగుల డిమాండ్
- 10వ తేదీ నుంచి సమ్మెబాటలోనే ఉద్యోగులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: విద్యాభివృద్ధి కోసం ఏళ్ల తరబడి సేవలందిస్తున్న తాము శ్రమదోపిడీకి గురవుతున్నామని సర్వశిక్ష ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీస వేతనం కూడా లేకుండా పనిచేస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10వ తేదీన సమ్మె బాట పట్టారు. రాష్ట్రవ్యాప్తంగా 19,325 మంది ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటున్నారు. కాంట్రాక్ట్ పద్ధతిలో నియామకమైనప్పటికీ మెరిట్, రోస్టర్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ విధానంలోనే నియమితులయ్యామని ఉద్యోగులు పేర్కొంటున్నారు. దీంతో తాము ఉద్యోగ భద్రతకు అర్హత కలిగి ఉన్నామని, వెంటనే తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతున్నారు.

కనీస వేతనాలు సైతం కరువు..

సుప్రీంకోర్టు తీర్పు మేరకు తమకు ఇవ్వాల్సిన కనీస వేతనాలు సైతం అమలు చేయడంలేదని సర్వశిక్ష ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. జిల్లా స్థాయిలో ఏపీవోలు, సిస్టమ్ అనలిస్టులు, టెక్నికల్ పర్సన్స్, ఆపరేటర్స్, డీఎల్‌ఎంటీ, మెసెంజర్స్, మండల స్థాయిలో ఎంఐఎస్ కోఆర్డినేటర్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, ఐఈఆర్‌పీఎస్, మెసెంజర్స్, సీజీవీలు, స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో క్లస్టర్ రీసోర్స్ పర్సన్స్, కేజీబీవీ, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో స్పెషల్ ఆఫీసర్లు (పీజీ హెచ్‌ఎం హోదా), కాంట్రాక్ట్ రిసోర్స్ టీచర్స్ (స్కూల్ అసిస్టెంట్ హోదా), పీఈటీలు, ఏఎన్‌ఎంలు, అకౌంటెంట్స్, క్రాఫ్ట్ అండ్ కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్స్, కుక్స్, వాచ్‌ఉమెన్స్, స్వీపర్లు, స్కావెంజర్లు, పాఠశాల స్థాయిలో పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్స్(ఆర్ట్, పీఈటీ, వర్క్ ఎడ్యుకేషన్), భవిత కేంద్రాల్లో ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రీసోర్స్ టీచర్లుగా పనిచేస్తున్నారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్న వీరికి కేవలం రెగ్యులర్ ఉద్యోగుల వేతనాల్లో నాలుగోవంతు జీతం మాత్రమే ఇస్తున్నారు. మెసెంజర్లకు రూ.11వేలు, సీఆర్‌పీలకు రూ.19,350 (ఏపీలో మాత్రం రూ.26వేలు), పీజీ హెచ్‌ఎం స్థాయిలో ఉన్న స్పెషల్ ఆఫీసర్లకు రూ.32 వేలు వేతనంగా ఇస్తున్నారు. టీఏ, డీఏలు ఇవ్వడంలేదు. పైగా ఏడాదిలో 10 నెలలు మాత్రమే వేతనాలు అందుతున్నాయి. సర్వ శిక్షలో ఇప్పటివరకు 119 మంది మరణిస్తే కనీసం బెనిఫిట్స్ ఇవ్వలేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను రెగ్యులరైజ్ చేయాలని, రూ.10 లక్షల బీమా, రూ.5 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యాలు కల్పించాలని, మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 ప్రసూతి సెలవులు, మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు రూ.15 లక్షల పరిహారం, 61 ఏళ్లు నిండిన ఉద్యోగులకు రూ. 20 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేస్తున్నారు.

లకేవేద ఎన్‌కౌంటర్‌లో ఇద్దరే మావోలు !

- మిగతా ఐదుగురు గ్రామస్తులు.. అందరినీ పట్టుకొని కాల్చి చంపారు
- నారాయణపూర్ ఎన్‌కౌంటర్‌పై క్లారిటీ ఇచ్చిన మావోయిస్టులు
- సోషల్ మీడియాలో మావోల లేఖ చక్కర్లు

సాక్షిప్రతినిధి, వరంగల్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని లకేవేద వద్ద ఈ నెల 11, 12 తేదీల్లో జరిగిన ఎన్‌కౌంటర్, మృతుల వివరాలపై మావోయిస్టు పార్టీ స్పష్టత ఇచ్చింది. ఈ మేరకు కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా(మావోయిస్ట్) మాడ్ డివిజనల్ కమిటీ పేరిట విడుదల చేసినట్టుగా చెబుతున్న ఓ లేఖ ఆదివారం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. లకేవేద వద్ద జరిగిన ఎన్‌కౌంటర్ అబద్ధమని, మృతి చెందిన ఏడుగురిలో ఇద్దరు తప్ప మిగతా ఐదుగురు గ్రామస్తులేనని ఆ లేఖలో పేర్కొంది. ఈనెల 11వ తేదీ ఉదయం 11 గంటల ప్రాంతంలో లకేవేద పెండలో వ్యవసాయం చేస్తున్న వారిని చుట్టుముట్టిన పోలీసులు విచక్షణా రహితంగా కాల్పులు జరిపారని, గాయపడిన గ్రామస్తుడు మాసా ఓయంను పట్టుకొని చంపారని ఆరోపించారు. 12వ తేదీ ఉదయం.. కుమ్మం అడవిలో పీఎల్‌జీఏకి చెందిన పేషెంట్ టీమ్‌ని చుట్టుముట్టి, అక్కడ అనారోగ్యంతో ఉన్న సీనియర్ కామ్రేడ్ కార్తీక్ దాదా(62), ఆయన సహాయం కోసం ఉన్న కామ్రేడ్ రమీలను సజీవంగా పట్టుకొని కిరాతకంగా హత్య చేశారని మాడ్ డివిజన్ కమిటీ స్పష్టం చేసింది. మావోయిస్టు పార్టీ.. మృతుల పేర్లు, వివరాలను ప్రకటించింది.

- కార్తీక్ దాదా అలియాస్ దాసరు దాదా, ఒడిశా రాష్ట్ర కమిటీ సభ్యుడని, ఇతను ఏపీలోని కృష్ణా జిల్లా బందర్ తాలూకా పోలవరం సమీప ఏడుగుళ్లపల్లి గ్రామానికి చెందినవాడుగా పేర్కొంది.
- పశ్చిమ బస్తర్ డివిజన్‌కు చెందిన రమిలా మడ్కం, నారాయణపూర్ జిల్లా లకేవేదకు చెందిన మాసో ఓయం, కొహ్లాల్ ఓయం, గుడ్సా ఓయం (50), నెహ్రూ ఓయం (గుడ్సా ఓయం కుమారుడు), సోంబరి ఓయం (గ్రామీణ మహిళ) ఉన్నట్టు మాడ్ డివిజన్ కమిటీ వెల్లడించింది.
- రామల్ ఓయం ఆచూకీ లేనందున, అతడు తప్పిపోయి ఉండవచ్చు.. లేదా చంపబడి ఉండవచ్చని పేర్కొంది.

నారసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ

- వరుస సెలవులతో కిక్కిరిసిన గుట్ట ఆలయ పరిసరాలు


హైకోర్టు జడ్జి జస్టిస్ శ్రవణ్ కుమార్‌కు శ్రీస్వామి చిత్ర పటాన్ని అందజేస్తున్న ఈఓ భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట: వరుస సెలవులతో యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయానికి భక్తులు తరలివచ్చారు. హైదరాబాద్- సికింద్రాబాద్ జంట నగరాలతో పాటు వివిధ ప్రాంతాలు, రాష్ట్రాలకు చెందిన భక్తులు యాదగిరిగుట్టకు పోటెత్తారు. ఆలయ క్యూకాంప్లెక్స్, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, మాడ వీధుల్లో, బస్టాండ్లు, కల్యాణకట్ట, లక్ష్మీ పుష్కరిణి, శ్రీసత్యనారాయణ స్వామి వ్రత మండపాల్లో భక్తులు కిటకిటలాడారు. దీంతో స్వామివారి ధర్మ దర్శనానికి 4 గంటలు, వీఐపీ దర్శనానికి గంటన్నర సమయం పట్టిందని భక్తులు వెల్లడించారు. శ్రీస్వామిని 40 వేల మందికిపైగా భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ పూజలతో ఆలయానికి రూ.57,65,859 నిత్యాదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

యాదగిరీశుడి సేవలో హైకోర్టు జడ్జి

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ ఎస్.వి.శ్రవణ్ కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ముందుగా కొండకు దిగువన శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపంలో పూజల్లో పాల్గొన్నారు. అనంతరం కొండపైకి చేరుకున్న జస్టిస్ శ్రవణ్ కుమార్, కుటుంబ సభ్యులకు అర్చకులు సంప్రదాయ స్వాగతం పలికారు. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్టాలంకార మూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీస్వామిని దర్శించుకున్న జస్టిస్ శ్రవణ్ కుమార్, కుటుంబ సభ్యులకు అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, ఈవో భాస్కర్‌రావు లడ్డూ ప్రసాదంతో పాటు శ్రీస్వామి వారి చిత్ర పటాన్ని అందజేశారు.

జాకీర్ హుస్సేన్ ఆరోగ్యం విషమం



కొద్దిరోజులుగా తీవ్ర అనారోగ్యం

- విషమించడంతో ఐసీయూలో చేరిక
- చికిత్స పొందుతూ మరణించినట్టు వార్తలు
- ధ్రువీకరించని కుటుంబ సభ్యులు

న్యూఢిల్లీ: ప్రముఖ తబలా విద్వాంసుడు, పద్మ విభూషణ్ గ్రహీత జాకీర్ హుస్సేన్ ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉంది. పదేళ్లుగా అమెరికాలో ఉంటున్న ఆయన గుండె సంబంధిత వ్యాధితో పాటు అధిక రక్తపోటుతో బాధపడుతున్నారు. 73 ఏళ్ల హుస్సేన్ ఆరోగ్య పరిస్థితి కొద్ది రోజులుగా బాగా విషమించింది. దాంతో రెండు వారాల క్రితం అమెరికాలో శాన్‌ఫ్రాన్సిస్కోలో ఆసుపత్రిలో చేరారు. ఐసీయూలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి ఆయన మరణించినట్టు వార్తలొచ్చాయి. జాకీర్ హుస్సేన్ సన్నిహితుడు, ప్రముఖ వేణువాద కళాకారుడు రాకేశ్ చౌరాసియా కూడా తొలుత దాన్ని ధ్రువీకరించారు. కాసేపటికే కేంద్ర సమాచార, ప్రసార శాఖ కూడా ఆయన మృతి పట్ల సంతాపం తెలుపుతూ ప్రకటన విడుదల చేసింది. ''దేశం సంగీత ధ్రువతారను కోల్పోయింది. సంగీత ప్రపంచానికి ఆయన సేవలు శాశ్వతంగా నిలిచి ఉంటాయి'' అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. విపక్ష నేత రాహుల్ గాంధీ, కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, ముఖ్యమంత్రులు మమతా బెనర్జీ, యోగి ఆదిత్యనాథ్, హిమంత బిశ్వశర్మ తదితరులు సంతాపం తెలిపారు. కానీ జాకీర్ హుస్సేన్ మృతి వార్తలను ఆయన సోదరి ఖుర్షీద్ ఖండించారు. ''నా సోదరుని పరిస్థితి అత్యంత విషమంగానే ఉన్న మాట నిజమే. కానీ ప్రస్తుతానికి ఆయన ప్రాణాలతోనే ఉన్నారు'' అని తెలిపారు. ''జాకీర్ హుస్సేన్ మరణించారంటూ మీడియాలో, సోషల్ మీడియాలో వెల్లువెత్తుతున్న వార్తలు మమ్మల్నెంతో బాధిస్తున్నాయి. వాటిని నమ్మొద్దని మీడియాకు, ఆయన అభిమానులకు విజ్ఞప్తి చేస్తున్నాం. ఆయన కోలుకోవాలని అంతా ప్రార్థించాల్సిందిగా కోరుతున్నాం'' అని పీటీఐ వార్తా సంస్థకు వెల్లడించారు. జాకీర్ హుస్సేన్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఐసీయూకు మార్చినట్టు ఆయన మేనేజర్ నిర్మలా బచానీ కూడా పేర్కొన్నారు. కాసేపటికే ఐ అండ్ బీ శాఖ కూడా ఎక్స్‌లో చేసిన సంతాప పోస్టును తొలగించింది.

బహుముఖ ప్రజ్ఞాశాలి: బహుముఖ సంగీత ప్రజ్ఞకు జాకీర్ హుస్సేన్ నిలువెత్తు నిదర్శనం. హిందుస్తానీ క్లాసికల్ మ్యూజిక్‌తో పాటు జాజ్ ఫ్యూజన్‌లోనూ తిరుగులేని నైపుణ్యం సాధించారు. గ్రేటెస్ట్ తబలా ప్లేయర్స్ ఆఫ్ ఆల్ టైమ్‌లో ఒకరిగా నిలిచారు. సంగీత దర్శకునిగా కూడా తనదైన ముద్ర వేశారు. ఇన్ కస్టడీ, ద మిస్టిక్ మాసా వంటి సినిమాలకు సంగీతం అందించారు. పలు సినిమాల్లో నటించారు కూడా. ఆయన ప్రముఖ తబలా విద్వాంసుడు ఉస్తాద్ అల్లా రఖా ఖాన్ కుమారుడు. 1951 మార్చి 9న ముంబైలో జన్మించిన ఆయన అసలు పేరు జాకీర్ హుస్సేన్ అల్లారఖా ఖురేషీ. తండ్రి బాటలో నడుస్తూ ఏడేళ్ల చిరుప్రాయంలోనే తబలా చేతబట్టారు. తండ్రిని మించిన తనయునిగా పేరు తెచ్చుకున్నారు. గొప్ప కళాకారుడిగా అంతర్జాతీయంగా పేరు గడించారు. దేశ విదేశాల్లో లెక్కలేనన్ని ప్రదర్శనలిచ్చారు. జాకీర్ హుస్సేన్ అందుకున్న జాతీయ, అంతర్జాతీయ బహుమతులకు, పురస్కారాలకూ లెక్కే లేదు. భారత ప్రభుత్వం ఆయనను పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్ పురస్కారాలతో సత్కరించింది. పదేళ్ల క్రితమే కుటుంబంతో కలిసి అమెరికాలో స్థిరపడ్డారు.

స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్‌లో... రాజ్యసభపై లోక్‌సభ విజయం



ట్రోఫీతో లోక్‌సభ జట్టు సభ్యులు



రిజిజు బౌలింగ్



ఓం బిర్లా

న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో పరస్పరం వాగ్వాదానికి దిగే ఎంపీలు ఆదివారం ఉల్లాసంగా గడిపారు. పరస్పరం పోటీపడ్డారు. కానీ, పార్లమెంట్ లోపల కాదు, బయట మాత్రమే. క్షయవ్యాధి (టీబీ)పై అవగాహన పెంచడానికి లోక్‌సభ, రాజ్యసభ ఎంపీల మధ్య స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. ఢిల్లీలోని మేజర్ ధ్యాన్‌చంద్ నేషనల్ స్టేడియంలో జరిగిన టీ20 మ్యాచ్‌లో రాజ్యసభ చైర్మన్ ఎలెవన్ జట్టుపై లోక్‌సభ స్పీకర్ ఎలెవన్ విజయం సాధించింది. రాజ్యసభ జట్టుకు కేంద్ర మంత్రి కిరెణ్ రిజిజు, లోక్‌సభ టీమ్‌కు కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ కెప్టెన్లుగా వ్యవహరించారు. పక్కా ప్రొఫెషనల్స్‌ను తలపిస్తూ ఇరు జట్లూ హోరాహోరీగా తలపడటం విశేషం. తొలుత బ్యాటింగ్ చేసిన లోక్‌సభ ఎలెవన్ ఏడు వికెట్ల నష్టానికి ఏకంగా 250 పరుగులు సాధించింది. కెప్టెన్ ఠాకూర్ సెంచరీ (111 పరుగులు) చేయడం విశేషం. లక్ష్యఛేదనలో రాజ్యసభ ఎలెవన్ 8 వికెట్ల నష్టానికి 178 పరుగులు మాత్రమే చేయగలిగింది. రాజ్యసభ జట్టు సభ్యుడు, భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మహమ్మద్ అజారుద్దీన్ 42 బంతుల్లో 74 పరుగులు సాధించారు. ఆయనతో పాటు హర్భజన్‌సింగ్, యూసుఫ్ పఠాన్ రూపంలో మ్యాచ్‌లో ముగ్గురు మాజీ ఇండియా ఆటగాళ్లు తలపడటం విశేషం. లోక్‌సభ సభ్యులు దీపేందర్ హుడా(కాంగ్రెస్)కు బెస్ట్ బౌలర్, నిషికాంత్ దూబే(బీజేపీ)కి బెస్టు ఫీల్డర్ అవార్డులు లభించాయి. బీజేపీ ఎంపీ మనోజ్ తివారీకి సూపర్ క్యాచ్ అవార్డు దక్కింది. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అవార్డులను ప్రదానం చేశారు. అంతకుముందు మ్యాచ్ ఆరంభించిన లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కాసేపు సరదాగా బ్యాట్ పట్టి అలరించారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, శర్బానంద సోనోవాల్, జ్యోతిరాదిత్య సింధియా, మన్‌సుఖ్ మాండవీయ, గజేంద్రసింగ్ షెకావత్, సురేశ్ గోపీ, చిరాగ్ పాశ్వాన్, ఎంపీలు రాఘవ్ చద్దా (ఆప్), డెరెక్ ఓబ్రియాన్ (టీఎంసీ) తదితరులు మ్యాచ్‌లో పాల్గొన్నారు.

జమిలి ఎన్నికల బిల్లులు వాయిదా

లోక్‌సభ బిజినెస్ జాబితా నుంచి తొలగింపు ● ఈనెల 20లోగా సభ ముందుకు రెండు బిల్లులు

న్యూఢిల్లీ: నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 'ఒకే దేశం.. ఒకే ఎన్నిక' బిల్లు సోమవారం లోక్‌సభ ముందుకు రావడం లేదు. జమిలి ఎన్నికలకు సంబంధించి రాజ్యాంగ(129వ సవరణ) బిల్లు-2024, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల(సవరణ) బిల్లు-2024ను పార్లమెంట్ దిగువ సభలో నేడు ప్రవేశపెట్టాలని తొలుత నిర్ణయించారు. ఈ మేరకు లోక్‌సభ బిజినెస్ జాబితాలో సైతం వీటిని చేర్చారు. కానీ, కేంద్ర ప్రభుత్వం పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. ఆదివారం సవరించిన బిజినెస్ జాబితా నుంచి ఈ రెండు బిల్లులను తొలగించారు. సోమవారం నాటి లోక్‌సభ అజెండాలో వీటిని చేర్చలేదు. అయితే, రెండు బిల్లులను ఈ వారమే సభలో ప్రవేశపెట్టనున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఈ నెల 20న ముగియనున్నాయి. ఆలోగానే బిల్లులు సభ ముందుకు రానున్నాయి. ప్రవేశపెట్టాలనుకుంటున్న బిల్లులను లోక్‌సభ స్పీకర్ అనుమతితో చివరి నిమిషంలోనైనా సప్లిమెంటరీ లిస్టు ఆఫ్ బిజినెస్ జాబితాలో చేర్చే వెసులుబాటు ప్రభుత్వానికి ఉంది. నిధుల కేటాయింపులకు సంబంధించిన కొన్ని డిమాండ్లపై సోమవారం లోక్‌సభలో చర్చించాల్సి ఉందని, అందుకే జమిలి ఎన్నికల బిల్లులను వాయిదా వేసినట్లు ప్రభుత్వ వర్గాల సమాచారం. లోక్‌సభతోపాటు రాష్ట్రాల అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడానికి ఉద్దేశించిన రెండు బిల్లుల వివరాలను నిబంధనల ప్రకారం గత వారమే లోక్‌సభ సభ్యులకు అందజేశారు. రాజ్యాంగ (129వ సవరణ) బిల్లు, కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల(సవరణ) బిల్లుకు కేంద్ర కేబినెట్ ఈ నెల 12న ఆమోద ముద్ర వేసిన సంగతి తెలిసిందే.

జమిలి బిల్లులకు మద్దతివ్వండి

లక్నో: 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' విధానాన్ని బీఎస్పీ అధినేత మాయావతి సమర్థించారు. ఎన్నికల ఖర్చు తగ్గుతుందని, సంక్షేమ కార్యక్రమాలు అంతరాయం లేకుండా కొనసాగుతాయని ఆమె చెప్పారు. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే జమిలి బిల్లుకు మద్దతు పలకాలని ఇతర రాజకీయ పార్టీలను మాయావతి కోరారు. ఈ విషయంలో రాజకీయాలకు అతీతంగా అందరూ ఆలోచించాలన్నారు.

38 మందితో ఆప్ తుది జాబితా

సాక్షి, న్యూఢిల్లీ: వచ్చే ఫిబ్రవరిలో జరగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రి అర్వింద్ కేజ్రీవాల్ మరోసారి న్యూఢిల్లీ స్థానం నుంచి పోటీ చేయనున్నారు. ముఖ్యమంత్రి ఆతిశీ మర్లిన్ కల్కాజీ నుంచి బరిలోకి దిగనున్నారు. ఈ మేరకు ఆదివారం ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) 38 మంది పేర్లతో నాలుగో, చివరి జాబితా ఆదివారం విడుదల చేసింది. ఇందులో ఆరోగ్య మంత్రి సౌరభ్ భరద్వాజ్ గ్రేటర్ కైలాష్ స్థానం, మాజీ మంత్రి సత్యేంద్ర జైన్‌కు షకూర్ బస్తీ, ఎమ్మెల్యే సోమనాథ్ భారతికి మాలవీయ నగర్ కేటాయించారు. నవంబర్ 21 నుంచి డిసెంబర్ 15 మధ్య 25 రోజుల్లో మొత్తం 4 జాబితాల్లో అసెంబ్లీలోని మొత్తం 70 సీట్లకు అభ్యర్థుల పేర్లను ఆప్ ప్రకటించింది. నాలుగో లిస్టులో 26 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు సీటు దక్కలేదు. ఈ జాబితాలో ఐదుగురు ముస్లింలు, 10మంది మహిళలకు స్థానం కల్పించారు. డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియాను పట్‌పర్‌గంజ్ నుంచి జంగ్‌పురా అసెంబ్లీ స్థానానికి, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రాఖీ బిర్లాన్‌ను మంగోల్‌పురి నుంచి మాదిపూర్‌కు, ప్రవీణ్ కుమార్‌ను జంగ్‌పురా నుంచి జనక్‌పురికి, దుర్గేష్ పాఠక్‌ను కరవాల్ నగర్ నుంచి రాజేంద్రనగర్‌కు మార్చారు. 2020లో రాఘవ్ చద్దా రాజేంద్రనగర్ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

బీజేపీకి సీఎం అభ్యర్థే లేరు: కేజ్రీవాల్

రానున్న అసెంబ్లీ ఎన్నికలకు గాను బీజేపీకి ముఖ్యమంత్రి అభ్యర్థే కరువయ్యారని ఆప్ చీఫ్ కేజ్రీవాల్ ఎద్దేవా చేశారు. 'బీజేపీకి సీఎం అభ్యర్థి లేడు. ఢిల్లీపై విజన్ లేదు. నాయకుల బృందం లేదు. ప్రణాళిక లేదు. వాళ్ల నినాదం, విధానం, మిషన్ ఒక్కటే..అదే కేజ్రీవాల్‌ను ఓడించడం' అని పేర్కొన్నారు. అన్నిటికీ తన వైపే వేలెత్తి చూపుతున్న బీజేపీ నాయకులు ఈ ఐదేళ్లు ఎక్కడున్నారని ప్రశ్నించారు.

'పోష్' పరిధిలోకి పార్టీలు

న్యాయవాదులు, ఉద్యమకారుల డిమాండ్

న్యూఢిల్లీ: పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల (నివారణ, నిషేధ, ఫిర్యాదు) చట్టం పోష్ పరిధిలోకి రాజకీయ పార్టీలను తక్షణమే తీసుకురావాలని న్యాయ నిపుణులు, ఉద్యమకారులు పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీలను బాధ్యులుగా చేసేందుకు, లింగ సమానత్వం సాధించేందుకు ఇది ఎంతో అవసరమన్నారు. పోష్ చట్టం-2013ను అనుసరించేలా రాజకీయ పార్టీలకు ఆదేశాలివ్వాలంటూ దాఖలైన పిటిషన్‌ను సోమవారం సుప్రీంకోర్టు తిరస్కరించిన నేపథ్యంలో వీరు ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. హెల్పింగ్ హ్యాండ్ అనే ఎన్జీవో డైరెక్టర్, లాయర్ సోనాల్ మట్టూ మాట్లాడుతూ..ప్రజల దృక్పథంలో మార్పు రావాలన్నారు. రాజకీయ పార్టీలు పోష్ చట్టం సాంకేతిక నిర్వచనం కంటే ఆ చట్టం స్ఫూర్తిపై దృష్టి పెట్టాలని కోరారు.

చలి గుప్పెట ఉత్తరాది

న్యూఢిల్లీ: ఢిల్లీ, పంజాబ్, రాజస్థాన్‌లతో పాటు ఉత్తర, పశ్చిమ భారతదేశంలోని కొన్ని ప్రాంతాలు చలి తీవ్రతతో గజగజలాడుతున్నాయి. చాలా చోట్ల ఆదివారం ఉష్ణోగ్రతలు పడిపోయాయి. ఢిల్లీలో గరిష్ట ఉష్ణోగ్రత 23.2 డిగ్రీలుగా నమోదైంది. సాధారణం కంటే ఇది 0.2 డిగ్రీలు తక్కువ. అయితే, కనిష్ట ఉష్ణోగ్రత ఒక్కసారిగా 4.9 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. సాధారణం కంటే ఇది 3.1 డిగ్రీలు తక్కువ. ప్రస్తుతానికి శీతల గాలులు లేవని వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. పంజాబ్, హరియాణాల్లో మాత్రం చలి తీవ్రత ఎక్కువగానే ఉందని ఐఎండీ పేర్కొంది. అత్యల్పంగా ఫరీద్‌కోట్‌లో 1 డిగ్రీ సెల్సియస్ నమోదైంది. పంజాబ్‌లోని గురుదాస్‌పూర్, భటిండాల్లో కనీస ఉష్ణోగ్రతలు వరుసగా 2 డిగ్రీలు, 4.6 డిగ్రీలు నమోదయ్యాయి. హరియాణాలోని హిస్సార్‌లో కనిష్ట ఉష్ణోగ్రత 1.7 డిగ్రీలుగా ఉంది. రాజస్తాన్‌లోని ఫతేపూర్‌లో వరుసగా మూడో రోజు ఆదివారం కూడా మైనస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హిమాచల్‌లోని కొండ ప్రాంతంలో శీతల గాలుల తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు ఐఎండీ వివరించింది. ఉనాలో శీతల గాలుల ప్రభావంతో 0.2 డిగ్రీలు, సుందర్‌నగర్‌లో 0.6 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అదే సమయంలో, సొలాన్‌లో గరిష్ట ఉష్ణోగ్రతలు అత్యధికంగా 24.7 డిగ్రీలు, సిమ్లాలో 19 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శ్రీనగర్‌లో -3.4 డిగ్రీలు, గుల్మార్గ్‌లో -4.8 డిగ్రీల ఉష్ణోగ్రతలున్నట్లు వెల్లడించింది.

లొంగుబాటా.. దాడులా... మీరే తేల్చుకోండి

నక్సలైట్లకు అమిత్ హెచ్చరిక ● జనజీవనంలో కలవాలని హితవు



జగదల్‌పూర్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న అమిత్ షా

రాయ్‌పూర్: లొంగిపోవడమా, తీవ్ర పరిణాలు ఎదుర్కోవడమా ఏదో ఒకటి తేల్చుకోవాలని నక్సలైట్లకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా హెచ్చరికలు జారీ చేశారు. ''వెంటనే ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలో కలవండి. లేదంటే భద్రతా దళాల దాడులను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండండి'' అని స్పష్టం చేశారు. ఛత్తీస్‌గఢ్‌లో 2026 మార్చి చివరి నాటికి నక్సలిజాన్ని పూర్తి నిర్మూలించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయన్నారు. నక్సలిజం నుంచి ఛత్తీస్ విముక్తి పొందినప్పుడే దేశమంతా ఆ ముప్పు నుంచి బయటపడుతుందన్నారు. అమిత్ ఆదివారం ఛత్తీస్‌గఢ్‌లో పర్యటించారు. రాయ్‌పూర్‌లో ప్రెసిడెంట్స్ పోలీసు కలర్ అవార్డు ప్రదానోత్సవంలో మాట్లాడారు. జగదల్‌పూర్‌లో బస్తర్ ఒలింపిక్స్ క్రీడోత్సవాల్లో ప్రసంగించారు. తీవ్రవాదాన్ని అరికట్టడంలో ఛత్తీస్ పోలీసులు ఏడాదిగా గణనీయమైన పురోగతి సాధించారని ప్రశంసించారు. ''లొంగిపోయిన నక్సలైట్ల పునరావాసానికి రాష్ట్ర ప్రభుత్వం అద్భుత విధానం అమలు చేస్తోంది. తీవ్రవాదులు హింసకు స్వస్తి పలికి రాష్ట్ర ప్రగతికి చేయూతనందించాలి'' అని పిలుపునిచ్చారు.

ఏడాదిలో 287 మంది హతం

ఛత్తీస్‌గఢ్‌లో గత ఏడాదిలో 287 మంది నక్సలైట్లు మరణించారని, 1,000 మంది అరెస్టయ్యారని, 837 మంది లొంగిపోయారని అమిత్ వివరించారు. నక్సలిజంపై పోరాటంలో పురోగతికి ఈ గణాంకాలే నిదర్శనమన్నారు. ''ఏడాదిలో 14 మంది నక్సల్స్ అగ్ర నేతలు హతమయ్యారు. నక్సల్స్ హింసాకాండలో మరణించిన భద్రతా సిబ్బంది, సాధారణ పౌరుల సంఖ్య 100లోపే. నాలుగు దశాబ్దాల్లో ఇదే అతి తక్కువ. మావోయిస్టుల దాడుల్లో భద్రతా సిబ్బంది, పౌర మరణాలు 70 శాతం తగ్గాయి. నక్సలిజంపై చివరిదెబ్బ కొట్టడానికి కేంద్ర, రాష్ట్ర బలగాలు సిద్ధంగా ఉన్నాయి. ప్రెసిడెంట్స్ పోలీసు కలర్ పురస్కారం అందుకోవాలంటే కనీసం పాతికేళ్ల సేవలందించి ఉండాలి. కానీ ఛత్తీస్‌గఢ్‌లో 2000లో ఏర్పాటైనా రాష్ట్ర పోలీసు దళానికి ఈ అవార్డు దక్కడం హర్షణీయం. పోలీసుల అంకితభావం, త్యాగం, ధైర్యసాహసాలే ఇందుకు కారణం. జమ్మూకశ్మీర్ కంటే బస్తర్ అందమైన ప్రాంతం. నక్సలిజం అంతమైతే ఇక్కడికి పర్యాటకులు భారీగా వస్తారు'' అని అన్నారు.

వేసక్టమీ చేసుకుంటేనే పెళ్లి

లొంగిపోయిన మావోయిస్టుల వెల్లడి

''కుటుంబ నియంత్రణ ఆపరేషన్. నక్సలైట్లలో తరచూ వినిపించే మాట. దళంలో ఉండగా పెళ్లి చేసుకోవాలంటే ముందు పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకోవాలి. లేకపోతే పెళ్లికి అనుమతివ్వరు. అగ్రనేతల ఆదేశాలతో బలవంతంగానైనా ఆపరేషన్ చేయిస్తారు. నాకూ అలా ఆపరేషన్ చేయించారు'' అని తెలంగాణకు చెందిన మాజీ మావోయిస్టు వెల్లడించారు. ''ఆయుధాలు వదిలేసి లొంగిపోయి సాధారణ జీవితం మొదలు పెట్టాక సంతానం కావాలనిపించింది. మళ్లీ ఆపరేషన్ చేయించుకుని ఒక బాబుకు తండ్రినయ్యా'' అని హోం మంత్రి అమిత్ షాకు తన అనుభవం వివరించారు. లొంగిపోయిన నక్సలైట్లతో ఆయన జగదల్‌పూర్‌లో ప్రత్యేకగా సమావేశమయ్యారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాల మాజీ నక్సల్స్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ''దళంలో స్త్రీ, పురుష సభ్యులు పెళ్లాడటం పరిపాటి. పిల్లలు పుడితే వారి సంరక్షణ, అడవుల్లో తిరగడం కష్టమవుతుందని, ఉద్యమానికీ ఇబ్బందని అగ్రనేతలు చెబుతుంటారు. అందుకే నక్సలైట్లకు వేసక్టమీ తప్పనిసరి చేశారు'' అని వారన్నారు.

నా ఉత్థాన పతనాలకు గాంధీలే కారణం

కాంగ్రెస్ సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్



న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ రాజకీయాల్లో తాను అత్యున్నత స్థాయికి ఎదిగినా, తర్వాత ప్రాధాన్యత తగ్గి క్రియాశీలక రాజకీయాలకు దూరమైనా అందుకు గాంధీల కుటుంబమే కారణమని సీనియర్ రాజకీయవేత్త మణిశంకర్ అయ్యర్ వ్యాఖ్యానించారు. పీటీఐ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలను వెల్లడించారు. ''గత పదేళ్లుగా సోనియాగాంధీని కలిసే అవకాశం కూడా నాకు దక్కనివ్వలేదు. రాహుల్ గాంధీని ఒక్కసారి, ప్రియాంకను రెండుసార్లు కలిశా. ప్రియాంక నాకు ఫోన్‌లో టచ్‌లో ఉంటారు. నా ఎదుగుదలకు, రాజకీయ పతనానికి గాంధీల కుటుంబమే కారణం. ఇది నా రాజకీయ జీవితంలో కఠిన వాస్తవం. రాహుల్ పుట్టినరోజున ఆయనను కలిసి, లేదా ఫోన్ చేసి శుభాకాంక్షలు చెబుదామనుకున్నా కుదర్లేదు. చివరకు ప్రియాంకకు ఫోన్ చేసి నా తరఫున విషెస్ చెప్పాలని కోరా. ఆమె ఆశ్చర్యపోయి, 'మీరే స్వయంగా చెప్పొచ్చుకదా?' అని అన్నారు. నన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేశారుగా. అందుకే' అని బదులిచ్చా. బేషరతుగా క్షమాపణలు చెబుతూ ఉత్తరం రాశా. మొదటి పేరాలో శుభాకాంక్షలు ప్రస్తావించా. రెండో పేరాలో ప్రస్తుతం పార్టీలో నా స్థానమేంటి? అని వివరణ కోరా. దానికి ఇంతవరకు జవాబు రాలేదు. పార్టీలో ఒంటరినయ్యా. అయినా పార్టీని వీడను. బీజేపీలో చేరను. చాయ్ అమ్ముకునే మోదీ ప్రధాని అవకూడదని నేనస్సలు అనలేదు. అదంతా అబద్ధం. 2014లో మోదీ ఓడిపోతే, ప్రధానిగా అవకాశం దక్కకపోతే మళ్లీ ఛాయ్ అమ్ముకుంటారేమో అని మాత్రమే అన్నాను'' అని అయ్యర్ చెప్పుకొచ్చారు.

39 మందితో మహా కేబినెట్ విస్తరణ

నాగ్‌పూర్: మహారాష్ట్రలో బీజేపీ సారథ్యంలోని మహాయుతి సంకీర్ణ ప్రభుత్వం కేబినెట్‌ను విస్తరించింది. కొత్తగా మంత్రివర్గంలో చేరిన 39 మంది ఆదివారం రాష్ట్ర రెండో రాజధాని నాగ్‌పూర్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎం ఫడ్నవీస్, డిప్యూటీ సీఎంలు ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్‌ల సమక్షంలో గవర్నర్ పీసీ రాధాకృష్ణన్ ప్రమాణం చేయించారు. మహారాష్ట్ర శీతాకాల అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఇలా ఉండగా, నాగ్‌పూర్ రాజ్‌భవన్‌లో మంత్రి వర్గ ప్రమాణ స్వీకారం చివరిసారిగా 1991లో అప్పటి సీఎం సుధాకర్ రావు నాయక్ హయాంలో జరిగింది.

సౌండ్ దెబ్బకు గాల్లోకి లేవాల్సిందే



తెలుగు సినిమాల్లో హీరో కొడితే విలన్ గాల్లోకి అంతెత్తున ఎగిరిపడతాడు. వాస్తవ ప్రపంచంలో అలాంటివి అసాధ్యం. అయినాసరే కొందరు అభిమానులు ఆ సీన్‌లను కళ్లప్పగించి చూస్తారు. మనిషిని గాల్లోకి ఎగరేసేంత అపార శక్తి మరో మనిషికి లేదుగానీ వస్తువులను గాల్లోనే నిలిపే శక్తి అతిధ్వని తరంగాలకు ఉందని తాజాగా ధ్వనిశాస్త్రవేత్తలు నిరూపించి చూపారు. తొలి దశలో చిన్నపాటి వస్తువులను, నీటి బిందువులను గాల్లో అలాగే ఒక స్థానంలో నిలబెట్టగలమని ప్రయోగపూర్వకంగా ప్రదర్శించి చూపారు. భవిష్యత్తులో ఇంకాస్త బరువైన వస్తువులనూ గాల్లో యథాస్థానంలో ఉంచడమేకాదు కావాల్సిన దిశలో కదిలించగలమని చెబుతున్నారు.

గాల్లో ఎలా సాధ్యం?

శబ్ద పీడనంతో వస్తువులను గాల్లో కదిలించవచ్చని శతాబ్దాలుగా శాస్త్రవేత్తలు భావిస్తున్నారుగానీ ప్రయోగపూర్వకంగా నిరూపించలేకపోయారు. ధ్వని తరంగాలు గాల్లో ప్రయాణించేటప్పుడు గాలి పీడనంలో మార్పులు తీసుకురాగలవు. ఈ కారణంగా ఆ ప్రాంతంలోని వస్తువుల అణువులను దగ్గరకు జరపడం, లేదంటే దూరం దూరంగా విడగొట్టడం సాధ్యం. ఏదైనా వస్తువు మీదుగా అతిధ్వని తరంగాలను ప్రయాణింపజేసినప్పుడు, లేదంటే వస్తువు వైపుగా అతిధ్వని తరంగాలను ప్రయోగించినప్పుడు భూమి గురుత్వాకర్షణ శక్తికి అభిముఖంగా దానిని యథాస్థానంలో అక్కడే గాల్లో నిలపవచ్చని తాజాగా నిరూపితమైంది. ఈ సందర్భంలో ఆ వస్తువు చూడ్డానికి గాల్లో ఈదుతున్నట్లుగా ఉంటుంది.

గాల్లోనే ఉంటే మనకేం ఉపయోగం?

ద్రవాల్లోని కలుషితాలను వేరేచేయాలన్నా, అసలు ఆ ద్రవం కలుషితం అయ్యిందో లేదో తెలియాలన్న పెద్దపెద్ద ల్యాబ్ పరీక్షలు చేయకుండా సులభంగా ఆ ద్రవం ప్రవహించే మార్గంలో అతిధ్వని తరంగాలను ప్రసరింపజేసి కలుషితకారక పదార్థ అణువులను పక్కకు జరిపి పూర్తి ద్రవాన్ని శుద్ధి చేయొచ్చని పరిశోధకులు చెబుతున్నారు. అతిసూక్ష్మస్థాయి వస్తువుల్లో పాడైన, నకిలీ వస్తువులను వేరు చేసేందుకు అతిధ్వని తరంగాలు ఉపయోగపడతాయని ధ్వని శాస్త్రవేత్తలు చెప్పారు. త్వరలోనే పూర్తిస్థాయి పరీక్షలను పూర్తిచేసుకుని వాణిజ్యపర వినియోగం స్థాయికి తీసుకురావచ్చని అకొస్టోఫ్యాబ్ సంస్థ సహవ్యవస్థాపకులు శ్రీరామ్ సుబ్రమణియమ్, శుభీ భన్సాల్ చెప్పారు

- సాక్షి, నేషనల్ డెస్క్

హిజాబ్ లేకుండా పాట..

ఇరాన్ గాయని అరెస్ట్

టెహ్రాన్: హిజాబ్ ధరించకుండా పాట పాడి, యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసిన ఇరాన్ గాయని పరస్టూ అహ్మదీ(27)ని ఇరాన్ అధికారులు అరెస్ట్ చేశారు. సారి నగరంలో శనివారం అధికారులు పరస్టూను అదుపులోకి తీసుకున్నట్లు ఆమె తరఫు లాయర్ మిలాద్ చెప్పారు. ఆన్‌లైన్ కచేరీలో ఆమె హిజాబ్ ధరించలేదు. భుజాలు కనిపించే నల్ల రంగు డ్రెస్ వేసుకున్నారు. ఆమె అరెస్ట్‌కు కారణాలను, ఎక్కడ నిర్బంధంలో ఉంచిందీ అధికారులు వెల్లడించలేదు. కచేరి సమయంలో ఆమెతో కనిపించిన కళాకారుల్లో సొహైల్ నసిరీ, ఎహ్సాన్ బెయిరఘ్దార్‌లనూ అరెస్ట్ చేశారు. న్యాయ శాఖ అధికారులతో మాట్లాడి, నిర్బంధం గురించి తెలుసుకుంటామని లాయర్ చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో హిజాబ్ లేకుండా సోలోగా పాడటాన్ని ఇరాన్ నిషేధించింది. హిజాబ్ ధరించకుండా కనిపించిన అమినీ అనే యువతి పోలీసు నిర్బంధంలో ఉండగా చనిపోవడం 2022లో ఇరాన్ వ్యాప్తంగా అల్లర్లకు దారి తీయడం తెలిసిందే.

546 మందితో హిందూస్తానీ విభావరి

గ్వాలియర్: మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ కోటలో ఆదివారం చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. ఏకంగా 546 మంది కళాకారులతో కూడిన అతి పెద్ద హిందుస్తానీ శాస్త్రీయ సంగీత బృందం తొమ్మిది రకాల సంగీత పరికరాలతో తొమ్మిది నిమిషాల పాటు పలు రాగాలు ఆలపించి గిన్నిస్ రికార్డు సాధించారు. కళాకారుల్లో 347 మంది పురుషులు కాగా, 189 మంది మహిళలు. దిగ్గజ కళాకారుడు తాన్‌సేన్ 100వ అంతర్జాతీయ సమ్మేళం సందర్భంగా ప్రముఖ వేణుగాన కళాకారుడు పండిట్ రోను మంజుదార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటైంది. 16వ శతాబ్దంలో అక్బర్ చక్రవర్తి ఆస్థానంలో ఉన్న ఈయన రుద్ర వీణ/ రబాబ్‌ను అద్భుతంగా వాయించేవారని ప్రతీతి.

వీహెచ్‌పీ కార్యక్రమంలో వ్యాఖ్యల వివాదం

సుప్రీం కొలీజియంకు వివరణివ్వనున్న జస్టిస్ యాదవ్

న్యూఢిల్లీ: వివాదాస్పద వ్యాఖ్యలతో ఇటీవల వార్తల్లోకెక్కిన అలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ త్వరలో సుప్రీంకోర్టు కొలీజియం ఎదుట హాజరవనున్నారు. ఇటీవల ఆయన విశ్వ హిందూ పరిషత్(వీహెచ్‌పీ) కార్యక్రమంలో ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమవడం తెలిసిందే. జస్టిస్ ఎస్‌కే యాదవ్ వ్యాఖ్యల వివాదంపై నివేదికివ్వాలని ఈ నెల 10న సుప్రీంకోర్టు అలహాబాద్ హైకోర్టును కోరింది. అలహాబాద్ హైకోర్టు అందజేసిన నివేదిక ప్రస్తుతం న్యాయస్థానం పరిశీలనలో ఉన్నట్లు ఒక అధికారిక ప్రకటన పేర్కొంది. ఆనవాయితీ ప్రకారం..ఆరోపణలు ఎదుర్కొంటున్న జడ్జీలు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ)సారథ్యంలోని కొలీజియం ఎదుట హాజరై వివరణ ఇవ్వాల్సి ఉంటుంది.

సాక్షి హైదరాబాద్

సోమవారం ׀ 16 ׀ డిసెంబర్ ׀ 2024



ఏలికల సేవలో మున్సిపాలిటీలు!
సామాన్యుల సమస్యలను పరిష్కరించాల్సిన మున్సిపాలిటీలు/కార్పొరేషన్లు ఇప్పుడు 'పెద్ద'లు, బడా రియల్టర్ల సేవలో తరిస్తున్నాయి.
-8లో



పైప్‌లైన్ మరమ్మతు పనులు పూర్తి
రెడ్ హిల్స్ వద్ద ధ్వంసమైన మంచినీటి పైప్‌లైన్ మరమ్మతు పనులను జలమండలి యుద్ధ ప్రాతిపతికన ఆదివారం సాయంత్రం పూర్తి చేసింది.
-8లో

గరిష్టం/కనిష్టం
29.0/15.0

వాతావరణం
నగరంలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం వేళల్లో పొగమంచు భారీగా కురుస్తుంది. సాయంత్రం నుంచి చల్లని గాలులు పెరుగుతాయి.

మంచి అలవాట్లే మనకు శ్రీరామరక్ష

• గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



కార్యక్రమంలో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

రాజేంద్రనగర్: సత్యం, ధర్మం, మంచి అలవాట్లు కలిగి జీవించడమే సత్సంగ్ అని..ఆధ్యాత్మిక వేత్త ఠాకూర్ అనుకూల్ చంద్ర స్థాపించిన సత్సంగ్ విహార్‌లో ఇదే అంశాన్ని బోధిస్తూ ఆచరించడం సంతోషకరమైన విషయమని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. శ్రీ ఠాకూర్ అనుకూల్ చంద్ర 137వ జయంతి, హైదరాబాద్ సత్సంగ్ విహార్ 14వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం రాజేంద్రనగర్‌లోని హైదరాబాద్ సత్సంగ్ విహార్‌లో వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ మాట్లాడుతూ మంచిని ఆచరించాలంటే గురువు సారథ్యంలో నేర్చుకోవాల్సి ఉంటుందని..అది సత్సంగ్ విహార్‌లలో సాధ్యమవుతుందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ చెబుతున్న వికసిత్ భారత్ అంటే దేశం ఆర్థికంగా బాగుండటం, ప్రజలు కావాల్సినంత డబ్బు కలిగి ఉండటం కాదని..సంస్కృతీ సంప్రదాయాలు, దేశ చరిత్ర, సత్యం, ధర్మంతో ప్రతిరాష్ట్రం, దేశం విలసిల్లినప్పుడే వికసిత్ భారత్ సాధ్యమని ఆయన ఉద్దేశమన్నారు. స్వామి వివేకానంద లాంటి యుగ పురుషులు వికసిత్ భారత్ సాధన దిశగా పని చేశారన్నారు. పాశ్చాత్య నాగరితకు అలవాటు పడవద్దన్నారు. గురువు బోధించిన మార్గంలో సత్యంతో జీవిస్తే గురువు ఆశీర్వాదాలు ఉంటాయన్నారు. మంచి అలవాట్లు మనిషిని ఉన్నతునిగా చేస్తాయన్నారు. అండమాన్ నికోబార్ దీవుల ఎంపీ బిష్ణు పదరాయ్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ ఠాకూర్ అనుకూల్ చంద్ర మహారాజ్ మార్గంలో నడుచుకోవాలన్నారు. డీఆర్‌డీఎల్ శాస్త్రవేత్త డాక్టర్ జీఏ శ్రీనివాస మూర్తి, విశ్రాంత అడిషనల్ డీసీపీ సుహాస్ చతుర్వేది, హైదరాబాద్ సత్సంగ్ విహార్ ఇన్‌చార్జి కార్యదర్శి అశోక్ గిద్వానీ, బారీ, ఆవుల ఉచ్చిరప్ప యాదవ్, చంద్రమౌళి పాల్గొన్నారు.

చారిత్రక సంపద పరిరక్షణకు కృషి

• కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణలోని వారసత్వ సంపద, చారిత్రక కట్టడాల సంరక్షణకు ప్రత్యేకంగా దృష్టి సారిస్తామని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని చారిత్రక, వారసత్వ సంపద పరిరక్షణ కోసం కృషి చేస్తున్న 'టార్చ్' సంస్థ బృందం ఆదివారం కిషన్‌రెడ్డిని కలిసింది. ఈ సందర్భంగా పలు అంశాలపై వినతిపత్రాలు అందజేశారు. ఇందులో భాగంగా కాకతీయులు నిర్మించినవే కాకుండా పలు ప్రసిద్ధి చెందిన చారిత్రక నిర్మాణాలు, పురావస్తు శాఖ ఆదరణకు నోచుకోని విలువైన వారసత్వ సంపద రాష్ట్రంలో శిథిలావస్థకు చేరుకుంటోందని టార్చ్ సంస్థ వ్యవస్థాపకులు అరవింద్ పకిడే మంత్రికి వివరించారు. ఎంతో ఘన చరిత్ర కలిగిన తెలంగాణలో ఇప్పటి వరకు కేవలం 8 నిర్మాణాలు మాత్రమే కేంద్ర పురావస్తు శాఖ గుర్తించిందని కానీ ఇతర రాష్ట్రాల్లో ఈ సంఖ్య వందల్లో ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గుర్తించినవి దాదాపు 70 వరకు నిర్మాణాలు ఉన్నాయని, వీటన్నింటినీ కేంద్ర పురావస్తు శాఖ ఆధీనంలోకి తీసుకోవాలని మంత్రికి విన్నవించారు. ప్రస్తుత పెద్దపల్లి జిల్లాలో కాకతీయ పాలకులు నిర్మించిన చంద్రవెల్లి ఆలయం ఆలనాపాలనా లేక శిథిలావస్థకు చేరుకుని కూలిపోయే పరిస్థితి ఏర్పడిందని, ఈ ఆలయ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కోరారు. జీవ వైవిధ్యానికి తెలంగాణ కేంద్రంగా నిలుస్తుందని, ఇందులో భాగంగా కోట్ల సంవత్సరాల క్రితం మనుగడ సాగించిన జీవజాతుల శిలాజాలు (ఫాసిల్స్) రాష్ట్రంలో లభ్యమవుతున్నాయని, వీటి సంరక్షణ, పరిశోధనల కోసం ప్రత్యేకంగా ఫాసిల్ పార్క్ నిర్మించాలని కోరారు. ఈ సందర్భంగా కోట్లాది సంవత్సరాల క్రితం నాటి వృక్ష శిలాజాన్ని మంత్రికి బహూకరించారు. వినతులపై మంత్రి సానుకూలంగా స్పందించి, తగిన చర్యలకు కృషి చేస్తానని చెప్పారు.



నిజాంకాలేజీ సెంటర్‌లో అభ్యర్థులను తనిఖీ చేసి లోపలికి అనుమతిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది



దోమలగూడలోని ఏవీ కాలేజ్ వద్ద

ఉరుకులు పరుగుల మధ్య...

తొలిరోజు గ్రూప్–2 ప్రశాంతం

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్–2 పరీక్ష తొలి రోజు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. పరీక్షకు సకాలంలో చేరుకునేందుకు అభ్యర్థులు ఉరుకులు పరుగులు పెట్టాల్సి వచ్చింది. ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను పలు కేంద్రాల్లో అనుతించలేదు. ఇందిరానగర్ వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన గ్రూప్–2 పరీక్ష కేంద్రానికి ఆలస్యంగా వచ్చిన ఓ మహిళా అభ్యర్థిని అధికారులు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించకపోవడంతో ఆమె వెనుతిరిగి వెళ్లారు. అభ్యర్థుల హాల్ టికెట్, గుర్తింపు కార్డు, బయోమెట్రిక్‌లను పరిశీలించి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి 144 సెక్షన్ విధించారు. నగరంలోని మెహిదీపట్నం సంతోష్‌నగర్ సెయింట్ ఆన్స్ బాలికల జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రంలోని గ్రూప్–2 పరీక్ష కేంద్రాలను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారులకు తగు సూచనలు చేశారు. హైదరాబాద్ జిల్లా పరిధిలో 101 పరీక్ష కేంద్రాల్లో ఉదయం జరిగిన గ్రూప్–2 పేపర్–1 పరీక్షకు 48,012 అభ్యర్థులకు గాను 19,208 మంది అభ్యర్థులు (40.01%)హాజరయ్యారు. 28804 మంది అభ్యర్థులు గైర్హాజరు అయ్యారు. మధ్యాహ్నం పేపర్–2కు 48,012 అభ్యర్థులకు గాను 18,879 (39.32%)మంది హాజరయ్యారు. 29133 మంది గైర్హాజరయ్యారు.





నిజాం కాలేజీ వద్ద..

గజ..గజ!

- వణికిస్తున్న చలి
- 8.6 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు
- మరో వారం వరకు ఇదే పరిస్థితి

సాక్షి, సిటీబ్యూరో: చలి గజ గజ వణికిస్తోంది. రాత్రి పూట కనిష్ట ఉష్ణోగ్రత బాగా తగ్గుముఖం పట్టింది. తెల్లవారు జామున పొగ మంచు పెరుగుతోంది. రోడ్లను కమ్మేస్తోంది. పగలు చల్లని గాలులతో గరిష్ట ఉష్ణోగ్రత 29 డిగ్రీలకు చేరింది. ఆదివారం రాత్రి చలి తీవ్రత మరింత పెరిగింది. సగటున కనిష్ట ఉష్ణోగ్రతలు 14.6 డిగ్రీలుగా నమోదైంది. శివార్లలో మాత్రం అత్యల్పంగా రికార్డు స్థాయిలో 8.6 డిగ్రీలు నమోదైంది. సగటు కంటే నాలుగు నుంచి ఐదు డిగ్రీల వరకు తగ్గింది. మరో వారం రోజులు ఇదే పరిస్థితి కొనసాగుతుందని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది.

కనిష్ట ఉష్ణోగ్రతలు ఇలా

ప్రాంతం	డిగ్రీలు
పటాన్‌చెరు	8.6
రాజేంద్రనగర్	11
హయత్‌నగర్	13
హకీంపేట	13.7
దుండిగల్	14.2

టెక్‌మండలి!

ఐటీ సంస్కరణలకు వాటర్‌బోర్డు శ్రీకారం

- అప్‌డేటెడ్ టెక్నాలజీతో నెట్‌వర్క్ మ్యాపింగ్
- జీఐఎస్ కనెక్టివిటీతో మొబైల్ యాప్స్ రూపకల్పన
- డ్యాష్ బోర్డు ద్వారా ఫీల్డ్‌వర్క్ ప్రత్యక్ష పర్యవేక్షణ

సాక్షి, సిటీబ్యూరో: జలమండలి అత్యాధునిక సాంకేతి పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా అప్‌డేటెడ్ టెక్నాలజీతో క్షేత్ర స్థాయి పనుల పర్యవేక్షణ కోసం ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ నివేదికలపై ఆధారపడకుండా 'లైవ్ లోకేషన్ ఫీల్డ్ వర్క్ మ్యానిటరింగ్' సిస్టంకు శ్రీకారం చుట్టింది. టెక్నాలజీ సాయంతో సిటీజనులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కసరత్తు చేస్తోంది. తాగునీటి సరఫరా, సీవరేజీ నిర్వహణ నెట్‌వర్క్‌లను భౌగోళిక సమాచార వ్యవస్థ (జీఐఎస్)తో మ్యాపింగ్ చేసింది. వాటికి ప్రత్యేక డేటా ప్రోగ్రామింగ్ రూపకల్పన చేసి డ్యాష్ బోర్డుతో అనుసంధానించింది. మరోవైపు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో మొబైల్ యాప్స్‌కు రూపకల్పన చేసి ఇటు జీఐఎస్, అటు డ్యాష్‌బోర్డుతో కనెక్టివిటీ చేసింది. ఇక సెక్షన్లలోని మేనేజర్ల నుంచి ప్రధాన కార్యాలయంలోని ఎండీ వరకు ఫీల్డ్ వర్క్‌ను డ్యాష్ బోర్డుల ద్వారా లైవ్ మానిటరింగ్ చేసే విధంగా చర్యలు చేపట్టింది. ప్రతి విభాగానికి ఒక డ్యాష్‌బోర్డు చొప్పున ఏర్పాటు చేసి క్షేత్రస్థాయి పర్యవేక్షణలో జలమండలి నిమగ్నమైంది.





దానకిశోర్ హయాంలో ఐటీకి బీజం

సరిగ్గా ఐదేళ్ల క్రితం ప్రస్తుతం మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి ఎం.దానకిశోర్ జలమండలి ఎండీగా ఉన్న సమయంలో మహానగర పరిధిలోని మంచినీటి, మురుగునీటి పారుదల వ్యవస్థలకు సంబంధించి పైప్‌లైన్, మ్యాన్‌హోళ్లకు డిజిటల్ బేస్ మ్యాపింగ్‌కు బీజం పడింది. అప్పట్లో బోర్డులోని సెంట్రల్ డిజైన్ సెల్ ఆధ్వర్యంలో నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సంస్థ సహకారంతో డిఫరెన్షియల్ కరెక్షన్ పద్ధతుల ద్వారా గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ రిసీవర్లను ఉపయోగించి మ్యాపింగ్‌కు శ్రీకారం చుట్టారు. ప్రాథమికంగా బోర్డు పరిధిలోని 16 నిర్వహణ డివిజన్ల పరిధులను సూచించే శాటిలైట్ చిత్రాలను వినియోగించి సీవరేజీ, వాటర్ పైప్‌లైన్లు, మ్యాన్ హోల్స్ సమాచారం పొందుపర్చారు. సాధారణంగా కాగితంపై ఉన్న వివరాల్లో దొరకని అతి సూక్ష్మ సమాచారం సైతం మ్యాపులో ఒక్క క్లిక్‌తో పూర్తి డేటాబేస్ ప్రత్యక్షమయ్యే విధంగా రూపొందించారు. కరోనా మహమ్మారితో మ్యాపింగ్ ప్రక్రియ నత్తనడకన కొనసాగి.. 2023లో పూర్తయింది. అంతలోనే అసెంబ్లీ ఎన్నికల తర్వాత దానకిశోర్ పదోన్నతి ద్వారా బదిలీ కావడంతో జీపీఎస్ ద్వారా పర్యవేక్షణ అమలు మాత్రం ముందుకు పడలేదు.

అన్ని సేవలకూ డ్యాష్‌బోర్డులు

సీవరేజీ స్పెషల్ డ్రైవ్ డ్యాష్ బోర్డు స్ఫూర్తితో మిగతా సేవలన్నింటినీ డ్యాష్ బోర్డుల ద్వారా పర్యవేక్షించేందుకు జలమండలి సిద్ధమవుతోంది. ఇప్పటికే ఎంసీసీ, డీసిల్టింగ్, ఎస్‌డబ్ల్యూసీ, ఏఎంఎస్, నాణ్యత, ఓఆర్ఆర్, ట్యాంకర్ ట్రాకింగ్ తదితర డ్యాష్‌బోర్డులను అందుబాటులో తెచ్చారు. తాజాగా ప్రాజెక్టు, రిజర్వాయరు, ఎస్టీపీ, రెవెన్యూ వెహికిల్ ట్రాకింగ్ తదితర డ్యాష్‌బోర్డులను కూడా ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

త్వరలో కామన్ కంట్రోల్ రూమ్

క్షేత్ర స్థాయిలో సిబ్బంది పనితీరుపై పర్యవేక్షణ కోసం జీఐఎస్‌తో అనుసంధానమైన డ్యాష్‌బోర్డులను ప్రధాన్య కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్నామని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే సీవరేజీ స్పెషల్ డ్రైవ్ పనితీరు ఎప్పటికప్పుడు డ్యాష్‌బోర్డు ద్వారా మానిటరింగ్ చేయడం సత్ఫలితాలిస్తోందని చెప్పారు. జలమండలి సేవలన్నింటిపై డ్యాష్ బోర్డులు రూపొందించి..వాటికోసం ప్రధాన కార్యాలయంలో కామన్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయనున్నామని చెప్పారు.

ఎండీ చొరవతో డ్యాష్‌బోర్డు

సరిగ్గా రెండున్నర నెలల క్రితం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీవరేజీ స్పెషల్ డ్రైవ్‌తో డేటాబేస్ నెట్‌వర్క్ మ్యాపింగ్ వినియోగంపై కదలిక వచ్చినట్లయింది. ఐదున్నర నెలల క్రితం జలమండలి ఎండీగా పదవీ బాధ్యతలు చేపట్టిన అశోక్ రెడ్డి సాంకేతిక సమాచార వ్యవస్థపై గట్టి పట్టు ఉండటంతో..సీవరేజీ స్పెషల్ డ్రైవ్‌పై నెట్‌వర్క్ డేటా బేస్ మ్యాపింగ్ ఆధారంగా డ్యాష్ బోర్డు ఏర్పాటు చేసి క్షేత్ర స్థాయి పర్యవేక్షణ చేస్తే బావుంటుందని భావించారు. జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం (జీఐఎస్) టెక్నాలజీలో పాతికేళ్ల అనుభవంతో కూడిన స్పెషలిస్టు మల్లిఖార్జున్ బోర్డు ఐటీ విభాగం ఇన్‌చార్జిగా అందుబాటులో ఉండటం మరింత కలిసి వచ్చింది. దీంతో డ్యాష్ బోర్డు ఏర్పాటుపై చర్చించి పలు సూచనలు చేశారు. మల్లికార్జున్ సారథ్యంలోని ఐటీ విభాగం ప్రత్యేక ఆన్‌లైన్ వెబ్–బేస్డ్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీతో నెట్‌వర్క్ మ్యాపింగ్‌ను బోర్డు మెట్రో కస్టమర్ కేర్ సెంటర్ సర్వర్‌కు అనుసంధానం చేసింది. మరోవైపు జీఐఎస్ మ్యాపింగ్ ఆధారంగా ప్రత్యేకంగా అప్లికేషన్ డెవలప్ చేసి క్షేత్రస్థాయి సెక్షన్ మేనేజర్‌తో పాటు జెట్టింగ్ మిషన్ ఇన్‌చార్జి, ఫీల్డ్ సూపర్‌వైజర్లకు మొబైల్స్‌లో యాప్ అప్లికేషన్‌ను ఇన్‌స్టాల్ చేశారు. నెట్‌వర్క్‌ను ప్రధాన సర్వర్‌తో డ్యాష్ బోర్డుకు అనుసంధానించారు. దీంతో స్పెషల్‌డ్రైవ్‌పై లైవ్ ఫీల్డ్ వర్క్ మానిటరింగ్ ప్రారంభమైంది. రోజువారిగా క్షేత్రస్థాయిలో ఎక్కడ నుంచి ఎక్కడి వరకు సీవరేజీ పైప్‌లైన్ క్లీనింగ్, మ్యాన్ హోళ్ల డీసిల్టింగ్, ఎయిర్‌టెక్ మిషన్, సిల్ట్ వెహికిల్స్ పనితీరుపై డ్యాష్‌బోర్డు ద్వారా పర్యవేక్షణ సత్ఫలితాలు ఇస్తోంది.

కల నెరవేరుతున్న వేళ...

- పాత బస్తీలో మెట్రోరైలు పనులు షురూ
- ఈ రూట్‌లో రోడ్డు విస్తరణ పనులు ముమ్మరం
- నెలాఖరులోగా ప్రభావిత ఆస్తులకు అవార్డులు
- తదనంతరం పరిహారం చెల్లింపు
- పనుల ప్రగతిపై ఎప్పటికప్పుడు సీఎం సమీక్ష



పాతబస్తీలో రోడ్డు విస్తరణ కోసం మార్కింగ్ చేస్తున్న అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: పాతబస్తీ వాసుల కల నెరవేరే సమయం ఆసన్నమైంది. ఎన్నో ఏళ్ల తర్జనభర్జనలు.. ప్రభుత్వ నిర్ణయాల అనంతరం ఇక్కడ మెట్రో రైలు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు చారిత్రక పాతబస్తీలో మెట్రో పనులు మొదలయ్యాయి. మెట్రో రూట్‌లో రోడ్డు విస్తరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మెట్రో రెండో దశలో భాగంగా ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మేర మెట్రోరైల్ లైన్ నిర్మించనున్న సంగతి తెలిసిందే. ఈ రూట్‌లో పాతబస్తీలో రోడ్డు విస్తరణ, ఆస్తుల సేకరణ పనులను సకాలంలో పూర్తి చేసి మెట్రో నిర్మాణ పనులను పట్టాలెక్కించేందుకు హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌మెట్రో రైల్ కార్యాచరణను వేగవంతం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు పనుల పురోగతిని తెలియజేస్తున్నట్లు హెచ్‌ఏఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి చెప్పారు. సుమారు ఏడున్నర కిలోమీటర్ల నిడివి గల ఎంజీబీఎస్ – చాంద్రాయణగుట్ట మార్గంలో 1100 ఆస్తులను గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ ఆస్తుల సేకరణ పనులు వేగవంతమయ్యాయన్నారు.

త్వరలో పరిహారం చెల్లింపు...

భూసేకరణ చట్టానికి అనుగుణంగా సేకరించనున్న ఆస్తులకు పరిహారం చెల్లించేందుకు హెచ్‌ఏఎంఎల్ చర్యలు చేపట్టింది. ఇప్పటి వరకు గుర్తించిన 1100 ఆస్తులలో 900 ఆస్తులకు సంబంధించిన రిక్విజిషన్‌ను మెట్రోరైల్ అధికారులు ఇప్పటికే హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. ఈ మేరకు ఆయన వాటిలో 800 ఆస్తులకు సంబంధించిన ప్రిలిమినరీ నోటిఫికేషన్ వివిధ దఫాలుగా విడుదల చేశారు. ఇప్పటి వరకు గుర్తించిన ఆస్తులలో 400 ఆస్తులకు ప్రిలిమినరీ డిక్లరేషన్‌ను కూడా జారీ చేశారు. వాటిలో 200 ఆస్తుల పరిహారానికి సంబంధించిన అవార్డులను ఈ నెలాఖరులోగా ప్రకటించనున్నట్లు ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఆ తర్వాత సేకరించిన వాటికి పరిహారం చెల్లించి కూల్చివేతలు చేపట్టనున్నారు. దీంతో మెట్రో రైలు మార్గ నిర్మాణానికి మార్గం సుగమం కానుంది. ఈ మార్గంలో ఉన్న వివిధ నిర్మాణాలు, ప్రభావిత ఆస్తుల యాజమానులతో సానుకూలంగా చర్చించి, వాటిని భూసేకరణ చట్టం ప్రకారం సేకరించి రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నట్లు ఎండీ వివరించారు. రోడ్డు విస్తరణలోను, మెట్రో నిర్మాణంలోను మతపరమైన, చారిత్రక కట్టడాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా సమర్థవంతమైన ఇంజినీరింగ్ పరిష్కారాలతో పరిరక్షిస్తున్నట్లు మరోసారి స్పష్టం చేశారు.

పర్యాటకంగా మరింత ఆకర్షణ...

మెట్రో రైల్ రాకతో పాత నగరం మరింత ఆకర్షణను సంతరించుకోనుంది. ఇప్పటికే జాతీ య, అంతర్జాతీయ పర్యాటకులు చార్మినార్ సహా పలు ప్రాంతాలను సందర్శించేందుకు పెద్ద ఎత్తున తరలివస్తున్న సంగతి తెలిసిందే. మెట్రో అందుబాటులోకి వస్తే మరింత ఎక్కువ మంది పర్యాటకులు పాతబస్తీని సందర్శించే అవకాశం ఉంది. అటు నగరంలోని ప్రధాన ప్రాంతాల నుంచి, ఇటు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రయాణికులు, పర్యాటకులు ఎలాంటి ఇబ్బంది లేకుండా పాతబస్తీకి రాకపోకలు సాగించనున్నారు.

నన్ను వదిలేస్తే రూ.3 కోట్లు ఇస్తా!

గోవా కానిస్టేబుల్‌కు ఆఫర్ ఇచ్చిన అంతర్రాష్ట్ర నేరగాడు ఖాన్

- ల్యాండ్ గ్రాబింగ్ కేసులో చిక్కి తప్పించుకునేందుకు ఈ ఎత్తు
- ప్రత్యేక బృందాలతో ముమ్మరంగా గాలిస్తున్న అక్కడి కాప్స్
- ఇందులో భాగంగా నగరానికి చేరుకున్న గోవా పోలీసులు
- ఈ నిందితుడిపై తెలంగాణ, ఏపీల్లోనే అనేక మోసం కేసులు



క్రైమ్ బ్రాంచ్ లాకప్ వద్ద అమిత్‌తో సులేమాన్ (సీసీ టీవీ దృశ్యం)

సాక్షి, సిటీబ్యూరో: గోవా క్రైమ్ బ్రాంచ్ పోలీసులు అక్కడి ఓ ల్యాండ్ గ్రాబింగ్ కేసులో సులేమాన్ మహ్మద్ ఖాన్‌ను శుక్రవారం పట్టుకున్నారు..లాకప్‌లో ఉన్న అతగాడు సెంట్రీ విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌కు రూ.3 కోట్ల ఆఫర్ ఇచ్చాడు...అతడి వల్లోపడిన కానిస్టేబుల్ తన ఉద్యోగం పోగొట్టుకోవడంతో పాటు శనివారం అరెస్టు అయ్యాడు. పరారీలో ఉన్న సులేమాన్ కోసం గాలిస్తున్న ప్రత్యేక బృందం ఆదివారం నగరానికి చేరుకుంది. ఇతడికి నగరంతో సంబంధాలు ఉండటంతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల్లో మోసాల కేసులు ఉన్నాయి. దీంతో గోవా పోలీసులు రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ గాలిస్తున్నారు.

రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో నష్టాలతో...

గోవాలోని తివం ప్రాంతానికి చెందిన సులేమాన్ తండ్రి శాండ్ కాంట్రాక్టర్. పదో తరగతితోనే చదువుకు స్వస్తి చెప్పిన ఇతగాడు 1989లో నిర్మాణరంగ కార్మికుడిగా మారాడు. 1992లో మేస్త్రీగా, 1995 నాటికి కాంట్రాక్టర్ వరకు ఎదిగాడు. ఈ రంగంలో భారీగా ఆర్జించి రియల్టర్ అవతారం ఎత్తిన ఇతగాడు గోవా చుట్టు పక్కల ప్రాంతాల్లో భారీగా ప్లాట్లు కొన్నాడు. 2007–2009 వరకు ఏర్పడిన ఆర్థికమాంద్యంతో రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలింది. దీని ప్రభావానికి తీవ్రంగా నష్టపోయిన సులేమాన్ తన మకాంను పుణేకు మార్చాడు.

జీపీఏ రద్దు చేసుకున్నందుకు మహిళ హత్య

పుణేలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేద్దామని భావించిన సులేమాన్ అందుకు అవసరమైన పెట్టుబడి లేకపోవడంతో మోసాలు ప్రారంభించాడు. ఈ నేపథ్యంలోనే ఇతడికి అక్కడి గ్యాంగ్‌స్టర్ గజానన్ మార్నేతో విభేదాలు ఏర్పడ్డాయి. దీనికితోడు ఓ ల్యాండ్ విషయంలో విమల్‌రావు దేశ్‌ముఖ్ అనే వ్యాపారిని మోసం చేయడంతో కేసు నమోదైంది. దీంతో ఓ పక్క మాఫియా, మరోపక్క పోలీసుల నుంచి సులేమాన్‌కు ఒత్తిడి పెరిగింది.

అక్కడ నుంచి పారిపోయే ప్రయత్నాల్లో పోలీసులకు చిక్కిన ఇతగాడు దాదాపు వంద రోజులు పుణేలోని ఎరవాడ సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. జైలు నుంచి బయటకు వచ్చాక మళ్లీ గోవా వెళ్లిన సులేమాన్ రియల్ ఎస్టేట్ దందా మొదలెట్టాడు. 2014లో ఖరీదైన స్థలానికి సంబంధించి 75 ఏళ్ల వృద్ధురాలికి అడ్వాన్స్ ఇచ్చిన సులేమాన్ ఆమెతో జీపీఏ చేసుకున్నాడు. సరైన సమయానికి చెల్లింపులు చేయలేకపోవడంతో ఆమె దీన్ని రద్దు చేసుకుంది. కక్షకట్టిన అతగాడు ఆమెకు విషం ఇంజెక్షన్ ఇచ్చి చంపేశాడు.

కాపలా ఉన్న కానిస్టేబుల్‌కే టోకరా...

అక్కడ భూ కబ్జాలు ప్రారంభించిన సులేమాన్‌పై అనేక కేసులు నమోదయ్యాయి. దీంతో అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన అతడి కోసం క్రైమ్ బ్రాంచ్ పోలీసులతో ఓ సిట్ ఏర్పాటు చేశారు. ముమ్మరంగా గాలించి ఎట్టకేలకు గురువారం పట్టుకుని లాకప్‌లో ఉంచారు. అక్కడ కానిస్టేబుల్ అమిత్ నాయక్‌ను కాపలాగా ఉంచారు. అమిత్‌తో మాటలు కలిపిన సులేమాన్..ఈ ఉద్యోగంలో ఏం వస్తుందంటూ అతడిని నమ్మించాడు. తనను వదిలేసి, తనతో పాటు వస్తే బెంగళూరు వెళ్లిన వెంటనే రూ.3 కోట్లు ఇస్తానని నమ్మించాడు. ఇతడి మాటలను నమ్మిన అమిత్ అదే పని చేసి, అతడితో కలిసి హుబ్లీ వరకు వెళ్లాడు. అక్కడ అమిత్ కళ్లుగప్పిన సులేమాన్ పరారయ్యాడు. వీరిద్దరి కోసం గాలించడానికి ఏర్పాటైన ప్రత్యేక బృందాలు శనివారం అమిత్‌ను పట్టుకున్నాయి. సులేమాన్ కోసం వేటాడుతూ ఓ బృందం ఆదివారం హైదరాబాద్ చేరుకుంది. నగరంతో పాటు సంగారెడ్డి, మహబూబ్‌నగర్, విజయవాడ, విశాఖపట్నాల్లోనూ ముమ్మరంగా గాలిస్తోంది.

కందిలో షెల్టర్ ఏర్పాటు చేసుకుని కొన్నాళ్లు...

అక్కడ నుంచి 2016లో సంగారెడ్డికి వలసవచ్చిన ఇతగాడు గచ్చిబౌలి, మహబూబ్‌నగర్, విజయవాడ, విశాఖపట్నంలో పలు మోసాలు చేశాడు. కరెన్సీ మార్పిడి, రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరుతో దండుకున్నాడు. 2018 జూలైలో మాదాపూర్‌లోని ఐటీసీ కోహినూర్ హోటల్‌లో బస చేశాడు. ఆన్‌లైన్ ద్వారా విదేశీ కరెన్సీ మార్పిడి చేసే ఏజెన్సీల వివరాలు తెలుసుకున్నాడు. ఒకరికి ఫోన్ చేసి 30 వేల అమెరికన్ డాలర్లు కావాలని చెప్పాడు. ఆ నెల 10న సదరు వ్యాపారికి గచ్చిబౌలి ఫ్లైఓవర్ వద్దకు రమ్మని చెప్పి, కారులో వెళ్లి ఎక్కించుకున్నాడు. ఓఆర్ఆర్ అప్పా జంక్షన్ వద్దకు తీసుకువెళ్లి, తుపాకీతో బెదిరించి డాలర్లు తీసుకుని పరారయ్యాడు. దీనిపై కేసు నమోదు చేసుకున్న గచ్చిబౌలి పోలీసులు ఆ ఏడాది ఆగస్టు 10న సులేమాన్‌ను అరెస్టు చేసి తుపాకీ, తూటాలు, డాలర్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో బెయిల్ పొందిన తర్వాత అతడు గోవాకే వెళ్లిపోయాడు.



2018లో సులేమాన్ నుంచి సైబరాబాద్ పోలీసులు స్వాధీనం చేసుకున్న తుపాకీ, తూటాలు, కరెన్సీ

పోలీసులు కౌన్సెలింగ్‌కు పిలిచారని..

● ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య


శ్రీకాంత్ (ఫైల్)

బౌద్ధనగర్: పోలీసులు కౌన్సెలింగ్‌కు పిలవడంతో ఆందోళనకు గురైన ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అడ్మిన్ ఎస్సై సుధాకర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాంనగర్ రామాలయం ప్రాంతానికి చెందిన మచ్చ శ్రీకాంత్ (32) ముషీరాబాద్ జీహెచ్‌ఎంసీ సర్కిల్‌లో కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికుడిగా పని చేస్తున్నాడు. అతడి భార్య శృతి క్యాటరింగ్‌లో పని చేస్తుంది. గత కొన్నాళ్లుగా మద్యానికి బానిసైన శ్రీకాంత్ తరచూ భార్యతో గొడవ పడుతున్నాడు. ఈ నెల 13న ఆమె మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో 16న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని పోలీసులు శ్రీకాంత్‌కు సమాచారం అందించారు. దీంతో భయాందోళనకు గురైన శ్రీకాంత్ ఆదివారం చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిని గుర్తించిన అతడి తండ్రి స్థానికుల సహాయంతో కిందకు దించి 108కు సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది అతడిని పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పైప్‌లైన్ మరమ్మతు పనులు పూర్తి

● పనులను పరిశీలించిన జలమండలి ఎండీ ● నీటి సరఫరా పునరుద్ధరణ..


పనులను పరిశీలిస్తున్న జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, టెక్నికల్ డైరెక్టర్ సుదర్శన్.

సాక్షి,సిటీబ్యూరో: నగరంలోని రెడ్ హిల్స్ వద్ద ధ్వంసమైన 825 ఎంఎం డయా పీఎస్‌సీ గ్రావిటీ మెయిన్ పైప్‌లైన్ మరమ్మతు పనులను జలమండలి యుద్ధ ప్రాతిపదికన ఆదివారం సాయంత్రం పూర్తి చేసింది. అనంతరం నీటి సరఫరాను పునరుద్ధరించారు. దీంతో.. రెడ్ హిల్స్ రిజర్వాయర్ పరిధిలోని అన్ని ప్రాంతాలకు నీటి సరఫరా యథావిధిగా ప్రారంభించారు. అంతకు ముందు జలమండలి ఎండీ అశోక్ రెడ్డి పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పనులను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా తొలగించిన పైపులను అక్కడినుంచి తరలించాలని సూచించారు. జలమండలి చేపట్టే మరమ్మతులు, పైపులైన్ విస్తరణ పనులు పూర్తయిన వెంటనే రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని ఆదేశించారు. కొత్తగా నిర్మించిన పైప్‌లైన్‌ను బలోపేతం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. నీటి సరఫరా, మురుగునీటి నెట్‌వర్క్ కోసం పైప్‌లైన్‌ల వివరాలను జీఐఎస్‌లో నమోదు చేయాలని ప్రాజెక్టు అధికారులను ఆదేశించారు. ఈ ఘటనలో వేగంగా స్పందించి.. సకాలంలో మరమ్మతు పనులు చేపట్టి నీటి సరఫరా పునరుద్ధరించిన అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. ఎండీ వెంట టెక్నికల్ డైరెక్టర్ సుదర్శన్, డీజీఎం సరిత తదితరులు ఉన్నారు.

గొప్ప సంగీత విద్వాంసుడు ఎల్లా వెంకటేశ్వరరావు


ఎల్లా వెంకటేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

గన్‌ఫౌండ్రీ: మృదంగ వాయిద్యానికి అంతర్జాతీయ ఖ్యాతిని తీసుకువచ్చిన గొప్ప సంగీత విద్వాంసుడు ఎల్లా వెంకటేశ్వరరావు అని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ ఎల్లా వెంకటేశ్వర్‌రావు సంగీత రంగంలో 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన శిష్యబృందం ఆధ్వర్యంలో జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ సాధారణంగా శాస్త్రీయ సంగీత కచేరీలో మృదంగం పక్క వాయిద్యంగానే ఉంటుందని అలాంటి వాయిద్యం కేంద్రం సంగీత కచేరీలో తన ప్రత్యేకతను చాటుకున్నారని కొనియాడారు. అంతకు ముందు ఎల్లా డాక్యుమెంటరీ ప్రదర్శన, సంగీత కచేరి ఆహుతులను ఆకట్టుకుంది. అనంతరం ఎల్లా వెంకటేశ్వరరావు దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ అన్నవరపు రామస్వామి, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎల్‌వీ.సుబ్రమణ్యం, ప్రొఫెసర్ జీవీ.ఆర్.శాస్త్రీ, వేద కవి జొన్నవిత్తుల రామలింగేశ్వర్ రావు, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏలికల సేవలో పురపాలికలు

● బంధుగణానికి అప్పనంగా ప్రజాధనం
● కన్వెన్షన్లు, ఫంక్షన్‌హాళ్లు, అపార్ట్‌మెంట్ల వద్దే అభివృద్ధి పనులు
● సామాన్యుల సమస్యలను పట్టించుకోని వైనం
● పెద్ద అంబర్‌పేట్, అత్తాపూర్, బండ్లగూడజాగీర్, శంషాబాద్, తుర్కయంజాల్, బడంగ్‌పేట్ మున్సిపాలిటీల తీరుపై విమర్శలు


కుంట్లూరు పెద్ద చెరువు నుంచి ఓ కన్వెన్షన్ కోసం పెద్ద అంబర్‌పేట మున్సిపల్ నిధులతో వేస్తున్న రోడ్డు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని కుంటూర్లుకు చెందిన ఓ ప్రజాప్రతినిధి తన కుటుంబ సభ్యులు, బంధువుల పట్టా భూములకు రహదారి కోసం ఏకంగా రూ.20 లక్షల మున్సిపాలిటీ నిధులకు కౌన్సిల్ తీర్మానం చేయించారు. ఏడాది తర్వాత పనులు ప్రారంభించారు. అది కూడా ఎఫ్‌టీఎల్, ప్రభుత్వ భూమి నుంచి రోడ్డు వేసేందుకు కావడం విశేషం. ఇదే మున్సిపాలిటీకి చెందిన మరో ప్రజాప్రతినిధి ఏకంగా తన వార్డుకు మంజూరైన నిధులను పక్క వార్డులోని బంధువుల కన్వెన్షన్‌కు మళ్లించారు. రూ.30 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు వేసుకున్నారు. అత్తాపూర్ డివిజన్ తేజస్వీనగర్ కాలనీలో ఓ మంత్రి కుమారుడు బహుళ అంతస్తుల భవనం నిర్మిస్తున్నాడు. నిర్మాణ దశలో ఉన్న భవనానికి పోలీసుల పహారాలో జీహెచ్‌ఎంసీ అధికారులు బీటీ రోడ్డు వేయడం వివాదాస్పదమైంది'. సామాన్యుల సమస్యలు పరిష్కరించాల్సిన మున్సిపాలిటీలు/కార్పొరేషన్లు 'పెద్ద'లు, బడా రియల్టర్ల సేవలో తరిస్తున్నాయి. చేపట్టే అభివృద్ధి పనులు, అంచనాలు, టెండర్ల ఖరారు వంటి అంశాలకు కౌన్సిల్ తీర్మానం చేయాల్సి ఉంది. కొంతమంది ప్రజాప్రతినిధులు తమకున్న రాజకీయ పలుకుబడిని అడ్డం పెట్టుకుని అడ్డగోలు పనులకు వినియోగిస్తున్నారు.

కన్వెన్షన్లు, అపార్ట్‌మెంట్ల కోసం..

జిల్లాలో 13 మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్లు ఉన్నాయి. శివారులోని మరికొన్ని ప్రాంతాలు రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, ఎల్బీనగర్ సర్కిళ్ల పరిధిలో ఉన్నాయి. ఇక్కడ అనేక కొత్త కాలనీలు వెలుస్తున్నాయి. వ్యక్తిగత నివాసాలతో పాటు బహుళ అంతస్తుల భవనాలు, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు వెలుస్తున్నాయి. ప్రజలు తమ ఆస్తుల రిజిస్ట్రేషన్లు సహా ఎల్ఆర్ఎస్, బిల్డింగ్ పర్మిషన్ల పేరుతో ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో చార్జీలు చెల్లిస్తున్నారు. పన్నులు, ఇతర చార్జీల రూపంలో వచ్చిన మొత్తాన్ని ఆయా ప్రాంతాల అభివృద్ధి కోసం ఖర్చు చేయాల్సి ఉంది. కానీ పలు మున్సిపాలిటీలు ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి. ప్రజల నుంచి వచ్చిన నిధులను 'పెద్ద'ల నిర్మాణాల వైపు మళ్లిస్తున్నాయి. నిర్మాణం పూర్తి కాకముందే రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాయి. సామాన్యులు, పేదలు నివసించే బస్తీలు, కాలనీల్లో ఇప్పటికీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, పార్కులు, వీధి లైట్లు వంటి కనీస మౌలిక సదుపాయాలు లేవు. తమ కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాల్సిందిగా కోరుతూ కాలనీ సంక్షేమ సంఘాలు పదేపదే విజ్ఞప్తులు చేస్తున్నా పట్టించుకోకుండా కన్వెన్షన్లు, ఫంక్షన్‌హాళ్లు, అపార్ట్‌మెంట్ల కోసం నిధులు మళ్లిస్తున్నారు. ఎప్పటికప్పుడు ఆయా కాలనీల్లో పర్యటించి, స్థానికుల సమస్యలను గుర్తించి, కౌన్సిల్ చర్చించి అభివృద్ధి పనులు చేపట్టాల్సిన ప్రజాప్రతినిధులు ఇందుకు విరుద్ధంగా బంధువులు, బడా రియల్టర్ల సేవల్లో తరిస్తున్నారు. అదేమంటే నిధుల లేమి సాకుతో తప్పించుకు తిరుగుతున్నారు. అక్రమాలను అడ్డుకోవాల్సిన అధికారులు కూడా వారిచ్చే తాయిలాలకు ఆశపడి మౌనంగా ఉండిపోతున్నారు. పెద్ద అంబర్‌పేట్, తుర్కయంజాల్, అత్తాపూర్ డివిజన్, బండ్లగూడ జాగీర్, మీర్‌పేట్, బడంగ్‌పేట్, తుక్కుగూడ మున్సిపాలిటీల్లో ఈ తంతు ఎక్కువగా జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఇదో పెద్ద దందా..

అపార్ట్‌మెంట్, వెంచర్‌కు సొంతంగా రోడ్డు, డ్రైనేజీ, తాగునీరు వంటి పనులు చేపట్టాలంటే రూ.కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. అదే కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, కమిషనర్లు, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులకు డబ్బులు ఆశ చూపి కౌన్సిల్‌లో తీర్మానం చేయిస్తే సరిపోతుందని భావిస్తున్నారు. మాట వినని అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు తెచ్చి మరో చోటికి బదిలీ చేయిస్తున్నారు. తుర్కయంజాల్‌లోని ఓ ఇల్లీగల్ లేఅవుట్‌లో వెలిసిన అపార్ట్‌మెంట్‌కు రోడ్డు, డ్రైనేజీ వేశారు. రూ.30 లక్షల అంచనాతో శ్మశానవాటిక నుంచి ఓ ప్రైవేటు వెంచర్‌కు రోడ్డును ప్రతిపాదించారు. సాంకేతికంగా సమస్యలు రాకుండా ముందే కౌన్సిల్‌లో తీర్మానం చేయించారు. అన్ని మున్సిపాలిటీల్లోనూ ఇదే దందా నడుస్తోంది. అడ్డుకట్ట వేయాల్సిన ఉన్నతాధికారులు చేతులెత్తేస్తున్నారు. స్థానికుల నుంచి తిరుగుబాటు వస్తే తప్ప పరిస్థితిలో మార్పు రాదు.

– ఓరుగంటి యాదయ్య, సీపీఐ నేత

21న కృతజ్ఞతా సభను విజయవంతం చేయండి


2కే వాక్‌ను ప్రారంభిస్తున్న దయాకర్

● టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో నిరుద్యోగులకు 54 వేల ఉద్యోగాలు కల్పించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ ఈ నెల 21న ఓయూలో నిర్వహించ తలపెట్టిన కృతజ్ఞతా సభను విజయవంతం చేయాలని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఓయూ క్యాంపస్‌లోని క్రీడా మైదానంలో నిర్వహించిన 2కే వాక్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన వాక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్య వ్యవస్థను నిర్లక్ష్యం చేసిందని, ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే విద్యారంగ సమస్యలపై దృష్టి సారించిందన్నారు. గురుకుల విద్యార్థులు మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలను పెంచిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దక్కుతుందన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులకు, రైతులకు పెద్దపీట వేసిన కాంగ్రెస్ ప్రజా పాలనకు కృతజ్ఞతగా నిర్వహిస్తున్న సభకు విద్యార్థులు వేలాదిగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఓయూ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు మెడ శ్రీను, క్రాంతికుమార్, సతీష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

తండ్రి మందలించాడని..

● యాసిడ్ తాగి యువకుడి బలవన్మరణం


సాయికృష్ణ (ఫైల్)

జవహర్‌నగర్: తండ్రి మందలించడంతో మనస్తాపానికి లోనైన ఓ యువకుడు యాసిడ్ తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కాప్రా జమ్మిగడ్డ, బీజేఆర్‌నగర్‌కు చెందిన వెంకటేష్‌కు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఈ నెల 14న కుమారులు ముగ్గురూ గొడవ పడుతుండటంతో వెంకటేష్ వారిని వారించాడు. పెద్ద కుమారుడు సాయికృష్ణ (18)ను ఏదైనా పని చేసుకోవాలని చెప్పి మందలించాడు. దీంతో మనస్తాపానికి లోనైన సాయికృష్ణ అదే రోజు రాత్రి యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ ఎమ్మెల్యే ఇంట్లో చోరీ

ఫిలింనగర్: కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఇంట్లో భారీగా నగదు చోరీకి గురైన సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు ఆయన ఫిలింనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఘటనా స్థలంలో ఆధారాలు సేకరించారు. సంఘటనా స్థలంలో సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. వివరాల్లోకి వెళితే..మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ శనివారం రాత్రి రూ.7.50 లక్షల నగదును బెడ్ రూమ్‌లోని తన టేబుల్‌పై ఉంచాడు. ఉదయం నిద్ర లేచిన తర్వాత చూడగా నగదు కనిపించలేదు. దీంతో ఆయన ఇంట్లో ఆరా తీయగా ఫలితం కనిపించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ఇంట్లో పని మనుషులపై అనుమానం వ్యక్తం చేయడంతో పని మనుషులతో పాటు కుటుంబ సభ్యులను కూడా విచారించారు. ఆ రోజు ఇంటికి ఎవరెవరు వచ్చారు. వారి వివరాలను కూడా నమోదు చేసుకున్నారు ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగుజాతి గర్వించే వ్యక్తులు బాపు-రమణ


సినీ రచయిత ఆకెళ్ల వెంకట సూర్యనారాయణకు పురస్కారాన్ని అందజేస్తున్న కేవీ. రమణాచారి

బంజారాహిల్స్: తెలుగు జాతి గర్వించదగ్గ వ్యక్తులు బాపూ-రమణలు అని మాజీ ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి అన్నారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో బాపు-రమణ అకాడమీ ఆధ్వర్యంలో బాపు రమణ-2024 పురస్కార ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేవీ. రమణాచారి మాట్లాడుతూ ఒకరు చిత్రకారుడిగా, ఒకరు రచయితగా ఉన్నప్పటికీ భిన్నత్వంలో ఏకత్వంలా వారిద్దరూ నిలిచారని కొనియాడారు. ఈ సందర్భంగా బాపూ-రమణ జీవితకాల సాఫల్య పురస్కారాన్ని ప్రముఖ సినీ రచయిత ఆకెళ్ల వెంకట సూర్యనారాయణకు అందజేశారు. కార్టూనిస్ట్ సురేంద్రకు బాపు పురస్కారం, రచయిత భువనచంద్రకు రమణ పురస్కారాన్ని అందజేశారు. అనంతరం కార్టూనిస్ట్ గాంధీ రూపొందించిన 'మనోహరాలు-గాంధీ కార్టూన్లు' సంకలనాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల, సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్, నటుడు ఉత్తేజ్ తదితరులు పాల్గొన్నారు.

నెక్స్‌ట్ జెన్ కారు సర్వీసింగ్ సెంటర్‌లో అగ్ని ప్రమాదం


ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు.

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ హైదర్‌గూడలోని నెక్స్‌ట్ జెన్ కారు సర్వీసింగ్ సెంటర్‌లో ఆదివారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఒక కారు పూర్తిగా దగ్ధం కాగా మరో నాలుగు కార్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అఫ్రోజ్, రవి అనే వ్యక్తులు గత కొంత కాలంగా హైదర్‌గూడలో నెక్స్‌ట్ జెన్ కారు సర్వీసింగ్ సెంటర్ నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి సిబ్బంది సర్వీసింగ్ సెంటర్‌కు తాళం వేసి వెళ్లిపోయారు. ఆదివారం సెలవు దినం కావడంతో ఎవరూ రాలేదు. ఆదివారం మధ్యాహ్నం సర్వీసింగ్ సెంటర్ నుంచి పొగలు వస్తుండటాన్ని గుర్తించిన స్థానికులు అప్రమత్తమై పోలీసులు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. అత్తాపూర్ ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో ఒక కారు పూర్తిగా కాలిపోయిగా, మరో నాలుగు కార్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు.

మెరిసిన కంగనా..!

సాక్షి, సిటీబ్యూరో: బాలీవుడ్ ఫైర్ బ్రాండ్ కంగనా రనౌత్ నగరంలో తళుక్కుమన్నారు. ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో జరిగిన యంగ్ ఇండియా హైదరాబాద్ తొలి వార్షికోత్సవానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన టాక్‌షోలో పాల్గొని రాజకీయాలు, సినిమాలు, మహిళా సాధికారతపై తన అభిప్రాయాలను యువతీ యువకులతో పంచుకున్నారు. తన స్ఫూర్తిమంతమైన మాటలతో యువతలో ఉత్తేజాన్ని నింపారు.





ప్రేమ పేరుతో వేధింపులు

నిందితుడి అరెస్ట్


నిందితుడు సతీష్

నాగోలు: ప్రేమ పేరుతో ఓ బాలికను వెంటపడి వేధిస్తున్న యువకుడిని ఎల్బీనగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎల్బీనగర్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, పోలేపల్లికి చెందిన యలమల్ల సతీష్ మన్సూరాబాద్‌లో నివాసం ఉంటున్న తన అక్క, బావ ఇంట్లో ఉంటున్నాడు. అతను అదే కాలనీకి చెందిన బాలిక(13)ను ప్రేమ పేరుతో వెంటపడి వేధిస్తున్నాడు. బాలిక తల్లిదండ్రులకు ఫోన్ చేసి వేధించడమేగాక, రాత్రి వేళల్లో వారి ఇంటికి వెళ్లి గట్టిగా అరుస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు ఎల్బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కేసు నమోదైన విషయం తెలుసుకున్న సతీష్ దుబాయ్‌లో ఉంటున్న బంధువుల వద్దకు పారిపోయాడు. ఇటీవల అతను నగరానికి తిరిగి వచ్చినట్లు తెలియడంతో ఎల్బీనగర్ పోలీసులు ఆదివారం అతడిని అరెస్టు చేసి రిమాండ్ తరలించారు.

హైడ్రా కూల్చేసిన స్థలంలో
రోడ్డు పనులు ప్రారంభం


ఫిలింనగర్‌లో హైడ్రా కూల్చివేసిన ప్రాంతంలో మొదలైన పనులు

ఫిలింనగర్: ఫిలింనగర్ రోడ్డునెంబర్–9లో ఇటీవల ఫిలింనగర్ మహిళా సమాజం పేరుతో నిర్వహించిన కట్టడాన్ని అక్రమమని తేలుస్తూ హైడ్రా కూల్చివేసింది. లేఅవుట్‌లో 290 గజాల ఈ ప్లాట్ రోడ్డులో ఉందని, ఇది అక్రమ నిర్మాణమని నేలమట్టం చేశారు. దీంతో ఇక్కడ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. అయితే ఇప్పటికే ఫిలింనగర్ రోడ్డునెంబర్–1లో విశాలమైన రోడ్డు ఉంది. ఇప్పుడు కూల్చివేసిన ప్రాంతంలో రోడ్డు నిర్మాణం అవసరమా? అని స్థానికులు నిలదీస్తున్నారు. 290 గజాల విస్తీర్ణంలో ఉన్న ఈ స్థలంలో తపాలాశాఖ భవన నిర్మాణం చేపడతామని సొసైటీ వెల్లడించింది. అయితే హైడ్రా అధికారులు దీనికి ఒప్పుకోలేదు. కనీసం పార్కుగానైనా తామే డబ్బులు వెచ్చించి అద్భుతంగా రూపొందిస్తామని సొసైటీ చెప్పినా అధికారులు వినిపించుకోవడం లేదు. ఇక్కడి రోడ్డు ఏమాత్రం అవసరం లేకపోగా ఈ స్థలాన్ని ప్రజా ప్రయోజనాల కోసం నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. కమ్యూనిటీ హాల్, పార్కు, తపాలా శాఖ కార్యాలయం నిర్మించే అవకాశం ఉన్నా సంబంధిత అధికారులు మాత్రం రోడ్డుపై దృష్టిపెట్టడం కాలనీవాసులు తీవ్ర ఆగ్రహానికి గురిచేస్తోంది. చక్కటి ఫౌంటెన్ ఏర్పాటు చేసి రంగురంగుల మొక్కలతో పార్కుగా తీర్చిదిద్దుతామని, ఎంతో మందికి ఆహ్లాదం కలిగించే రీతిలో రూపుదిద్దుతామని సొసైటీ సూచిస్తున్నా అధికారులు పెడచెవిన పెడుతున్నారు. హైడ్రా అధికారులకు ఈ స్థలంపై ఇంత ప్రత్యేక శ్రద్ధ ఏమిటో అంతుబట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

రాజీయే... రాజమార్గం!
లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించిన వెస్ట్‌జోన్ ఠాణాలు

- ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐల ప్రత్యేక దృష్టి
- 155 కేసులను పరిష్కరించి టాప్–1లో నిలిచిన పంజగుట్ట ఠాణా
- హర్షం వ్యక్తం చేసిన బాధితులు



బంజారాహిల్స్: హైదరాబాద్ జిల్లా పరిధిలోని అత్యధిక కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించిన ఠాణాలుగా వెస్ట్‌జోన్ పరిధిలోని పోలీస్‌స్టేషన్లు నిలిచాయి. సత్వర న్యాయం అందించేందుకు శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో వెస్ట్‌జోన్ పరిధిలోని ఠాణాలు కేసుల పరిష్కారంలో మొదటి స్థానంలో నిలిచాయి. సోదరభావం ఏర్పడడం, విలువైన కాలాన్ని కాపాడుకోవడం, కేసుల సత్వర పరిష్కారం లభించడంతో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరమయ్యాయి. కేసుల సత్వర పరిష్కారానికి గత మూడు వారాల నుంచి ఆయా పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు ప్రత్యేక శ్రద్ధ చూపించారు. వెస్ట్‌జోన్ డీసీపీ సైతం లోక్ అదాలత్‌పై ప్రత్యేక దృష్టిసారించారు. క్షణికావేశం, పాత కక్షలతో గొడవ పడి కేసులు పెట్టుకున్న వారు కోర్టుల చుట్టూ నానా ఇబ్బందులు పడేవారు. కేసులు ఏళ్ల కొద్దీ పరిష్కారం కాకపోవడంతో ఆర్థికంగానూ చితికిపోయారు. అలాంటి వారికి న్యాయస్థానాలు లోక్ అదాలత్ రూపంలో సువర్ణ అవకాశాన్ని కల్పించాయి. రాజీయే రాజమార్గం అంటూ కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేసి కక్షిదారులకు రాజీ కుదుర్చుకునే మార్గాన్ని చూపాయి. దీంతో చాలామంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఆయా ఠాణాల సీఐలు, ఎస్‌ఐలు, చూపిన శ్రద్ధతో ఈసారి లోక్ అదాలత్‌లో చాలావరకు కేసులు పరిష్కారమయ్యాయి. చాలామంది బాధితులు తమ సమస్యను పరిష్కరించుకునేందుకు ఆసక్తి చూపారు.

టాప్–1లో పంజగుట్ట..

జాతీయ లోక్ అదాలత్‌లో హైదరాబాద్ జిల్లాలోనే పంజగుట్ట ఠాణా అత్యధిక కేసులు పరిష్కరించి మొదటి స్థానంలో నిలిచింది. ఈ పోలీస్‌స్టేషన్ పరిధిలో 155 కేసులను రాజీమార్గం ద్వారా ఇరుపక్షాలు హర్షం వ్యక్తం చేసే రీతిలో పరిష్కరించారు. రెండో స్థానంలో 152 కేసులు పరిష్కరించి బంజారాహిల్స్ ఠాణా నిలిచింది. మూడో స్థానంలో 132 కేసులు పరిష్కరించి జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ నిలిచింది. ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 108, మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 84, ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 83, బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో 83, మాసబ్‌ట్యాంక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 27 కేసులు పరిష్కారమయ్యాయి. మొత్తంగా వెస్ట్‌జోన్ 8 పోలీస్‌స్టేషన్ల పరిధిలో 824 కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కారానికి నోచుకున్నాయి. నగర పోలీసు కమిషనరేట్ పరిధిలో కేసుల పరిష్కారంలో టాప్–3లో వెస్ట్‌జోన్ పరిధిలోని పంజగుట్ట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ వరుసగా నిలిచాయి. మధురానగర్, ఫిలింనగర్, బోరబండ, ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో కూడా సంతృప్తికరమైన రీతిలో కేసులు రాజీ కుదుర్చుకున్నారు.

బీఎస్పీ సమీక్ష సమావేశం



వెంకటేశ్వరకాలనీ: బహుజన సమాజ్ పార్టీ జన కళ్యాణ్ దివస్ (జేకేడీ) సమీక్ష సమావేశం సోమాజీగూడలో నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరామకృష్ణ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. సికింద్రాబాద్ జిల్లా ఇన్‌చార్జి దొరపల్లి రమేష్, బండారు శ్రీనివాసరావు, కుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ అసెంబ్లీకి కొత్త కమిటీని ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా రాజు ముదిరాజ్, జనరల్ సెక్రటరీగా చేమల శ్రీనివాస్, సెక్రటరీగా ప్రవీణ్‌కుమార్ తదితరులను నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనకళ్యాణ్ దివస్ బీఎస్పీ ఏడాదికోసారి ప్రజల నుంచి విరాళాలను సేకరిస్తుందన్నారు. అయితే ఇతర పార్టీలు లాగా బడా వ్యాపారస్తుల నుంచి విరాళాలు తీసుకోదని, దేశంలో ఈ ఒక్క పార్టీ మాత్రమే వ్యాపారవేత్తల నుంచి విరాళాలను వసూలు చేయదన్నారు.

పబ్బుల్లో అధికారుల తనిఖీలు
అపరిశుభ్రతతోపాటు కాలంచెల్లిన వస్తువుల గుర్తింపు


కాలం చెల్లిన ఉత్పత్తులు..

జూబ్లీహిల్స్: రోడ్డునెంబర్–45లోని హార్ట్‌కప్ కాఫీ రెస్టారెంట్ అండ్ బార్, పబ్‌లో ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో కిచెన్‌లో బొద్దింకలతోపాటు పరిశుభ్రత వాతావరణం ఉన్నట్లు గుర్తించారు. రిఫ్రిజిరేటర్‌లో భద్రపరిచిన చికెన్, మటన్‌లు కాలం చెల్లినదిగా తేల్చారు. కాలం చెల్లిన టమాటా పేస్ట్, వనస్పతి ఇతర మసాలాలు కూడా పెద్ద ఎత్తున గుర్తించారు. అదే విధంగా జూబ్లీహిల్స్‌లోని డైలీ రిచ్‌వల్స్ పబ్‌లో కూడా ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు నిర్వహించగా కిచెన్‌లో బొద్దింకలు, కాలం చెల్లిన ఉత్పత్తులు ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఈ రెండు పబ్‌లకు నోటీసులు జారీ చేశారు.

అక్రమ పార్కింగ్‌తో ఇబ్బందులు
అసహనం వ్యక్తం చేస్తున్న వాకర్లు

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు సెకండ్ గేటు ఎదురుగా జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 యూబీడీకి చెందిన టిప్పర్ అక్రమ పార్కింగ్ చేయడంతో పార్కుకు వచ్చే వాకర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరిగ్గా గేటు ఎదురుగానే ప్రతిరోజూ రేయింబవళ్లు ఈ వాహనం పార్కింగ్ చేయడంతో పార్కుకు కార్లలో వచ్చే వాకర్లు తమ వాహనాలను ఎక్కడ పార్కింగ్ చేసుకోవాలో తెలియక సతమతమవుతున్నారు. విషయంపై సంబంధిత అధికారిని ప్రశ్నించగా సరైన సమాధానం ఇవ్వకుండా నిర్లక్ష్యం చూపుతున్నారని వాకర్లు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఈ వాహనాన్ని ఇక్కడి నుంచి తొలగించాలని, వాకర్ల కార్ల పార్కింగ్‌కు మార్గం సుగమం చేయాలని కోరుతున్నారు. లేదంటే ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేసి ఈ వాహనాన్ని ఇక్కడి నుంచి తరలించేందుకు కూడా ప్రయత్నిస్తున్నట్లు వాకర్లు తెలిపారు.


కేబీఆర్ పార్కు సెకండ్ గేటు ఎదురుగా ఉన్న టిప్పర్

బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి

లిబర్టీ: కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఆగమేఘాల మీద జమిలీ ఎన్నికల బిల్లు ప్రవేశపెడుతున్న క్రమంలో బీసీ బిల్లు ఎందుకు ప్రవేశపెట్టరని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుంద్ర కుమారస్వామి ప్రశ్నించారు. రాజకీయ ప్రయోజనాల కోసం జమిలి ఎన్నికల మీద ఉన్న శ్రద్ధ బీసీ బిల్లుపై ఎందుకు లేదని నిలదీశారు. ఆదివారం దళ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు నాలుగు సంవత్సరాల సమయం ఉందని ఇప్పటికిప్పుడే బిల్లు ఎవరికి కోసం తెచ్చారన్నారు. బీసీలకు రిజర్వేషన్ కల్పించే బిల్లును కూడా శీతాకాల పార్లమెంటు సమావేశంలో ప్రవేశపెట్టి బాగుండేదని కుమారస్వామి అన్నారు. పదేళ్లుగా కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తుందని విమర్శించారు. బీసీ బిల్లును కూడా ప్రవేశపెట్టి చట్టభద్రత కల్పించకపోతే రానున్న రోజుల్లో బీసీల ప్రతిఘటన తప్పదని కుమారస్వామి హెచ్చరించారు.

ముదిరాజ్‌లను ఆదుకోవాలి

లిబర్టీ: సంప్రదాయ కులవృత్తులు క్రమంగా కనుమరుగవుతున్నాయని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కులవృత్తులను కాపాడాలని తెలంగాణ ముదిరాజ్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టి యాదగిరి ముదిరాజ్ విజ్ఞప్తి చేశారు. ముదిరాజ్‌లకు ప్రభుత్వం చేయూతనిచ్చేందుకు ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆయన విన్నవించారు. ఆదివారం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 500 కోట్లతో కార్పొరేషన్ ఏర్పాటు చేసి ముదిరాజులకు ఆర్థికంగా చేయూతనివ్వాలని కోరారు. దీనికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల్లో ముదిరాజ్‌లకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. బీసీ జనాభాలో అత్యధికంగా ముదిరాజ్‌లే ఉన్నారని, కానీ వారి బతుకులు మాత్రం దయనీయంగా మారాయని ఇప్పటికైనా ముదిరాజ్‌ల అభివృద్ధి కోసం పాటుపడాలని కోరారు.

ఆహార మార్పులతో ఆరోగ్యకర జీవనం


సదస్సులో వైద్యులు, పోషకాహార నిపుణులు

సాక్షి, సిటీబ్యూరో: ఆహార మార్పులతో ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమవుతుందని పలువురు పోషకాహార నిపుణులు పేర్కొన్నారు. మంచి ఆహారం ద్వారా మనిషి మనుగడ బావుంటుందన్నారు. పోషకాహార ప్రాధాన్యం, వృక్షాధార డైట్ ద్వారా నాన్–కమ్యూనికబుల్ డిసీజెస్ (ఎన్‌సిడిలు)నిర్వహణపై..ఫిజీషియన్స్ అసోసియేషన్ ఫర్ న్యూట్రిషన్ (పిఎఎన్) ఇండియా ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని హయత్‌ప్లేస్‌లో సదస్సు జరిగింది. 29వ ఇన్–పర్సన్ కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్ (సిఎమ్‌ఇ) పేరిట జరిగిన ఈ సదస్సు వైద్య నిపుణులు, పోషకాహార నిపుణులను ఒక వేదికపైకి తెచ్చింది. ఈ సదస్సులో మెడికల్ డైరెక్టర్ డాక్టర్ హేమలత, డా.రజీన షహీన్, డా. ప్రత్యూష నేరెళ్ల ఆధునిక పరిశోధనల ఫలితాలు సమర్పించారు. డాక్టర్ రాజేందర్ రామగిరి ఆధ్వర్యంలో డయాబెటిస్ రిమిషన్‌పై కేస్ ప్రజెంటేషన్ చేస్తూ జీవన శైలి మార్పులతో వచ్చిన అద్భుత ఫలితాలను వివరించారు. ఐడి, శోగ్రెన్ సిండ్రోమ్ నుంచి రిమిషన్ సాధించిన ముగ్గురు రోగుల కేస్ స్టడీ, పోషకాహారం ద్వారా సాధించిన ఫలితాలను తెలిపారు. వైద్య రంగంలో పోషకాహారం సమగ్రతపై డాక్టర్ సుందీప్ లక్టాకియా మాట్లాడారు.

‘ప్రభుత్వం మారినా మారని
కళాకారుల జీవితాలు’

కాచిగూడ: తెలంగాణలో ప్రభుత్వం మాత్రమే మారిందని, కళాకారుల జీవితాలు ఏమాత్రం మాత్రం మారలేదని డెక్కన్ థియేటర్ స్కాలర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఖాజాపాషా అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే కళాకారుల జీవితాల్లో మార్పు వస్తుందని ఆశించి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటానికి కళాకారులు ఎంతగానో కృషి చేశారని ఆయన పేర్కొన్నారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వంజరి ప్రణయ్ రాజ్, జి.రామారావుతో కలిసి ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన విజయోత్సవ వేడుకలను గ్రామాల్లో విస్తృత స్థాయిలో ప్రచారం చేపట్టడానికి ప్రభుత్వం రూ.1కోటి నిధులు విడుదల చేస్తూ తెలంగాణ సంగీత, నాటక అకాడమీకి బాధ్యతలను అప్పగించడం జరిగిందన్నారు. సంగీత నాటక అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ పుంజాల అలేఖ్య కేవలం తమ అనుచరులైన 40 మంది కళాకారులను తీసుకుని వారికి నాలుగు రోజులు శిక్షణ ఇప్పించి వారిచేతనే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారాన్ని నిర్వహించిందని ఆరోపించారు. కళాకారులను విస్మరించిన పుంజాల అలేఖ్య విషయంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వివరించనున్నట్లు వారు తెలిపారు. మున్ముందు జరిగే ప్రభుత్వ కార్యక్రమాల్లోనైనా అందరికి అవకాశం కల్పించే విధంగా చూడాలని వారు కోరారు.

రెండు వాహనాలు బోల్తా


పల్టీ కొట్టిన వాహనం

రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్ బాపూజీనగర్ సబ్‌స్టేషన్ వద్ద మూలమలుపు వద్ద గంటన్నర వ్యవధిలో రెండు వాహనాలు పల్టీకొట్టాయి. ఈ ఘటనలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఎస్పీఆర్‌హిల్స్ బాపూజీనగర్ సబ్‌స్టేషన్ మూల మలుపు వద్ద తరచూ వాహనాలు పడిపోవడం పరిపాటిగా మారింది. ఈక్రమంలో ఆదివారం ఉదయం 10 గంటల ప్రాంతంలో ఇటుక లోడుతో ఎస్పీఆర్‌హిల్స్ వైపు వస్తున్న మినీ టిప్పర్ వాహనం ఈ ప్రాంతంలో పల్టీ కొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్ నాయక్‌కు గాయాలు కాగా, మళ్లీ గంటన్నర సమయంలో ఇదే చోట మరో వాహనం టాటాఏసీ బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికి పెద్దగా గాయాలు కాలేదు.

కమాన్‌లేక ప్రమాదాలు...

గతంతో ఈ ప్రాంతంలో ఇనుప కమాన్ ఉండటంతో భారీ వాహనాలు ఈ దారి గుండా నడిచేవి కావు. దళిత స్టడీసెంటర్ ప్రారంభోత్సవానికి సీఎం రాక సందర్భంగా ఈ కమాన్‌ను తొలగించారు. అప్పటి నుంచి భారీలోడు వాహ నాలు ఈ దారిగుండా మళ్లీ రాకపోకలు కొనసాగిస్తుండంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని కాంగ్రెస్ నాయకుడు గ్యార నాగరాజు తెలిపారు. వెంటనే ఇనుప కమాన్‌ను తిరిగి ఏర్పాటు చేసి ప్రమాదాలను అరికట్టాలని కోరుతున్నారు.

నేటి నుంచి ధనుర్మాసోత్సవాలు


వేడుకలకు ముస్తాబైన శ్రీ నగర్ కాలనీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం

బంజారాహిల్స్: ధనుర్మాస ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఖైరతాబాద్ నియోజకవర్గం వ్యాప్తంగా ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయాలు ముస్తాబయ్యాయి. శ్రీనగర్‌కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి వచ్చే నెల 13వ తేదీ వరకు ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించంతో పాటు సాయంత్రం ప్రవచనాలు ఉంటాయని ఆలయ అధికారులు తెలిపారు. ప్రతిరోజూ ఆలయంలో ఆండాల్ అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బంజారాహిల్స్ రోడ్‌నెం. 14లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా ఉదయం ఆరాధన, వసుదేవ పుణ్యహవచనం, ధనుర్మాస వ్రత దీక్షలు, తిరుప్పావై సేవాకాలం, తీర్థ ప్రసాద గోష్టి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు శశికాంతాచార్యులు తెలిపారు.

నేత్రపర్వంగా గజారోహణ మహోత్సవం


ఆలయం వద్ద స్వామివారి గజారోహణ మహోత్సవంలో భక్తులు

వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్‌కాలనీ వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో కొలువుదీరిన శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం వైభవంగా గజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం స్వామివారి ఆభరణాల ఊరేగింపును జూబ్లీహిల్స్ రోడ్ నెం.5 నుంచి శ్రీనగర్ కాలనీ ఆలయం వరకు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయంలో మహాపడిపూజ కార్యక్రమంలో భక్తులు, అయ్యప్ప స్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అదే విధంగా సాయంత్రం రంగురంగుల విద్యుత్ దీపాలు, కేరళ సంప్రదాయ డప్పుచప్పుళ్ల నడుమ స్వామివారిని గజ వాహనంపై శ్రీనగర్ కాలనీ, ఎల్లారెడ్డిగూడ, యూసుఫ్‌గూడ, ఇందిరానగర్ మీదుగా యాత్ర నిర్వహించారు. స్వామివారి గజవాహన సేవలో పెద్ద ఎత్తును భక్తులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలి



కాచిగూడ: పాఠశాల విద్యాభివృద్ధి కోసం గత ఇరవై ఏళ్లుగా పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్షలోని అన్ని విభాగాలలో దాదాపు 19,600 మంది కాంట్రాక్టు ఉద్యోగులు పని చేస్తున్నారని, ఏండ్ల తరబడి వారు చాలీచాలని వేతనంతో జీవితాలు నెట్టుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంట్రాక్టు ఉద్యోగులు ఉండనివ్వమని, అందరినీ రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చి పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏనాడూ వీరి సమస్యలు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఏన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తున్నారని, అదే విధంగా సమగ్ర శిక్ష ఉద్యోగులకు కూడా న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రతి ఉద్యోగికి 10లక్షల రూపాయల జీవిత బీమాతో పాటు ఆరోగ్య బీమా రూ.10 లక్షలు కల్పించాలని, ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు పదవీ విరమణ చేస్తున్న వారికి, చేసిన వారికి బెనిఫిట్స్ కింద రూ.25లక్షలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ విద్యాశాఖ నియామకాల్లో వీరికి వెయిటేజ్ కల్పించాలన్నారు. ప్రభుత్వం పాఠశాల విద్య అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని, సమగ్ర శిక్ష ఉద్యోగులతో వెంటనే చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్లు పరిష్కరిస్తుందన్న నమ్మకం తమకుందన్నారు. ఈ సమావేశంలో బీసీ పొలిటికల్ జేఏసీ సలహాదారుడు పి. బడేసాబ్, గాలిగల్ల సాయిబాబా, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఇంద్రకంటి సరితగౌడ్,నవనీత గౌడ్, శ్రీవాణి, రమ్య, ఫరీన్, గిరిజా భవాని, మధురవాణి, మోహన్ సరస్వతి, షేక్‌పాషా పాల్గొన్నారు.

తప్పుడు పత్రాలతో బ్యాంకుకు టోకరా
ఇద్దరు మహిళలపై కేసు నమోదు

వెంగళరావునగర్: ఉద్యోగస్తులమని నకిలీ డ్యాక్యుమెంట్లు సృష్టించి బ్యాంకుకు టోకరా వేసిన మహిళలపై మధురానగర్ పీఎస్‌లో కేసులు నమోదయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం... కూకట్‌పల్లికి చెందిన శ్రీదేవి తాను సాఫ్ట్‌వేర్ ఉద్యోగినని, ఇల్లు నిర్మించుకునేందుకు రుణం కావాలని స్థానిక వెస్ట్ శ్రీనివాస్‌నగర్‌లోని సౌత్ ఇండియన్ బ్యాంక్ అధికారులు కలిసింది. గణేష్ అనే మధ్యవర్తి ద్వారా అపాయింట్‌మెంట్ లెటర్, జీతానికి చెందిన బిల్లులు బ్యాంకుకు సమర్పించింది. రూ.68 లక్షలు కావాలని దరఖాస్తు చేసుకోగా, అధికారులు రూ.67,88,324 రుణం మంజూరు చేశారు. అదే విధంగా కుల్లా రాజేశ్వరి దుర్గారావు అనే మధ్యవర్తి ద్వారా ఫ్లాట్ కొనుగోలు కోసం రూ.46 లక్షలు కావాలని దరఖాస్తు చేసుకుంది. ఆమెకు రూ. 32,05, 573 రుణాన్ని బ్యాంకు అధికారులు మంజూరు చేశారు. అయితే వీరు రుణాలకు సంబంధించిన ఈఎంఐలు సరిగా చెల్లించడం లేదు. దీంబ్యాంకు అధికారులు విచారణ చేయగా నకిలీ డాక్యుమెంట్స్ సమర్పించారని అని తేలడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెక్లెస్ రోడ్డులో ‘రన్‌ఫర్ గోమాత’



ఖైరతాబాద్: గోమాతను జాతి మాతగా ప్రకటించేందుకు జాగరణ కార్యక్రమంలో భాగంగా 5కే రన్ ఫర్ గోమాత మారథాన్‌ను ఆదివారం నెక్లెస్ రోడ్డులో నిర్వహించారు. శ్రీ దక్షిణేశ్వర్ కేదార్‌నాథ్ ఆలయ ట్రస్ట్, సర్వదళ గోరక్ష మంచ్, దేవభూమి ఉత్తరాఖండ్ సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో గోమాతను జాతీయ మాతగా ప్రకటించాలని అవగాహన కల్పిస్తూ మారథాన్‌ను నిర్వహించారు. మారథాన్‌ను గోభక్తులు రామ భాటి, మోహన్ చౌదరి, మంగళారం పంవార్, సోనారాం తిలాయదా, వికాస్ శర్మలు జెండా ఊపి ప్రారంభించారు. ఉత్సాహంగా సాగిన 5కే రన్‌లో విజేతలకు బహుమతులు అందజేశారు.

నిశ్చితార్థ వేడుకలో సినీ ప్రముఖులు



తెలుగు పరిశ్రమలో పలు ప్రతిష్టాత్మక చిత్రాలకు ఫైనాన్స్ చేసిన ఆర్ – సెక్యూర్డ్ ఫైనాన్స్ అధినేత బంగారు బాబు (ఈవీ రాజారెడ్డి) చిన్న కుమారుడు క్రాంతిరెడ్డి నిశ్చితార్థం ప్రముఖ పారిశ్రామిక వేత్త సీతా రామిరెడ్డి–రామ సీత దంపతుల కుమార్తె శిరీషతో హోటల్ తాజ్ కృష్ణలో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు పలువురు రాజకీయ, సినీ, వ్యాపార, ప్రముఖులు విచ్చేసి, శుభాకాంక్షలు తెలిపారు. పాల్గొన్న ప్రముఖుల్లో నిర్మాతలు కేఎస్ రామారావు, సి.కళ్యాణ్, శ్యాం ప్రసాద్ రెడ్డి, పోకూరి బాబురావు, ఎస్వీ కృష్ణారెడ్డి, కె.అచ్చిరెడ్డి, సునీల్ నారంగ్, రవిశంకర్, ఎర్నేని నవీన్, డీవీవీ దానయ్య, బెల్లంకొండ సురేష్ తదితరులు ఉన్నారు.

– సాక్షి, సిటీబ్యూరో

అమరజీవి పొట్టి శ్రీరాములు

లిబర్టీ: భాషా ప్రాముఖ్యత రాష్ట్రాల ఏర్పాటు కోసం ప్రాణాలను పొట్టి శ్రీరాములు పణంగా పెట్టారని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు కె.బి.శ్రీధర్ అన్నారు. ఆదివారం లిబర్టీ ప్లాజాలోని పార్టీ కార్యాలయంలో వర్ధంతి సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటు కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం చరిత్రలో నిలిచిపోతుందని ఆయన పేర్కొన్నారు. ఎవరు ముందుకు వచ్చి రాష్ట్ర ఏర్పాటుకు పూనుకోలేదని స్వయంగా పొట్టి శ్రీరాములు ముందుకు వచ్చి 53 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి రాష్ట్రాన్ని సాధించారని తెలిపారు. పొట్టి శ్రీరాములు ఆశయ సాధన కోసం ముందుకు సాగాలని కోరారు.

సన్మానం



రహమత్‌నగర్: శబరిమల యాత్రలో బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ అందించిన కిట్లు తమకు ఎంతో ఉపయోగపడ్డాయని అయ్యప్ప భక్తులు తెలిపారు. ఆదివారం బాబా ఫసియుద్దీన్‌ను అయ్యప్ప భక్తులు ఆయన కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా అయ్యప్పభక్తులు బబ్లుగౌడ్, బాలు యాదవ్, ఓంకార్‌లు మాట్లాడుతూ బోరబండ నుంచి నవంబర్ 1వ తేదీన కాలినడకన శబరిమలకు బయల్దేరుతున్న తరుణంలో బాబాఫసియుద్దీన్ కిట్లను అందించారని పేర్కొన్నారు. శబరిమల దర్శనం అనంతరం ఫసియుద్దీన్‌కు కృతజ్ఞతలు తెలిపి స్వామి ప్రసాదాన్ని అందించామన్నారు.

సాక్షి సోమవారం । 16 । డిసెంబర్ । 2024

నగరంలో నేడు

- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని లేబుల్స్ పాప్ అప్ స్పేస్‌లో డి నస్స్ పటోలా ఆర్ట్స్ వస్త్ర ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా వింటర్ ఉత్సవ్ మేళా సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది.
- సికింద్రాబాద్ ఆర్పీ రోడ్డులోని ప్యారడైజ్ ఫుడ్ కోర్టు ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు రాయల్ ఫుడ్ ఫెస్టివల్ ఉంటుంది.
- స్పోర్ట్స్ కామెంటేటర్ సి.వెంకటేష్ రచించిన క్రికెట్ బిట్స్, పీసెస్ పుస్తకావిష్కరణ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సాయంత్రం 6 గంటలకు నిర్వహిస్తారు.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఆలిండియా క్రాఫ్ట్‌మేళా ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 7 గంటలకు ఇండియన్ ఫొటో ఫెస్టివల్ కొనసాగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

ముందుకు సాగని భూక్రమబద్ధీకరణ

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనలో జాప్యం

- సమాచారం ఇచ్చినా రాకపోవడంతో హెల్ప్ డెస్కులు
- నగర శివారుల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల సంఖ్య 3.85 లక్షలు
- పరిశీలన పూర్తయిన దరఖాస్తులు 28 వేలకు పైనే..



నగర శివారు జిల్లాల్లో పురపాలికలు, జీపీల వారీగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు ఇలా..

జిల్లా	పురపాలక సంఘాలు	జీపీలు	మొత్తం దరఖాస్తులు
రంగారెడ్డి	2,35,417	6,330	2,41,747
మేడ్చల్	1,39,030	4,897	1,43,927
మొత్తం	3,74,447	11,227	3,85,674

సాక్షి, సిటీబ్యూరో: నగర శివారుల్లో లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్(ఎల్ఆర్ఎస్) దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం నత్తకు నడక నేర్పుతోంది. దరఖాస్తుదారులు విచారణకు రావాలని పరిశీలన బృందాలు సమాచారం అందించినా నిర్లక్ష్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. రెవెన్యూ, నీటిపారుదలశాఖ, పురపాలక సంఘాల అధికారుల అనుమతి లేకుండా అక్రమ వెంచర్లు, విక్రయించిన ప్లాట్ల క్రమబద్ధీకరణకు వీలుకల్పించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. రూ.వెయ్యి రుసుముతో ప్లాట్లు, రూ.10 వేల రుసుముతో వెంచర్ల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించింది. అయినా.. సిబ్బంది కొరతతో పాటు మరికొన్ని సమస్యలు తోడుకావడంతో.. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియపై గత ప్రభుత్వం పూర్తిస్థాయిలో శ్రద్ధ చూపలేదని తెలుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే భూక్రమబద్ధీకరణపై దృష్టి సారించింది.

అనుమతి లేని కారణంగా..

నగర శివారుల్లో అత్యధికంగా పదుల సంఖ్యలో స్థిరాస్తి వ్యాపారులు వెంచర్లు ఏర్పాటు చేసి వందల సంఖ్యలో ప్లాట్లు విక్రయించి రూ.కోట్లు దండుకున్నారు. రెవెన్యూ, నీటిపారుదల శాఖలు, పురపాలక సంఘాల పరిధిలో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వాటికి అనుమతి లేని కారణంగా కొనుగోలు చేసిన వారు మళ్లీ వాటిని తిరిగి అమ్ముకోలేకపోతున్నారు.

☛ ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల విచారణలో భాగంగా పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, పలు శాఖల సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు సంయుక్తంగా పరిశీలన ప్రారంభించారు. ఎల్-1 నుంచి ఎల్-4 వరకు నాలుగు దశల్లో విచారణ కొనసాగుతోంది. గ్రామ పంచాయతీ పరిధిలో వచ్చిన దరఖాస్తులను హెచ్ఎండీఏ నేతృత్వంలో పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్(ఆర్ఐ), నీటి పారుదల శాఖ ఏఈలు పరిశీలిస్తారు. పురపాలక సంఘాల పరిధిలో మున్సిపాలిటీ, రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ ప్లాట్లలో ప్రభుత్వ భూమి, చెరువు, కుంట శిఖం, బఫర్ జోన్, స్థానిక అవసరాలకు కేటాయించి ఉంటే అనుమతి నిరాకరిస్తారు. అన్నీ సక్రమంగా నాలుగు దశల్లో పరిశీలించి అనుమతి ఇస్తారు.

☛ నగర శివారుల్లో 3.85 లక్షల దరఖాస్తులు రాగా, క్షేత్రస్థాయిలో విచారణకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పలువురు కొనుగోలు చేసిన ప్లాట్లకు సంబంధించిన లేఅవుట్ పత్రాలు, ఈసీ పత్రాలను జత చేయకపోవడంతో ప్లాట్లను గుర్తించలేకపోతున్నారు. కొన్ని ఏరియాల్లో ఏర్పాటు చేసిన వెంచర్లు కనిపించకుండా పోయాయి. నగర శివారుల్లో ఇప్పటి వరకు సుమారు 28 వేల దరఖాస్తులను విచారించగా, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా 15 వేల దరఖాస్తులను పరిశీలించినట్లు తెలుస్తోంది.

పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు

ఎల్ఆర్ఎస్ ప్రక్రియ త్వరగా చేపట్టేందుకు అధికార యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. దరఖాస్తులకు కావాల్సిన పత్రాలను జత చేయకపోవడంతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురవుతుండటంతో.. అన్ని పత్రాలు తీసుకు రావాలని దరఖాస్తుదారులకు సమాచారం ఇచ్చినా స్పందించకపోవడంతో.. కలెక్టరేట్‌లతో సహా పురపాలక సంఘాలు, మండలాల్లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశారు.

రాజ్యాంగాన్ని కాపాడుకోవడం తక్షణ కర్తవ్యం

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు


మాట్లాడుతున్న బీవీ రాఘవులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: భారతీయులు విశ్వ మానవులని, వారిని ఒక్కటిగా ఉంచగలిగిందే మన రాజ్యాంగం అని, దాన్ని కాపాడుకోవడం భారతీయుల తక్షణ కర్తవ్యం కావాలని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్‌యూటీఎఫ్) సీనియర్ నాయకులు అక్షయకుమార్ దత్ ప్రథమ వర్ధంతి సభ ఆదివారం జరిగింది. బీవీ రాఘవులు మాట్లాడుతూ.. అక్షయకుమార్ దత్ గొప్ప మానవతవాది, లౌకికవాది అన్నారు. రాజ్యాంగంపై పార్లమెంటులో చర్చ జరుగుతున్న నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెస్ పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయని, రాజ్యాంగ ఉల్లంఘనకు కాంగ్రెస్ పాల్పడితే బీజేపీ రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తోందని ఆరోపించారు. ఒకే దేశం ఒకే ఎన్నిక నియంతృత్వానికి దారి తీసిందన్నారు. టీఎస్‌యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి చావ రవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, సీఐటీయూ ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్య, నాయకులు మానిక్‌రెడ్డి, నరహరి, కమలాకుమారి, కొండల్‌రావు పాల్గొన్నారు.

మూత్రపిండాల వ్యాధులపై అవగాహన తప్పనిసరి

హైటెక్‌సిటీ యశోద హాస్పిటల్‌లో క్రానిక్ కిడ్నీ డిసీజ్ క్లినిక్ ప్రారంభం


హైటెక్‌సిటీ యశోద హాస్పిటల్‌లో క్రానిక్ కిడ్నీ డిసీజ్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న జగద్గురువు శివరాత్రి దేశికేంద్ర మహాస్వామీజీ, యశోద హాస్పిటల్ చైర్మన్ రవీందర్‌రావు తదితరులు

మాదాపూర్: దేశంలో కిడ్నీ సంబంధిత వ్యాధి గ్రస్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని యశోద హాస్పిటల్ గ్రూప్ చైర్మన్ గోరుకంటి రవీందర్‌రావు అన్నారు. మాదాపూర్ హైటెక్‌సిటీ యశోద హాస్పిటల్‌లో తీవ్రమైన కిడ్నీ వ్యాధి గ్రస్తుల కోసం(క్రానిక్ కిడ్నీ డిసీజ్ క్లినిక్)ను జగద్గురువు శివరాత్రి దేశికేంద్ర మహాస్వామీజీ, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరితో కలిసి యశోద హాస్పిటల్ చైర్మన్ రవీందర్‌రావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశ జనాభాలో 17శాతం మంది మూత్రపిండాల సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారన్నారు. దేశంలో ప్రతి సంవత్సరం 5 లక్షల మంది డయాలసిస్ దశకు చేరుకుంటున్నారన్నారు. వీరిలో కేవలం 20వేల మందికి మాత్రమే కిడ్నీ మార్పిడి అందించనున్నట్లు తెలిపారు. దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధిగ్రస్తుల కోసం ఒక ప్రత్యేక క్లినిక్ ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రారంభించినట్లు తెలిపారు. దీర్ఘకాలిక సమస్యలతో బాధపడుతున్న వారు ఈ క్లినిక్‌లో పేరు నమోదు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ రాజశేఖర్ చక్రవర్తి, పలువురు డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.


ముగింపు వేడుకల్లో నల్సార్ లా యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణ దేవరావు తదితరులు

దేశంలో మరిన్ని న్యాయ సంస్కరణలు అవసరం

నల్సార్ లా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణ దేవరావు

కాచిగూడ: దేశంలో మరిన్ని న్యాయ సంస్కరణలు తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందని నల్సార్ లా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణ దేవరావు అన్నారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేశవ్ మెమోరియల్ లా కాలేజీ ఆధ్వర్యంలో '75 ఏళ్ల భారత రాజ్యాంగం – గతంలోని సవాళ్లు, భవిష్యత్తును ముందుకు తీసుకెళ్లడం' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు ముగింపు వేడుకలు ఆదివారం జరిగాయి. కేశవ్ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు, పాట్నా హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి అధ్యక్షత వహించారు. ప్రొఫెసర్ శ్రీకృష్ణ దేవరావు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పైబడినా దేశ ప్రజల మధ్య ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, సామాన్యులకు చట్టాలపై అవగాహన పెంచేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఓయూ లా కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాంప్రసాద్, జె.నరసింహారావు, డాక్టర్ ఏవీ సుబ్రహ్మణ్యం, బి.శ్రీధర్‌రెడ్డి, కరస్పాండెంట్ ఎల్.ప్రభాకర్‌రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ జె.నాగేశ్వర్‌రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ వాణి అక్కపెద్ది తదితరులు పాల్గొన్నారు.

సెన్సార్ బోర్డ్ సభ్యురాలిగా భవాని కళ్లెపు



సాక్షి, సిటీబ్యూరో: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్(సెన్సార్) ఇటీవల ఏర్పాటైన అడ్వయిజరీ కమిటీకి నగరానికి చెందిన భవానీ కళ్లెపు నూతన సభ్యురాలిగా నియామకమైంది. సామాజిక సేవతో పాటు సాంస్కృతిక తదితర కార్యక్రమాల రంగంలో సేవలకు గుర్తింపుగా ఈ పదవి వరించింది. ఆమె మాట్లాడుతూ తనకు ఈ పదవి వరించడం ఎంతో ఆనందంగా ఉందని, బోర్డ్ నిబంధనలకు లోబడి అధికారులతో పాటు తోటి కమిటీ సభ్యులను కలుపుకొని పనిచేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా తన నియామకం పట్ల కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తాను రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్నట్లు హైదరాబాద్ సెన్సార్ బోర్డ్ రీజనల్ ఆఫీసర్ షిఫాలీ కుమార్ ఉత్తర్వులు విడుదల చేశారు. భవానీ ఎంపిక పట్ల రవి దన్నపునేని, వాసుదేవరావు, అజిత్ సాగి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

హిందూ సంస్థలన్నీ ఏకతాటిపై రావాలి


రౌండ్ టేబుల్ సమావేశంలో అతిథులు

సనాతన హిందూధర్మ పరిరక్షణ సమావేశంలో వక్తలు

మణికొండ: ఆధ్యాత్మిక విద్యాలయాలుగా దేవాలయాలు మారాలని, వాటిల్లో హిందూ ధర్మం గురించి బోధనలు జరగాల్సిన అవసరం ఎంతో ఉందని వక్తలు, పలువురు పీఠాధిపతులు అన్నారు. మణికొండ శివాలయం ఆవరణలో సనాతన హిందూధర్మ పరిరక్షణపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇతర మతాల వారు వారి ధర్మాన్ని పాటిస్తున్నప్పుడు హిందువులు మాత్రం కొందరు అందుకు బిన్నంగా వ్యవహరిస్తున్నారన్నారు. సనాతన ధర్మంపై ఈ మధ్య కాలంలో చులకన చేసే వారి సంఖ్య పెరుగుతోందని, అలాంటి వారికి బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. హిందువులు గడప లోపల కులం, గడప బయట హిందువులం అనేలా ఉండాలన్నారు. ప్రతి హిందువు బొట్టు పెట్టుకుని తమ ధర్మానికి న్యాయం చేయాలన్నారు. పలకరింపులోనూ జైశ్రీరాం, హరహర మహాదేవ్‌ను చేర్చాలన్నారు. హిందూ సంస్థలన్నీ ఒక్కతాటిపైకి వచ్చి ధర్మం కోసం పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సోమేశ్వరస్వామి, సిద్ధి బాలయోగిస్వామి, రఘోత్తమాచార్యస్వామి, శివరుద్ర సాధువు స్వామి, వీర ధర్మజ స్వామి, సారంగధర స్వామి, బసవరాజు స్వామి, అశోక్‌ఆర్య, బెనారస్ గురూజీ, బీజేవైఎం అధికార ప్రతినిధి భార్గవి కల్యాణి, హిందూ ధర్మ ప్రచార సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లిఖార్జున్, సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయవాది మాల్యాద్రి హాజరయ్యారు. నిర్వాహకులు చంద్రారెడ్డి గురూజీ, చక్రినాయుడు, చంద్రశేఖర్, జానకి పాల్గొన్నారు.

తిరుగీతికలు ఆడియో, వీడియో ఆవిష్కరణ

నాంపల్లి: విఖ్యాత వాగ్గేయకారుడు శ్రీమాన్ పుట్టపర్తి నారాయణాచార్యుల పుత్రిక డాక్టర్ పుట్టపర్తి నాగపద్మిని అనుసృజన 'తిరుగీతికలు' ఆడియో, వీడియో సీడీ ఆవిష్కరణ సభ ఆదివారం మాసబ్‌ట్యాంక్ నఫీజ్ రెసిడెన్సీలోని గాయత్రీ సదనంలో జరిగింది. సరస్వతీ పుత్ర కళాపీఠం, శ్రీరాగ క్రియేషన్స్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన సభకు విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ. రమణాచారి ముఖ్య అతిథిగా హాజరై సీడీ ఆవిష్కరించి ప్రసంగించారు. తిరుగీతికల పాటల రచయిత్రి గోదాదేవి తమిళంలో రచించిన 30 పాటలను డాక్టర్ నాగపద్మిని తెలుగులోకి అనువదించారని కొనియాడారు. అలాగే నాగపద్మిని కుమార్తె వంశీప్రియా ధర్మరాజు(యుఎస్ఏ) ఈ పాటలకు గానం చేశారని ప్రశంసించారు. విష్ణుప్రియ భరద్వాజ్ 30 తిరుగీతికల్లోని 20 గీతికలకు రాగాలను స్వరపరచడం అభినందనీయం అన్నారు. ప్రఖ్యాత ప్రవచనకర్త డాక్టర్ అనంత లక్ష్మి మాట్లాడుతూ ముగ్గురు మహిళలు రచన, సంగీతం, గానం చేసిన కార్యక్రమానికి తాను రావడం సంతోషంగా ఉందన్నారు. లేళ్లపల్లి రమేష్, శ్రీదేవి, చంద్రశేఖర్ భరద్వాజ్ ఉన్నారు.



విప్లవోద్యమ రూపశిల్పి కొండపల్లి


కొండపల్లి సీతారామయ్య రచనలను ఆవిష్కరిస్తున్న కృష్ణబాయ్, అల్లం నారాయణ

ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: విప్లవోద్యమం నిర్మాత కొండపల్లి సీతారామయ్య రచనలు వెలుగులోకి రావడం హర్షణీయమని ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కొండపల్లి సీతారామయ్య సంపూర్ణ రచనలు రెండు సంపుటాల ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా అల్లం నారాయణ మాట్లాడుతూ.. కేఎస్(కొండపల్లి సీతారామయ్య)గా సుపరిచితమైన కొండపల్లితో కలిసి పనిచేయడం ఎప్పటికీ మరువలేనిదని అన్నారు. తొలిదశ తెలంగాణ ఉద్యమం 1969లో ప్రారంభమైతే దానికి ఆదిలోనే మద్దతుగా నిలిచి పీపుల్స్‌వార్ పార్టీగా తనశ్రేణులను సన్నద్ధం చేశారని గుర్తుచేశారు. గ్రామాలకు తరలిరండి, జగిత్యాల జైత్రయాత్ర వంటి కార్యక్రమాల రూపశిల్పి కొండపల్లి అన్నారు. దేశ చరిత్రలో ఇంతటి మహోజ్వల పోరాటం కొండపల్లి సారథ్యంలో నిర్మాణం జరిగిందన్నారు. డాక్టర్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విరసం సీనియర్ నాయకురాలు కృష్ణబాయ్ కొండపల్లి సీతారామయ్య రచనలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది సీహెచ్ శివారెడ్డి, సామాజిక కార్యకర్త సుధాకర్, రచయిత ఏకే ప్రభాకర్, ప్రొఫెసర్ సూరెపల్లి సుజాత, సాంబమూర్తి, మాభూమి సంధ్య, జర్నలిస్టు తాయమ్మ కరుణ పాల్గొన్నారు.

శ్రీతేజను పరామర్శించిన మంద కృష్ణ మాదిగ


శ్రీతేజ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న మంద కృష్ణమాదిగ

రాంగోపాల్‌పేట్: పుష్ప-2 సినిమా రిలీజ్ రోజు ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని సంధ్య థియేటర్‌లో సినిమా చూసేందుకు వచ్చి తొక్కిసలాటలో గాయపడిన శ్రీతేజను ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పరామర్శించారు. సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజను ఆదివారం ఆయన పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఘటనకు బాధ్యుడిగా అల్లు అర్జున్‌ను అరెస్టు చేసి జైలుకు పంపారని, ఆయన బెయిల్‌పై బయటకు వచ్చాడన్నారు. కానీ వార్తా పత్రికల్లో వచ్చిన సమాచారం ప్రకారం థియేటర్ యాజమాన్యం పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసిందన్నారు. థియేటర్ యాజమాన్యానికి సమాచారం ఇచ్చినా తొక్కిసలాట జరగకుండా ఏర్పాట్లు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. 10 గంటలు జైల్లో ఉండి వచ్చిన హీరో అల్లు అర్జున్‌ను సినీ పరిశ్రమ పెద్దలు పరామర్శిస్తున్నారని, మరణించిన కుటుంబ సభ్యులను పరామర్శించడం లేదని విమర్శించారు. బాధిత కుటుంబానికి కనీసం రూ.కోటి ఆర్థిక సాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.


వీధుల్లో హనుమాన్ ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

హిందూ సమాజ రక్షణకు త్రిశూల్ దీక్ష తీసుకోవాలి

హుడాకాంప్లెక్స్: హిందూ సమాజ రక్షణకు యువత బజరంగ్‌దళ్‌లో చేరి త్రిశూల్ దీక్ష తీసుకోవాలని జనగణమన ఉత్సవ సమితి అధ్యక్షుడు విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. విశ్వహిందూ పరిషత్, వివేకానంద జిల్లా బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ మండల గ్రౌండ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన త్రిశూల్ ప్రతిజ్ఞ దీక్ష కార్యక్రమానికి వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్, కశ్మీర్ ఫైల్స్ సినీ నిర్మాత అభిషేక్ అగర్వాల్‌తో పాటు విజయ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశం కోసం, సమాజం కోసం యువత ముందుకు రావాలని కోరారు. హిందువుల సంఖ్య నానాటికీ తగ్గుతోందని, అన్యమతస్తుల సంఖ్య పెరుగుతోందని, అతి కొద్ది కాలంలోనే హిందూ జనాభా 90 శాతం కంటే దిగువకు వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. సనాతన ధర్మమే దేశ రక్షణకు దోహదపడుతుందని, హిందూ ధర్మాన్ని కాపాడేందుకు ప్రతి హిందువు మేల్కొనాలని సూచించారు. మతమార్పిడులను అరికట్టాలని, లవ్ జిహాదీలను అడ్డుకోవడానికి తమవంతు కృషి చేయాలని కోరారు. శక్తిని పెంచుకోవాలని త్రిశూల్ దీక్షతోనే అన్యమతస్తులను ఎదుర్కోవడం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, యువకులు పాల్గొన్నారు. అనంతరం సరూర్‌నగర్ ప్రధాన రహదారిపై హనుమంతుడి విగ్రహాన్ని ఊరేగించారు.

వేమూరి రామకృష్ణ కవిత్వం సమాజ ప్రగతికి దోహదం


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిత్రంలో అనంతరామకృష్ణ తదితరులు

ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి

నాంపల్లి: మేమూరి రామకృష్ణశర్మ కవిత్వం సామాజిక అంశాలు, ఆధ్యాత్మికతను సమన్వయ పరుస్తూ రసస్ఫోరకంగా వెలువరించారని ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఇలాటి పుస్తకాలు భవిష్యత్తు తరానికి ఎంతో ఉపయోగకరమని కొనియాడారు. తెలుగు భాష చైతన్య సమితి ఆధ్వర్యంలో ప్రముఖ కవి వేమూరి అనంత రామకృష్ణశర్మ రచించిన 'అనంత కవితా లహరి' పుస్తకావిష్కరణ సభ నాంపల్లి పబ్లిక్‌గార్డెన్స్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఆదివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. కవి వేమూరి అనంత రామకృష్ణశర్మ రచించిన అనంతర కవిత లహరి పుస్తకం సమాజ ప్రగతికి దోహదం చేసే విధంగా ఉందని అన్నారు. భక్తి, ఆధ్యాత్మిక, సామాజిక అంశాలను ప్రేరేపించేలా ఈ పుస్తకం దోహదం చేస్తుందని, ముఖ్యంగా ఆధ్యాత్మిక భక్తి అంశాలను ఎంతో వివరణాత్మకంగా రచించారని కొనియాడారు. ఆయన కలం పేరిట పుస్తకాన్ని ఆవిష్కరించి తమ తల్లిదండ్రులకు ఈ పుస్తకాన్ని అంకితం చేయడం అభినందనీయం అన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరీశంకర్ అధ్యక్షోపన్యాసం చేస్తూ.. భాష భావంలో స్పష్టత శర్మ రచించిన కవితలో ఉన్నాయని అభినందించారు. సిటీ అడిషనల్ డీసీపీ రాందాస్ తేజావత్, పిల్లలమర్రి రాములు, డాక్టర్ ఎస్.బాలాచారి, నాలేశ్వరం శంకరం హాజరై ప్రసంగించారు. సభా ప్రారంభంలో పలువు కవులు తమ స్వీయ కవితలను చదివి వినిపించారు. కురుగంటి కళాక్షేత్రం నృత్య గురువు డాక్టర్ కె.కుందనిక శిష్య బృందం, మయూరి అకాడమీ రాజేశ్వరి శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రముఖ గాయని వేమూరి మంజుల ఆలపించిన భక్తి గీతాలు అలరించాయి. కార్యక్రమంలో కవి మిద్దె సురేష్, కాంగ్రెస్ నాయకులు పిడమర్తి గణేష్, బడేసాబ్, మేమూరి అనంత రామకృష్ణశర్మ, కుటుంబ సభ్యులు, సాహితీవేత్తలు, కవులు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

రోగుల్లో ఆత్మవిశ్వాసం కల్పించడమే లక్ష్యం

- అపోలో లారింజెక్టమీ సొసైటీ వ్యవస్థాపకుడు డాక్టర్ ఉమానాథ్ నాయక్
- ఘనంగా లారింజెక్టోమీ సొసైటీ 25వ వార్షికోత్సవం


స్వరపేటిక శస్త్ర చికిత్స చేయించుకున్న రోగులతో అపోలో వైద్య బృందం

బంజారాహిల్స్: రోగుల్లో ఆత్మవిశ్వాసం కల్పించడమే లక్ష్యమని అపోలో హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ హెడ్, నెక్ సర్జన్, లారింజెక్టమీ సొసైటీ వ్యవస్థాపకుడు డాక్టర్ ఉమానాథ్ నాయక్ తెలిపారు. గొంతు క్యాన్సర్ బాధితుల పునరావాసానికి సహాయపడుతున్న 'లారింజెక్టోమీ సొసైటీ' తన 25వ వార్షికోత్సవాన్ని అపోలో మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో ఆదివారం ఘనంగా జరుపుకుంది. లారింజెక్టమీ(స్వరపేటిక) శస్త్రచికిత్స చేసుకున్న వారికి ఈ సొసైటీ పునరావాసం అందిస్తోంది. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ 25 ఏళ్ల క్రితం ప్రారంభించిన ఈ సొసైటీ సాధించిన పురోగతి ఎంతో ఉందన్నారు. ఇది కేవలం ఒక సహాయక సమూహం మాత్రమే కాదని, ఇది మానవ స్ఫూర్తికి, పునరావాస శక్తికి నిదర్శనం అన్నారు. రోగులు స్వరాలను మాత్రమే కాకుండా, గౌరవాన్ని, నాణ్యమైన జీవనం తిరిగి పొందేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ సొసైటీ పునరావాస కార్యక్రమంలో మాట్లాడే సామర్థ్యాన్ని పునరుద్ధరించడంపై దృష్టి సారించిందన్నారు. దాదాపు 90 శాతం మందిని అర్థమయ్యేలా మాట్లాడించడంలో విజయం సాధించామన్నారు. అంతేగాకుండా భౌతిక, సామాజిక, మానసిక, వృత్తిపరమైన అవసరాలను తీర్చడానికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అపోలో హాస్పిటల్స్ కన్సల్టెంట్ హెడ్ నెక్ డాక్టర్ అభిషేక్ బీ, మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రబాబు, అసోసియేట్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, సోమవారం, 16, డిసెంబర్, 2024





భలేవాడివి బాసు!

ఉద్యోగుల మానసిక స్థితిని మార్చేది ప్రవర్తనే

ఉరుకుల పరుగుల జీవితంలో మానసిక ప్రశాంతత చాలా అవసరం. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం బాగుంటేనే ప్రతిరోజూ ఆనందం ఉంటుంది. అసలే దూరాభారం ప్రయాణాలు, ట్రాఫిక్ చిక్కులు, టార్గెట్లు వంటి కారణాలతో అలిసిపోవడం సహజం.. అయితే మన రోజువారీ ఆరోగ్య పరిస్థితిని ఇలాంటి అనేక అంశాలు ప్రభావితం చేస్తుంటాయి. అన్నింటి కన్నా మనపై ఉన్న బాస్ ప్రవర్తనను బట్టే మన మానసిక ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని తాజా పరిశోధనల్లో తేలింది.

- సాక్షి, సిటీబ్యూరో



- బాస్ నాయకత్వ లక్షణాలతో ఆఫీస్ వాతావరణంలో పాజిటివిటీ
- కర్కశంగా వ్యవహరిస్తే సమస్యలు తలెత్తే ప్రమాదం
- తెలివితేటలపై అపనమ్మకం
- తగ్గనున్న సృజనాత్మకత

మనం పనిచేసే ప్రాంతం బాగుంటే మానసిక ప్రశాంతత ఉంటుందని మానసిక నిపుణులు, పరిశోధకులు చెబుతున్నారు. ఎందుకంటే రోజుకు కనీసం 9 గంటల పాటు ఆఫీస్‌లోనే గడపాల్సి వస్తుంది కాబట్టి.. అక్కడి వాతావరణం బాగుంటేనే మిగతా రోజంతా సులువుగా గడిచిపోతుందని పేర్కొంటున్నారు. పై అధికారి శాడిస్టు అయితే మానసిక ఆరోగ్యంతో పాటు మన పనితనం, భవిష్యత్తు, ఇతరులతో సంబంధాలు కూడా దెబ్బతింటాయని చెబుతున్నారు నిపుణులు.

దీర్ఘకాలిక ప్రభావం..

ఆఫీస్‌లో బాస్ ప్రవర్తన సరిగ్గా లేకపోతే.. అది ఉద్యోగిపై స్వల్పకాలికంగా కాకుండా దీర్ఘకాలికంగా ప్రభావం చూపుతుందని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు. ఎప్పుడూ నెగెటివిటీతో బాస్ మాట్లాడుతుంటే ఉద్యోగుల సొంత తెలివితేటలపైనే అనుమానం వస్తుంటుంది. వారిని వారే తక్కువ అంచనా వేసుకోవడంతో పనితీరు కూడా మందగిస్తుందని నిపుణులు చెబుతున్నారు. చివరకు ఉద్యోగంపై విరక్తి కలిగి రాజీనామా చేసేంత వరకూ వెళ్తుందని పేర్కొంటున్నారు.



మోటివేషన్ ఉండాల్సిందే..

పని చేసే ప్రదేశంతో నెగెటివ్ వాతావరణం కన్నా మోటివేషన్ ఉంటే ఉద్యోగులు క్రియాశీలకంగా పనిచేస్తుంటారని, చేసిన పనికి మెచ్చుకోలు లేకపోయినా కనీసం కించపరిచేలా మాట్లాడటం, అందరి ముందు మందలించడం వంటి పనులు చేస్తే మానసిక వేదనకు గురై.. పని తీరు మందగిస్తుందని పేర్కొంటున్నారు. పనిచేసే ప్రదేశంలో ఆరోగ్యకరమైన పోటీతత్వం, స్వతంత్రత, చుట్టుపక్కల వారితో సత్సంబంధాలు ఉంటే ఉద్యోగులకు మోటివేషన్ వస్తుందని పేర్కొంటున్నారు. అప్పుడు పనితీరులో కూడా మెరుగుదల ఉంటుందని చెబుతున్నారు.

ఎలా బయటపడాలి..?

కర్కశమైన బాస్ కింద పని చేసిన వారి మానసిక స్థితిని మళ్లీ తిరిగి పొందొచ్చని నిపుణులు సలహా ఇస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పనిచేయడం కన్నా అక్కడి నుంచి వెళ్లిపోయి వేరే ఉద్యోగం వెతుక్కోవడం మంచిదని సూచిస్తున్నారు. ఇక, పాత ఆఫీస్ జ్ఞాపకాలను మర్చిపోయి.. ఆత్మన్యూనత భావం నుంచి బయటపడటం కాస్త కష్టమైనా కూడా సాధించొచ్చని చెబుతున్నారు.



మన శక్తి సామర్థ్యాలను గుర్తు చేసుకుని, మనం గతంలో సాధించిన విజయాలను నెమరువేసుకుంటూ ఉండాలని పేర్కొంటున్నారు. మన మంచి కోరే సహోద్యోగులతో మనం చేసిన పనిపై ఫీడ్‌బ్యాక్ తీసుకుంటూ ఉండాలని, చిన్న చిన్న లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటిని పూర్తి చేస్తుంటే మళ్లీ మనలో కాన్ఫిడెన్స్ పెరుగుతుందంటున్నారు. కొత్త స్కిల్స్ నేర్చుకుంటూ ఆత్మ స్థైర్యం సాధించాలని పేర్కొంటున్నారు. ఆఫీస్‌లో మన చుట్టూ ఉన్న వాతావరణాన్ని ప్రొఫెషనల్‌గా ఉండేలా చూసుకోవాలని సూచిస్తున్నారు.

అనేక ఆరోగ్య సమస్యలు..



పనిచేసే ప్రదేశంలో బాస్ సపోర్టు ఉంటే ఉద్యోగులు వ్యక్తిగతంగా ఎదుగుదలకు ఉపయోగపడటమే కాకుండా సంస్థ పనితీరు కూడా బాగుంటుంది. ఏం చేసినా తప్పులు వెతకడం, విమర్శలు చేస్తుండటం వల్ల ఒత్తిడి, ఆందోళనకు గురవుతారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా ఆ ఉద్యోగాన్ని వదిలి వెళ్లలేక, అక్కడే భరించలేక తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతుంటారు. ఈ పరిస్థితులను ఎవరికీ చెప్పుకోలేక నిద్రలేమి, హృద్రోగ సమస్యలు తలెత్తుతాయి. బాస్ ప్రవర్తనతో ఎలాంటి సమస్యలు వస్తున్నాయో కుదిరితే నేరుగా చెప్పి సమస్యలను పరిష్కరించుకోవాలి. నచ్చిన వారితో కాసేపు ప్రశాతంగా గడిపినా, ఫోన్‌లో మాట్లాడినా మనసులోని బరువు తగ్గి మానసిక ప్రశాంతత చేకూరుతుంది.

– డాక్టర్ పి.హరీశ్, కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్

వ్యక్తిగత సంబంధాలపై ప్రభావం..

'ఎక్కువ కాలం ఇలాంటి వాతావరణంలో పనిచేయడంతో నేర్చుకునే తత్వం తగ్గిపోతుందని, కొత్త విషయాలు రూపకల్పన చేయడం, సృజనాత్మకత పెంచేందుకు దోహదపడే డోపమైన్ తగ్గుముఖం పట్టి.. కార్టిసాల్ స్థాయి పెరిగుతుందని ఢిల్లీకి చెందిన సైకోథెరపిస్టు డాక్టర్ చాందినీ చెబుతున్నారు. అద్భుతంగా ఎలా పని చేయాలా..? అని ఆలోచించడం మానేసి.. తన మీదికి రాకుండా ఏం చేయాలనే దానిపైనే దృష్టి సారిస్తారని ఆమె వివరించారు. ఆఫీస్ వాతావరణం చాలాకాలం పాటు సరిగ్గా లేకుంటే ఉద్యోగులకు వేరే వారితో సంబంధాలు దెబ్బతింటాయని, అలాగే వ్యక్తిగత జీవితంలో కూడా ఇబ్బందులు ఎదురవుతాయని మానసిక వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. దీంతో మత్తు పదార్థాలు తీసుకునే అలవాటు చేసుకుంటారని, అలాగే శారీరక ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని హెచ్చరిస్తున్నారు.

లీడర్‌షిప్ ముఖ్యం..

ఆఫీస్ వాతావరణం చెడిపోడానికి కారణాల్లో ప్రధానమైనది లీడర్‌షిప్ లేకపోవడం. బాస్ సరిగ్గా లేకపోవడం వల్లే ఇలాంటి పరిస్థితులు ఏర్పడుతాయని చెబుతున్నారు. బాస్‌కు నాయకత్వ లక్షణాలు లేకపోతే తాను చెప్పాలనుకున్న విషయాలు ఉద్యోగులకు వ్యక్తీకరించలేరు. దీంతో ఉద్యోగులకు ఉన్న సమస్యలు నేరుగా చెప్పుకోలేరు. పక్షపాత వైఖరి, అసాధ్యమైన టార్గెట్లు పెట్టడం కూడా వారి మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందని చెబుతున్నారు. ఒత్తిడితో పాటు ఆందోళన పెరుగుతుందని పేర్కొంటున్నారు. తద్వారా ఆఫీస్ వాతావరణం పూర్తిగా చెడిపోతుందని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఐటీ రంగంలో ఇటీవల ఆత్మహత్యలు పెరుగుతున్న నేపథ్యంలో తాజా ఈ అధ్యయనం ప్రాధాన్యత సంతరించుకుంది.



మంచి అలవాట్లే జీవితానికి దశ దిశ

శారీరక ఆరోగ్యానికి వ్యాయామం చాలా ముఖ్యం : ఫిట్‌నెస్ కోచ్ సౌరబ్ బోథ్రా

లక్డీకాపూల్ : మంచి జీవన విధానానికి తమ తమ అలవాట్లే దశ దిశ అని ఫిట్‌నెస్ కోచ్, ఇన్‌స్ట్రక్టర్ సౌరబ్ బోథ్రా పేర్కొన్నారు. జేఐటీఓ హైదరాబాద్ లేడీస్ వింగ్ ఆధ్వర్యంలో యోగా ద్వారా ఆరోగ్యం అనే అంశంపై అవగాహన కల్పించారు. నెక్లెస్ రోడ్డులోని సంజీవయ్య పార్కులో ఆదివారం జేఐటీఓ లేడీస్ వింగ్ చైర్‌పర్సన్ సుధా కిమ్టీ నిర్వహించిన కార్యక్రమంలో సౌరబ్ మాట్లాడారు. అవగాహనతో కూడిన జీవన విధానంతో పాటు యోగ ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగమన్నారు. ఆరోగ్యకర జీవితం ఆరోగ్యవంతమైన దేశాన్ని నడిపిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్యం, ఫిట్ నెస్ గురించి అవగాహన కల్పించారు. సంతోషకరమైన శరీరానికి వ్యాయామం ఎంత ముఖ్యమో వివరించారు. కార్యక్రమంలో ప్రభా దుగర్, జేఐటీఓ లేడీస్ వింగ్ ప్రధాన కార్యదర్శి టీనా షా, హైదరాబాద్ చైర్మన్ రోహిత్ కొఠారి, ప్రధాన కార్యదర్శి లలిత్ చోప్రా, సభ్యులు ఉజ్వల ధరివాల్, బిజల్ షా, ఛాయా కంకారియా, పూజా చోవాటియా, దర్శన జైన్, వినీతా మెహతా, రూబీ జైన్ పాల్గొన్నారు.



20 రాష్ట్రాల కళాకారులు.. 400 స్టాల్స్..

- శిల్పారామంలో అలిండియా హస్త కళా మేళా
- 31 వరకు కొనసాగింపు
- ప్రత్యేక ఆకర్షణగా వుడ్ కార్వింగ్, టెర్రకోట ఉత్పత్తులు



మాదాపూర్: కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన అలిండియా క్రాఫ్ట్‌మేళాను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ముఖ్య అతిథులుగా పాల్గొని ఆదివారం ప్రారంభించారు. మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, నేషనల్ జ్యూట్‌బోర్డు సౌజన్యంతో మేళాను ఏర్పాటు చేశారు. దేశ వ్యాప్తంగా 20 రాష్ట్రాల నుంచి చేనేత కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శించారు. ఈనెల 31 వరకూ నిర్వహించనున్న ఈ మేళాలో చేనేత ఉత్పత్తులకు 100 స్టాల్స్, జ్యూట్ ఉత్పత్తులకు 31స్టాల్స్, చేనేత హస్తకళలు, వుడ్ కార్వింగ్, టెర్రకోట, తదితర ఉత్పత్తలకు 300లకి పైగా స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు.

వివిధ రకాల ఉత్పత్తులు..

మేళాలో గద్వాల్, పోచంపల్లి, మంగళగిరి, నారాయణపేట, కోట డోరియా, చెందేరి, జాందానీ, పైతాని, పటోళ్ళ చీరలు, కాటన్ అద్దకం, చెద్దర్లు, వరంగల్ కార్పెట్లు, పష్మీనా శాలువాలు, శ్రీకాళహస్తి చెక్కవిగ్రహాలు, జ్యూట్‌బ్యాగులు, మట్టికుండలు తదితర ఉత్పత్తులు అమ్మకాలకు అందుబాటులో ఉంచారు. రాష్ట్ర కళాకారులే కాకుండా విదేశాలలో స్థిరపడి భారతీయ కళలను నేర్చుకుంటున్న వారందరూ మేళాలో తమ కళలను ప్రదర్శిస్తున్నారు. సౌత్‌జోన్ కల్చరల్ సెంటర్ తంజావూర్ వివిధ రాష్ట్రాల నుంచి జానపద కళా రూపాల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. శిల్పారామం ప్రత్యేక ఆధికారి జి.కిషన్‌రావు, వీవర్స్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ అరుణ్‌కుమార్, శిల్పారామం జనరల్ మేనేజర్ నర్సింహులు పాల్గొన్నారు.

22న చిత్రామృతం..



సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ తెలుగు గాయని, నైటింగేల్ ఆఫ్ సౌత్ ఇండియాగా పేరొందిన కేఎస్ చిత్ర తన గానామృతంతో సంగీతాభిమానుల్ని అలరించనున్నారు. నగరంలోని మాదాపూర్ శిల్పకళా వేదికలో చిత్రామృతం పేరిట ఈ నెల 22న కార్యక్రమం జరుగనుంది. విభిన్న భాషల్లో పాటలు పాడిన ఈ సీనియర్ ప్లేబ్యాక్ సింగర్.. తెలుగు, హిందీ పాటలను ఆలపించనున్నారు. ఈ కార్యక్రమం సాయంత్రం 6గంటల నుంచి ప్రారంభం కానుంది. ఎంట్రీలను ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేయవచ్చు.



డిజైనర్ వేర్‌లో కొత్త అధ్యాయ్ం

బంజారాహిల్స్: బంజారా హిల్స్ రోడ్ నెం.10లో ఆదివారం అధ్యాయ్ డిజైనర్ స్టోర్ ప్రారంభమైంది. ఆకట్టుకునే డిజైన్లతో ఇక్కడ దుస్తులు విశేషంగా ఆకర్షిస్తున్నాయి. స్టోర్ యజమానులు నరేష్ జైన్, చందేష్ జైన్, రితేష్ జైన్ ఈ స్టోర్‌ను ప్రారంభించారు. వివాహాదీ శుభకార్యాలకు ప్రఖ్యాత డిజైనర్లు రూపొందించిన దుస్తులు ఈ స్టోర్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా హ్యాండీక్రాఫ్ట్స్ మరో ఆకర్షణగా ఉన్నాయి.

ఉత్సాహంగా హెచ్‌సీఎల్ సైక్లోథాన్

- మూడు విభాగాల్లో వందలాది సైక్లిస్ట్‌లు
- విజేతలకు నగదు బహుమతి
- ఫిట్‌నెస్, ఒత్తిడి తగ్గించేందుకు సైక్లింగ్
- హెచ్‌సీఎల్ అధ్యక్షులు సుందర్ మహాలింగం





గచ్చిబౌలి: హెచ్‌సీఎల్ సైక్లోథాన్ మొదటి ఎడిషన్‌లో వందలాది మంది సైక్లిస్టులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆదివారం భారతీయ సైక్లింగ్ సమాఖ్య ఆధ్వర్యంలో 52 కిలో మీటర్ల ప్రొఫెషనల్ రోడ్డు రేస్, అమెచ్యూర్ రోడ్డు రేస్, 23 కిలో మీటర్ల అమెచ్యూర్ ఎంటీబీ రోడ్డు రేస్, 10 కిలోమీటర్ల గ్రీన్ రైడ్ విభాగాల్లో సైక్లోథాన్ నిర్వహించారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ప్రారంభమైన సైక్లింగ్ ఔటర్ రింగ్ వెంట కొల్లూర్ సర్వీస్ రోడ్డు వరకూ, అక్కడి నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకూ సాగింది. దాదాపు 1500 మంది పురుషులు, మహిళా సైక్లిస్టులు పాల్గొన్నారు. అన్ని కేటగిరీల్లో పురుషులు, మహిళ విభాగంలో విజేతలు, రన్నర్‌లు, ఫస్ట్ రన్నర్‌లకు రూ.33.6 లక్షల నగదు అందజేశారు. 52 కిలో మీటర్ల ప్రొఫెషనల్ రోడ్ రేస్ విభాగంలో దినేష్ కుమార్, ముస్కాన్, రన్నర్‌లుగా సాహిల్ కుమార్, ఛాయనికా గగోయ్ నిలిచారు. 52 కిలో మీటర్ల అమెచ్యూర్ రోడ్ రేస్‌లో విజేతలుగా నహల్ నదాఫ్, అర్పిత కేతన్‌పాండ్యా, రన్నర్‌లుగా సోహెల్ బర్గిర్, జినాత్ సయ్యద్‌లు నిలిచారు. 23 కిలోమీటర్ల రోడ్ రేస్‌లో విజేతలుగా హర్ష పవార్, బర్నాలీ మెహత, రన్నర్‌గా రాహుల్ కుంద్రా, నేహా తాచ్‌నాచా నిలిచారు. 23 కిలోమీటర్ల అమెచ్యూర్ ఎంటీబీ రేస్ విజేతలుగా అన్వేష్ పరీక్, సంధ్యా మౌర్య, రన్నర్‌లుగా మొహిమిస్ ఇస్మాయిల్, రుతిక రవీంద్ర గైక్వాడ్‌లు నిలిచారు. వివిధ కార్పొరేట్ కంపెనీలు, సైక్లింగ్ క్లబ్‌లకు చెందిన సైక్లిస్టులు ఉత్సాహంగా పాల్గొన్నారని హెచ్‌సీఎల్ అసోసియేట్ ప్రెసిడెంట్ రజత్ చందోలియా పేర్కొన్నారు.

సైక్లింగ్‌తో ఒత్తిడి దూరం..

పని ఒత్తిడి దూరం చేసి, ఫిట్‌నెస్ సాధించేందుకు సైక్లింగ్ దోహదం చేస్తుంది. ప్రొఫెషనల్ సైక్లిస్టులను ఎప్పుడూ ప్రోత్సాహిస్తాం. నోయిడా, చెన్నై, హైదరాబాద్ సైక్లోథాన్‌లకు మంచి స్పందన వచ్చింది.

– సుందర్ మహాలింగం, హెచ్‌సీఎల్ గ్రూప్ ప్రెసిడెంట్

జగన్ హయాంలో
జీఎస్‌డీపీ జోరు

రూ.1.94 లక్షల కోట్లు పెరిగిన రాష్ట్ర స్థూల ఉత్పత్తి

ఆర్‌బీఐ నివేదికలో వెల్లడి



- స్థిర ధరల ఆధారంగా ఐదేళ్లలో జీఎస్‌డీపీ 31.04 శాతం వృద్ధి
- వైఎస్సార్‌సీపీ హయాంలో వ్యవసాయ రంగం వృద్ధి 16.46 శాతం
- రెండేళ్లు కోవిడ్ సంక్షోభంలోనూ తయారీ రంగం 58.39 శాతం వృద్ధి
- ఐదేళ్లలో పారిశ్రామిక రంగం 46.62%.. నిర్మాణ రంగంలో 41.50% వృద్ధి
- విద్య, వైద్యం, తాగునీరు, సంక్షేమం, పారిశుద్ధ్యం, గ్రామీణ, పట్టణాభివృద్ధి, పౌష్టికాహారానికి అత్యధిక ప్రాధాన్యమిస్తూ వైఎస్ జగన్ 'సామాజిక' అడుగులు
- సామాజిక రంగంపై రూ.5.22 లక్షల కోట్లు వెచ్చించిన జగన్
- బాబు హయాంలో తలసరి ఆదాయం రూ.1,54,031
- జగన్ పాలనలో రూ.2,42,479కి పెరిగిన తలసరి ఆదాయం
- టీడీపీ హయాంలో తలసరి విద్యుత్ లభ్యత గంటకు 1,289.4 కిలోవాట్
- వైఎస్సార్‌సీపీ హయాంలో తలసరి విద్యుత్ లభ్యత గంటకు 1,623.0 కిలోవాట్
- వైఎస్ జగన్ పాలనలో రూ.1.35 లక్షల కోట్లు అదనంగా పెరిగిన రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

విజన్ 2047..
ఓ డొల్ల డాక్యుమెంట్

మరోసారి చంద్రబాబు పబ్లిసిటీ స్టంట్: 'ఎక్స్'లో వైఎస్ జగన్ ధ్వజం

- బాబు పాలనలో మొత్తం విజన్లు.. చరిత్రలో నిలిచిపోయే పని ఒక్కటైనా చేశారా?
- ప్రభుత్వ రంగంలో ఒక్క మెడికల్ కాలేజీ అయినా కట్టారా? స్కూళ్లు, ప్రభుత్వ ఆస్పత్రులను బాగు చేశారా? రైతులకు అండగా నిలిచారా?
- మరి ఇంకెందుకు ఈ విజన్ డాక్యుమెంట్లు?
- రాష్ట్రం, ప్రజల అవసరాలకు చోటెక్కడ? వాస్తవిక దృక్పథం ఏది?
- ఆయన దృష్టంతా ప్రజలను మోసం చేయడం, మాయ చేయడంపైనే
- విజన్ డాక్యుమెంట్లు పేరిట ఇలా అబద్ధాలాడితే జైలుకో, ఆస్పత్రికో పంపిస్తామన్న నాటి స్విట్జర్లాండ్ ఆర్థిక మంత్రి పాస్కల్
- బాబు 14 ఏళ్ల పాలనలో రెవెన్యూ లోటు మినహా ఎన్నడైనా మిగులు ఉందా?
- ప్రభుత్వ ఆస్తులను అమ్మేసి.. సంపదను ఆవిరి చేసే సంస్కృతి చంద్రబాబుది
- వైఎస్సార్ సీపీ అమలు చేసిన పథకాలు, కార్యక్రమాలను నీరుగారుస్తూ.. రద్దు చేస్తున్నారు
- మేం సృష్టించిన ఆస్తులను తన మనుషులకు అమ్మేయడానికి బాబు ప్రయత్నిస్తున్నారు
- పేదలను మరింత పేదవాళ్లుగా తయారు చేస్తున్న చంద్రబాబు

సాక్షి, అమరావతి: విజన్ 2047 పేరిట ప్రజలను మభ్యపుచ్చి మాయ చేసేందుకు సీఎం చంద్రబాబు మరోసారి పబ్లిసిటీ స్టంట్‌కు దిగారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. చంద్రబాబు పత్రంలో రాష్ట్రం, ప్రజల అవసరాలకు చోటే లేదని ధ్వజమెత్తారు. వాస్తవిక దృక్పథం అంతకన్నా లేదన్నారు. ఆయన దృష్టి ఎప్పుడూ ప్రజలు తనకిచ్చిన ఐదేళ్లలో మేనిఫెస్టో హామీల అమలుపై ఉండదని దుయ్యబట్టారు. ఎప్పుడూ ప్రజలను మోసం చేయడం, మాయ చేయడం మీదనే ఆయన ధ్యాసంతా ఉంటుందని మండిపడ్డారు. ఈ మేరకు ఆదివారం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వైఎస్ జగన్ పోస్టు చేశారు. అందులో ఇంకా ఏమన్నారంటే...



- 1998లో కూడా చంద్రబాబు విజన్–2020 పేరిట డాక్యుమెంట్ విడుదల చేశారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో అదొక చీకటి అధ్యాయం. రైతుల ఆత్మహత్యలు, ఉపాధి లేక వలసలు, ఉద్యోగాలు లేక నిరుద్యోగుల అష్టకష్టాలు.. వీటన్నింటినీ దాచేసి చంద్రబాబు తన విజన్ చుట్టూ నడిపించిన ప్రచారం అంతా ఇంతా కాదు. ప్రైవేటీకరణ పేరుతో విలువైన ప్రభుత్వ ఆస్తులను పప్పు బెల్లాల మాదిరిగా తన మనుషులకు కట్టబెట్టి అవినీతికి పాల్పడ్డారు. నాడు స్విట్జర్లాండ్‌కు చెందిన ఆర్థిక మంత్రి పాస్కల్ హైదరాబాద్‌లో పర్యటించిన సందర్భంగా విజన్ డాక్యుమెంట్ల పేరిట ఇలా అబద్ధాలు చెప్పేవారిని తమ దేశంలో జైలుకో లేకపోతే ఆస్పత్రికో పంపిస్తామని కామెంట్ చేశారు. చివరకు ప్రజలు కూడా విజన్ 2020 కాదు.. 420 అంటూ చంద్రబాబు తీరును దుయ్యబట్టారు.
- 2014లో కూడా చంద్రబాబు విడుదల చేసిన విజన్ 2029 డాక్యుమెంట్ ప్రచార ఆర్భాటంగానే మిగిలిపోయింది. తన పరిపాలనలో మొత్తం విజన్లు ప్రకటించిన చంద్రబాబు చిరస్థాయిగా నిలిచిపోయే పని ఒక్కటైనా చేశాడా? ప్రభుత్వానికి మేలు జరిగే విధంగా ఒక్క ప్రాజెక్టు అయినా కట్టాడా? ఒక్క పోర్టుగానీ ఫిషింగ్ హార్బర్లుగానీ కట్టాడా? ప్రభుత్వ రంగంలో ఒక్క మెడికల్ కాలేజీ అయినా కట్టారా? స్కూళ్లు బాగు చేశారా? ప్రభుత్వ ఆస్పత్రులను బాగు చేశారా? వ్యవసాయ రంగాన్ని బాగు చేశారా? చెప్పుకోదగ్గ ఉద్యోగాలు ఏమైనా ఇచ్చారా? మానవ వనరుల అభివృద్ధి మీద, యువత భవిష్యత్తు మీద ఒక్క పైసా అయినా ఖర్చు చేశారా? ఒక్కటంటే ఒక్కటి కూడా చేయలేదు. మరి ఇంకెందుకు ఈ విజన్ డాక్యుమెంట్లు?
- ఎన్నికలలో తానిచ్చిన మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ సహా ఇతర హామీలకు తూట్లు పొడుస్తూ మోసాలు, అబద్ధాలతో ప్రజలకు నమ్మక ద్రోహం చేస్తున్న చంద్రబాబు ఇప్పుడు మళ్లీ విజన్ 2047 పేరిట డాక్యుమెంట్ విడుదల చేయడం మరో డ్రామా, స్టంట్ కాదా? ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను గంగలో కలిపిన పాలకుడిని చీటర్ అంటారు. అంతేగానీ విజనరీ అంటారా?
- చంద్రబాబు పాలనలో, ఆయన 14 ఏళ్ల పరిపాలనలో ఎప్పుడూ రెవెన్యూ లోటే కనిపిస్తుందన్న మాట వాస్తవం కాదా? మరి ఇంకెక్కడి సంపద సృష్టి? ఆయన పాలించిన ఏ ఒక్క సంవత్సరంలోనైనా రెవెన్యూ మిగులు ఉందా? ఆయనకు సంపద సృష్టించే శక్తి లేదు. సమగ్ర ఆర్థిక నియంత్రణ కూడా లేదు. ఇప్పుడు విజన్ 2047 ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2.4 ట్రిలియన్ డాలర్లు చేస్తానంటూ చంద్రబాబు చెప్పడం కట్టుకథ కాదా?
- సహజంగా ఏ రాష్ట్రంలోనైనా కాలం గడుస్తున్న కొద్దీ ఆర్థిక వ్యవస్థ పెరుగుతూ వస్తుంది. ఇప్పటి నుంచి వచ్చే 10 ఏళ్లు తీసుకున్నా లేక గతంలో 10 ఏళ్ల లెక్కలు తీసుకున్నా ఏ రాష్ట్రమైనా, ఏ దేశమైనా ద్రవ్యోల్బణం వల్ల, సహజంగా వచ్చే పెరుగుదల వల్ల వృద్ధి చెందుతూ ఉంటుంది. కానీ సంపద సృష్టి ఎప్పుడూ చేయని చంద్రబాబు.. ఎప్పుడూ ప్రభుత్వ ఆస్తులను అమ్మేసి సంపదను ఆవిరి చేసే ఈ బాబు.. ఆ పెరుగుదల తన వల్లే అని చెప్పుకుంటూ ఉంటారు. అందుకే ఈ మోసగాడిని మాత్రమే 420 అని అంటారు.

మేం ఏం చేశామో చూడండి..

- రాష్ట్రంలో నెలకొన్న సమస్యలకు దీర్ఘకాలిక పరిష్కారం చూపుతూ అసమానతలు రూపుమాపి అందరికీ సమాన అవకాశాలు కల్పించి, సుస్థిర అభివృద్ధి దిశగా వైఎస్సార్‌సీపీ హయాంలో అనేక చర్యలు తీసుకున్నాం. విద్యారంగంలో సీబీఎస్‌ఈ, ఐబీ, పిల్లలకు ట్యాబ్‌లు, వ్యవసాయంలో ఆర్బీకే వ్యవస్థ, ఈ క్రాప్, ఫామ్‌గేట్ వద్దే మద్దతు ధరకు పంటల కొనుగోళ్లు, నాడు – నేడు ద్వారా ఆసుపత్రుల బలోపేతం, కొత్తగా ప్రభుత్వ రంగంలో 17 మెడికల్ కాలేజీలకు శ్రీకారం, ఫ్యామిలీ డాక్టర్, విలేజ్ క్లినిక్‌లు, ఉపాధి కల్పనా రంగంలో మైక్రోసాఫ్ట్ ద్వారా నైపుణ్యాభివృద్ధి, ఎడెక్స్‌తో ఒప్పందం ద్వారా అత్యాధునిక కోర్సుల్లో శిక్షణ లాంటి పలు విప్లవాత్మక కార్యక్రమాలు చేపట్టాం.
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన ఈ పథకాలు, కార్యక్రమాలను చంద్రబాబు నీరు గారుస్తున్నారు, రద్దు చేస్తున్నారు. విద్య, వ్యవసాయం, ఆరోగ్యం, ఉపాధి కల్పన, సుపరిపాలనలో తీసుకున్న విప్లవాత్మక సంస్కరణలు ఎన్నింటినో దెబ్బతీశారు. ప్రభుత్వ రంగంలో సృష్టించిన ఆస్తులను తన మనుషులకు అమ్మేయడానికి ప్రయత్నిస్తున్నారు.
- సమాజంలో అట్టడుగు వర్గాలకు చేయూతనిచ్చి వారి జీవన ప్రమాణాలు పెంచి పేదరికాన్ని నిర్మూలించే దిశగా గత ప్రభుత్వం అమలు చేసిన కార్యక్రమాలన్నింటినీ తీసివేసి పేదలను మరింత పేదవాళ్లుగా చంద్రబాబు తయారు చేస్తున్నారు. మరి చంద్రబాబుకు విజన్ ఉందని ఎలా అనుకుంటారు?

స్థిరంగా కొనసాగుతున్న
అల్పపీడనం

- నేడు తీవ్ర అల్పపీడనంగా మారే ఛాన్స్
- 18న తమిళనాడులో తీరం దాటే అవకాశం
- రేపు దక్షిణ కోస్తా, రాయలసీమలో అక్కడక్కడా మోస్తరు వానలు

సాక్షి, విశాఖపట్నం: దక్షిణ అండమాన్ సముద్రంలో ఉపరితల ఆవర్తన ప్రభావంతో ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం స్థిరంగా కొనసాగుతోంది. రాబోయే 24 గంటల్లో ఇది బలపడి తీవ్ర అల్పపీడనంగా మారనుంది. అనంతరం దిశ మార్చుకుని పశ్చిమ వాయువ్య దిశగా ప్రయాణిస్తుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. 18వ తేదీన ఉదయం తమిళనాడు రాష్ట్రంలో తీరం దాటే అవకాశం ఉందని వెల్లడించారు. దీని ప్రభావంతో మంగళవారం దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే సూచనలున్నాయని తెలిపారు. తీరం వెంబడి 30 నుంచి 35 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీస్తాయని.. దక్షిణ కోస్తా జిల్లాల్లోని మత్స్యకారులు ఈ నెల 18 వరకూ వేటకు వెళ్లవద్దని వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

అమెరికాలో రోడ్డు ప్రమాదం..
తెనాలి యువతి దుర్మరణం

- రెండు రోజుల్లో ఎంఎస్ పట్టా చేతికి..
- అంతలోనే ప్రాణాలు విడిచిన నాగశ్రీ వందన పరిమళ



నాగశ్రీ వందన

తెనాలి : అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెనాలి యువతి నాగశ్రీ వందన పరిమళ(26) దుర్మరణం పాలైంది. సూరె గణేష్, రమాదేవి దంపతులకు ముగ్గురు కుమార్తెలు. రెండో కుమార్తె నాగశ్రీ వందన పరిమళ. డేటా అనలటిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ చేసేందుకు 2022లో అమెరికా వెళ్లి.. మెంఫిస్ యూనివర్సిటీలో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసింది. సోమవారం జరిగే యూనివర్సిటీ కాన్వొకేషన్‌లో ఎంఎస్ పట్టా తీసుకుంటానన్న సంతోషంలో ఉంది. ఈ నేపథ్యంలో అమెరికా కాలమానం ప్రకారం శుక్రవారం రాత్రి ఎవరినో రిసీవ్ చేసుకునేందుకు స్నేహితులతో కలిసి కారులో బయలుదేరింది. అదే రోజు రాత్రి 2.30 గంటల సమయంలో ఆమె ప్రయాణిస్తున్న కారు రోడ్డుపై నిలిపి ఉండగా.. వేగంగా వస్తున్న ట్రక్ ఢీకొట్టింది. ప్రమాదంలో నాగశ్రీ వందన పరిమళ అక్కడికక్కడే మృతిచెందింది. ప్రమాదం జరగడానికి అరగంట ముందు ఇంటికి ఫోను చేసి తల్లి రమాదేవితో మాట్లాడింది. ఆ తర్వాత కొద్దిసేపటికే రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడంతో ఆ కుటుంబం తల్లడిల్లిపోతోంది.

తిరుమలలో వైభవంగా
కార్తీక దీపోత్సవం



తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం సాయంత్రం కార్తీక పౌర్ణమి దీపోత్సవాన్ని టీటీడీ ఘనంగా నిర్వహించింది. కార్తీక పున్నమినాడు సాయంత్రం శ్రీవారికి సాయంకాల కైంకర్యాదులు నివేదనలు పూర్తయిన తర్వాత ఈ దీపోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో మొదట శ్రీ యోగనరసింహస్వామి ఆలయం పక్కన ఉన్న పరిమళం దగ్గర 80 కొత్త మూకుళ్లతో దీపాలను వెలిగించారు. తదుపరి వీటిని ఛత్రచామర, మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా విమాన ప్రదక్షిణం చేస్తూ, ఆనంద నిలయంలో శ్రీవారికి హారతి ఇచ్చారు. ఆ తరువాత గర్భాలయంలో అఖండం, కులశేఖర పడి, రాములవారి మేడ, ద్వార పాలకులు, గరుడాళ్వారు, వరదరాజస్వామి సన్నిధి, వకుళ మాత, బంగారు బావి, కల్యాణ మండపం, సభ అర, తాళ్లపాక అర, భాష్యకారుల సన్నిధి, యోగ నరసింహస్వామి, విష్వక్సేనులు, చందనం అర, పరిమళం అర, వెండి వాకిలి, ధ్వజ స్తంభం, బలి పీఠం, క్షేత్ర పాలకుల సన్నిధి, తిరుమలరాయ మండపం, పూల బావి, రంగ నాయక మండపం, మహా ద్వారం, బేడి ఆంజనేయస్వామి, శ్రీవరాహస్వామి ఆలయం, స్వామి పుష్కరిణి వద్ద సుమారుగా 1,000 నేతి జ్యోతులను మంగళ వాయిద్యాల నడుమ వేదమంత్రోచ్చారణలతో ఏర్పాటు చేశారు. కార్తీక దీపోత్సవం కారణంగా టీటీడీ పౌర్ణమి గరుడ సేవను రద్దు చేసింది. ఆలయంలో కార్తీకదీపోత్సవ శోభను చూసి భక్తులు తన్మయత్వంతో పులకించారు.

'సీపీఎస్' ఎమ్మెల్సీ అభ్యర్థిగా మధుబాబు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగులకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో ఏర్పాటైన సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం తరఫున వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పంతులు మధుబాబు బరిలో నిలువనున్నారు. ఈ విషయాన్ని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు దాముక కరుణాకర్ ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు.



ఉత్సాహంగా నేవీ మారథాన్

విశాఖ స్పోర్ట్స్: విశాఖ సాగరతీరం ఆదివారం జనసంద్రంగా మారింది. తూర్పు నావికాదళం ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే నేవీ మారథాన్‌లో భాగంగా 42 కిలోమీటర్ల పరుగుతో పాటు హాఫ్ మారథాన్, 10 కిలోమీటర్ల పరుగు పోటీలను నిర్వహించారు. ఔత్సాహికులను ప్రోత్సహించేందుకు ఐదు కిలోమీటర్ల ఫన్ రన్ నిర్వహించారు. తెల్లవారుజామున 4.15 గంటలకు మొదలైన 42 కిలోమీటర్ల ఫుల్ మారథాన్‌లో అథ్లెట్లు పాల్గొన్నారు. మారథాన్‌లో మెన్ అథ్లెట్లు ఉత్సాహంగా పాల్గొనగా, హాఫ్ మారథాన్‌లతో పాటు 10కే పరుగులో మహిళా అథ్లెట్లు సైతం సత్తాచాటుకున్నారు.

ఆ ఫుడ్.. సేఫ్టీనా?

- కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ నేతృత్వంలో హోటళ్లు, స్ట్రీట్ ఫుడ్‌ల తనిఖీకి ప్రత్యేక ఏర్పాట్లు
- నాచారం ఫుడ్‌సేఫ్టీ ల్యాబ్‌కు కొత్త హంగులు
- కొత్తగా వరంగల్, నిజామాబాద్, మహబూబ్‌నగర్‌లో ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్స్

'హైదరాబాద్‌లోనే పేరున్న ఓ హోటల్ నుంచి తెచ్చిన చికెన్ బిర్యానీ పార్శిల్‌లో బొద్దింక.. మరో హోటల్‌లో బిర్యానీలో కనిపించిన జెర్రీ... ప్రసిద్ధి చెందిన ఓ హోటల్ కిచెన్‌లోని ఫ్రిజ్‌లో పాడైపోయిన చికెన్..సేంద్రియ పంటల నుంచి తయారు చేసే స్వీట్ల దుకాణంలో అపరిశుభ్ర వాతావరణం'... గత కొంతకాలంగా హైదరాబాద్‌తోపాటు ఇతర నగరాల్లోని హోటళ్లలో ఆహార ప్రియులకు వినిపిస్తున్న చేదు వార్తలు ఇవి.



సాక్షి, హైదరాబాద్: పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఏర్పాటవుతున్న హోటళ్లు, ఇతర ఫుడ్ సెంటర్లలో ఆహార తనిఖీలకు అవసరమైన సిబ్బంది లేకపోవడం, ఆహార పరీక్షలు జరిపే సదుపాయాలు మెరుగుపడకపోవడం వంటి కారణాలతో కొన్నేళ్లుగా ప్రజారోగ్యంపై ప్రభుత్వాలు ఏమాత్రం శ్రద్ధ చూపలేదు. జీహెచ్‌ఎంసీతోపాటు అన్ని మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు హోటళ్లకు ట్రేడ్ లైసెన్స్‌లు ఇవ్వడంపై చూపిన శ్రద్ధ ఆహార భద్రతపై పెట్టలేదు. రోడ్ల పక్కన గప్‌చుప్, మిర్చిబజ్జీలు, బ్రేక్‌ఫాస్ట్‌తోపాటు ఇతర ఆహారం అందించే స్ట్రీట్ ఫుడ్ స్టాళ్లు హైదరాబాద్‌తోపాటు అన్ని జిల్లా కేంద్రాలు, నగరాల్లో విచ్చలవిడిగా వెలిశాయి. మధ్యాహ్నం, రాత్రి భోజనాలు కూడా రోడ్ల పక్కనే అందించే స్ట్రీట్ ఫుడ్ పాయింట్లు అయితే కోకొల్లలు. వీధుల్లోని ఫుడ్ సెంటర్లతోపాటు పేరున్న హోటళ్లలో సైతం నాణ్యత ప్రమాణాలతో ఆహారం అందించడం లేదని ఇటీవల తనిఖీలతో తేటతెల్లమైంది.

'ఫుడ్ సేఫ్టీ ఆన్‌వీల్స్'ద్వారా రాష్ట్రవ్యాప్త తనిఖీలు

ఆహార భద్రతపై వచ్చిన వందలాది ఫిర్యాదుల నేపథ్యంలో సీఎం రేవంత్, మంత్రి దామోదర రాజనర్సింహ ఫుడ్ సేఫ్టీపై ప్రత్యేక దృష్టి పెట్టారు. సీనియర్ ఐఏఎస్ అధికారి ఆర్‌వీ.కర్ణన్‌ను ఫుడ్ సేఫ్టీ కమిషనర్‌గా నియమించి ఆహార భద్రతకు సంబంధించి కఠిన చర్యలు తీసుకొనే బాధ్యతను ఆయనకు అప్పగించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఆహార తనిఖీ కోసం నాచారంలో ఒకే ల్యాబ్ ఉంది. అయితే కొత్తగా మూడింటిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. నాచారం ల్యాబ్‌ను ఆధునీకికరించడంతోపాటు వరంగల్, నిజామాబాద్, మహబూబ్‌నగర్‌లో ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయనున్నారు. ఇటీవల కొత్తగా 24 మంది ఫుడ్ సేఫ్టీ అధికారులకు వివిధ జిల్లాల్లో పోస్టింగ్ ఇచ్చారు. ఐదు మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్స్‌ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. వీటికి తోడు మరో పదింటిని రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులోకి తెస్తున్నారు. 'ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్' పేరిట ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ (ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏ) ప్రత్యేకంగా ఈ మొబైల్ యూనిట్లను అందిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ వాహనాల్లో ఫుడ్ లేబొరేటరీలను ఏర్పాటు చేసి, నగరం, పట్టణాల్లో రోజుకో ఏరియాలో మొబైల్ పరీక్షలు నిర్వహిస్తోంది. తద్వారా సంవత్సరానికి కనీసం 24 వేల ఆహార నమూనాలు పరీక్షించేలా లేబొరేటరీలను అందుబాటులోకి తేవాలని సంకల్పించింది. దీనికోసం 10 మంది ల్యాబ్ టెక్నీషియన్లు, ఇతర సిబ్బందిని నియమించింది. జీహెచ్‌ఎంసీతోపాటు వరంగల్, నిజామాబాద్, ఖమ్మం, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్లగొండలో ఈ పది మంది ఇప్పటికే రంగంలోకి దిగారు. స్ట్రీట్ ఫుడ్స్, గప్‌చుప్ బండ్లు, ఇతర ఆహార విక్రయ కేంద్రాల వద్ద ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏ నిబంధనలకు అనుగుణంగా ఆహారం ఉందో లేదో పరీక్షలు నిర్వహిస్తున్నారు.

ములుగు ఏజెన్సీకి భూకంపాల ముప్పు

ఓయూ భౌతిక శాస్త్రం ప్రొఫెసర్ లక్ష్మణ్ నాయక్



ఉస్మానియా యూనివర్సిటీ: ములుగు ఏజెన్సీకి భూకంపాల ముప్పు పొంచి ఉన్నదని ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ) భౌతికశాస్త్రం విభాగం ప్రొఫెసర్ లక్ష్మణ్ నాయక్ తెలిపారు. జియోగ్రాఫికల్‌గా ఈ ప్రాంతం అంతటా భూగర్భంలో బొగ్గు గనులు విస్తరించి ఉన్నాయని చెప్పారు. ఏజెన్సీ ప్రాంతంలో అనేక సార్లు భూకంపాలు సంభవించినా.. దట్టమైన అడవులు ఉండటం, శాస్త్ర పరిజ్ఞానం అంతగా లేకపోవటంతో ఇంతకాలం అధికారులు కనిపెట్టలేకపోయారని పేర్కొన్నారు. ఈ మధ్య అక్కడ తరచూ భూకంపాలు వస్తున్నట్లు తన పరిశోధన ద్వారా గుర్తించానని వివరించారు. గత ఆగస్టు 31న కూడా అక్కడ భూకంపం వచ్చిందని తెలిపారు. మేడారం, పస్రా, గోవిందరావుపేట, చలవాయి, తాడ్వాయి ప్రాంతాలతోపాటు గోదారి తీర ప్రాంతాలైన గోదారిఖని, బెల్లంపల్లి, రామగుండం వరకు భూకంపాలతో ముప్పు ఉందని వెల్లడించారు. ఈ ప్రాంతంలో భూకంపాలను నివారించాలంటే బొగ్గును తీసేందుకు శబ్దాలు లేని పేలుడు పదార్థాలను ఉపయోగించాలని సూచించారు. ప్రొఫెసర్ లక్ష్మణ్ ములుగు జిల్లా పస్రా గ్రామానికి సమీపంలోని ఏజెన్సీ ప్రాంతానికి చెందినవారే కావటం విశేషం.

చెరువులకు చేరింది
సగంలోపు చేప పిల్లలే

- 90 కోట్ల చేప పిల్లల పంపిణీకి మత్స్యశాఖ నిర్ణయం
- ఆ దిశగా అడుగులు వేయని అధికారులు
- 40 శాతం కూడా దాటని ఉచిత చేప పిల్లల సరఫరా

సాక్షి, హైదరాబాద్ : ఈ ఏడాది 90 కోట్ల చేప పిల్లలను చెరువుల్లోకి వదలాలని మత్స్యశాఖ నిర్ణయించింది. అయినా అందులో సగం లక్ష్యాన్ని కూడా చేరుకోలేకపోయారు అధికారులు. టెండర్లు ఆలస్యంగా ఖరారు కావడమే దీనికి ప్రధాన కారణం. అక్టోబర్ నెలలోనే ఉచితంగా చేప పిల్లల పంపిణీ ప్రారంభించినా, డిసెంబర్ నెలలో సగం రోజులు పూర్తవుతున్నా పంపిణీ ఇంకా పూర్తి కాలేదు. మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ప్రభుత్వ ఆశయానికి కాంట్రాక్టర్లు, మత్స్యశాఖ అధికారులు నీరుగారుస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

లెక్క ఎట్లా..?

మొదట ఒక గ్లాస్‌లో ఎన్ని చేప పిల్లలు పడతాయో లెక్కిస్తారు. ఆ తర్వాత ఆ గ్లాస్‌ను నింపుతూ ప్లాస్టిక్ కవర్లలో పోస్తారు. అంటే మొదట ఎన్ని వచ్చాయో అన్నే ఉన్నాయని కాంట్రాక్టర్ల లెక్క అన్నమాట. గ్లాస్‌లో తక్కువ నింపుతూ కాంట్రాక్టర్లు జేబులు నింపుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. వాస్తవంగా చేప పిల్లల పంపిణీ పూర్తి పారదర్శకంగా ఉండేలా వీడియో, ఫొటోలు తీయాలి. ఆ నిబంధనలేమీ పాటించకుండా పోశామా.. ఇచ్చామా అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. మరోవైపు ఇప్పటికే సమయం మించిపోవడంతో వచ్చింది చాలులే అన్నట్టుగా మత్స్యకారులు తీసుకుంటున్నారు.



90 కోట్ల చేప పిల్లల పంపిణీ ఎక్కడ?

2024–25 సంవత్సానికి 34 వేల చెరువుల్లో విడతల వారీగా 90 కోట్ల ఉచిత చేప పిల్లలను వదలాలని ప్రభుత్వం నిర్ణయించింది. జూన్‌లో టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. గత ప్రభుత్వం ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించకపోవడంతో టెండర్లు దాఖలు చేయలేదు. మూడుసార్లు టెండర్లు పిలిచినా, ఎవరూ రాకపోవడంతో మత్స్యశాఖ స్వయంగా రంగంలోకి దిగి కాంట్రాక్టర్లను ఒప్పించింది. ఎట్టకేలకు సెప్టెంబర్ చివరి నాటికి టెండర్లు ఖరారు చేసి, అక్టోబర్‌లో చేప పిల్లల పంపిణీ ప్రారంభమైంది. ఈ ఏడాది భారీ వర్షాలతో దాదాపు అన్ని చెరువులు నిండినా, సరైన సమయంలో చేప పిల్లలు వదలలేదు.

ఏడాది చివరిలో వదిలే చేప పిల్లలకు వృద్ధి ఉండదు

ఏడాది చివరిలో వదిలే ఏ రకమైన చేప పిల్లలైన ఎదుగుదల సరిగా ఉండదు. డిసెంబర్ ఆ తర్వాత వదిలే చేప పిల్లలు బక్కచిక్కి బరువు తక్కువగా ఉంటాయి. వీటికి వినియోగదారులు కొనడానికి ఇష్టపడరు. చేపలు పట్టడానికి కూలీ, రవాణా ఖర్చు మత్స్యకారులపై పడి ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుంది.

ఉచిత చేప పిల్లల పంపిణీ
తక్షణమే పూర్తి చేయాలి

ప్రభుత్వం విడుదల చేసే ఉచిత చేప పిల్లల పంపిణీ తక్షణమే పూర్తి చేయాలి. వచ్చే ఏడాది ముందుగానే టెండర్లు పిలిచి సకాలంలో చేపలను చెరువుల్లోకి వదలాలి. లేకుంటే మత్స్యకారులు నష్టపోవాల్సి వస్తోంది. దీనిపై మత్స్యశాఖ దృష్టి సారించాలని, ఆ దిశగా అడుగులు వేయాలి.

– మత్స్యకారులు సుదర్శన్, గౌటే గణేష్



● ముగ్గు-ముచ్చట



సి.రాజ్యలక్ష్మి
ఏఎస్‌రావు నగర్,
హైదరాబాద్

18 చుక్కలు, 6 వరుసలు
6 వరకు - సరిచుక్కలు







25 చుక్కలు,
13 వచ్చేవరకు
మధ్యచుక్క

గడగోజు స్రవంతి
ఈదులూరు,
నల్గొండ జిల్లా

మీరు ముగ్గులు వేస్తారా? అలా అయితే ముచ్చటైన మీ ముగ్గులను అందమైన రంగులతో కాగితం మీద పెట్టండి. చుక్కల వివరాలు, ఊరు పేరుతో సహా వాటిని మాకు పంపండి. వాటిలో మంచి ముగ్గును మీ ఫొటోతో సహా మేము ప్రచురిస్తాం.

ముగ్గులకు ఆహ్వానం



ముగ్గులు పంపవలసిన చిరునామా: ముగ్గు-ముచ్చట,
సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1,
బంజారాహిల్స్, హైదరాబాద్-34.
ఈ మెయిల్:
muggulu.sakshi@gmail.com

మంచిమాట

శక్తిమంతమైన మాటని చక్కగా ఉపయోగించుకో టానికి కొన్ని లక్షణాలని పెంపొందించుకోవాలి. అవి – సత్యం, హితం, మితం, ప్రియం, స్మితం, మధురం, ప్రథమం. ఏ ఒక్క లక్షణం ఉన్నా గొప్పే. అన్నీ ఉండటం సామాన్య మానవుల విషయంలో చాలా కష్టం. హితమైనది ప్రియంగా ఉండదు. సత్యం మధురంగా ఉండక పోవచ్చు. నిజం నిష్ఠురంగా ఉంటుంది కదా! "సత్యం బ్రూయాత్ ప్రియం బ్రూయాత్, న బ్రూయాత్ సత్య మప్రియం, ప్రియం చ నానృతంబ్రూయాత్, ఏష ధర్మ స్సనాతనః". ఈ ఆరు లక్షణాలతో ఎవరిని నొప్పించకుండా మాట్లాడాలి అంటే సహజ స్వభావానికి మెఱుగు పెట్టే శిక్షణ అవసరం.

మాటే మహాత్మ్యం

మాటకున్న మహత్తు ఇంతా అంతా కాదు. బయటి నుంచి తెచ్చుకోవాల్సిన పని లేని ఆయుధం. ప్రతి మనిషికి సహజంగా ఇవ్వబడినది. ఎవరికి వారికి తగిన రీతిలో ప్రత్యేకంగా తయారు చేసి ఇవ్వబడింది. మనిషి తనంత తానుగా చేయ వలసినది దానిని పదును పెట్టి, పాడవకుండా, తుప్పు పట్టకుండా చూసుకోవటం.

దానికి ముందుగా అందరూ అప్రయత్నంగా చేసేది పెద్దలని చూసి అనుకరించటం. తరువాత శిక్షణ తీసుకోవటం. ఈ శిక్షణ పాఠశాలలలో కాని, విడిగా శిక్షణాతరగతులలో కాని జరుగుతుంది.

ఇతర జీవులకి వేటికి లేని ప్రత్యేకత మానవుడికి మాత్రమే ఇవ్వ బడింది. అదే మనస్సు. దాని లక్షణం ఆలోచించటం. ఆపై తన ఆలోచనలను ఇతరులతో పంచుకోవటం. దానికి సాధనం భాష. మానవులకి మాత్రమే ఇవ్వబడిన భాష అనే విలువైన సాధనాన్ని సద్వినియోగం చేసుకోవాలి కదా!

అపార్థాలు కలగకుండా, అనర్థాలు వాటిల్లకుండా, సమర్థవంతంగా తన భావనలని వ్యక్తం చేయటానికి, దానికి సాధనమైన మాటని జాగ్రత్తగా ఉపయోగించాలి. మాటతో మనుషులు, కుటుంబాలు, సంస్థలు, దేశాలు కలుస్తాయి, విడిపోతాయి కూడా. మాట ప్రాణం పోస్తుంది, మాట ప్రాణం తీస్తుంది. వీటి అన్నిటికీ చరిత్రలో ఉదాహరణలు కోకొల్లలు. రామకథలో ప్రతి మలుపుకి ఒక మాట కారణమయింది. స్వతంత్ర భారత దేశం ముక్కలు కావటానికి ఒక మాట కారణం అంటారు ఆనాటి రాజనీతివేత్తలు. కుటుంబ కలహాలకి చెప్పుడు మాటలే కారణం అని విన్నవాళ్ళకి కూడా తెలుసు. కాని, ఆ క్షణాన ఆ మాటలు ఇంపుగా అనిపిస్తాయి. దీనినే కైటభుడుగా పురాణాలు సంకేతించి చెప్పాయి. వినగా వినగా నిజమేనేమో అనిపిస్తుంది, క్రమంగా నిజమే అనిపిస్తుంది. చిన్నప్పుడు విన్న బ్రాహ్మణుడు - నల్లమేకకథ గుర్తు ఉంది కదా! (ప్రస్తుతం మన ప్రచార, ప్రసార సాధనాలు ఈ సిద్ధాంతాన్ని బాగా ఉపయోగించుకుంటున్నాయి.) ఆంగ్లంలో ఒక సామెత ఉంది. ఒక కుక్కని చంపాలి అంటే ముందు అది పిచ్చిది అని ప్రచారం చేయాలి అని. మాటకి ఉన్న శక్తి అర్థమయింది కదా!

ఉచ్చారణ, వ్యాకరణం, వాక్యనిర్మాణం, కాకువు, ముఖకవళికలు, ముఖ్యంగా కళ్ళు, కనుబొమల కదలికలు, శరీరభంగిమ, కాళ్ళు చేతుల కదలికలు మొదలైనవి అన్నీ మాటలతో పాటు భావప్రకటనకి సహకరిస్తాయి. ఉచ్చారణ స్పష్టంగా లేక పోతే 'కళ్ళు' తెరవటం 'కల్లు' తెరవటం అవుతుంది. 'శకలం' (ముక్క) 'సకలం' (సమస్తం) అవుతుంది. 'శంకరుడు'కాస్తా 'సంకరుడు' అయిపోతాడు. తేడా తెలుస్తోంది కదా!

వ్యాకరణం తెలియక ఎంతో సదుద్దేశంతో ''సుపుత్రాప్రాప్తిరస్తు'' అని దీవిస్తూ ఉంటారు. అంటే సుపుత్ర అప్రాప్తి అవుతుంది. ''సుపుత్ర ప్రాప్తిరస్తు'' అనాలి. అందరికీ వాక్సిద్ధి లేకపోవటం అదృష్టం.

జాగ్రత్తగా ఉచ్చరించిన మాటలకి సరైన కంఠస్వరం తోడు ఉంటే వినాలని అనిపిస్తుంది. చెవితో వింటే కదా! ఆచరించాలని అనిపించేది. ఎన్నో సందర్భాలలో ఆర్థికంగా గాని, శారీరికంగా గాని సహాయం చేయలేక పోయినా మాటసహాయం చేసి సమస్యలని పరిష్కరించటం చూస్తాం. ఇంత శక్తిమంతమైన ఆయుధాన్ని సద్వినియోగం చేసుకుని ఎవరికి వారు ఉద్ధరించ బడుతూ పదిమందికి సహాయం చేయవచ్చు.

– డా.ఎస్.అనంతలక్ష్మి

తాత్వికథ

ఖాళీ బిందె



ఓ గ్రామంలోని చేదబావి దగ్గర ఇద్దరు మహిళలు వాదులాడుకుంటూ ఉన్నారు. ఒక మహిళ గట్టి గట్టిగా అరుస్తోంది. మాటలు పడుతున్న స్త్రీ కన్నీళ్ళు పెట్టుకుంది.

దారినపోతున్న ఓ పండితుడు అది గమనించాడు.

గట్టిగా మాట్లాడుతున్న మహిళతో ''ఇలా అరవడం మంచిది కాదు'' అని చెప్పబోయాడు.

''నోరు ఉన్న వాళ్ళదే కదా రాజ్యం!'' అని బదులిచ్చింది అరిచిన మహిళ.

చిన్న నవ్వు నవ్వాడు ఆ పండితుడు.

ఖాళీగా ఉన్న బిందెను చేంతాడు సహాయంతో బావిలోకి పంపమన్నాడు. 'అదెంత పని' అని అనుకున్న ఆమె ఖాళీబిందెను సరసరా బావి లోకి వదిలింది. బిందెలో నీళ్ళు చేరాక పైకి లాగమన్నాడు. శక్తిని ఉపయోగిస్తూ బిందెను లాగడం ప్రారంభించింది.

''ఎలా ఉంది?'' అని ప్రశ్నించాడు పండితుడు.

''బిందెలో నీళ్ళు ఉన్నాయి కదా, కాబట్టి బరువుగా ఉంది. కష్టంగా లాగుతున్నాను'' అని సమాధానమిచ్చింది.

''ఖాళీ బిందెని బావిలోకి వదిలినంత సులభంగా మనం ఎదుటివారిని ఎన్నో మాటలనవచ్చు. కానీ ఆ మాటలు ఎదుటి వారి మీద ఎంత ప్రభావం చూపిస్తాయో ఆలోచించాలి. నీళ్ళు చేరాక ఖాళీ బిందె ఎలా బరువయ్యిందో, అలాగే మన మాటలు చాలా మంది మనసుల్ని బరువుగా చేస్తుంది.

ఒంటికి తగిలిన గాయాలను కొన్నాళ్ళకు మరుస్తామేమో కానీ, మనసుకు తగిలిన గాయాల్ని అంత సులభంగా మరువలేము. ఆపైన, మనం ఎప్పుడు వారికి కనిపించినా మనం మాట్లాడిన మాటలే వారికి గుర్తుకు వస్తాయి. వారి మనసు బాధగా మూలుగుతుంది. విరిగిన మనసు అంత సులభంగా అతకదని తెలుసుకో. ఆ తర్వాత మనం ఎంత ప్రయత్నించినా మనలోని మంచి వారికి కనిపించదు.

అందుకే మనం మాట్లాడేటప్పుడు ఒకటికి రెండు సార్లు ఆలోచించి మాట్లాడాలి.మాటలు మన పెదాలు దాటితే అవి మన అధీనంలో ఉండవు. మాటలు అనడం తేలిక. మాటల పర్యవసానం చాలా భారం. దానికి ఎంతో మూల్యం చెల్లించాల్సి వస్తుంది. అంతేకాదు, మనుషుల్ని రాబట్టుకోవడం కష్టం, పోగొట్టుకోవడం సులభం'' అని హితవు చెప్పాడు.

నోరు మంచిదైతే ఊరు మంచిదని గుర్తించిన ఆ మహిళ, అక్కడే కన్నీళ్ళు పెట్టుకుని బాధ పడుతున్న స్త్రీని క్షమాపణలు కోరింది.

ఇద్దరూ కలిసి నవ్వుతూ చేద బావిలోని నీళ్ళను చేదుకున్నారు.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

ఆత్మబోధనం

మౌనం.. శక్తికి ఆధారం



భారతదేశం ఎన్నో దివ్య క్షేత్రాలకు, ఎన్నెన్నో దివ్య ధామాలకు నిలయం. ఆ సేతు శీతాచలం అసంఖ్యాకమైన పవిత్ర ఆలయాలు ఈ నేలపై కొలువై ఉన్నాయి. యుగాలు మారినా, తరాలు గడిచినా ఆ ఆలయాల శక్తి ఏ మాత్రం తరగలేదు. ఈ రోజుల్లో ఆలయాలకు వెళ్ళినప్పుడు భగవంతుడిని మొక్కుబడిగా చూసి, కోరికల చిట్టా విప్పడం అనవాయితీగా మారిపోయింది. గుడికి వెళ్లి కూడా అనేకమైన సమస్యల గురించిన చింతను వదలకుండా అదే పనిగా తలుచుకోవడం సామాన్యంగా మారింది. ఆలయాలు మహా శక్తి క్షేత్రాలు. ఆ ప్రదేశాలకు వెళ్ళినప్పుడు శక్తిని గ్రహించాలి. దేవుడిని దర్శించడంతో పాటు పరమాత్మ తత్వంతో ఏకీకృతం అయ్యే ప్రయత్నం చేయాలి. భగవద్ తత్వంతో లయం కావాలంటే మొదట మౌన స్థితికి చేరాలి. ఎందుకంటే భౌతిక జీవితంలో ఎదురయ్యే అనేక సమస్యల నుండి స్వాంతనను ఇవ్వగలిగే శక్తిని మీరు మౌనం ద్వారా పొందగలరు. మౌనం మీకు సత్య దర్శనాన్ని కలిగిస్తుంది. దివ్య ప్రదేశాలకు వెళ్ళినప్పుడు మనసును ప్రయత్న పూర్వకంగా స్తిమిత పరిచి శక్తిని ప్రోది చేసుకోవాలి. తక్షణమే మీ చింతలు తగ్గి, మనసు మీ అదుపులోకి వస్తుంది.

ఎన్ని పనులున్నా కోవెలకు వెళ్ళినప్పుడు మాత్రం అన్నీ వదిలి పెట్టాలి. ఫోన్ కాల్స్ కానీ, మెసేజీలు కానీ, ఆఫీస్ విషయాలు కానీ, ఇంటి పనులు, ఇతరితర విషయాలన్నీ పక్కన పెట్టి భగవద్ చైతన్యంతో మమేకం కావాలి. మహిమాన్విత ఆలయాలకు, పుణ్యక్షేత్రాలకు వెళ్లినప్పుడు, అక్కడికి చేరడంతోనే మీరు ఎంతో కొంత శక్తిని స్వీకరిస్తారు. అదే గనుక మౌన స్థితిలో ఉండగలిగితే మరింత అద్భుత శక్తిని పొందుతారు. ఆలయాలలో అనేక మాధ్యమాల ద్వారా ప్రసరించే దివ్యశక్తి మీ శక్తి శరీరాన్ని ప్రభావితం చేస్తుంది. శక్తి శరీరాన్ని కాంతి శరీరం అని కూడా అంటారు. శక్తి శరీరానికి దివ్య శక్తే ఆధారం. మీరు మౌన స్థితిలో ఉన్నప్పుడు మాత్రమే దివ్యశక్తి మీలోనికి అధికంగా ప్రవేశిస్తుంది. ముఖ్యంగా ఋషులు, దేవతలు ప్రతిష్ఠించిన పురాతన ఆలయాల్లో దేవతా శక్తి, ఋషుల తపోశక్తులు రెండూ కలగలిసి ఉంటాయి. ఎన్నియుగాలు గడిచినా ఇటువంటి ఆలయాలలోని శక్తి సంపద చెక్కుచెదరదు. అందుకే వందల సంవత్సరాలుగా భక్తకోటి తరలి వస్తున్నా ఇంకా అదే శక్తి ప్రకంపనలతో ఈ ఆలయాలు అలరారుతున్నాయి. ఈ కారణంగా ఆ ప్రదేశాలకు వెళ్ళినప్పుడు, భక్తి ప్రపత్తులతో మౌన స్థితో ఉండటం ఉత్తమం. అవకాశం కుదిరితే కాసేపు ఆ ప్రదేశాల్లో ధ్యానసాధన కూడా చేయండి. భగవంతుడి వద్దకు వెళ్లిన ప్రతిసారీ మీ సమస్యలను గురించో, లేకపోతే మీరు పొందాలనుకుంటున్న కోరికల గురించో విన్నవించుకునే బదులుగా, మీకు భగవంతుడు ప్రసాదించిన ఎన్నో వరాలకు భక్తితో కృతజ్ఞతలు తెలిపి, మౌనస్థితికి వెళ్ళండి. మీరు అనుభవిస్తున్న బాధలు, సమస్యలు అన్నీ పరమాత్మకు తెలుసు. అలాగే మీరు ఏమి కోరుకుంటున్నారో కూడా ఆయనకు తెలుసు. భగవంతుడు సర్వాంతర్యామి. మీరు చేయవలసింది భగవంతునికి మీ భక్తిని సమర్పించడం. స్వచ్ఛమైన మనసుతో, మౌనస్థితిలో భగవంతుడి చైతన్యంలో లయమవ్వడం. ఇలా చేస్తే జీవితంలో ఎదురయ్యే సమస్యలను క్రమక్రమంగా ఓర్పు నేర్పులతో పరిష్కరించుకోగల శక్తి మీకే లభిస్తుంది. దివ్యశక్తి మీతో కలిసి మీ ప్రగతికై పని చేస్తుంది.



– మాతా ఆత్మానందమయి, ఆధ్యాత్మిక గురువు

సినిమా

గ్రీన్ సిగ్నల్?



● సూర్య

సూర్య మంచి జోరు మీద ఉన్నారు. ఇప్పటికే కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో ఓ పీరియాడికల్ యాక్షన్ మూవీని పూర్తి చేశారు సూర్య. ప్రస్తుతం ఆర్‌జే బాలాజీ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. కాగా దర్శకుడు వెంకీ అట్లూరి ఇటీవల సూర్యకు ఓ కథ చెప్పారట. వెంకీ ఇప్పటి వరకూ ధనుష్‌తో 'సార్', దుల్కర్ సల్మాన్‌తో 'లక్కీ భాస్కర్' వంటి సూపర్ హిట్ చిత్రాలు తెరకెక్కించిన విషయం తెలిసిందే. తొలి, మలి చిత్రాల్లో ఉన్నట్లుగానే సూర్యకి చెప్పిన కథలో మంచి పాయింట్ ఉండటంతో వెంకీ దర్శకత్వంలో సినిమా చేయడానికి ఈ హీరో గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట.

లెనిన్?



● అఖిల్

అఖిల్ హీరోగా 'వినరోభాగ్యము విష్ణు కథ' ఫేమ్ మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వంలో 'లెనిన్' (ప్రచారంలో ఉన్న టైటిల్) అనే సినిమా రూపొందుతోందని సమాచారం. ఈ సినిమా ప్రారంభోత్సవం ఆదివారం హైదరాబాద్‌లో జరిగిందని, ఈ మూవీని అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్మెంట్స్ పతాకాలపై నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారని టాక్. అలాగే ఈ సినిమాలో శ్రీలీల హీరోయిన్ అని తెలిసింది. ఇది చిత్తూరు నేపథ్యంలో సాగే రూరల్ లవ్‌స్టోరీ మూవీ అని ఫిల్మ్‌నగర్ భోగట్టా.

బాధితురాలు.. నేరస్థురాలు.. లెజెండ్



● అనుష్కా శెట్టి

అనుష్కా శెట్టి లీడ్ రోల్‌లో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'ఘాటి'. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ సమర్పణలో రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సూపర్ హిట్ మూవీ 'వేదం' (2010) తర్వాత క్రిష్-అనుష్క కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం ఇది. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ఏప్రిల్ 18న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఇక ఇటీవల విడుదలైన గ్లింప్స్‌లో చేతిలో కొడవలితో ఒక వ్యక్తి తల నరికి, ఆ తలను పట్టుకుని నడుస్తూ కనిపించారు అనుష్క. 'విక్టిమ్, క్రిమినల్, లెజెండ్' అనే ట్యాగ్‌లైన్‌ని బట్టి బాధితురాలైన ఓ మహిళ పగ తీర్చుకునే క్రమంలో నేరస్థురాలిగా ఎలా మారింది? ఆ తర్వాత ఎలా లెజెండ్ అయింది? అనేది 'ఘాటీ' ప్రధానాంశం అని, అనుష్క పాత్రలో ఈ మూడు షేడ్స్ ఉంటాయని తెలుస్తోంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీతో సహా పలు భాషల్లో విడుదల కానున్న ఈ యాక్షన్ ప్యాక్డ్ మూవీకి సంగీతం: నాగవెల్లి విద్యాసాగర్, కెమెరా: మనోజ్ రెడ్డి కాటసాని.

నా క్యారెక్టర్‌కు కనెక్ట్ అవుతున్నారు



● ప్రియాంకా ప్రసాద్

సదన్, ప్రియాంకా ప్రసాద్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ప్రణయ గోదారి'. పీఎల్ విఘ్నేష్ దర్శకత్వంలో పారమళ్ళ లింగయ్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 13న విడుదలైంది. ఈ చిత్రం సక్సెస్‌మీట్‌లో పీఎల్ విఘ్నేష్ మాట్లాడుతూ– ''మా సినిమా చూసిన ప్రతి ఒక్కరూ బాగుందని చెప్పడం హ్యాపీగా ఉంది'' అన్నారు. ''ఈ సినిమాలో నా పాత్రకు ఆడియన్స్ కనెక్ట్ అవుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది'' అన్నారు ప్రియాంకా ప్రసాద్. ''ఈ సినిమా పాటలకు మంచి స్పందన లభిస్తోంది'' అన్నారు సంగీత దర్శకుడు మార్కండేయ.

తెలుగు ప్రేక్షకులు ఇచ్చే సపోర్ట్ గొప్పది

– విజయ్ సేతుపతి



● చింతపల్లి రామారావు, విజయ్ సేతుపతి, మంజు వారియర్

హీరో విజయ్ సేతుపతి, దర్శకుడు వెట్రిమారన్ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'విడుదల– 2'. వీరి కాంబినేషన్‌లోనే 2023లో వచ్చిన 'విడుదల 1'కు సీక్వెల్‌గా 'విడుదల 2' రూపొందింది. ఈ చిత్రం ఈ నెల 20న విడుదల కానుంది. 'విడుదల 2' సినిమాను శ్రీ వేదాక్షర మూవీస్ అధినేత చింతపల్లి రామారావు తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఆదివారం జరిగిన విలేకర్ల సమావేశంలో విజయ్ సేతుపతి మాట్లాడుతూ– ''తెలుగు ప్రేక్షకులు ఇచ్చే సపోర్ట్ గొప్పగా ఉంటుంది. ఇటీవల నా 'మహారాజా' సినిమాను సూపర్ హిట్ చేశారు. ఈ కోవలోనే 'విడుదల 2' కూడా మిమ్మల్ని అలరిస్తుందనే నమ్మకం ఉంది. ఇళయరాజాగారి సంగీతం ఈ సినిమాకు ప్లస్సవుతుంది'' అన్నారు. ''ఇది తమిళ చిత్రం అనుకుంటున్నారు. కానీ మన తెలుగు నేటివిటీకి దగ్గరగా ఉన్న సినిమా. మన తెలుగునాట జరిగిన వాస్తవ సంఘటనల, సమస్యల ఆధారంగా వెట్రిమారన్ తీసిన సినిమా ఇది. ఇండియన్ స్క్రీన్‌పై ఇప్పటివరకు తెలుగు ఆడియన్స్ చూడని పోరాట ఘట్టాలు ఈ చిత్రంలో ఉంటాయి'' అని తెలిపారు చింతపల్లి రామారావు. ''విజయ్ సేతుపతి వంటి గొప్ప నటుడితో నటించడం, 'అసురన్' తర్వాత వెట్రిమారన్‌తో మళ్లీ సినిమా చేయడం హ్యాపీగా ఉంది'' అని పేర్కొన్నారు మంజు వారియర్.

ఉల్లాసం... ఉత్సాహం



● దాసరి లోకేశ్‌బాబు

దాసరి లోకేశ్‌బాబు, శిరీష నులు జంటగా నటిస్తున్న సినిమా 'ఉల్లాసంగానే ఉత్సాహంగానే.'. కేవీజీ రాజు దర్శకత్వంలో మైత్రీ క్రియేషన్స్ పతాకంపై యార్లగడ్డ ఉమా మహేశ్వర రావు నిర్మిస్తున్నారు. ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో లోకేశ్ మాట్లాడుతూ– ''ఇదొక మంచి లవ్‌స్టోరీ. ఫీల్‌గుడ్ అంశాలతో పాటు అన్ని కమర్షియల్ హంగులు ఉన్న ఈ సినిమా మా టీమ్ అందరికీ సక్సెస్ ఇస్తుందని నమ్ముతున్నాను'' అన్నారు. ''లోకేశ్ ఎనర్జిటిక్‌గా నటించాడు. ఈ సినిమా విషయంలో మా నిర్మాతల సాయం మర్చిపోలేనిది'' అని తెలిపారు కేవీజీ రాజు. ''అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పించే చిత్రం ఇది'' అని పేర్కొన్నారు ఉమా మహేశ్వరరావు. ఈ సినిమా సహ నిర్మాతలు ఎండీ కలామ్, ఖదీర్, నటుడు జబర్దస్త్ ప్రవీణ్, నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ మాట్లాడారు.

అవార్డ్స్ వచ్చినా ఎవరూ ఫోకస్ చేయలేదు

– దర్శకురాలు హరిత



● ఏఆర్ అభి, హరిత గోగినేని

వేదిక లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'ఫియర్'. హరిత గోగినేని దర్శకత్వంలో డా. వంకి పెంచలయ్య, ఏఆర్ అభి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న రిలీజైంది. ఆదివారం జరిగిన సక్సెస్‌మీట్‌లో హరిత గోగినేని మాట్లాడుతూ– ''మా సినిమాకి 30 ఇంటర్‌నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో 70కి పైగా అవార్డులు దక్కాయి. ఎవరైనా ఒక సెలబ్రిటీ ఒక అవార్డు గెలుచుకుంటే ఎంతో ప్రచారం దక్కుతుంది. కానీ మేం కొత్తవాళ్లం కాబట్టి ఇన్ని అవార్డ్స్ వచ్చినా ఎవరూ ఫోకస్ చేయలేదు. తెలుగు సినిమాలో ఎవరూ వాడని, యునిక్ కలర్ ప్యాట్రన్‌ను మేం వాడాం. మంచి సౌండింగ్ ఉన్న థియేటర్‌లో ఈ సినిమా చూడండి'' అన్నారు. ''మా సినిమాను 150 థియేటర్స్‌లో రిలీజ్ చేశాం. అన్ని సెంటర్స్ నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వస్తోంది'' అన్నారు ఏఆర్ అభి.

సతీ లీలావతి



● లావణ్యా త్రిపాఠి

తెలుగులో రెండేళ్ల గ్యాప్ తర్వాత లావణ్యా త్రిపాఠి ఒక కొత్త చిత్రం అంగీకరించారు. 'సతీ లీలావతి' టైటిల్‌తో తాతినేని సత్య దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందనుంది. డిసెంబర్ 15న లావణ్య పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రాన్ని ప్రకటించి, ఓ పవర్‌ఫుల్ రోల్‌ని ఆమె చేయనున్నట్లు తెలిపింది చిత్రబృందం. దుర్గా దేవి పిక్చర్స్, ట్రియో స్టూడియోస్ పతాకాలపై నాగమోహన్ బాబు .ఎమ్, రాజేశ్ .టి ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ''ఓ ఆసక్తికరమైన కథాంశంతో రూపొందించనున్న ఈ చిత్రంలో లావణ్యా త్రిపాఠి వినూత్న పాత్రలో కనిపిస్తారు. త్వరలో షూటింగ్ ఆరంభిస్తాం. మరిన్ని వివరాలను త్వరలోనే తెలియజేస్తాం'' అని నిర్మాతలు పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జె. మేయర్, కెమెరా: బినేంద్ర మీనన్.

తెరపైకి బాబు జగజ్జీవన్ రామ్ జీవితం

స్వాతంత్ర్య సమరయోధుడు, భారత మాజీ ఉప ప్రధాని బాబు జగజ్జీవన్ రామ్ జీవితం ఆధారంగా 'బాబు జగజ్జీవన్ రామ్' సినిమా తెరకెక్కుతోంది. మిలటరీ ప్రసాద్ టైటిల్ రోల్‌లో నటిస్తున్నారు. దిలీప్ రాజా దర్శకత్వంలో పెదరావూరు ఫిలిం స్టూడియోస్, తెనాలి బ్యానర్ సంస్థలు నిర్మిస్తున్నాయి. ఈ చిత్రం ప్రెస్‌మీట్‌లో దిలీప్ రాజా మాట్లాడుతూ– ''దేశానికి ఎంతో సేవ చేసిన బాబు జగజ్జీవన్ రామ్‌గారి జీవితాన్ని డాక్యుమెంటరీలా కాకుండా ప్రేక్షకులకు నచ్చేలా రూపొందిస్తున్నాం. ఈ చిత్రంలో గాంధీజీ, నేతాజీ, లాల్ బహదూర్ శాస్త్రి, చంద్రశేఖర్ ఆజాద్‌ల పాత్రలు ఉంటాయి. ఇందులో జగజ్జీవన్ రామ్ కుమార్తె, లోక్ సభ మాజీ స్పీకర్ మీరా కుమార్ పాత్రలో తాళ్లూరి రామేశ్వరి నటిస్తున్నారు. బాబు జగజ్జీవన్ రామ్‌గారి వర్ధంతి అయిన జూలై 6న తెలుగుతో పాటు పాన్-ఇండియా భాషల్లో రిలీజ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నాం'' అన్నారు. ''ఎంతోమందికి స్ఫూర్తినిచ్చిన జగజ్జీవన్ రామ్ పాత్ర చేయడం నా అదృష్టం'' అన్నారు మిలటరీ ప్రసాద్.



● దిలీప్ రాజా, మిలటరీ ప్రసాద్

1 అంతర్జాతీయ క్రికెట్‌లో భారత్‌పై అత్యధిక సెంచరీలు (15) చేసిన ప్లేయర్‌గా స్టీవ్ స్మిత్ చరిత్ర సృష్టించాడు. ఆసీస్ మాజీ కెప్టెన్ పాంటింగ్ (14) పేరిట ఉన్న ఈ రికార్డును స్మిత్ అధిగమించాడు. జో రూట్ (13) మూడో స్థానంలో ఉన్నాడు. టీమిండియాపై వన్డేల్లో 5 శతకాలు బాదిన స్మిత్, టెస్టుల్లో 10 సెంచరీలు చేశాడు. ఇక భారత్, ఆస్ట్రేలియా మధ్య టెస్టుల్లో అత్యధిక (10) సెంచరీలు చేసిన రెండో ఆటగాడిగా స్మిత్ నిలిచాడు. సచిన్ (11) అగ్రస్థానంలో ఉన్నాడు.

1 టెస్టు క్రికెట్ చరిత్రలో రెండు వేర్వేరు జట్లపై 10 లేదా అంతకంటే ఎక్కువ సెంచరీలు చేసిన తొలి ప్లేయర్‌గా స్టీవ్ స్మిత్ రికార్డుల్లోకెక్కాడు. ఇంగ్లండ్‌పై 12 శతకాలు నమోదు చేసిన స్మిత్‌కు భారత్‌పై ఇది పదో సెంచరీ.

2 టెస్టుల్లో ఆస్ట్రేలియా తరఫున అత్యధిక సెంచరీలు చేసిన జాబితాలో స్మిత్ (33) రెండో స్థానానికి చేరాడు. బ్రిస్బేన్ మ్యాచ్‌లో శతకంతో స్మిత్... స్టీవ్ వా (32)ను దాటేశాడు. రికీ పాంటింగ్ 41 సెంచరీలతో అగ్రస్థానంలో ఉన్నాడు.

12 టెస్టు మ్యాచ్‌లో 5 లేదా అంతకంటే ఎక్కువ వికెట్లు పడగొట్టడం బుమ్రాకిది 12వ సారి. భారత పేసర్లలో కపిల్ దేవ్ 16 సార్లు ఈ ఫీట్ నమోదు చేయగా... బుమ్రా రెండో స్థానంలో ఉన్నాడు.

10 ఆసియా అవలి పిచ్‌లపై బుమ్రా 5 వికెట్లు పడగొట్టడం ఇది పదోసారి. ఈ జాబితాలో కపిల్‌దేవ్ (9)ను అధిగమించి బుమ్రా అగ్రస్థానానికి చేరాడు.

బ్రిస్బేన్‌లో తొలి రోజు వరుణుడు విజృంభిస్తే... రెండో రోజు ఆస్ట్రేలియా బ్యాటర్లు వీర విహారం చేశారు. ట్రావిస్ హెడ్ టీమిండియాపై తన ఆధిపత్యం కొనసాగిస్తూ మరో సెంచరీతో విరుచుకుపడగా... స్టీవ్ స్మిత్ సాధికారిక సెంచరీతో కదంతొక్కాడు. ఫలితంగా 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ' మూడో టెస్టులో ఆస్ట్రేలియా భారీ స్కోరు సాధించింది. భారత మేటి పేసర్ బుమ్రా 5 వికెట్లతో అదరగొట్టినా... అతనికి సహచర బౌలర్ల నుంచి ఆశించిన సహకారం లభించలేదు. దాంతో ఆస్ట్రేలియా మ్యాచ్‌పై పట్టు సాధించే అవకాశాన్ని సృష్టించుకుంది. మూడో రోజు వర్షం అంతరాయం కలిగించే అవకాశం ఉన్న ఈ పోరులో భారత బ్యాటర్ల ఆటతీరుపైనే టీమిండియా ఆశలు ఆధారపడి ఉన్నాయి.

కంగారూలు కసితీరా...

మూడో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 405/7

హెడ్, స్టీవ్ స్మిత్ సెంచరీలు

బుమ్రాకు 5 వికెట్లు


హెడ్
స్టీవ్ స్మిత్

బ్రిస్బేన్: సొంతగడ్డపై ఆస్ట్రేలియా జట్టు అదరగొట్టింది. 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ'లో భాగంగా జరుగుతున్న మూడో టెస్టులో ఆస్ట్రేలియా భారీ స్కోరు నమోదు చేసింది. గత మ్యాచ్ విజయం ఇచ్చిన స్ఫూర్తితో విజృంభించిన ఆస్ట్రేలియా ఆదివారం ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 101 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 405 పరుగులు చేసింది. భారత్‌తో మ్యాచ్ అంటే చాలు పూనకం వచ్చినట్లు చెలరేగే ట్రావిస్ హెడ్ (160 బంతుల్లో 152; 18 ఫోర్లు) వరుసగా రెండో మ్యాచ్‌లోనూ భారీ శతకంతో విజృంభించగా... చాన్నాళ్లుగా ఫామ్‌లో లేని మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్ (190 బంతుల్లో 101; 12 ఫోర్లు) రికార్డు సెంచరీతో రాణించాడు. వీరిద్దరి అసమాన ప్రదర్శన ముందు... బుమ్రా (5/72) ఒంటరి పోరాటం చిన్నబోయింది. వికెట్ కీపర్ అలెక్స్ కేరీ (47 బంతుల్లో 45 బ్యాటింగ్; 5 ఫోర్లు, 1 సిక్స్) కూడా రాణించడంతో రెండో రోజు ఆస్ట్రేలియా సంపూర్ణ ఆధిపత్యం కనబర్చింది. ఓవర్‌నైట్ స్కోరు 28/0తో ఆదివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆసీస్ ఓవరాల్‌గా రెండో రోజు 377 పరుగులు జతచేయడం విశేషం. భారత బౌలర్లలో బుమ్రా 5 వికెట్లతో అదరగొట్టగా... సిరాజ్, నితీశ్ కుమార్ రెడ్డి చెరో వికెట్ పడగొట్టారు. మూడో రోజు ఆసీస్ ఇంకెన్ని పరుగులు జోడిస్తుందనేది ఆసక్తికరం.

తొలి సెషన్ మనదే...

వర్ష సూచన మధ్య ప్రారంభమైన రెండో రోజు ఆటలో మొదట మన బౌలర్లు ఆకట్టుకున్నారు. బుమ్రాకు వికెట్ సమర్పించుకోకూడదు అనే సంకల్పంతో ముందుకు సాగిన ఓపెనర్లు ఉస్మాన్ ఖ్వాజా (54 బంతుల్లో 21), నాథన్ మెక్‌స్వీనీ (49 బంతుల్లో 9) చివరకు అతడి బౌలింగ్‌లోనే వెనుదిరిగారు. బంతి బంతికి వికెట్ తీసేలా కనిపించిన బుమ్రా... వరుస ఓవర్లలో వీరిద్దరినీ పెవిలియన్‌కు పంపాడు. దీంతో ఆస్ట్రేలియా 38 పరుగులకే 2 వికెట్లు కోల్పోవడంతో భారత జట్టుకు మెరుగైన ఆరంభమే లభించినట్లు అనిపించింది. లబుషేన్ (55 బంతుల్లో 12)తో పాటు ఆరంభంలో స్మిత్ అతి జాగ్రత్తకు పోవడంతో భారత బౌలర్లదే పైచేయి అయింది. గంటకు పైగా క్రీజులో గడిపినా... ఒక్క షాట్ ఆడలేకపోయిన లబుషేన్ చివరకు ఆంధ్ర క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డి బౌలింగ్‌లో వెనుదిరిగాడు. దీంతో ఆసీస్ 75/3తో నిలిచింది. ఇదే జోరు కొనసాగిస్తే మ్యాచ్‌పై టీమిండియా


బుమ్రా

పట్టు సాధించడం ఖాయమే అనే అంచనాలకు వస్తున్న తరుణంలో... స్మిత్‌తో కలిసి హెడ్ వీరోచితంగా పోరాడాడు. మొత్తానికి తొలి సెషన్ ముగిసేసరికి ఆసీస్ 104/3తో నిలిచింది.

12 పరుగుల వ్యవధిలో 3 వికెట్లు

మూడో సెషన్ ఆరంభంలోనూ స్మిత్, హెడ్ జోరు సాగింది. నాలుగో వికెట్‌కు 241 పరుగులు జత చేసిన తర్వాత ఎట్టకేలకు బుమ్రా ఈ జోడీని విడదీశాడు. టెస్టు ఫార్మాట్‌లో 25 ఇన్నింగ్స్‌ల తర్వాత సెంచరీ నమోదు చేసుకున్న స్మిత్... మూడంకెల స్కోరు చేసిన వెంటనే పెవిలియన్ చేరగా... పేస్ ఆల్‌రౌండర్ మిషెల్ మార్ష్ (5) ఎక్కువసేపు నిలవలేకపోయాడు. ఆఫ్‌స్టంప్ లైన్‌లో బుమ్రా వేసిన బంతికి మార్ష్ స్లిప్‌లో కోహ్లికి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అదే ఓవర్‌లో హెడ్ కూడా ఔటయ్యాడు. భారీ షాట్‌కు ప్రయత్నించిన ట్రావిస్ వికెట్ కీపర్ పంత్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ బాట పట్టాడు. దీంతో 12 పరుగుల వ్యవధిలో 3 వికెట్లు కోల్పోవడంతో ఇకనైనా ఆసీస్ ఇన్నింగ్స్‌కు తెరపడుతుందని ఆశిస్తే... వికెట్ కీపర్ అలెక్స్ కేరీ దాన్ని అడ్డుకున్నాడు. కెప్టెన్ ప్యాట్ కమిన్స్ (20)తో కలిసి ధాటిగా ఆడుతూ కీలక పరుగులు జోడించాడు. గాయం కారణంగా కాసేపు మైదానానికి దూరమైన సిరాజ్... ఆఖరికి ఒక వికెట్ పడగొట్టగా... కేరీతో పాటు మిషెల్ స్టార్క్ (7 నాటౌట్) క్రీజులో ఉన్నాడు. తదుపరి మూడు రోజుల ఆటకు వర్షం అంతరాయం కలిగించే అవకాశం ఉందన్న హెచ్చరికల మధ్య ఈ మ్యాచ్‌లో ఇప్పటికే ఆస్ట్రేలియా పటిష్ట స్థితికి చేరింది.

భారీ భాగస్వామ్యం

లంచ్ విరామం అనంతరం ఆస్ట్రేలియా గేర్ మార్చింది. అప్పటి వరకు రక్షణాత్మక ధోరణిలో ఆడిన ఆసీస్ ప్లేయర్లు... ఎదురుదాడికి దిగి ఫలితం రాబట్టారు. ముఖ్యంగా గత కొంతకాలంగా... టీమిండియాపై మెరుగైన ప్రదర్శన చేస్తూ... మన బౌలింగ్‌కు కొరకరాని కొయ్యలా మారిన హెడ్ అలరించాడు. రెండో సెషన్‌లో కెప్టెన్ రోహిత్ శర్మ తీసుకున్న నిర్ణయాలు కూడా ఈ జోడీకి పరోక్షంగా సహకరించాయి. హెడ్ క్రీజులో కుదురుకునే సమయంలో ఫీల్డింగ్ మోహరింపు అనుకూలంగా ఉండటంతో అతడు సునాయాసంగా పరుగులు రాబట్టగలిగాడు. షార్ట్‌బాల్‌ను సరిగ్గా ఆడలేని బలహీనతను సొమ్ము చేసుకునే విధంగా బౌలింగ్ సాగకపోగా... అడపాదడపా జరిగిన ప్రయత్నాల్లో రోహిత్ థర్డ్ మ్యాన్‌ను మోహరించకపోవడం ఆశ్చర్యం కలిగించింది. బుమ్రా బౌలింగ్‌లో ఆచితూచి ఆడిన హెడ్ ఆ తర్వాత దూసుకెళ్లాడు. మరో ఎండ్ నుంచి స్మిత్ అతడికి చక్కటి సహకారం అందించాడు. టచ్‌లోకి వచ్చాక రవీంద్ర జడేజా, నితీశ్ రెడ్డి బౌలింగ్‌ను లక్ష్యంగా చేసుకుంటూ హెడ్ బౌండరీలతో చెలరేగిపోయాడు. కొత్త బంతితో బౌలింగ్ చేయించేందుకు ప్రధాన పేసర్లను తప్పించడంతో ఆసీస్ జోడీ స్వేచ్ఛగా ముందుకు సాగింది. ఇన్నింగ్స్ ఆరంభంలో ఆత్మవిశ్వాసం లేకుండా కనిపించిన స్మిత్... లయ అందుకున్నాక ట్రేడ్‌మార్క్ షాట్లతో అలరించాడు. ఆకాశ్‌దీప్ బౌలింగ్‌లో ఇబ్బంది పడినట్లు కనిపించిన స్మిత్... మిగిలిన వాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నాడు. దీంతో రెండో సెషన్‌లో ఆసీస్ జట్టు వికెట్ కోల్పోకుండా 130 పరుగులు చేసింది.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: ఖ్వాజా (సి) పంత్ (బి) బుమ్రా 21; మెక్‌స్వీనీ (సి) కోహ్లి (బి) బుమ్రా 9; **లబుషేన్ (సి) కోహ్లి (బి) నితీశ్ రెడ్డి 12; స్మిత్ (సి)** రోహిత్ (బి) బుమ్రా 101; హెడ్ (సి) పంత్ (బి) బుమ్రా 152; మార్ష్ (సి) కోహ్లి (బి) బుమ్రా 5; కేరీ (బ్యాటింగ్) 45; కమిన్స్ (సి) పంత్ (బి) సిరాజ్ 20; స్టార్క్ (బ్యాటింగ్) 7; ఎక్స్‌ట్రాలు 33; **మొత్తం (101 ఓవర్లలో 7 వికెట్లకు) 405. వికెట్ల పతనం:** 1–31, 2–38, 3–75, 4–316, 5–326, 6–327, 7–385. **బౌలింగ్:** బుమ్రా 25–7–72–5; సిరాజ్ 22.2–4–97–1; ఆకాశ్‌దీప్ సింగ్ 24.4–5–78–0; నితీశ్ కుమార్ రెడ్డి 13–1–65–1; రవీంద్ర జడేజా 16–2–76–0.



విజేత రష్మిక

సాక్షి, హైదరాబాద్: ఏడాది విరామం తర్వాత తెలంగాణ టెన్నిస్ స్టార్ భమిడిపాటి శ్రీవల్లి రష్మిక తన కెరీర్‌లో రెండో అంతర్జాతీయ టైటిల్‌ను సాధించింది. మహారాష్ట్రలోని సోలాపూర్‌లో ఆదివారం ముగిసిన అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ35 టోర్నీలో 23 ఏళ్ల రష్మిక మహిళల సింగిల్స్ విభాగంలో చాంపియన్‌గా అవతరించింది. థాయ్‌లాండ్ ప్లేయర్ థామ్‌వైవట్ బున్‌యావితో జరిగిన ఫైనల్లో రష్మిక 7–5, 6–3తో గెలుపొందింది. 96 నిమిషాలపాటు జరిగిన ఈ తుది పోరులో రష్మిక ఐదు ఏస్‌లు సంధించి, ఆరు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన సర్వీస్‌ను నాలుగు సార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఏడుసార్లు బ్రేక్ చేసింది. రష్మిక చివరిసారి గత ఏడాది నవంబర్‌లో బెంగళూరులో జరిగిన ఐటీఎఫ్ డబ్ల్యూ25 టోర్నీలో విజేతగా నిలిచింది.

భారత్ శుభారంభం

పాకిస్తాన్‌పై 9 వికెట్ల తేడాతో గెలుపు


కమలిని

కౌలాలంపూర్: జూనియర్ ఆసియా కప్ అండర్–19 మహిళల టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో భారత జట్టు శుభారంభం చేసింది. గ్రూప్ 'ఎ'లో భాగంగా ఆదివారం జరిగిన పోరులో భారత్ 9 వికెట్ల తేడాతో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌ను చిత్తు చేసింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 67 పరుగులు చేసింది. కోమల్ ఖాన్ (24; 4 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా... యువ భారత బౌలర్లలో సోనమ్ యాదవ్ తన కోటా 4 ఓవర్లలో 6 పరుగులే ఇచ్చి 4 వికెట్లు పడగొట్టింది. అనంతరం భారత జట్టు 7.5 ఓవర్లలోనే ఒక వికెట్ మాత్రమే కోల్పోయి 68 పరుగులు చేసింది. తెలంగాణ అమ్మాయి గొంగడి త్రిష (0) డకౌట్ కాగా... వికెట్ కీపర్ కమలిని (29 బంతుల్లో 44 నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), సనికా చాల్కే (19 నాటౌట్; 3 ఫోర్లు) అజేయంగా జట్టును విజయ తీరాలకు చేర్చారు. కమలిని భారీ షాట్లతో విరుచుకుపడటంతో మరో 73 బంతులు మిగిలుండగానే గెలిచింది. తదుపరి మ్యాచ్‌లో మంగళవారం నేపాల్‌తో భారత జట్టు తలపడనుంది.



చైనాపై భారత్‌దే పైచేయి

జూనియర్ ఆసియా కప్ మహిళల హాకీ టోర్నీ టైటిల్ నిలబెట్టుకున్న టీమిండియా

మస్కట్: ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన పోరులో భారత మహిళల హాకీ జట్టు తమ ఆధిపత్యాన్ని చాటుకుంది. వరుసగా రెండోసారి జూనియర్ ఆసియా కప్ చాంపియన్‌గా టీమిండియా నిలిచింది. మూడుసార్లు చాంపియన్ చైనా జట్టుతో ఆదివారం జరిగిన ఫైనల్లో జ్యోతి సింగ్ నాయకత్వంలోని భారత జట్టు 'షూటౌట్'లో 3–2 గోల్స్ తేడాతో విజయం సాధించింది. అంతకుముందు నిర్ణీత సమయం ముగిసేసరికి రెండు జట్లు 1–1తో సమంగా నిలిచాయి. ఫలితంగా విజేతను నిర్ణయించేందుకు 'షూటౌట్' నిర్వహించారు. 'షూటౌట్'లో భారత్ తరఫున సాక్షి రాణా, ఇషిక, సునెలిత టొప్పో సఫలమయ్యారు. ముంతాజ్ ఖాన్, కనిక సివాచ్ విఫలమయ్యారు. చైనా తరఫున గువోటింగ్ హావో, లియు టాంగ్జీ సఫలంకాగా... వాంగ్ లిహాంగ్, లి జింగీ, దన్‌దన్ జువో విఫలమయ్యారు. ముగ్గురు చైనా ప్లేయర్ల షాట్‌లను భారత గోల్‌కీపర్ నిధి నిలువరించి టీమిండియా విజయంలో ముఖ్యపాత్ర పోషించింది. ఫైనల్ చేరుకునే క్రమంలో లీగ్ దశలో చైనా చేతిలో మాత్రమే ఓడిపోయిన భారత జట్టుకు టైటిల్ పోరులోనూ గట్టిపోటీ ఎదురైంది. తొలి 29 నిమిషాల వరకు రెండు జట్లు ఖాతా తెరువలేకపోయాయి. 30వ నిమిషంలో లభించిన పెనాల్టీ స్ట్రోక్‌ను చైనా జట్టు సద్వినియోగం చేసుకుంది. టాన్ జిన్‌జువాంగ్ గోల్ చేయడంతో మాజీ చాంపియన్ 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత 41వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను కనిక సివాచ్ గోల్‌గా మలచడంతో భారత్ స్కోరును 1–1తో సమం చేసింది. ఆ తర్వాత రెండు జట్లు మరో గోల్ చేయడానికి యత్నించినా ఫలితం లేకపోయింది.

'షూటౌట్' సాగిందిలా...

భారత్		స్కోరు		చైనా
సాక్షి రాణా	✔	1-0	✘	వాంగ్ లిహాంగ్
ముంతాజ్ ఖాన్	✘	1-1	✔	గువోటింగ్
ఇషిక	✔	2-2	✔	లియు టాంగ్జీ
కనిక సివాచ్	✘	2-2	✘	లి జింగీ
సునెలిత టొప్పో	✔	3-2	✘	దన్‌దన్ జువో

బీసీసీఐలో మరో పోస్ట్ ఖాళీ

మహారాష్ట్ర కేబినెట్‌లోకి బోర్డు కోశాధికారి ఆశిష్ షెలార్

ముంబై: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)లో మరో కీలక పదవి ఖాళీ అయ్యింది. కోశాధికారి ఆశిష్ షెలార్ మహారాష్ట్ర ప్రభుత్వ మంత్రి వర్గంలో చేరారు. ఆదివారం ఆయన ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ కేబినెట్‌లో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో క్రికెట్ బోర్డులోని తన కోశాధికారి పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. రెండేళ్ల క్రితం 2022 అక్టోబర్‌లో బీసీసీఐ కోశాధికారిగా షెలార్ ఎన్నికయ్యారు. గత నెల మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు జరుగగా... భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం కొలువుదీరింది. ముంబై సబర్బన్ జిల్లా పరిధిలోని వాంద్రే వెస్ట్ నియోజకవర్గం నుంచి ఆశిష్ షెలార్ ఎన్నికయ్యారు. కేంద్ర, రాష్ట్రాల్లో ఎన్నికైన ప్రజాప్రతినిధులెవరూ బోర్డు కార్యవర్గంలో ఉండకూడదని సుప్రీం కోర్టు మార్గదర్శకాలున్నాయి. 2016లో ఏర్పాటైన జస్టిస్ లోధా కమిటీ సిఫార్సులకు అనుగుణంగా సర్వోన్నత న్యాయస్థానం మార్గదర్శకాలు విడుదల చేసింది. అయితే 2022లో ఎమ్మెల్యే, ఎంపీలకు మినహాయింపునిస్తూ కేబినెట్ హోదా ఉన్న వారిని అనర్హులని తీసుకొచ్చిన సవరణకు సుప్రీం ఆమోదం తెలపడంతో ఇన్నాళ్లు ఎమ్మెల్యేగా ఉన్న షెలార్ కోశాధికారిగానూ పనిచేశారు. ఇప్పుడు రాష్ట్ర మంత్రి కావడంతో బోర్డు పదవికి రాజీనామా చేశారు. ఇదివరకే అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) చైర్మన్‌గా జై షా ఎన్నికవడంతో బీసీసీఐ కార్యదర్శి పదవి కూడా ఖాళీ అయ్యింది. ఇప్పుడు కీలకమైన కార్యదర్శి, కోశాధికారి పదవులు రెండూ ఖాళీగా ఉన్నాయి. అయితే జాయింట్ సెక్రటరీ దేవజిత్ సైకియా ప్రస్తుతానికి తాత్కాలిక కార్యదర్శిగా పని చేస్తున్నారు.



మెరిసిన జెమీమా, స్మృతి

తొలి టి20లో భారత మహిళల జట్టు గెలుపు

- 49 పరుగులతో ఓడిన వెస్టిండీస్
- రేపు రెండో టి20 మ్యాచ్


జెమీమా

నవీ ముంబై: భారత మహిళల జట్టు చాన్నాళ్ల తర్వాత ఆల్‌రౌండ్ ప్రదర్శనతో చెప్పుకోదగ్గ విజయం సాధించింది. వెస్టిండీస్‌తో ఆదివారం జరిగిన తొలి టి20 మ్యాచ్‌లో టీమిండియా 49 పరుగుల తేడాతో వెస్టిండీస్‌పై నెగ్గింది. టాపార్డర్ బ్యాటర్లు స్మృతి మంధాన (33 బంతుల్లో 54; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), జెమీమా రోడ్రిగ్స్ (35 బంతుల్లో 73; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) దంచేయగా, బౌలింగ్‌లో టిటాస్ సాధు (3/37), దీప్తి శర్మ (2/21), రాధా యాదవ్ (2/28) కరీబియన్ జట్టును దెబ్బతీశారు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 195 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్ ఉమా ఛెత్రి (26 బంతుల్లో 24; 4 ఫోర్లు), రిచా ఘోష్ (14 బంతుల్లో 20; 2 ఫోర్లు, 1 సిక్స్) పర్వాలేదనిపించారు. కరిష్మా రమ్హారాక్ 2, డియాండ్ర డాటిన్ 1 వికెట్ తీశారు. అనంతరం వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 146 పరుగులే చేసి ఓడింది. ఓపెనర్ కియానా జోసెఫ్ (33 బంతుల్లో 49; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), డియాండ్ర డాటిన్ (28 బంతుల్లో 52; 4 ఫోరు, 3 సిక్స్‌లు) రాణించారు. జెమీమాకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. మంగళవారం ఇదే వేదికపై రెండో టి20 మ్యాచ్ జరుగుతుంది.

స్కోరు వివరాలు

భారత మహిళల ఇన్నింగ్స్: స్మృతి (సి) కియానా (బి) కరిష్మా 54; ఉమా ఛెత్రి (బి) కరిష్మా 24; జెమీమా రోడ్రిగ్స్ (రనౌట్) 73; రిచా ఘోష్ (సి) మంగ్రూ (బి) డియాండ్ర 20; హర్మన్‌ప్రీత్ (నాటౌట్) 13; సజన (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 195. వికెట్ల పతనం:** 1–50, 2–131, 3–155, 4–190.
బౌలింగ్: చినెలీ హెన్రీ 2–0–17–0, జైదా జేమ్స్ 1–0–13–0, హేలీ 3–0–38–0, కరిష్మా 4–0–18–2, అఫీ ఫ్లెచర్ 3–0–39–0, డియాండ్ర 4–0–37–1, షమిలియా 1–0–11–0, కియానా జోసెఫ్ 2–0–22–0.
వెస్టిండీస్ మహిళల ఇన్నింగ్స్: హేలీ మాథ్యూస్ (సి) సబ్–మిన్నుమణి (బి) టిటాస్ 1; కియానా (సి) సైమా (బి) టిటాస్ 49; షెమైన్ (బి) దీప్తి శర్మ 13; డియాండ్ర (సి) రాధ (బి) టిటాస్ 52; చినెలీ హెన్రీ (సి) సబ్–మిన్నుమణి (బి) రాధ 7; షబిక (నాటౌట్) 15; అఫీ ఫ్లెచర్ (బి) దీప్తి శర్మ 0; జైదా (సి) ఉమా ఛెత్రి (బి) రాధ 5; మంగ్రూ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 146. వికెట్ల పతనం:** 1–2, 2–36, 3–80, 4–108, 5–126, 6–127, 7–140. **బౌలింగ్:** రేణుక 4–0–25–0, టిటాస్ సాధు 4–0–37–3, దీప్తిశర్మ 4–0–21–2, సైమా 4–0–35–0, రాధ 4–0–28–2.

3622 అంతర్జాతీయ మహిళల టి20ల్లో అత్యధిక పరుగులు సాధించిన భారత క్రికెటర్‌గా స్మృతి మంధాన గుర్తింపు పొందింది. ఇన్నాళ్లు హర్మన్‌ప్రీత్ (3589 పరుగులు) పేరిట ఉన్న రికార్డును స్మృతి సవరించింది.

117 అంతర్జాతీయ మహిళల టి20ల్లో అత్యధిక సిక్స్‌లు కొట్టిన బ్యాటర్ డియాండ్రా డాటిన్ (117) ఘనత సాధించింది. న్యూజిలాండ్ ప్లేయర్ సోఫీ డివైన్ (114) పేరిట ఉన్న రికార్డును డియాండ్రా బద్దలు కొట్టింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సూచీ	మార్పు	ముగింపు
సెన్సెక్స్ ▲	843	82,133
నిఫ్టీ ▲	220	24,768

విదేశీ సూచీలు


సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	19,924	▲	21
డోజోన్స్	43,857	▽	56
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,300	▽	11
డాక్స్	20,406	▽	20
షాంఘై	3,391	▽	70
నికాయ్	39,470	▽	379

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	84.46	85.48
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	106.20	109.01
€	యూరో	ఎస్‌బీఐ	87.60	90.22
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.83	56.23
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.43	55.62
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.82	65.54
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.73	23.29
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.21	24.00
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.80	12.62

స్టాక్స్ బడిలో 'టీనేజీ' పాఠాలు!



నేర్చుకోండి.. నేర్చుకోండి.. నేర్చుకోండి.. సరిగ్గా జీవించడమంటే అన్ని వేళలా నేర్చుకోవడమే.
– చార్లీ ముంగర్, విఖ్యాత ఇన్వెస్టర్



- యుక్త వయసు నుంచే ఈక్విటీ మార్కెట్‌పై అవగాహన
- ముందస్తు పెట్టుబడితో కాంపౌండింగ్
- దీర్ఘకాలంలో భారీ సంపద సృష్టి
- అందుబాటులో ఎన్నో కోర్సులు
- వర్చువల్ ట్రేడింగ్ వేదికలు
- పిల్లలకు నిపుణుల మార్గనిర్దేశం

పిల్లలు విద్యలో రాణిస్తుంటే తల్లిదండ్రుల ఆనందానికి హద్దులుండవు. వారి భవిష్యత్ బంగారమేనని మురిసిపోతుంటారు. తమ వారసులకు నాణ్యమైన విద్య, ఉపాధి మార్గం చూపడంతోనే తల్లిదండ్రుల బాధ్యత తీరిపోయినట్టు కాదు. సంపాదనను సంపదగా మార్చే విద్య కూడా వారికి చెప్పాలి. ఆర్థిక అంశాలపై సమగ్రమైన అవగాహన వారిని స్థితిమంతులను చేస్తుంది. ఆర్థిక సమస్యల్లో చిక్కుకోకుండా కాపాడుతుంది. ప్రతి ముగ్గురు అమెరికన్ ఈక్విటీ ఇన్వెస్టర్లలో ఒకరు 18 ఏళ్లకే ఈక్విటీల్లోకి అడుగు పెడుతున్నారు. మన దగ్గర 25 ఏళ్ల తర్వాతే ఎక్కువ మందికి ఈక్విటీల గురించి తెలుస్తోంది. స్టాక్స్ గొప్ప కాంపౌండింగ్ మెషిన్. ఎంత ముందుగా పెట్టుబడి మొదలు పెడితే, అన్ని రెట్లు అధిక ప్రతిఫలాన్ని ఇస్తుంది. గుజరాత్, మహారాష్ట్రలోని కొన్ని కమ్యూనిటీల్లో యుక్త వయసులోనే పిల్లలకు తల్లిదండ్రులు స్టాక్స్ పాఠాలు చెప్పడం మొదలు పెడతారు. పెట్టుబడుల వారసత్వాన్ని సైతం వారు ఎంతో కీలకంగా చూస్తారు. ఈ తరహా విధానం అందరికీ అనుసరణీయమేనన్నది నిపుణుల అభిప్రాయం. – సాక్షి, బిజినెస్‌డెస్క్

చిన్న నాటి నుంచే ఈక్విటీ పెట్టుబడుల పరిచయంతో భవిష్యత్తులో దాన్ని సంక్లిష్టంగా కాకుండా క్రమబద్ధంగా, సంపద సృష్టికి సులభమైన మార్గంగా చూడడం అలవడుతుందనేది ఈక్విరస్ వెల్త్ మేనేజ్‌మెంట్ ఎండీ, సీఈవో అభిజిత్ భవే అభిప్రాయం. ''ఆరంభానికి 16 ఏళ్ల వయసు అనువైనది. వాస్తవిక ఆర్థిక విషయాలను వారు అప్పుడే అర్థం చేసుకోవడం మొదలవుతుంది. 17 ఏళ్ల వయసుకు రిస్క్, రాబడి, దీర్ఘకాలంలో పెట్టుబడుల వృద్ధి తదితర అంశాలను అర్థం చేసుకోగలరు'' అని అభిజిత్ భవే చెప్పారు. ''టీనేజ్‌లో కుటుంబ సభ్యులు లేదా స్నేహితుల ద్వారా పెట్టుబడుల గురించి వింటుంటారు. ఆ దశలోనే వారిలోని ఆసక్తిని గుర్తించి నేర్పించడం మొదలు పెట్టాలి. 15–16 ఏళ్లపుడు ఆరంభిస్తే.. 17–19 ఏళ్లు వచ్చే సరికి ఈక్విటీలను అర్థం చేసుకోగలరు. వీరిలో కొందరు కెరీర్‌గానూ మలుచుకునే అవకాశం ఉంటుంది'' అని 5నాన్స్ డాట్ కామ్ వ్యవస్థాపకుడు దినేష్ రోహిరా సూచించారు.

''వారంతట వారే నేర్చుకునేలా పిల్లలను ప్రోత్సహించాలి. మెరుగైన మ్యూచువల్ ఫండ్స్ పథకాలు లేదా స్టాక్స్‌ను గుర్తించే అవకాశం కల్పించాలి. అప్పుడు ఫలితాలు ఎలా ఉంటాయో చూడాలి. నిర్ణయాలను నిందించకుండా, మంచి చెడుల పరంగా తీర్పు ఇవ్వకుండా తమ పెట్టుబడులు, తప్పిదాలు, విజయాల గురించి పంచుకునే స్వేచ్ఛ



ఇవ్వాలి. తమను తాము ఆవిష్కరించుకునే అవకాశం ఇవ్వాలి'' అని సెంటర్ ఫర్ ఇన్వెస్ట్‌మెంట్ ఎడ్యుకేషన్ అండ్ లెర్నింగ్ చైర్‌పర్సన్ ఉమా శశికాంత్ అన్నారు. ఇలా స్వేచ్ఛా వాతావరణం ఉంటే పిల్లలు సంతోషంగా పంచుకుంటారు. అప్పుడు వారి నిర్ణయాల్లోని లోపాలను ఎలా సరిచేసుకోవాలో వివరించి చెప్పొచ్చు. టీనేజ్ నుంచే వెన్ను తట్టి ప్రోత్సహించడం వల్ల సంపాదన మొదలయ్యే నాటికి వారు మెరికలుగా మారతారు. ''ఈక్విటీల్లో కాంపౌండింగ్ (రాబడిపై రాబడి)కు సమయం కావాలి. తల్లిదండ్రులు తమ పిల్లలకు ముందుగా ఈక్విటీ పెట్టుబడులను పరిచయడం చేయడం వల్ల, మార్కెట్లను మెరుగ్గా అర్థం చేసుకోగలిగి భవిష్యత్తులో అద్భుతమైన సంపదను సృష్టించుకోగలరు'' అని రూపీ విత్ రుషబ్ ఇన్వెస్ట్‌మెంట్ సర్వీసెస్ వ్యవస్థాపకుడు రుషబ్ దేశాయ్ పేర్కొన్నారు.

ఆర్థిక అంశాలు, పెట్టుబడులు, వివిధ సాధనాల గురించి స్కూల్ పాఠాల్లో ఉండదు. కనుక వీటి గురించి చెప్పే బాధ్యతను తల్లిదండ్రులు తీసుకోవాలి. పదో తరగతి లేదా ఇంటర్‌లోకి వచ్చిన వెంటనే ప్రాథమిక అంశాల గురించి అర్థమయ్యేలా వివరించి, కొన్ని కోర్సులను వారికి పరిచయం చేయాలి. దీంతో ఈక్విటీల గురించి మరింత లోతుగా నేర్చుకుంటారు. అయితే, మెజారిటీ తల్లిదండ్రులకు క్యాపిటల్ మార్కెట్లపై అవగాహన లేకపోవడం సమస్యగా పేర్కొన్నారు ఫిన్‌సేఫ్ ఇండియా వ్యవస్థాపకురాలు మృణ్ అగర్వాల్. అయినా సంకోచించకుండా, తమ పిల్లలను ఫైనాన్షి

ప్రాథమిక అంశాలు..



యల్ ప్లానర్లు/ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ల వద్దకు తీసుకెళ్లి అవగాహన కల్పించాలని సూచించారు. ఆన్‌లైన్ కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయి. ఒకవేళ తల్లిదండ్రులు స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నట్టు అయితే, కంపెనీలు, వాటి ఈక్విటీ, ఆదాయం, లాభాలు, యాజమాన్యం, రుణభారం, వివిధ రకాల మ్యూచువల్ ఫండ్స్, వాటి పెట్టుబడుల విధానం, రిస్క్, రాబడులు, బేర్, బుల్ మార్కెట్లు, ఆటుపోట్లు (వోలటాలిటీ), పెట్టుబడుల్లో వైవిధ్యం, కాంపౌండింగ్, లక్ష్యాలను నిర్ణయించుకోవడం, దీర్ఘకాలం పాటు ఇన్వెస్ట్ చేయడం తదితర అంశాల గురించి చెప్పాలి. ముందుగా పెట్టుబడులు ఆరంభించడం వల్ల రాబడిపై రాబడి (కాంపౌండింగ్) తోడయ్యి వచ్చే అద్భుత రాబడుల సూత్రాన్ని వివరించాలి. అధిక రాబడులు ఎప్పుడూ కూడా అధిక రిస్క్‌తో ఉంటాయన్న వాస్తవాన్ని తెలియజేయాలి. ఈ రిస్కును అధిగమించే వ్యూహాలపై అవగాహన కల్పించాలి.

నేర్చుకునేందుకు వేదికలు..

ఎన్ఎస్ఈ అకాడమీ సర్టిఫికేషన్ ఇన్ ఫైనాన్షియల్ మార్కెట్స్ (ఎన్‌సీఎఫ్ఎం):
నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) నిర్వహిస్తున్న అకాడమీ ఇది. ఆన్‌లైన్ ద్వారా ఎన్నో రకాల కోర్సులను అందిస్తోంది. బిగినర్, బేసిక్, ఇంటర్‌మీడియట్, అడ్వాన్స్‌డ్ ఇలా వివిధ దశల్లో వీటిని పొందొచ్చు. ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేసుకుని, ఫీజు చెల్లించిన తర్వాత మెటీరియల్ పొందొచ్చు. సన్నద్ధమైన తర్వాత పరీక్షలు రాయవచ్చు. ఎన్ఎస్ఈ అకాడమీ డాట్ కామ్ పోర్టల్‌ను సంప్రదించాలి.

బీఎస్ఈ ఇనిస్టిట్యూట్
బీఎస్ఈ సబ్సిడరీ ఇది. మూడేళ్ల గ్రాడ్యుయేట్, ఏడాది, రెండేళ్ల పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులను సైతం ఆఫర్ చేస్తోంది. ప్లస్2 తర్వాత వీటిలో చేరొచ్చు. రోజులు, వారాల నిడివితో స్టాక్ మార్కెట్లు, మ్యూచువల్ ఫండ్స్, డెరివేటివ్‌లపై స్వల్పకాలిక ప్రోగ్రామ్‌లు, కోర్సులను సైతం అందిస్తోంది.

నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్స్ (ఎన్ఐఎస్ఎం):
సెక్యూరిటీలపై స్వల్పకాలిక, దీర్ఘకాలిక కోర్సులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో సెబీ అందిస్తోంది.

ఉడెమీ
ఇదొక ఆన్‌లైన్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్. ఉచిత కోర్సులు కూడా ఇక్కడ లభిస్తాయి. రూ.449 నుంచి చెల్లింపుల కోర్సులు కూడా ఉన్నాయి.

17–19 ఏళ్ల వయసులో ప్రాథమిక అంశాలను దాటి లోతైన విశ్లేషణ, అధ్యయనాన్ని టీనేజర్లు ఆరంభించేలా చూడాలి. మార్కెట్లు, కంపెనీలను విశ్లేషించే సామర్థ్యాలు కచ్చితంగా తెలియాలి. అప్పటికే ఎన్నో ఏళ్ల పాటు పెట్టుబడులు పెట్టిన అనుభవం, మార్కెట్లపై సమగ్రమైన అవగాహన ఉంటే తల్లిదండ్రులే వీటి గురించి వివరంగా చెప్పొచ్చు. లేదంటే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ కోర్సుల్లో వారిని చేర్పించాలి. ఎన్ఎస్ఈ, బీఎస్ఈతోపాటు మరికొన్ని సంస్థలు ఈక్విటీలు, పెట్టుబడులకు సంబంధించి పలు కోర్సులను ఆఫర్ చేస్తున్నాయి. నిపుణులు రాసిన చక్కని పుస్తకాలు కూడా ఉన్నాయి. పరిశ్రమకు చెందిన నిపుణులు వర్క్‌షాప్‌లు, వెబినార్లను నిర్వహిస్తుంటారు. వర్చువల్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌లు, వార్తా పత్రికలు సమాచార వేదికలుగా ఉపయోగపడతాయి. తొలుత ఆరంభ స్థాయి, తదనంతరం అడ్వాన్స్‌డ్ కోర్సుల్లో చేర్పించొచ్చు. ఆర్థిక అంశాలు, ఆర్థిక వ్యవస్థల గురించి అవగాహన తప్పనిసరి. కంపెనీ ఆర్థిక మూలాలు, కంపెనీ ఉత్పత్తులు లేదా సేవలు, వాటి ద్వారా ఆదాయం పొందుతున్న తీరు, కీలక రంగాలు,

పరిశోధన, అధ్యయనం



వాటి పనితీరు, అంతర్జాతీయ ధోరణులు మార్కెట్లపై ఎలా ప్రభావం చూపిస్తాయన్నది తెలియాలి. ఫండమెంటల్, టెక్నికల్ కోర్సులను నేర్పించాలి. ''కంపెనీ బ్యాలన్స్ షీటును అర్థం చేసుకుని, విశ్లేషించే సామర్థ్యాలు అలవడితే, కంపెనీ నిధులను ఎలా వినియోగిస్తుందో తెలుసుకోగలిగితే అప్పుడు వారు తగిన కంపెనీని ఎంపిక చేసుకోగలరు. అప్పుడు అది పెట్టుబడి అవుతుందే కానీ, గ్యాంబ్లింగ్ కాబోదు. ఏమి చేస్తున్నాం? ఎందుకు చేస్తున్నాం? అన్న స్పష్టత ఉండాలి'' అని దినేష్ రోహిరా సూచించారు.

రిస్కులు/మోసాలు

ఈక్విటీ మార్కెట్లో పెట్టుబడులకు సంబంధించి రిస్కులు, మోసాల గురించి వివరంగా చెప్పాలి. తప్పుడు సలహాలతో ఏర్పడే నష్టం, వేరొకరి సూచనను గుడ్డిగా అనుసరించడం వల్ల వచ్చే రిస్కుల గురించి, భావోద్వేగాల నియంత్రణ ప్రాధాన్యాన్ని అర్థమయ్యేలా వివరించాలి. వేగంగా డబ్బులు సంపాదించేయాలన్న ధోరణి అస్సలు పనికిరాదు. ఒకవేళ మీ పిల్లల్లో ఈ ధోరణిని గుర్తిస్తే వెంటనే దాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలి. నేటి యువతరం ఎక్కువ మంది ఇదే ధోరణితో స్టాక్స్ వైపు అడుగులు వేస్తుండడాన్ని గమనించొచ్చు. క్రమశిక్షణతో కూడిన దీర్ఘకాలిక పెట్టుబడుల విధానానికి బదులు ట్రేడింగ్ వైపు మొగ్గు



చూపిస్తున్నారు. డెరివేటివ్స్ లావాదేవీల్లో లాభం వచ్చినా, నష్టం వచ్చినా రూ.వేలు, రూ.లక్షల్లో ఉంటుంది. డెరివేటివ్స్ స్పెక్యులేటివ్ ఆధారితం. ఇందులో రిస్కుల పట్ల పిల్లల్లో అవగాహన తప్పనిసరి. కష్టార్జితాన్ని కాపాడుకుంటూ, మెరుగైన రాబడులు సంపాదించడమే కర్తవ్యంగా ఉండాలి. కానీ, స్వల్ప కాలంలోనే సంపద కూడబెట్టడం అసాధ్యం అన్నది పిల్లలకు అర్థమయ్యేలా చేయాలి.

వాట్సాప్, యూట్యూబ్, ఎక్స్ తదితర ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా వచ్చే స్టాక్ రికమండేషన్ల ఉచ్చులో పడకుండా, టిప్స్‌కు దూరంగా ఉండేలా చూడాలి. ''అన్ని మార్గాల ద్వారా వస్తున్న సమాచారంతో ఈక్విటీ మార్కెట్లో డబ్బులు సంపాదించడం తేలికన్న భావన యువతలో సహజంగా ఏర్పడుతుంది. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు అతిపెద్ద రిస్క్'' అని మృణ్ అగర్వాల్ తెలిపారు. ఇతరులను గుడ్డిగా అనుసరిస్తే పెట్టుబడిని కూడా కోల్పోయే ప్రమాదం గురించి అర్థం కావాలి. నిజానికి సరైన రీతిలో వినియోగించుకుంటే సామాజిక మాధ్యమాలు, ఆన్‌లైన్ వేదికల నుంచి ఎంతో కీలక సమాచారాన్ని పొందొచ్చు. సమాచార వడబోత గురించి టీనేజర్లకు తెలిస్తే తప్పటడుగులు వేయకుండా మెరుగైన రక్షణ ఏర్పడినట్టే. స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్, సెక్టోరల్/థీమ్యాటిక్ ఫండ్స్‌లో ఉండే అధిక రిస్క్‌పై అవగాహన కల్పించాలి. స్టాక్స్‌లో స్వల్పకాలిక అస్థిరతల ప్రభావంతో నియంత్రణ కోల్పోకుండా చూడాలి.

వర్చువల్ ట్రేడింగ్ వేదికలు

నియోస్టాక్స్



వర్చువల్ ట్రేడింగ్‌కు సులభంగా, అర్థం చేసుకోవడానికి వీలుగా ఉంటుంది. ఇందులో రిజిస్టర్ చేసుకుని, సెక్యూరిటీలను ఎంపిక చేసుకుని ట్రేడింగ్ ప్రారంభించొచ్చు.

స్టాక్ ట్రెయినర్



మన దేశంతోపాటు ! అమెరికా సహా 15కు పైగా దేశాల స్టాక్స్ డేటాను ఈ ఆండ్రాయిడ్ యాప్ ఆఫర్ చేస్తోంది. వాటిలో వర్చువల్‌గా ట్రేడ్ చేసుకోవచ్చు, పనితీరును విశ్లేషించుకోవచ్చు.

పెట్టుబడులు-పర్యవేక్షణ



టీనేజర్లలో స్టాక్స్, మ్యూచువల్ ఫండ్స్‌పై ఏ మేరకు అవగాహన, విజ్ఞానం వచ్చిందో కొంత పెట్టుబడి వారికి సమకూర్చి పరీక్షించొచ్చు. పిల్లలు అప్పటి వరకు దాచుకున్న పాకెట్ మనీ ఉంటే, దాన్ని కూడా పెట్టుబడిగా పెట్టేలా ప్రోత్సహించాలి. లేదంటే తల్లిదండ్రులే ఆరంభ పెట్టుబడి కింద రూ.10,000 సమకూర్చాలి. లావాదేవీలకు వీలుగా డీమ్యాట్, ట్రేడింగ్ ఖాతాలు వారి పేరిట తెరిపించాలి. 18 ఏళ్లు నిండగానే ఈ పనిచేయాలి. 18 ఏళ్లలోపే పిల్లలు వీటి గురించి మెరుగ్గా తెలుసుకున్నారని భావిస్తే, అప్పుడు తల్లిదండ్రుల్లో ఒకరు తమ పేరిట ఖాతా తెరిచి, పిల్లలకు అందుబాటులో ఉంచాలి. మరోవైపు మ్యూచువల్ ఫండ్స్‌లో సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో పెట్టుబడులు పెట్టేలా చూడాలి. కొంత కాలానికి ఈ రెండింటి పనితీరును వారు పోల్చుకోగలరు. స్టాక్స్‌లో ఆటుపోట్లు ఎక్కువ. వీటిని ఫండ్స్ ఎలా అధిగమిస్తున్నాయన్నది తెలుసుకునే ఆసక్తి ఏర్పడుతుంది. ప్రతి 15 రోజులకు, నెల రోజులకు ఒకసారి పిల్లల పోర్ట్‌ఫోలియోను సమీక్షించి, అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తూ ప్రోత్సహించాలి. తప్పులను చూపించి నిందించడం ఎట్టి పరిస్థితుల్లోనూ చేయరాదు.

స్మాల్ క్యాప్ ఫండ్ నుంచి ఎస్‌డబ్ల్యూపీ

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రిసెర్చ్

ఏదైనా ఒక స్మాల్‌క్యాప్ ఫండ్‌లో పెద్ద మొత్తంలో ఇన్వెస్ట్ చేసి ఎస్‌డబ్ల్యూపీ ప్లాన్ ఎంపిక చేసుకోవచ్చా? అధిక శాతం పెట్టుబడులు స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లో ఉన్నప్పుడు, ఎస్‌డబ్ల్యూపీకి అనుకూలంగా తక్కువ అస్థిరతలతో కూడిన పోర్ట్‌ఫోలియో నిర్మాణం ఎలా?
– హరిహరన్ అనంతనారాయణన్

స్మాల్‌క్యాప్ పెట్టుబడులు అన్నవి చాలా రిస్క్‌తో ఉంటాయి. ఉదాహరణకు రూ.కోటి మొత్తాన్ని ఒక స్మాల్‌క్యాప్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసి 2006 నుంచి ఏటా 10 శాతం చొప్పున పెట్టుబడుల విలువ నుంచి ఉపసంహరించుకుంటూ వచ్చారని అనుకుంటే.. పెట్టుబడి ఇప్పటికీ రూ.6.3 కోట్లకు వృద్ధి చెంది ఉండేది. స్మాల్‌క్యాప్ ఫండ్స్ ఏ స్థాయిలో అధిక రాబడులు ఇస్తాయన్నదానికి ఇదొక నిదర్శనం. అయినప్పటికీ ఏటా 10 శాతం పెట్టుబడులను వెనక్కి తీసుకోవాలన్నది నా సూచన కాదు. ఆరంభ సంవత్సరాల్లో మరింత రక్షణాత్మక ధోరణితో ఇంతకంటే తక్కువే ఉపసంహరించుకోవాలి. రూ.కోటి ఇన్వెస్ట్ చేసి, ఏటా 2 శాతం చొప్పున ఉపసంహరించుకుంటే పైన చెప్పుకున్న ఉదాహరణలోనే పెట్టుబడి విలువ ఇప్పటికి రూ.18.7 కోట్లుగా మారేది. మీకు గణనీయమైన ఆస్తులు ఉండి, స్మాల్‌క్యాప్‌లోనూ చెప్పుకోతగ్గ మేర పెట్టుబడులు ఉండి, ఏటా ఉపసంహరణ రేటు 3 శాతం మించకపోతే అప్పుడు పెట్టుబడులను స్మాల్‌క్యాప్ పథకాల్లోనే కొనసాగించుకోవచ్చు. దీనివల్ల మానసిక ప్రశాంతతతో, మార్కెట్ల పతనాల్లో నిశ్చింతగా ఉండొచ్చు. వచ్చే 20–30 ఏళ్ల కాలంలో 2008 తరహా మార్కెట్ భారీ పతనాలు రెండు నుంచి మూడు చోటుచేసుకోవచ్చు. ఆ సమయాల్లో స్మాల్‌క్యాప్ పెట్టుబడుల విలువ మరింత పతనం కావొచ్చు. అయినప్పటికీ ఏటా 2 శాతం మేరే పెట్టుబడులను ఉపసహరించుకుంటే మార్కెట్ పతనాలను ఎదుర్కోగలరు. పూర్వపు మార్కెట్ భారీ పతనాలను చూసిన అనుభవం, నమ్మకం మీ పెట్టుబడుల విధానంతో కొనసాగేందుకు సాయపడతాయి. అస్థిరతలను అధిగమించేట్టు అయితే స్మాల్‌క్యాప్ పెట్టుబడులు అద్భుతమైన రాబడులను ఇస్తాయి. ఒకవేళ ఆటుపోట్లను సవాలుగా భావిస్తే, అప్పుడు రక్షణాత్మక ధోరణితో ఇన్వెస్ట్ చేసే పథకాలను ఎంపిక చేసుకోవాలి.



మార్కెట్లలో నెలకొన్న అస్థిరతల నేపథ్యంలో కమోడిటీలు, ఈక్విటీలు, డెట్, రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు పెట్టే మల్టీ అస్సెట్ ఫండ్స్‌ను ఎంపిక చేసుకోవచ్చా?
– ముఖర్జీ

మల్టీ అస్సెట్ ఫండ్స్ అన్నవి కనీసం మూడు రకాల సాధనాల్లో (సాధారణంగా ఈక్విటీ, డెట్, గోల్డ్) పెట్టుబడులు పెడుతుంటాయి. మార్కెట్ అస్థిరతలకు వ్యతిరేకంగా మల్టీ అస్సెట్ ఫండ్స్ ఎంపిక మెరుగైనదా? దీనికంటే ముందు 2008 నుంచి సెన్సెక్స్ పది దారుణ పతనాలను గమనించాలి. ఆ సమయంలో ఈక్విటీలు ఒక నెలలో 22.5 శాతం మేర నష్టపోయాయి. అదే సమయంలో బంగారం ధరలు కూడా తగ్గాయి. కాకపోతే ఈక్విటీలతో పోల్చి చూస్తే బంగారంలో క్షీణత కాస్తంత తక్కువ. పెట్టుబడుల విలువను రక్షించే స్థాయిలో ఈ వ్యత్యాసం లేదు. ఒక్క 2008 కాలం ఇందుకు మినహాయింపు. అప్పుడు ఈక్విటీలతో పోల్చితే బంగారం మెరుగ్గా పనిచేసింది. తక్కువ క్షీణించింది. చాలా సందర్భాల్లో ఈక్విటీ, డెట్ కలయిక సైతం ఇదే మాదిరి పనితీరు చూపించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

16-12-2024

విశాఖ	620–00
చిత్తూరు	633–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	630–00
విజయవాడ	630–00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	620–00
వరంగల్	622–00
రిటైల్ ధర	6.80

కొనుగోళ్లకే ఎఫ్‌పీఐల ఓటు

రూ. 22,766 కోట్ల పెట్టుబడులు



గత నెలలో దేశీ స్టాక్స్‌లో భారీగా ఇన్వెస్ట్ చేసిన విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) ఈ నెల(డిసెంబర్)లోనూ కొనుగోళ్లకే ఆసక్తి చూపుతున్నారు. వెరసి ఈ నెల తొలి రెండు వారాల్లో ఎఫ్‌పీఐలు రూ. 22,766 కోట్ల విలువైన స్టాక్స్ సొంతం చేసుకున్నారు. ఇందుకు ప్రధానంగా యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల కోత అంచనాలు ప్రభావం చూపుతున్నాయి. కాగా.. అక్టోబర్‌లో మార్కెట్ చరిత్రలోనే అత్యధికంగా రూ. 94,017 కోట్ల విలువైన అమ్మకాలు చేపట్టిన విదేశీ ఇన్వెస్టర్లు నవంబర్‌లోనూ నికరంగా 21,612 కోట్ల పెట్టుబడులు వెనక్కి తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే సెప్టెంబర్‌లో గత 9 నెలల్లోనే అధికంగా రూ. 57,724 కోట్లు ఇన్వెస్ట్ చేయడం గమనార్హం!

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
దేశ, విదేశీ ఆర్థికాంశాలే మార్కెట్‌కు దిక్సూచి
ఈ- టూవీలర్స్‌లోనూ పెద్ద కంపెనీలే

స్టాక్స్ వ్యూ

బీఎస్ఈ	బ్రోకరేజ్: యూఎల్‌జేకే రీసెర్చ్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 5,629 **టార్గెట్:** రూ. 6,211



ఎందుకంటే: ఈ ఆర్థిక సంవత్సరం(2024–25) రెండో త్రైమాసికంలో బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజీ(బీఎస్ఈ) అత్యుత్తమ ఫలితాలను సాధించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో ఆదాయం వార్షికంగా 137 శాతం(త్రైమాసికవారీగా 23 శాతం) జంప్‌చేసి రూ. 740 కోట్లకు చేరింది. ఈ బాటలో నిర్వహణ లాభం(ఇబిటా) 130 శాతం(29 శాతం) రూ. 430 కోట్లను తాకింది. ఇబిటా మార్జిన్లు 58 శాతాన్ని అధిగమించాయి. దీంతో నికర లాభం 192 శాతం(31 శాతం) ఎగసి రూ. 350 కోట్లుగా నమోదైంది. మ్యూచువల్ ఫండ్ విభాగంలో బీఎస్ఈ స్టార్ ఎంఎఫ్ భారీ వృద్ధిని అందుకుంది. ప్రాసెస్ చేసిన మొత్తం లావాదేవీలు 68 శాతం ఎగశాయి. మరోపక్క ఈ కాలంలో స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం 11 నూతన ఇండెక్సులను ప్రవేశపెట్టింది. వీటిలో బిజినెస్ గ్రూప్, అధికవ్యయ(ప్రీమియం) వినియోగం, ఇంటర్నెట్ ఎకానమీ తదితర పలు కొత్తతరహా ఇండెక్సులు సైతం ఉన్నాయి. ప్రస్తుతం బీఎస్ఈ యాజమాన్యం అటు ఐసీసీఎల్, ఇటు ఎన్‌సీఎల్‌తో చర్చలు నిర్వహిస్తోంది. వెరసి క్లియరింగ్ వ్యయాలను తగ్గించుకోవడం ద్వారా ఆర్థికపరమైన లబ్ధిని పొందాలని ఆశిస్తోంది. గత కొంతకాలంగా బీఎస్ఈ డెరివేటివ్స్ బిజినెస్ వృద్ధి పథంలో సాగుతోంది. ఊపందుకున్న టర్నోవర్, మెరుగుపడ్డ లావాదేవీల ఫీజులు ఇందుకు తోడ్పాటు నిస్తున్నాయి. వివిధ విభాగాలలో పనితీరు మెరుగుపడిన అంశాన్ని క్యూ2 ఫలితాలు ప్రతిబింబిస్తున్నాయి. నగదు విభాగంలో టర్నోవర్ భారీగా పెరగడంతోపాటు.. ఈక్విటీ డెరివేటివ్స్, ఎంఎఫ్ లావాదేవీలు ప్రభావం చూపుతున్నాయి.

పీఐ ఇండస్ట్రీస్	బ్రోకరేజ్: యాక్సిస్ సెక్యూరిటీస్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 3,998 **టార్గెట్:** రూ. 4,880



ఎందుకంటే: ఈ ఆర్థిక సంవత్సరం(2024–25) రెండో త్రైమాసికం(జులై–సెప్టెంబర్)లో పీఐ ఇండస్ట్రీస్ దేశీ బిజినెస్ వార్షిక ప్రాతిపదికన 6 శాతం క్షీణించింది. అయితే కొత్త ప్రొడక్టుల విడుదల తదితర సానుకూల అంశాల కారణంగా ద్వితీయార్ధం(అక్టోబర్–మార్చి)లో దేశీ ఆదాయం రెండంకెల వృద్ధిని అందుకునే అవకాశముంది. మరోపక్క ఆగ్రోకెమికల్ విభాగ ఎగుమతులు 12 శాతం పురోగతిని సాధించాయి. అయినప్పటికీ ప్రపంచ ఆగ్రోకెమ్ పరిశ్రమకు ఎదురవుతున్న సవాళ్లు, రాజకీయ భౌగోళిక అనిశ్చితులు కొనసాగుతుండటంతో ఈ విభాగ ఎగుమతులపై ప్రతికూల ప్రభావంపడే అవకాశమున్నట్లు కంపెనీ భావిస్తోంది. వెరసి కంపెనీ యాజమాన్యం ఈ ఏడాది ద్వితీయార్ధంలో ఆగ్రోకెమ్ ఎగుమతులు కొంతమేర మందగించవచ్చని అంచనా వేస్తోంది. సింగిల్ డిజిట్ లేదా రెండంకెల సమీపంలో వృద్ధి నమోదుకావచ్చని చెబుతోంది. అయితే వృద్ధి అవకాశాల అన్వేషణపై కంపెనీ అధిక దృష్టిని సారించింది. అంతేకాకుండా ఉత్తమ ప్రొడక్ట్ మిక్స్, పటిష్ట వర్కింగ్ క్యాపిటల్ నిర్వహణ ద్వారా లాభదాయకతను పెంచుకుంటోంది. ఈ ఏడాది తొలి అర్ధభాగం (ఏప్రిల్–సెప్టెంబర్)లో పెట్టుబడి వ్యయాలపై మొత్తం రూ. 443 కోట్లు వెచ్చించింది. గతేడాది ఇదే కాలంలో వెచ్చించిన రూ. 266 కోట్లతో పోలిస్తే 67 శాతం అధికంగా నిధులను కేటాయించింది. దీంతోపాటు సామర్థ్య వినియోగంపై ప్రత్యేక దృష్టిని పెట్టింది. ఈ బాటలో పూర్తి ఏడాదికి రూ. 800–900 కోట్ల పెట్టుబడి వ్యయ ప్రణాళికలను ప్రకటించింది. కొత్త ప్రొడక్టులు, ఫార్మా బిజినెస్‌పై ఫోకస్ కంపెనీకి మరింత బలాన్నివ్వనున్నాయి.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

క్లుప్తంగా...

లోక్‌అదాలత్‌లో లక్షన్నర కేసులు పరిష్కారం

వెల్లడించిన డీజీపీ కార్యాలయం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో అన్ని రకాలు కలిపి 1,57,088 కేసులు పరిష్కారం అయినట్టు డీజీపీ కార్యాలయం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. ఇరుపక్షాల అంగీకారంతో రాజీకి అర్హమైన కేసులు పరిష్కరించినట్టు అధికారులు పేర్కొన్నారు. ఇందులో పెట్టీ కేసులు 74,767, మోటార్ వెహికిల్ యాక్ట్ కేసులు 59,438, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కేసులు 2,131, ఇతర కేసులు 20,752 ఉన్నట్టు తెలిపారు. కేసులు పరిష్కారంలో మొదటి ఐదు స్థానాల్లో హైదరాబాద్ కమిషనరేట్ (24,546), సైబరాబాద్ (12,797), రాచకొండ కమిషనరేట్ (11,083), సూర్యాపేట (10,951), నిజామాబాద్ (10,246) నిలిచినట్టు వెల్లడించారు.

సికింద్రాబాద్ కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్‌కు 'ప్రెసిడెంట్ ఆఫ్ కలర్స్' అవార్డు

సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్‌కు అరుదైన గౌరవం దక్కింది. అత్యుత్తమ సేవలందించే సైనిక సంస్థలకు ఇచ్చే ప్రెసిడెంట్ కలర్స్ అవార్డుకు కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ (సీడీఎం) ఎంపికైనట్టు మిలిటరీ ఉన్నతాధికారులు తెలిపారు. వచ్చే వారంలో ఢిల్లీలో ఈ అవార్డు ప్రదానోత్సవం ఉంటుందని, సాయుధ సంస్థలకు ఇచ్చే అత్యున్నత గౌరవం ఇదని వారు వెల్లడించారు. భారత సేనకు సంబంధించిన మూడు సాయుధ బలగాల్లోని ఉన్నతాధికారులకు యుద్ధతంత్రాలు, నాయకత్వ లక్షణాలు, అంతర్జాతీయ స్థాయిలో మారుతున్న భద్రత సవాళ్లను ఎదుర్కొనే వ్యూహాలపై శిక్షణ ఇచ్చేందుకు సికింద్రాబాద్‌లో ఈ సీడీఎంను 1970లో స్థాపించారు. అప్పటి నుంచి ఎంతో మంది అధికారులకు శిక్షణ అందించడం ద్వారా భారత సేనలను బలోపేతం చేయడంలో సీడీఎం కీలక పాత్ర పోషించింది. ఇందుకు గుర్తింపుగానే ప్రతిష్టాత్మక ప్రెసిడెంట్ కలర్స్ అవార్డు దక్కినట్టు అధికారులు తెలిపారు.

టి-సాట్ లో వ్యవసాయ ప్రసారాలు

సీఈవో వేణుగోపాల్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: టి-సాట్ నెట్‌వర్క్ ద్వారా ఇక నుంచి వ్యవసాయ ప్రసారాలు అందించాలని నిర్ణయించినట్లు సంస్థ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 'నిపుణ'చానల్‌లో సోమ, శనివారాల్లో సాయంత్రం నాలుగు నుంచి ఐదు గంటల వరకు వ్యవసాయానికి సంబంధించిన ప్రత్యక్ష ప్రసారాలుంటాయని తెలిపారు. ఇవే కార్యక్రమాలు మరుసటి రోజు ఉదయం 7 గంటల నుంచి ఎనిమిది గంటల వరకు 'విద్య' చానల్‌లో ప్రసారమవుతాయన్నారు. ప్రతి మంగళవారం నిపుణ చానల్‌లో హార్టికల్చర్ కార్యక్రమాలు ప్రసారమవుతాయని, వీటిని మరుసటి రోజు ఉదయం ఏడు గంటల నుండి 8 గంటల వరకు 'విద్య'చానల్‌లో ప్రసారం చేయనున్నట్లు చెప్పారు. ఇక సాయంత్రం 4 నుంచి 5 గంటల సమయంలో వ్యవసాయ కార్యక్రమాలపై జరిగే ప్రత్యక్ష ప్రసార కార్యక్రమంలో నిపుణుల సలహాలు పొందేందుకు 040- 23540326/726 టోల్ ఫ్రీ నెం.1800 425 4039 నంబర్లకు కాల్ చేయాలన్నారు.

మొనాకో... చాలా కాస్ట్లీ గురూ!

ప్రపంచంలో ఒక్కో దేశంలో రియల్ ఎస్టేట్ ధరలు ఒక్కోలా ఉంటాయి. ఒక చదరపు అడుగు ధర ఒక్కో నగరంలో ఒక్కోలా ఉంటుంది. మనదగ్గర ఒక మిలియన్ డాలర్లు.. అంటే ప్రస్తుతం సుమారు రూ.8.48 కోట్లు ఉన్నాయనుకోండి.. ముంబై నగరంలో 1108.7 చదరపు అడుగుల స్థలాన్ని కొనొచ్చు. కానీ, ప్రపంచంలోని అత్యంత సంపన్న, ఖరీదైన దేశాల్లో ఒకటైన యూరోపియన్ దేశం మొనాకోలోని మొనాకో సిటీలో కేవలం 172.2 చ.అ. స్థలం మాత్రమే వస్తుంది. మరి, ప్రపంచంలోని మిగతా నగరాల్లో ఇదే సొమ్ముతో ఎంతెంత స్థలం కొనొచ్చో తెలుసా...



ఆధారం : గ్లోబల్ రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ నైట్ ఫ్రాంక్



ఆగని హిమం.. ఆనంద పరవశం...

ఈ చిత్రాన్ని చూసి దట్టమైన మేఘాలు వేగంగా కదులుతున్నాయనుకుంటే పొరపాటు. ఇది భీంపూర్ మండలం ధనోర గ్రామ సమీపంలోని నీటితో ప్రవహించే వాగు. ఇక్కడ కనిష్ట ఉష్ణోగ్రతలు 6.3 డిగ్రీలకు పడిపోయాయి. అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న ఈ వాగులో కురుస్తున్న దట్టమైన పొగమంచు నీటిని సైతం కన్పించకుండా మేఘాల మాదిరి కనువిందు చేస్తోంది. వేకువజాము నుంచి ఉదయం 11గంటల వరకు కురుస్తున్న పొగమంచు ప్రకృతి ప్రేమికులను అమితంగా ఆకర్షిస్తోంది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్.

ఆదిలాబాద్ @ 4.7 డిగ్రీలు

- పడిపోయిన కనిష్ట ఉష్ణోగ్రత
- రాష్ట్రమంతటా సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు తక్కువగా నమోదు



అర్లి(టి)లో చలినుంచి రక్షణకు పశువులపై కప్పిన గోనె దుప్పట్లు

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో కనిష్ట ఉష్ణోగ్రతలు భారీగా పతనమయ్యాయి. చాలాచోట్ల సాధారణం కంటే సగటున 2 డిగ్రీ సెల్సియస్ నుంచి 4 డిగ్రీ సెల్సియస్ తక్కువగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదివారం రాష్ట్రంలో అత్యంత తక్కువగా ఆదిలాబాద్‌లో కనిష్ట ఉష్ణోగ్రత 4.7డిగ్రీ సెల్సియస్‌గా నమోదైంది. ఇక్కడ ఈ సమయంలో నమోదు కావాల్సిన సాధారణ ఉష్ణోగ్రత కంటే 8.1 డిగ్రీలు తక్కువగా కనిష్ట ఉష్ణోగ్రత నమోదు కావడం గమనార్హం. పటాన్‌చెరు, హకీంపేట్, హనుమకొండ, మెదక్, నిజామాబాద్, రామగుండం, రాజేంద్రనగర్ ప్రాంతాల్లో సాధారణం కంటే 4డిగ్రీ సెల్సియస్‌కు పైబడి కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలో ఒక్కసారిగా నెలకొన్న వాతావరణ పరిస్థితులతో ఉష్ణోగ్రతలు పతనమైనట్టు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు సైతం సాధారణం కంటే తక్కువగానే నమోదయ్యాయి. ప్రస్తుతం రాష్ట్రానికి ఈశాన్య దిశనుంచి తక్కువ ఎత్తులో బలమైన గాలులు వీస్తున్నాయి. రానున్న రెండ్రోజులు ఉదయం పూట పొగమంచు ఏర్పడుతుందని, దీంతో జాగ్రత్తలు పాటించాలని వాతావరణ శాఖ సూచించింది. రానున్న మూడురోజులు కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటె 4డిగ్రీల వరకు తక్కువగా నమోదు కావొచ్చని వాతావరణ శాఖ సూచించింది.

ఆదివారం రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు(సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం	కేంద్రం	గరిష్టం	కనిష్టం
ఆదిలాబాద్	27.8	4.7	ఖమ్మం	31.0	17.0
భద్రాచలం	30.0	17.0	మహబూబ్ నగర్	30.0	16.6
దుండిగల్	29.0	14.2	మెదక్	29.6	9.8
హకీంపేట్	28.9	13.7	నల్లగొండ	27.5	17.6
హన్మకొండ	29.0	12.0	నిజామాబాద్	31.4	12.0
హైదరాబాద్	29.2	14.6	రామగుండం	28.1	11.6

అత్యంత తక్కువ ఉష్ణోగ్రతలు నమోదైన ప్రాంతాలు

ఆదిలాబాద్ : 4.7 డిగ్రీలు, అర్లి : 6.3డిగ్రీలు, తంద్ర: 6.6 డిగ్రీలు, తిర్యాణి: 6.7 డిగ్రీలు, కొహిర్: 6.8డిగ్రీలు, జుక్కల్: 7.6డిగ్రీలు, కొటగిరి: 7.7 డిగ్రీలు, శివంపేట్: 8 డిగ్రీలు, మల్లాపూర్: 8 డిగ్రీలు, మోమీన్‌పేట్: 8.2 డిగ్రీ సెల్సియస్ చొప్పున కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



రెడ్ రిసెల్డ్ ల్యాప్‌విగ్



వైట్ ఐ బెజార్డ్



కంసాలి పిట్ట



పైడ్ కింగ్ ఫిషర్

అడవంతా తిరిగి.. పక్షులను తిలకించి..

కవ్వాల్‌లో బర్డ్‌వాక్-పక్షులను కెమెరాలో బంధించిన వాచర్స్

జన్నారం: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధి కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో ఆదివారం బర్డ్‌వాక్ ఉల్లాసంగా సాగింది. బిహార్, బెంగళూరు, హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, నిర్మల్ ప్రాంతాల నుంచి 15 మంది బర్డ్ వాచర్లు వచ్చారు. శనివారం జన్నారం చేరుకున్న బర్డ్ వాచర్లకు రేంజ్ పరిధిలోని బైసన్‌కుంటలో రాత్రి బస కల్పించారు. ఆదివారం ఉదయమే సమీపంలోని అడవంతా తిరుగుతూ పక్షులను తిలకించారు. అరుదైన వివిధ రకాల పక్షులను కెమెరాలో బంధించారు. కొందరు బైనాక్యులర్‌తో పక్షులను తిలకించి మురిసిపోయారు. సఫారి ద్వారా మల్యాల వాచ్ టవర్ వద్దకు తీసుకెళ్లారు. అక్కడ కూడా పక్షులను ఫొటోలు తీశారు. ఉన్నతాధికారులు, జిల్లా అటవీశాఖ అధికారి శివ్‌ఆశిష్‌సింగ్ ఆదేశాల మేరకు జన్నారం అటవీ రేంజ్ అధికారి సుష్మారావు అధ్వర్యంలో బర్డ్‌వాక్ జరిగింది. ఇందన్‌పల్లి రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ బర్డ్‌వాక్‌ను పరిశీలించారు. డీఆర్వో తిరుపతి, సిబ్బంది సౌకర్యాలను ఏర్పాటు చేశారు. బర్డ్‌వాక్‌లో 60 రకాల పక్షులను గుర్తించినట్లు పలువురు తెలిపారు.



వైట్ త్రోటెడ్ కింగ్‌ఫిషర్



పెంటెడ్ స్పార్క్



ఓరియంటర్ డార్టర్

పేపర్-1 కఠినం.. పేపర్-2 మధ్యస్థం..



నిజాం కాలేజీలోని పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులు

- గ్రూప్-2 మొదటి రోజు పరీక్షలు ప్రశాంతం.. జీఎస్ పేపర్ కఠినంగా వచ్చిందన్న అభ్యర్థులు
- దరఖాస్తు చేసిన వారిలో 46 శాతం మందే హాజరు
- నేడు మరో రెండు పేపర్ల పరీక్ష

సాక్షి, హైదరాబాద్/అనంతగిరి: టీజీపీఎస్సీ గ్రూప్-2 పరీక్షలు ఆదివారం మొదటిరోజు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంతంగా జరిగాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో మొదటి, రెండో పేపర్ పరీక్షలు నిర్వహించగా, సోమవారం మూడు, నాలుగు పేపర్ల పరీక్షలు నిర్వహిస్తున్నారు. టీజీపీఎస్సీ ఇప్పటికే జారీచేసిన గ్రూప్స్ నోటిఫికేషన్లలో ఇదే చివరిది. ఇప్పటికే గ్రూప్-1, గ్రూప్-3 పరీక్షలు పూర్తికాగా.. గ్రూప్-4 ఉద్యోగాలను భర్తీ కూడా చేశారు. కాగా, ఆదివారం నిర్వహించిన గ్రూప్-2 మొదటి పేపర్ జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీ కఠినంగా వచ్చిందని అభ్యర్థులు తెలిపారు. అభ్యర్థి విషయ పరిజ్ఞానాన్ని లోతుగా పరిశీలించేలా ప్రశ్నపత్రం ఉందని మెజార్టీ అభ్యర్థులు చెప్పారు. ఇస్రో, జాతీయ అవార్డులు, ఖేలో ఇండియా, కాగ్, విద్యుత్ వాహనాలు, నీతి ఆయోగ్, వికలాంగులు, సీనియర్ సిటీజన్స్, జాగ్రఫీ, ఐటీలపై అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఎంచుకునేందుకు ఎక్కువ సమయం పట్టిందని వెల్లడించారు. దీంతో అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చేందుకు సమయం సరిపోలేదని ఎక్కువ మంది అభ్యర్థులు తెలిపారు. పేపర్-2లో హిస్టరీ, పాలిటీ, సొసైటీకి సంబంధించిన ప్రశ్నల్లో హిస్టరీ కఠినంగా ఉండగా, పాలిటీ కాస్త సులభంగా ఉందని పేర్కొన్నారు. సొసైటీపై ప్రశ్నలు మధ్యస్తంగా ఉన్నాయని పలువురు అభ్యర్థులు చెప్పారు. ప్రధానంగా తెలంగాణ హిస్టరీపై అడిగిన ప్రశ్నలు తికమకపెట్టేలా ఉన్నాయని తెలిపారు. కొందరు అభ్యర్థులు మాత్రమే ఈ ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇవ్వగలరని పేర్కొన్నారు.

46.3 శాతమే హాజరు

గ్రూప్-2 పరీక్ష మొదటిరోజు సగానికిపైగా అభ్యర్థులు హాజరుకాలేదు. మొత్తం 783 ఉద్యోగాల కోసం 5,51,855 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 74.96 శాతం మంది హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారు. పేపర్-1 పరీక్షకు 2,57,981 మంది (46.75%), పేపర్-2 పరీక్షకు 2,55,490 మంది (46.30%) మాత్రమే హాజరయ్యారు. అయితే పరీక్షల నిర్వహణ పూర్తయ్యి జవాబు పత్రాలు మొత్తం అందిన తర్వాత హాజరు శాతంపై స్పష్టత వస్తుందని టీజీపీఎస్సీ వర్గాలు తెలిపాయి.

పరీక్షా కేంద్రంలో మొబైల్ ఫోన్

వికారాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీ సాయి డెంటల్ కాలేజ్ సెంటర్ (కేంద్రం కోడ్ 4419) లో ఓ అభ్యర్థి వద్ద మొబైల్ ఫోన్ లభించటం కలకలం రేపింది. హాల్‌టికెట్ నంబర్ 2284419441 కలిగిన అభ్యర్థి వద్ద మొబైల్ ఫోన్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆ అభ్యర్థి పరీక్ష రాయకుండా అడ్డుకొని పోలీసులకు అప్పగించారు. అతడిపై మాల్‌ప్రాక్టీస్ చట్టం 25/97 కింద చర్యలు తీసుకొంటామని టీజీపీఎస్సీ కార్యదర్శి ఇ.నవీన్ నికోలస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్-2 పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 1,368 కేంద్రాలు ఏర్పాటుచేశారు.

విద్యార్థినులపై ప్రిన్సిపాల్ కర్కశత్వం

- రెండు గంటల పాటు చలిలో నిలబెట్టిన వైనం.. వరంగల్ జిల్లా ఐనపల్లి గురుకులంలో ఘటన



రాత్రి 7 గంటల వరకు హాస్టల్ ఎదుట చలిలో వేచి ఉన్న విద్యార్థులు

ఖానాపురం: వరంగల్ జిల్లా ఖానాపురం మండలం ఐనపల్లి మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల ప్రిన్సిపాల్ అక్కడి విద్యార్థినుల పట్ల అమానవీయంగా ప్రవర్తించారు. ఔటింగ్‌కు వెళ్లి అరగంట ఆలస్యంగా వచ్చారన్న కారణంతో రెండు గంటలపాటు బయట చలిలోనే నిల్చోబెట్టారు. మహాత్మ జ్యోతి బాపూలే పాఠశాల విద్యార్థులకు ఆదివారం తల్లిదండ్రులను కలిసేందుకు ఔటింగ్‌కు అనుమతి ఇచ్చారు. దీంతో వారు తమ తల్లిదండ్రులతో కలిసి బయటకు వెళ్లారు. సాయంత్రం 4 గంటలలోపు వారు తిరిగి పాఠశాలలోకి వెళ్లాల్సి ఉండగా, అరగంట ఆలస్యంగా రావటంతో ప్రిన్సిపాల్ వారిని లోనికి అనుమతివ్వలేదు. దీంతో విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు పాఠశాల ఎదురుగానే చలిలో సుమారు రెండు గంటలపాటు వేచి ఉన్నారు. అటు వైపుగా వెళ్లిన పోలీస్ సిబ్బంది గమనించి ఆరా తీసి పిల్లలను లోపలికి పంపాలని కోరినా ప్రిన్సిపాల్ వినిపించుకోలేదు. ఈ విషయాన్ని పలువురు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో వివరాలు తెలుసుకోవాలని డీటీడీఓకు కలెక్టర్ సూచించారు. దీంతో రంగంలోకి దిగిన డీటీడీఓ సదరు ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు. వెంటనే విద్యార్థినులను హాస్టల్‌లోకి అనుమతివ్వాలని ఆదేశించడంతో ప్రిన్సిపాల్ దిగొచ్చారు. కాగా ప్రిన్సిపాల్ తీరుపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తల్లిదండ్రులతోనూ నిత్యం అమర్యాదగా ప్రవర్తిస్తున్నారని, తమ పిల్లలతో మాట్లాడనీయకుండా చేస్తున్నారని మండిపడుతున్నారు.

ఇంగ్లిష్ ప్రావీణ్యం అంతంతే

ప్రపంచ వ్యాప్తంగా యువతలో ఆంగ్ల భాషా ప్రావీణ్యం రానురాను తగ్గుతోంది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది.. ఆసియా వాసుల ఆంగ్ల భాషా ప్రావీణ్యం దారుణంగా పడిపోయింది. ప్రభుత్వ రంగంలో పనిచేసేవారితో పోలిస్తే ప్రైవేటు రంగంలోని వారి భాషా నైపుణ్యాలు బాగున్నాయి. ఇఎఫ్ ఆంగ్ల భాషా ప్రావీణ్య సూచి (ఇఎఫ్ ఇపిఐ) 2024 నివేదికలో వెల్లడైన విషయాలివి. ఇఎఫ్ ఎడ్యుకేషన్ ఫస్ట్.. విద్యా రంగానికి సంబంధించిన ఈ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా 116 దేశాల్లో ఉంది. ప్రజల ఆంగ్ల భాషా ప్రావీణ్యాన్ని అంచనా వేసేందుకు ఏటా ఈఎఫ్ టెస్ట్ నిర్వహించి.. ఏటా ఇఎఫ్ ఇపిఐ విడుదల చేస్తుంటుంది. అలా గతేడాది నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షలో ప్రపంచ వ్యాప్తంగా 116 దేశాల్లోని 21 లక్షల మంది పాల్గొన్నారు. ఇందులో పాల్గొన్న వారి సగటు వయసు 26 ఏళ్లు. వారి వారి సామర్థ్యాలను బట్టి ఆయా దేశాలను.. అత్యద్భుతం, అద్భుతం, ఫర్వాలేదు, తక్కువ, చాలా తక్కువ విభాగాలుగా విభజించింది. ఇందులో మనదేశం తక్కువ ప్రావీణ్యం ఉన్న దేశాల జాబితాలో ఉంది. మన ర్యాంకు 69.

అత్యద్భుతమైన ప్రావీణ్యం ఉన్న టాప్ - 9 దేశాలు



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.


సప్తగిరుల దేవరాద్రి



ఘన చరిత్ర కలిగిన దేవరకొండ ఖిలా

ఎన్నో అద్భుత కళాఖండాలకు ప్రసిద్ధి.. ● అయినా అభివృద్ధిలో నిర్లక్ష్యం..పర్యాటక ప్రాంతం అయ్యేదెప్పుడు?

దేవరకొండ ఖిలాకు వందల ఏళ్ల చరిత్ర ఉంది. తెలంగాణలో ఉన్న కోటలన్నింటిలో దేవరకొండ కోట తనకంటూ ఓ ప్రత్యేకతను సొంతం చేసుకుంది. 13వ శతాబ్దంలో నిర్మితమైన దేవరకొండ ఖిలాకు సురగిరి అనే పేరుంది. అంటే దేవతల కొండ అని దీని అర్థం. కోట చుట్టూ ఎనిమిది చోట్ల అంజనేయస్వామి రూపాన్ని చెక్కి కోటను అష్ట దిగ్బంధనం చేశారని ప్రతీతి. ఎంతో ప్రాచుర్యం పొందిన దేవరకొండ ఖిలాను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ఈ ప్రాంత ప్రజల ఆకాంక్ష. అయినా పాలకులు దీనిపై దృష్టి పెట్టకపోవడంతో నిరాదరణకు గురవుతోంది. -దేవరకొండ



ఖిలాపై గల కోనేరు

కోట చుట్టూ 360 బురుజులు..

కాలక్రమేణా కోట గోడలు బీటలు వారినా.. నిర్మాణ శైలి నేటికీ అబ్బురపరుస్తోంది. పది కిలోమీటర్ల పొడవు, 500 అడుగుల ఎత్తులో ఏడు కొండల మధ్య నిర్మితమైన దేవరకొండ కోట శత్రుదుర్భేద్యంగా ఉండేది. మట్టి, రాళ్లతో కట్టిన గోడలు నేటికీ నాటి నిర్మాణ కౌశలాన్ని చాటుతున్నాయి. 7 గుట్టలను చుట్టుకొని ఉన్న శిలా ప్రాకారంలో 360 బురుజులు, రాతితో కట్టిన 9 ప్రధాన ద్వారాలు, 32 ప్రాకార ద్వారాలు, 23 పెద్ద బావులు, 53 దిగుడు బావులు, కోనేర్లు, కొలనులు, సైనిక నివాసాలు, ధాన్యాగారాలు, సభావేదికలు, ఆలయాలు ఇలా.. ఎన్నో.. ఎన్నెన్నో. ప్రతీ నిర్మాణం వెనుక ఓ చారిత్రక గాథ పలకరిస్తుంటుంది. రాజదర్బార్ ఉన్న కోట ద్వారాలకు రెండు వైపులా పూర్ణకుంభాలు, సింహాలు, తాబేళ్లు, చేపలు, గుర్రాలు వంటి ఆకృతులు ఇక్కడ రాతిపై చెక్కబడి ఉన్నాయి. కోట సమీపంలో నరసింహ, ఓంకారేశ్వర, రామాలయం వంటి పురాతన దేవాలయాలు దర్శనమిస్తాయి. ఇక్కడి శిల్ప కళా సంపద చరిత్రకు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తాయి.

సందర్శకుల తాకిడి..


దేవరకొండ ఖిలా సందర్శనకు హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున పర్యాటకులు వస్తుంటారు. సెలవు రోజుల్లో ఈ ప్రాంతం బిజీగా ఉంటుంది. అంతే కాకుండా హైదరాబాద్ నుంచి పలు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు, విదేశీయులు సైతం కోటను సందర్శించి ఇక్కడి శిల్ప కళా సంపదను చూసి ముగ్ధులవుతున్నారు. ఇక తొలి ఏకాదశి, మహా శివరాత్రి పర్వదినాల్లో దేవరకొండ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున కోటకు చేరుకొని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. ఈ కోట సింహద్వారంపై చెక్కబడిన పూర్ణకుంభం చిహ్నం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ చిహ్నంగా తీసుకోవడం గమనార్హం.

పద్మనాయకుల రాజధానిగా..

15వ శతాబ్దంనాటి ఈ కోటకు సంబంధించి ఎన్నో విశేషాలు వెలుగులోకి వచ్చాయి. సుమారు 700 ఏళ్ల కిందట 13వ శతాబ్దంలో కాకతీయులకు సామంతులుగా ఉండి.. ఆ తర్వాత స్వతంత్రులైన పద్మనాయకుల రాజధానిగా దేవరకొండ కీర్తి గడించింది. అనపోతనాయుడు, రెండవ మాదానాయుడి కాలంలో కోట నిర్మాణం జరిగింది. మాదానాయుడి వారసులు దేవరకొండని, అనపోతనాయుడి వారసులు రాచకొండను రాజధానిగా చేసుకొని క్రీ.శ 1236 నుంచి 1486 వరకు పాలన కొనసాగించారు. తర్వాత ఈ కోటను బహమనీ సుల్తానులు, కుతుబ్‌షాహీలు వశం చేసుకున్నారు.

పర్యాటక ప్రాంతంగా మార్చితే..

ఖిలాను పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయాలన్నది ఇక్కడి ప్రాంత ప్రజల చిరకాల కోరిక. దేవరకొండ ఖిలా గతమెంతో ఘనచరిత్ర కలిగి నాటి శిల్పకళా సంపదకు నిలువెత్తు రూపంగా నిలిచింది. ఈ ప్రాంతాన్ని ప్రభుత్వం పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేస్తే దేవరకొండతోపాటు చుట్టుపక్కల పట్టణాలు సైతం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతాయి. ఈ ఖిలా విశిష్టత సైతం నలుమూలల వ్యాప్తి చెందుతుందని ఇక్కడి ప్రజల కోరిక. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఖిలా ఆవరణలో పార్క్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. ప్రస్తుతం పార్క్ నిర్మాణ పనులు పూర్తయినట్టు అధికారులు పేర్కొంటున్నారు.



దేవరకొండ ఖిలా ప్రధాన ద్వారం

దేవరకొండ ఖిలాకు చేరుకునేదిలా..

దేవరకొండ ఖిలా హైదరాబాద్‌కు 110 కిలోమీటర్లు, నాగార్జునసాగర్‌కు 45 కి.మీ, నల్లగొండ నుంచి సాగర్‌కు వెళ్లే దారిలో కొండమల్లేపల్లి పట్టణం నుంచి 7 కిలోమీటర్ల దూరంలో ఉంది. హైదరాబాద్, నల్లగొండ, సాగర్ నుంచి దేవరకొండకు నేరుగా బస్సు సౌకర్యం ఉంది.



ఖిలాపై రామాలయం



ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా జూబ్లీహిల్స్ నివాసంలో ఆ మహనీయుడి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. చిత్రంలో మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి

సైబర్ బాధితులకు ఊరట..

- మెగా లోక్‌అదాలత్‌లో 4,893 మందికి రూ.33.27 కోట్లు రీఫండ్ చేయించిన టీజీసీఎస్‌బీ
- వెల్లడించిన తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్
- ఈ ఏడాదిలో 17,210 మంది బాధితులకు రూ.155.22 కోట్ల రిఫండ్



సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన బాధితుల్లో కొందరికి ఊరట లభించింది. బాధితులు పోగొట్టుకున్న సొమ్మును తిరిగి ఇప్పించడంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో మరో విజయాన్ని నమోదు చేసింది. శనివారం నిర్వహించిన మెగా లోక్‌అదాలత్‌లో మొత్తం 4,893 మంది బాధితులకు రూ.33.27 కోట్లను రిఫండ్ రూపంలో వారి ఖాతాల్లో జమ చేసినట్టు టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత లోక్‌అదాలత్‌లోనూ బాధితులకు రూ.27.2 కోట్లను రిఫండ్ చేసినట్టు పేర్కొన్నారు. టీజీసీఎస్‌బీ ద్వారా 2024లో మొత్తం 17,210 మంది బాధితులకు వారు పోగొట్టుకున్న సొమ్ములో రూ.155.22 కోట్లను రిఫండ్ చేయించినట్టు వెల్లడించారు.

సైబరాబాద్ కమిషనరేట్ టాప్..

శనివారం నాటి లోక్‌అదాలత్‌లో అత్యధిక రీఫండ్ చేయించిన మొదటి ఐదు యూనిట్ల వారీగా చూస్తే సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 2,136 కేసులలో రూ.12,77,49,117, హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 268 కేసులలో రూ.8,84,17,621, రాచకొండ కమిషనరేట్ పరిధిలో 592 కేసులలో రూ.4,53,06,114, టీజీసీఎస్‌బీ పరిధిలో 60 కేసులలో రూ1,06,49,044, సంగారెడ్డి జిల్లా పరిధిలో నమోదైన సైబర్ కేసులలో 188 మంది బాధితులకు రూ. 98,63,438 రీఫండ్ చేయించినట్టు శిఖాగోయల్ తెలిపారు. టీజీసీఎస్‌బీ అధికారులు, తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (టీజీఎల్ఎస్ఏ), జిల్లా జడ్జిలు, మెజిస్ట్రేట్, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ అధికారులు, పోలీస్ కమిషనర్లు, జిల్లాల ఎస్పీల సహకారం, సమన్వయంతోనే సాధ్యమైందని తెలిపారు. కాగా, సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఒకవేళ సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌లో లేదా నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ నేరం జరిగిన వెంటనే (గోల్డెన్ అవర్‌లో) సమాచారం ఇస్తేనే సైబర్ మోసగాళ్లు కొల్లగొట్టిన సొమ్ము రికవరీకి ఎక్కువ అవకాశం ఉంటుందని శిఖాగోయల్ తెలిపారు.

'టాప్' మోతపై ఏం చేద్దాం?



టమాటా, ఉల్లిగడ్డ, ఆలుగడ్డ ధరలతో వినియోగదారులు సతమతం


స్వల్పకాలిక పంట.. త్వరగా కుళ్లిపోవడమే కారణమని నివేదిక

సాక్షి, హైదరాబాద్: ప్రతీ ఏడాది ఏదో ఒక సీజన్‌లో టమాటాలు, ఉల్లిగడ్డల ధరలు ఒకేసారి పెరిగి 'సెంచరీ'కొట్టడం...మనందరి గుండెలు గుభిల్లుమనడం...మళ్లీ ఒక్కసారే వాటి ధరలు పడిపోవడం షరామామూలై పోతున్న విషయం మనకు తెలిసిందే. దక్షిణాదిలో ఈ సమస్య ఉండగా...టమాటా, ఉల్లిగడ్డల ధరల మోతతో పాటు దేశంలోని ఉత్తర, తూర్పు, పశ్చిమ తదితర ప్రాంతాల్లో ఆలుగడ్డల ధరలు బెంబేలెత్తిస్తున్న సంగతి కూడా విదితమే. ఏ యేడాదికి ఆ ఏడాది ఇలా ధరల పిడుగు మనపై పడుతూ, ఉత్పత్తి, సరఫరా సరిగా లేక ఈ సమస్య తీవ్రంగా ఉన్న రోజుల్లో 'కిచెన్ బడ్జెట్'ను కిందా మీదా చేస్తున్నా దీనికి తగిన పరిష్కారమంటూ లభించకపోవడం మాత్రం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. భారత రిజర్వ్ బ్యాంక్ వర్కింగ్ పేపర్ సిరీస్‌లో భాగంగా... డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనమిక్ అండ్ పాలసీ రీసెర్చ్ అక్టోబర్-2024లో విడుదల చేసిన 'వెజిటబుల్స్ ఇన్‌ఫ్లేషన్ ఇన్ ఇండియా :ఏ స్టడీ ఆఫ్ టమాటో, ఆనియన్ అండ్ పొటాటో (టాప్)'నివేదికలో వివిధ అంశాలను పొందుపరిచారు.

కన్జూమర్ ప్రైజ్ ఇండెక్స్ (సీపీఐ)లో పెద్దగా ప్రాధాన్యత లేని టమాట, ఉల్లిగడ్డ, ఆలుగడ్డలు వివిధ సందర్భాల్లో అధిక ధరల పెరుగుదల కారణంగా ఆహారపదార్థాలపై ప్రభావం పడటంతో పాటు ద్రవ్యోల్బణం విషయంలో వార్తాపత్రికలు, దృశ్యమాధ్యమాల పతాక శీర్షికలకు కారణమవుతోంది. ఈ నివేదికలో భాగంగా...వివిధ అంశాలను పరిశీలించారు. వాల్యూచెయిన్‌తో ముడిపడిన అంశాలు తదితరాలపై అధ్యయనం చేశారు. వీటిధరల్లో రైతుల భాగస్వామ్యం అనే విషయానికొస్తే...టమాటాల్లో 33 శాతం, ఉల్లిపాయల్లో 36 శాతం, ఆలుగడ్డల్లో 37 శాతం రైతుల 'షేర్'ఉన్నట్టుగా పేర్కొన్నారు.


వీటి పెట్టుబడి ఖర్చులు, వర్షపాతం, కూలీల వేతనాలు ఇంకా... సీజనల్ ఆటోరిగ్రెసివ్ ఇంటిగ్రేటెడ్ మూవింగ్ యావరేజ్ విత్ ఎక్సోజీనోస్ వేరియబుల్ (సారిమాక్స్) ప్రభావితం చేస్తున్నట్టుగా అంచనావేస్తున్నారు. చాలా దేశాల్లో మాదిరిగానే భారత్‌లోనూ...కరోనా మహమ్మారి అనంతర పరిస్థితులు, ఉక్రెయిన్ యుద్ధం కారణంగా తలెత్తుతున్న పరిణామాల ప్రభావంతో సరఫరాలో సమస్యలు ఎదురవుతున్నాయి. ఇందులో భాగంగా... భారత్‌లో ఆహార పదార్థాల ధరల ద్రవ్యోల్బణానికి కన్జూమర్ ప్రైస్‌ఇండెక్స్ (సీపీఐ)లో ఇవి మూడు అధిక ప్రాధాన్యతను పొందే పరిస్థితి ఏర్పడింది. మనదేశంలో అత్యధికంగా ఉత్పత్తి అయ్యి, అధికంగా వినియోగించే కూరగాయల్లో ఈ మూడు ఉండటంతో కొరత ఏర్పడినప్పుడు ధరల పెరుగుదలతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇవి మూడు కూడా ప్రధానంగా స్వల్పకాలిక పంటలు, (షార్ట్ సీజనల్ క్రాప్స్) త్వరగా కుళ్లిపోవడం, కొన్ని ప్రాంతాల్లోనే వీటి ఉత్పత్తి కేంద్రీకృతం కావడం, వాతావరణంలో చోటుచేసుకునే మార్పుల ప్రభావం వీటిపై తీవ్రంగా పడడం వంటి కారణాల వల్ల ధరల హెచ్చుతగ్గులకు అవకాశం ఏర్పడుతోందని ఈ నివేదికలో పేర్కొన్నారు.





సూచించిన పరిష్కారాలు...

- నెలవారీగా ఈ మూడింటి సప్లయ్, డిమాండ్‌ను రూపొందించి, దీనికి తగ్గట్టుగా మార్కెట్ స్పందనలు.. మరీముఖ్యంగా రైతులు, వ్యాపారులు, దిగుమతిదారులు, స్టాకిస్టులు, వినియోగదారుల కొనుగోలుతీరును పరిశీలించాలి.
- వీటి ధరలు అకస్మాత్తుగా పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వాటి స్టాక్‌లు అందుబాటులో ఉండేలా చూసుకుంటూ ధరల పెరుగుదలలు స్వల్పంగా ఉండేలా చూసుకోవాలి.
- వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుచేర్పులను ఎప్పటికప్పుడు అంచనావేస్తూ...వచ్చే 12 నెలలకుగాను ఈ ఉత్పత్తులు అందుబాటులో ఉండేలా చూసుకోవడంతో పాటు ఇతర ఆహార పదార్థాల ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం వంటి వాటిని ముందుగానే ఊహించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఈ మూడింటి ధరలు పెరగకుండా జాగరూకతతో వ్యవహరించడంలో భాగంగా వీటికి సంబంధించి వాల్యూ చెయిన్‌ను అర్థం చేసుకుని, వినియోగదారులు చెల్లించే మొత్తంలో వీటిని పండించే రైతుల వాటాను పెంచేలా చర్యలు చేపట్టాలి.



చిన్న రాళ్లపై ఒదిగిపోయిన పెద్ద బండరాయి

ప్రకృతి కొండ... మల్లన్న బండ

మల్లన్న బండ ఎక్కి చూస్తే ప్రకృతి అందాలకు కొదువ ఉండదు. చుట్టూ కనిపించే దృశ్యాలు కంటికి ఇంపును, మనసుకు ఆహ్లాదాన్ని పంచుతాయి. చిన్నచిన్న రాళ్లపై పెద్ద పెద్ద బండరాళ్లు ఒదిగిపోయి కనిపిస్తాయి. బండపై సహజ సిద్ధంగా ఏర్పడిన పుట్టు గుండంలో ఎన్ని కరువు కాటకాలు వచ్చినా పుష్కలమైన నీటి జలం దర్శనమిస్తుంది. సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని వీరారెడ్డిపల్లి-జంగపల్లి గ్రామాల శివారులో సుమారు 260 గజాల ఎత్తుతో, 90 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ మల్లన్న బండ ప్రకృతి ప్రేమికులకు కనువిందుచేస్తోంది. ఈ బండపై ప్రతి సంక్రాంతి పర్వదినాన జరిగే జాతరకు జిల్లావ్యాప్తంగా భక్తులు తరలివచ్చి, ఈ ప్రకృతి అందాలను తిలకిస్తూ అనందంతో పరవశించిపోతారు.


-మిరుదొడ్డి (దుబ్బాక)



బండపై సహజ సిద్ధంగా ఏర్పడిన పుట్టు గుండం



బండపై నుండి కనిపిస్తున్న ప్రకృతి దృశ్యాలు



విశాలమైన మల్లన్న బండ



సన్‌ఫ్లవర్.. క్లిక్.. క్లిక్
అరకు సందర్శనకు వచ్చే పర్యాటకులు పొద్దుతిరుగుడు పూల శోభలో మునిగితేలుతున్నారు. ఫొటోలు, సెల్ఫీలు తీసుకునేందుకు వీరిచ్చే రుసుంతో గిరి రైతులు మంచి ఆదాయం పొందుతున్నారు.



తీరానికి జనహోరం
సాయం సమయాన విశాఖ నగరం సాగరతీరాన సేదతీరింది. ఆదివారం విశాఖ బీచ్‌కు పర్యాటకులు పోటెత్తారు. తీరంలో తుళ్లింతలు, కెరటాల్లో కేరింతలతో హోయిహోయిగా గడిపేశారు. -సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



తండ్రి ఒడిలో తొలిపాఠం
విజయవాడ రెడ్ సర్కిల్ సమీపంలో ఓ చిన్నారి తన తండ్రి ఒడిలో కూర్చొని అతను చేస్తున్న పనిని తదేకంగా చూస్తున్న దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

నేటి నుంచి ఉపమాకలో ధనుర్మాసోత్సవాలు



నక్కపల్లి: అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం నుంచి ధనుర్మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 6.57 గంటలకు స్వామివారికి విశేష ప్రసాద నివేదనల అనంతరం నెలగంట జరుగుతుంది. 16 నుంచి వచ్చే ఏడాది జనవరి 14 వరకు స్వామి వారు, గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తులకు ప్రతి రోజు 2 వాహనాల్లో తిరువీధి సేవలు టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఆలయంలో 30 రోజుల పాటు తిరుప్పావై సేవా కాలాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి 'మన ఎమ్మెల్యే మా ఊరు'

పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా చేపట్టనున్న 'మన ఎమ్మెల్యే మా ఊరు' కార్యక్రమానికి సంబంధించి పోస్టర్లను ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల సమక్షంలో ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పర్యటించి సమస్యలను గుర్తిస్తామన్నారు. సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి ప్రయత్నిస్తామన్నారు.

రైతులే ఎగుమతి దారులు!

పంట ఎగుమతిలో రైతన్నలకు స్వేచ్ఛ!



రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటుకు ప్రోత్సాహం

- ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా మార్కెట్ క్రెడిట్ లింకేజ్
- 2020లోనే లక్ష్యాలను నిర్దేశించిన వైఎస్ జగన్ ప్రభుత్వం
- నాబార్డు, ఎన్‌సీడీసీ, నాఫెడ్, ఎస్‌ఎఫ్‌ఏసీ భాగస్వామ్యంతో ఏర్పాటు
- కంపెనీల చట్టం కింద ఎఫ్‌పీవోల ఏర్పాటుకు చర్యలు
- ఒక్కో ఎఫ్‌పీవోకు రూ.25 లక్షల ఆర్థిక చేయూత

సాక్షి, అమరావతి: అన్నదాతలను ఎగుమతి దారులుగా తీర్చిదిద్దే దిశగా వైఎస్ జగన్ ప్రభుత్వం రూపొందించిన కార్యాచరణ కార్యరూపం దాలుస్తోంది. తాము పండించిన పంట ఉత్పత్తులను ప్రపంచంలో ఎక్కడికైనా నేరుగా ఎగుమతి చేసుకునేలా రైతులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా పంటల ఆధారంగా రైతు ఉత్పత్తి దారుల సంఘాల (ఎఫ్‌పీవో)ను ఏర్పాటు చేయాలన్న సంకల్పంతో ఎఫ్‌పీవోల ఏర్పాటుకు గతంలోనే శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలో 200కు పైగా ఎఫ్‌పీవోలుండగా, వాటిలో 80 శాతం ఎఫ్‌పీవోలు తగిన ప్రోత్సాహం లేక నామమాత్రంగా పనిచేస్తున్నట్లు గుర్తించారు. వీటిని బలోపేతం చేయడంతో పాటు డివిజన్‌కొకటి చొప్పున కొత్తగా ఎఫ్‌పీవోలను కంపెనీల చట్టం కింద ఏర్పాటు చేయాలని సంకల్పించారు.

4 ఏజెన్సీల ద్వారా మార్కెటింగ్, క్రెడిట్ లింకేజ్

రైతులు పండించిన పంటలను ఎగుమతిదారులతో ప్రమేయం లేకుండా ప్రపంచంలో తమకు గిట్టుబాటు ధర లభించే ఏ దేశానికైనా నేరుగా ఎగుమతి చేసుకునేలా తీర్చిదిద్దడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ఈ ప్రాజెక్టు కోసం 2020లోనే వైఎస్ జగన్ ప్రభుత్వం విధివిధానాలు రూపొందించింది. కంపెనీల చట్టం కింద ఏర్పాటయ్యే ఈ ఎఫ్‌పీవోలకు గరిష్టంగా ఐదేళ్ల పాటు రూ.25 లక్షల వరకు ఆర్థిక చేయూతనిచ్చేలా ప్రణాళిక రూపొందించారు. వ్యవసాయ శాఖ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తున్న ఈ ప్రాజెక్టుకు అవసరమైన మార్కెట్, క్రెడిట్ లింకేజ్ కల్పించేందుకు ఎస్‌ఎఫ్‌ఏసీ (చిన్న రైతుల వ్యవసాయ వాణిజ్య కన్సార్టియం), నాబార్డు (జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంక్), ఎన్‌సీడీసీ (జాతీయ సహకార అభివృద్ధి కార్పొరేషన్), ఎన్‌ఎఫ్ఈడీ (జాతీయ వ్యవసాయ సహకార మార్కెటింగ్ సమాఖ్య)లను భాగస్వామ్యం చేశారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ సారథ్యంలో రాష్ట్రస్థాయి, కలెక్టర్ల నేతృత్వంలో జిల్లాస్థాయి కమిటీలను కూడా ఏర్పాటు చేశారు. ఏ ఏ ఉత్పత్తులకు ఏ దేశాల్లో డిమాండ్ ఎక్కువగా ఉంది. మంచి ధర రావాలంటే ఎలాంటి నాణ్యతా ప్రమాణాలు పాటించాలి. ఎగుమతి కోసం ఎలాంటి అనుమతులు అవసరం వంటి అంశాలపై అవసరమైన సహకారం అందిస్తున్నారు.

కంపెనీలుగా 450 ఎఫ్‌పీవోలు ఏర్పాటు..

కేంద్ర ప్రాయోజిత ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రంలో కంపెనీల చట్టం కింద 450 ఎఫ్‌పీవోలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించగా, ఆమేరకు 100 శాతం ఏర్పాటు చేశారు. వీటికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం చొరవతో వ్యవసాయ అనుబంధ శాఖల ద్వారా మరో 811 ఎఫ్‌పీవోలు ఏర్పాటు చేశారు. ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసిన స్టేట్ నోడల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఎస్ఎన్‌టీఐ) ద్వారా ఎఫ్‌పీవోల్లోని రైతులకు శిక్షణ ఇచ్చి ఆ తర్వాత ఇన్‌పుట్ లైసెన్సులు, మండి, జీఎస్టీ, ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులు జారీ చేస్తారు. 450 ఎఫ్‌పీవోల్లో ఇప్పటికే 75 ఎఫ్‌పీవోలకు సీడ్ లైసెన్స్, 100 ఎఫ్‌పీవోలకు ఫెర్టిలైజర్స్ లైసెన్సులు, 108 ఎఫ్‌పీవోలకు పురుగుల మందుల లైసెన్సులు జారీ చేశారు. మరొక వైపు పొలంబడులు, ఉద్యాన, పట్టు, మత్స్య సాగు బడులతో దిగుబడుల్లో నాణ్యత పెంచడంతో పాటు వాటికి గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్ (గ్యాప్), ఆర్గానిక్ సర్టిఫికేషన్ జారీ చేస్తూ ఎగుమతులను ప్రోత్సహిస్తున్నారు.

పురోగతిని వేగవంతం చేయండి..

కేంద్రప్రాయోజిత పథకమైన ఎఫ్‌పీవోల ఏర్పాటును ప్రోత్సహించడంతో పాటు వాటికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ ఆదేశించారు. సంఘాల ఏర్పాటు, పురోగతిపై 8వ ఎస్ఎల్‌సీసీ రాష్ట్ర స్థాయి కో–ఆర్డినేషన్ కమిటీ సమావేశం మంగళగిరిలో మంగళవారం జరిగింది. ఇక నుంచి నోడల్ అధికారిగా మార్క్‌ఫెడ్ ఎండీ వ్యవహరించనున్నట్లు ప్రకటించారు. ఎఫ్‌పీవోలకు ఎరువులు, పురుగుల మందుల వ్యాపారం నిర్వహణలో జరుగుతున్న జాప్యం నివారణకు సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు.

టెక్నాలజీని తట్టుకుని నిలిచిన తపాలశాఖ

పోస్ట్‌మాస్టర్ జనరల్ డీవీఎస్సార్ మూర్తి



డీవీఎస్సార్ మూర్తి

తెనాలి: తపాలశాఖలో పని సంస్కృతిని ఉద్యోగులు, అధికారులు ఇదే తీరులో కొనసాగించాలని పోస్ట్‌మాస్టర్ జనరల్ (విశాఖ, విజయవాడ రీజియన్లు) డీవీఎస్సార్ మూర్తి సూచించారు. భారతీయ పోస్టల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ సర్కిల్ గ్రూప్–సీ, పోస్ట్‌మ్యాన్ అండ్ ఎంటీఎస్ అండ్ బీజీడీకేఎస్ (జీడీఎస్) తృతీయ సమావేశాలు ఆదివారం ఘనంగా జరిగాయి. స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఏర్పాటైన సమావేశాలకు గ్రూప్–సీ ఏపీ సర్కిల్ అధ్యక్షుడు ఈ.హనుమంతరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీవీఎస్సార్ మూర్తి మాట్లాడుతూ.. ఈ–మెయిల్ వంటి టెక్నాలజీ ఒకవైపు దండయాత్ర చేస్తుంటే అనుకోని శత్రువు ఈ–కామర్స్ మరోవైపు విస్తరిస్తోందని, ఇవికాకుండా ప్రైవేటు కొరియర్ సర్వీసులు పోటీపడుతున్న తరుణంలో, వీటన్నిటినీ తట్టుకుని తపాలాశాఖ నిలబడటం గొప్ప విషయమన్నారు. పోస్టల్ అధికారులు, ఉద్యోగులు నిబద్ధత, అంకితభావం ఇందుకు కారణమన్నారు. కొత్తగా ప్రవేశపెట్టిన సాఫ్ట్‌వేర్ నిర్వహణను ఉద్యోగులు నేర్చుకుని, అమలుచేస్తుండటం వల్లనే సరికొత్త పథకాలతో తపాలశాఖ ముందుకు వెళ్లగలుగుతోందని చెప్పారు. గ్రూప్–సీ ఏపీ సర్కిల్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకయ్య మాట్లాడుతూ రెండేళ్ల వ్యవధిలో అసోసియేషన్ ఏడు డివిజన్ల నుంచి 24 డివిజన్లకు విస్తరించినట్లు చెప్పారు. సమావేశంలో భారతీయ పోస్టల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అనంతకుమార్ పాల్, పోస్టుమ్యాన్ అండ్ ఎంటీఎస్ ఏపీ సర్కిల్ అధ్యక్షుడు జి.బ్రహ్మయ్య, జీడీఎస్ ఏపీ సర్కిల్ అధ్యక్షుడు ఎ.వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేతన్న కంట కన్నీళ్లు

- గుదిబండలా మారిన జీఎస్టీ
- ఎగుమతులు, కొనుగోళ్లు లేక పేరుకుపోయిన నిల్వలు



మూలకు చేరిన చేనేత మగ్గాలు

చీరాల: ఉమ్మడి ప్రకాశం జిల్లాలో చేనేతలకు పుట్టినిల్లు చీరాల ప్రాంతం. చీరాలతోపాటు పొద్దుటూరు, జమ్మలమడుగు, పెడన, ఐలవరం, బద్వేలు, ఆత్మకూరు, తాటిపర్తి వంటి ప్రాంతాల నుంచి 40 ఏళ్ల కిందట వలసలు వచ్చిన కార్మికులు స్థానికంగా మాస్టర్ వీవర్లకు సంబంధించిన చేనేత షెడ్డుల్లోని మగ్గాలపై పని చేస్తూ జీవనం సాగిస్తుంటారు. జిల్లాలో 33,184 వేల మగ్గాల వరకు ఉండగా 24,000 చేనేత కుటుంబాలు ఉన్నాయి. వీరిలో మొత్తం 50 వేల మంది చేనేతపై ఆధారపడి జీవిస్తున్నారు.

జీఎస్టీ రద్దు హామీ అమలయ్యేనా..?

మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్న చేనేత పరిశ్రమపై జీఎస్టీ పెనుభారంగా మారింది. చేనేత వృత్తులు చేసే వారికి 29 శాతం జీఎస్టీ మినహాయింపు ఇస్తామని చెప్పినా అమలయ్యేలా లేదు. చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ మినహాయింపుపై నేటికీ కూటమి సర్కారు ఎలాంటి ప్రకటన చేయలేదు. చేనేతలు కూటమి సర్కారులో మేలు జరగకపోగా చేనేతలు కునారిల్లుతున్నారు. చేనేత వృత్తిలో రాణించలేక చివరకు కార్మికులు ఇతర వృత్తుల వైపు తరలిపోతున్నారు.

కరువైన నేతన్న నేస్తం..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019లో సీఎంగా పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం బడ్జెట్‌లో చేనేతలకు రూ.200 కోట్లు కేటాయింపుతోపాటుగా ఒక్కో చేనేత కుటుంబానికి రూ.24 వేలు అందించారు. చేనేతలకు పూర్వ వైభవం తీసుకువచ్చి నేతన్నల తలరాత మార్చేందుకు చర్యలు చేపట్టింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఇటీవల ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ రూ.2.94 లక్షల కోట్లలో చేనేత రంగానికి నామమాత్రంగా 0.066 శాతం కేటాయించారని కార్మిక సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

కలగానే చేనేత పార్కు..

చేనేతలు అధికంగా ఉన్న చీరాల ప్రాంతంలో 50 ఎకరాలలో చేనేత పార్కు ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు చీరాల వచ్చిన సందర్భంగా నమ్మబలికారు. నేటికీ ఆ ఊసే లేకుండా పోయింది. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చీరాల మండలం జాండ్రపేటలో నిర్వహించిన సదస్సుకు ఆ శాఖ మంత్రి సవిత హాజరై చేనేతల కోసం అనేక పథకాలు రచించామని చెప్పారే తప్ప టెక్స్‌టైల్స్ పార్కు గురించి ప్రస్తావించలేదు. చేనేత వృత్తి చేసే కార్మికులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తామని మేనిఫెస్టోలో ప్రకటించినప్పటికీ నేటికి కూటమి ప్రభుత్వం ఆ దిశగా అడుగులు లేవు.

కనీస వేతన చట్టానికి దిక్కేది?

కనీస వేతన చట్టం ప్రకారం ఒక కార్మికుడికి రోజుకు రూ.206 చెల్లించాల్సి ఉంటుంది. కానీ చేనేత కార్మికులకు కనీస వేతన చట్టం ప్రకారంగా కూడా కూలీలు అందడం లేదు. చేనేత మగ్గాలపై పీస్ వర్క్ చేస్తున్నారనే కారణంతో కూలి ధరలు పరిగణించలేమని కార్మికశాఖ చేతులెత్తేసింది. దీంతో హోటల్‌లో పని చేసే స్వీపర్ల కంటే చేనేత కార్మికుడికి కూలి తక్కువ. కనీస వేతన చట్టాన్ని అమలు చేసినా కార్మికులకు ప్రయోజనం ఉంటుంది.

నిధులు విడుదలైతే పార్కు పనులు ప్రారంభిస్తాం

హ్యాండ్‌లూమ్ పార్కుకు సంబంధించి ప్రభుత్వానికి నివేదికలు పంపించాం. ప్రభుత్వం నుంచి నిధులు వస్తే పార్కు పనులు ప్రారంభిస్తాం. మగ్గం కార్మికులకు 200 విద్యుత్ యూనిట్లపై మార్గదర్శకాలు అందలేదు. నేతన్న నేస్తం ద్వారా ఒక్కో కార్మికుడికి అందాల్సిన రూ.24 వేలు కూడా ప్రభుత్వం విడుదల చేస్తే కార్మికుడికి అందిస్తాం. ఆప్కో ద్వారా కొంత మేర స్వయం సహకార సంఘాల ద్వారా కొనుగోలు ఇప్పుడిప్పుడే మొదలుపెడుతున్నాం.

– నాగమల్లేశ్వరరావు, హ్యాండ్‌లూమ్, ఏడీ

ప్రమాదంలో మానవ విలువలు

- ప్రజాస్వామ్య పరిరక్షణకు ముందుకు రావాలి
- హక్కుల ఉద్యమ నేత ప్రొఫెసర్ హరగోపాల్



హరగోపాల్

కడప సెవెన్‌రోడ్స్ : స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే మౌలిక మానవ విలువలు నేడు ప్రమాదంలో పడ్డాయని ప్రముఖ పౌరహక్కుల ఉద్యమ నేత ప్రొఫెసర్ హరగోపాల్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా స్మృతిలో...చట్టం అందరికీ సమానమేనా అనే అంశంపై వామపక్ష ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం వైఎస్సార్ జిల్లా కడప హరిత హోటల్‌లో నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ చట్టం ముందు అందరూ సమానమేనా? అనేది ఒక మౌలిక ప్రశ్న అన్నారు. 75 సంవత్సరాల స్వాతంత్ర్యం తర్వాత ఈ ప్రజాస్వామ్యం నిలుస్తుందా, మనం ఏం చేయాలనే ప్రశ్న పౌరసమాజం నుంచి వస్తోందన్నారు. రాజ్య పూర్వ సమాజంలో అపరిమితస్వేచ్ఛ ఉండేదన్నారు. మనిషి స్వేచ్ఛను కాపాడుకోవడం కోసం, రక్షణ కోసం పరిమిత బలప్రయోగంతో కూడిన రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. అమెరికా రాజ్యాంగం రాసుకునే సమయంలో ఆయుధాలపై రాజ్యానికే అధికారం ఉండాలనే వాదనను అందరూ వ్యతిరేకించారన్నారు. ఆయుధాన్ని కలిగి ఉండే హక్కు ప్రజలకు ఇచ్చారని, చట్ట పరిమితుల్లో వాటిని ఉపయోగించుకోవాల్సి ఉంటుందన్నారు. మన దేశంలో అన్ని రాజ్యం చేతికి ఇచ్చిన తర్వాత మన హక్కులను రాజ్యం హరిస్తోందన్నారు. ఇందుకు ప్రొఫెసర్ సాయిబాబాకు జరిగిన అన్యాయమే నిదర్శనమన్నారు. ఖనిజ సంపద కార్పొరేట్ సంస్థలకు కట్టబెడతామని అడ్డం వస్తే ఎవరినీ సహించబోమంటూ సాక్షాత్తు ఛత్తీస్‌ఘడ్ ముఖ్యమంత్రి ఎకనమిక్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొనడం విచారకరమన్నారు. ఈ పరిస్థితుల్లో మనం ఏం చేయాలన్నది అందరి ముందున్న మౌలిక ప్రశ్న అని చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడం కోసం అందరూ ముందుకు రావాలన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ సాయిబాబానుపదేళ్లు జైలులో ఉంచినా నేరం రుజువు కాలేదని, అందుకు ఆయనకు ప్రభుత్వం ఎలాంటి పరిహారం ఇవ్వలేదన్నారు. రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ చట్టం పేద వాళ్లకు కాకుండా పెద్ద వాళ్లకే ఉపయోగపడతుందన్నారు. కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుర్రప్ప అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో రిటైర్డ్ అధికారి గుర్రాల గోపాల్, సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, డాక్టర్ రాజా వెంగళ రెడ్డి, డాక్టర్ ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతును నొక్కేస్తున్నారు

మానవ హక్కుల వేదిక రాష్ట్ర మహాసభల్లో వక్తలు



ఎస్ఎస్ సాహు

అనంతపురం కల్చరల్: ప్రశ్నించే గొంతును నొక్కేయడమే పాలకుల పనిగా పెట్టుకోవడం ఆవేదన కలిగిస్తోందని మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకుడు ఎస్ఎస్ సాహు అన్నారు. అనంతపురం వేదికగా నిర్వహించిన మానవ హక్కుల వేదిక పదో రాష్ట్ర మహాసభలు ఆదివారం ముగిశాయి. నగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్లో జరిగిన ఈ సభల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ అంశాలపై వక్తలు మాట్లాడారు. 'కుల గణన ఎందుకు అవసరం' అనే అంశంపై ఎస్ఎస్ సాహు ప్రసంగించారు. దేశంలో అనేక ఉపకులాల వారికి రిజర్వేషన్ల విషయంలో అన్యాయం జరుగుతోందన్నారు. కుల గణన సక్రమంగా, పారదర్శకంగా లేకపోతే ఆధిపత్య కులాలే రాజ్యాంగ ఫలాలను అనుభవిస్తాయని, అర్హులైన వారు అన్యాయమైపోతారని పేర్కొన్నారు. పాలకులు నిజాయితీగా కుల గణన చేయాలని, దాన్ని రాజకీయం చేయొద్దని హితవు పలికారు. సీనియర్ జర్నలిస్టు మాలిని సుబ్రమణ్యం 'బస్తర్‌లో మానవ హక్కుల ఉల్లంఘనలు' అనే అంశంపై మాట్లాడారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్, ఎస్ఎం బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సమాచారం

వైభవం..రాములోరి పౌర్ణమి కల్యాణం

ఒంటిమిట్ట(సిద్దవటం): ఒంటిమిట్ట శ్రీ కోందడ రామస్వామి దేవాలయంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయలోని బాలాలయ ప్రాంగణంలో ప్రత్యేక కల్యాణ వేదిక ఏర్పాటు చేశారు. అభిషేకం అనంతరం సీతారాముల విగ్రహాలను పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, తులసిమాలలతో అలకంరించారు. అర్చకులు శ్రావణకుమార్, పవన్‌కుమార్లు శాస్త్రోక్తంగా కల్యాణతంతును నిర్వహించారు.

అప్పన్న అన్నదానానికి విరాళాలు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరానికి చెందిన శిరీష్, కాళ్ల పురుషోత్తం అనే దాతలు చెరో రూ.లక్ష చొప్పున విరాళాలు అందించారు. సంబంధిత విరాళాలను సింహగిరిపైనున్న పీఆర్వో కార్యాలయంలో నగదు రూపంలో సిబ్బందికి అందజేశారు. దేవస్థానం తరపున దాతలకు ప్రొటోకాల్ సూపరింటెండెంట్ విక్రమ్ బాండ్‌లు ఇచ్చారు. కార్యక్రమంలో దేవస్థానం జూనియర్ అసిస్టెంట్ వరహానరసింహం పాల్గొన్నారు.

రుషికొండలో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు

కొమ్మాది: విశాఖలోని రుషికొండ శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం(టీటీడీ)లో జనవరి 10న జరిగే వైకుంఠ ఏకాదశికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు వేకువజామున 3.30 గంటల నుంచి దర్శనాలు ప్రారంభమవుతాయని చెప్పారు. సాయంత్రం 6 గంటల నుంచి 6.40 గంటల వరకు దర్శనాలు నిలిపివేస్తామని.. మరల 6.40 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు దర్శనాలు ఉంటాయని పేర్కొన్నారు. భక్తుల రద్దీ దృష్టిలో ఉంచుకుని ఆ రోజు భక్తులను ఉచితంగా కొండపైకి తీసుకొచ్చేందుకు మూడు బస్సులను అదనంగా ఏర్పాటు చేస్తామన్నారు.

కనకమహాలక్ష్మి దర్శనానికి పోటెత్తిన భక్తులు

డాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల 14వ రోజు ఆదివారం అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. విశాఖ జిల్లా నలుమూలల నుంచే కాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి మొక్కులు సమర్పించుకున్నారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 5 నుంచి పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం, ప్రత్యేక హోమాలు, సహస్రనామార్చన, సర్వదర్శనం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించారు. సహస్ర తులసీదళార్చనలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

కిక్కిరిసిన బోయకొండ



చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం వివిధ వాహనాల్లో తరలి వచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక అలంకారంలో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వర్షాలు సకాలంలో కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలు, జంతు సంపద వృద్ధి చెందాలంటూ పలు గ్రామాల ప్రజలు అమ్మవారికి పూజలు చేశారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు పిండి, నూనెదీపాలు, దీవెలతో మేళ తాళాల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు.

ఘనంగా గరుడసేవ మహోత్సవం

బద్వేలు అర్బన్ : మండలంలోని లక్ష్మీపాలెం గ్రామంలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన గరుడసేవ మహోత్సవంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత వేదపండితులు ఎమ్మెల్సీకి పూర్ణకుంభ స్వాగతం పలికి స్వామి వారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. గరుడ వాహనంపై కొలువుదీర్చిన స్వామివారికి పూజలు నిర్వహించి గ్రామోత్సవంలో పాల్గొన్నారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ గరుడవాహనధారి అయిన శ్రీవారిని దర్శించుకోవడం సర్వపాప పరిహరణకు మూలమని అన్నారు.

టీటీడీ సంస్థల తైక్వాండో కోచ్‌కు పురస్కారం

తిరుపతి సిటీ : టీటీడీ సీనియర్ అసిస్టెంట్, ఆ విద్యా సంస్థల తైక్వాండో కోచ్ మాస్టర్ కొమ్మినేని గోపి నాయుడుకు అరుదైన గౌరవం లభించింది. బెంగళూరు వేదికగా ఆదివారం జేపీ పార్క్ కప్–2024 ఓపెన్ నేషనల్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలు అట్టహాసంగా జరిగాయి. ఇందులో భాగంగా తిరుపతికి చెందిన మాస్టర్ కొమ్మినేని గోపి నాయుడు తైక్వాండో కోచ్‌గా ఉత్తమ క్రీడాకారులను తయారు చేయడంలో ఆయన కృషికి గుర్తింపుగా పోటీల ఆర్గనైజర్ పెంచలయ్య క్రీడారత్న అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా టీటీడీ ఉద్యోగులు, క్రీడాకారులు ఆయనను అభినందించారు.

అలీబాగ్ యూత్ వరల్డ్



క్రిస్మస్ హాలిడేస్, న్యూ ఇయర్ సెలబ్రేషన్స్... వెకేషన్ కోసం ఎదురు చూసే వాళ్లకు మంచి సమయాలు. సంస్కృతి సంప్రదాయాల నిలయాలను చూడడం ఒక అనుభూతి. చారిత్రక ప్రదేశాలను చూడడంలో ఓ థ్రిల్. కేవలం సెలవులను ఆహ్లాదకరంగా గడపడానికి కొన్ని ప్రదేశాలుంటాయి. అందులో అలీబాగ్ ఒకటి. అరేబియా తీరాన అందమైన టూరిస్ట్ ప్లేస్ ఇది. బీచ్‌లో విహరిస్తూ, చక్కటి వంటకాలతో కడుపు నింపుకుంటూ ఉద్యోగం, వ్యాపారంతో వచ్చే టెన్షన్‌లకు దూరంగా గడపడానికి ఎంచుకునే ఓ అందమైన ప్రదేశం అలీబాగ్. దీనిని మరో గోవా అనవచ్చు. అలీబాగ్ టూర్‌లోనూ ప్రధానమైనవి బీచ్‌లే. ఆ తర్వాత కొలాబా ఫోర్ట్. ఇది కూడా బీచ్ ఒడ్డునే ఉంది. కోట బురుజు నుంచి సముద్రాన్ని వీక్షించడం ఈ టూర్‌లో బోనస్. ముంబయి వాసులు వీకెండ్ టూర్‌కి ఇక్కడికే వస్తారు. ఈ బీచ్ వాటర్ స్పోర్ట్స్‌తోపాటు ఇతర అడ్వెంచరస్ స్పోర్ట్స్‌కు కూడా ప్రసిద్ధి. పారాసైలింగ్, సీ కేయాకింగ్, జెట్ స్కీ, బనానా బోట్‌రైడ్‌లు చేయాలనే ఆసక్తి ఉన్న యూత్‌కి ఇది ది బెస్ట్ టూరిస్ట్ ప్లేస్. ఇలాంటి సాహసాలేమీ చేయకుండా ఓపిగ్గా నిరీక్షించే సహనం ఉంటే సముద్రంలో ఎగిసిపడే డాల్ఫిన్‌ల కోసం చూడవచ్చు.








పట్నా నాటి ఔన్నత్యానికి దర్పణం



పట్నా టూర్ అనగానే నాకు 'చాణక్య' చారిత్రక నవల, టీవీ సీరియల్ ఒకదానితో ఒకటి పోటీ పడుతూ కళ్ల ముందు మెదిలాయి. 'సున్న'తో ప్రపంచ గణితాన్ని గాడిలో పెట్టిన ఆర్యభట్ట గుర్తొచ్చాడు. ఖగోళ పరిజ్ఞానంలో మన మేధ ఎంతో పరిణతి చెందినదనే విషయం మరోసారి గుర్తొచ్చింది. అలాగే వర్తమానంలో బిహార్ అనుభవిస్తున్న పేదరికమూ, జంగిల్ రాజ్ అనే వార్తకథనాలు కూడా గుర్తొచ్చాయి. పాటలీపుత్ర నుంచి పట్నా వరకు ఈ నగరం అనుభవించిన ఆటుపోట్లన్నీ కళ్లముందు మెదిలాయి. పట్నాలో అడుగు పెట్టిన తర్వాత దృష్టికి వచ్చిన ప్రతి అంశాన్నీ గతంలోకి వెళ్లి విశ్లేషించుకుంటూ ముందుకు సాగాను. ఆర్యభట్ట నాలెడ్జ్ యూనివర్సిటీలో చూపుడువేలితో ఆకాశాన్ని చూపిస్తున్న ఆర్యభట్ట విగ్రహం ముందు మోకరిల్లాను.

బిహార్‌లో ఆలూ

పట్నా ప్రజల జీవనశైలి నిరాడంబరంగా కనిపించింది. కూరగాయల బళ్ల మీద బంగాళదుంప రాశి, పక్కనే మరో బస్తా ఉంటాయి. కాయగూరలు నామమాత్రమే. బిహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ ఒక సందర్భంలో 'సమోసాలో ఆలూ ఉన్నంత కాలం బిహార్‌లో లాలూ ఉంటాడు' అన్న మాట గుర్తొచ్చింది. ఇప్పుడు లాలూ లేడు కానీ ఆలూ మాత్రం ఉంది. బిహార్ జీవనశైలిలో ఆకుపచ్చ కూరగాయల కంటే బంగాళదుంపకే ప్రాధాన్యం. ఉదయాన్నే బ్రేక్‌ఫాస్ట్‌లో జిలేబీ, భోజనంలో మధ్యమధ్య పచ్చిమిర్చి కొరుక్కుంటూ తినడం ఈ రెండూ కొత్తగా అనిపిస్తాయి. జీవనశైలి విలాసవంతంగా లేకపోయినప్పటికీ కళల పట్ల ఆరాధన మెండుగా ఉంది. సంగీతకార్యక్రమాలు, వేడుకల్లో నాట్య ప్రదర్శనలు నిత్యం జరుగుతూనే ఉంటాయి. ఊరేగింపులో వాహనాల మీద జరిగే నాట్యప్రదర్శనల్లో నర్తకి రక్షణ కోసం గ్రిల్ ఉంటుంది. బాలికల చదువు, రక్షణ కోసం టోల్ ఫ్రీ నంబర్‌తో ప్రచారం బాగున్నాయనిపించింది.



ఎలక్ట్రిక్ ఆటోరిక్షాలు

పట్నా నగరం పర్యావరణానికి ప్రాధాన్యం ఇస్తోంది. ఆటో రిక్షాలన్నీ ఎలక్ట్రిక్ వెహికల్సే. వాహనాల విషయంలో పర్యావరణ స్పృహ మెండుగానే ఉంది. ప్లాస్టిక్ వాడకం మీద నిషేధం ఏమీ లేకపోవడంతో సామాన్యుల్లో ఆ ధ్యాస కనిపించదు. గంగాతీరంలో పూజలు చేసి పూలు, అగరవత్తులు తీసుకెళ్లిన పాలిథిన్ కవర్లను అక్కడే పడేస్తున్నారు. తీరమంతా ప్లాస్టిక్ వ్యర్థాల తోరణంగా కనిపించింది. గంగానది నీరు స్వచ్ఛంగా ఉన్నాయి, నదిలో పడవ విహారం మాత్రం అద్భుతమైన అనుభూతినిచ్చింది. సూర్యోదయం, సూర్యాస్తమయాల్లో నది విహారం ప్లాన్ చేసుకుంటే బాగుంటుంది.

గోల్‌ఘర్

పట్నాలో తప్పకుండా చూడాల్సిన వాటిలో గోల్‌ఘర్ ఒకటి. ఇది మగధరాజ్య ధాన్యాగారం. ఈ ధాన్యాగారం ఇనుప నిర్మాణం. రాజ్యంలో రైతులు పండించిన ధాన్యంలో వారి అవసరాలకు పోగా మిగిలిన వాటిని సేకరించి ఇందులో భద్రపరిచేవారు. ఒక ఏడాది కరువు, వరదలు వచ్చినా సరే రాజ్యంలో ఆకలి లేకుండా తిండి గింజలను అందుబాటులో ఉంచడం కోసమే ఈ ఏర్పాటు. పాలనలో ఇంతటి ముందు చూపుకు చాణుక్యుని అర్థశాస్త్రమే మూలం. ప్రాచీన కాలంలో ఇక్కడ పర్యటించిన ఫాహియాన్, మెగస్తనీస్ వంటి విదేశీ యాత్రికులు పట్నా నగరాన్ని ప్రపంచానికి మోడల్‌గా చూపించారు. మెగస్తనీస్ అయితే ఏకంగా 'గ్రేటెస్ట్ సిటీ ఆన్ ద ఎర్త్' అని రాశాడు. అంతటి చైతన్యవంతమైన, ఉచ్ఛస్థితిని చూసిన నగరం పట్నా. సామాన్యులతో మాటలు కలిపితే ఆ మూలాల ప్రభావం ఇప్పటికీ ఉందనిపిస్తుంది. వారిని చూస్తే పేదరికంతో పోరాడుతూ జీవితాన్ని నెట్టుకొస్తున్నట్లు కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. కానీ మాటల్లో వారిలో సమృద్ధిగా ఉన్న రాజకీయ చైతన్యం వ్యక్తమవుతుంది.



ప్రాచీన కాలంలోకి ఎంట్రీ


పట్నా నగరం ప్రపంచంలో అత్యంత పురాతన కాలం నుంచి జనజీవనం కొనసాగుతూ వస్తున్న ప్రదేశం. ఆర్యభట్ట, వాత్సాయనుడు, చాణుక్యుడు, సిక్కుల గురువు గురుగోవింద్ సింగ్ వంటి మేధావులు పుట్టిన నేల. నంద, మౌర్య, గుప్త రాజవంశాల రాజధాని. ఇన్ని ప్రత్యేకతలను సొంతం చేసుకున్న నేల మీద నడిచేటప్పుడు మనకు తెలియకుండానే నేటి నుంచి అక్షరాలలో చూసిన నాటికి వెళ్లిపోతాం. ఇక్కడ పర్యటించడం రియల్లీ ఏ బ్యూటిఫుల్ ఎక్స్‌పీరియెన్స్.

పరిణత శిల్పకళ

ప్రాచీన పట్నా జీవనశైలిని చూడాలంటే బిహార్ మ్యూజియంలో అడుగుపెట్టాలి. మొదటగా ఆకర్షించేది యక్షిణి శిల్పం. గంగానది తీరాన దిదర్‌గంజ్ గ్రామం నుంచి సేకరించిన ఈ శిల్పం శిల్పం అద్దంలా మెరుస్తుంటుంది. శిల్పచాతుర్యాన్ని ఫొటోలో చూడాల్సిందే తప్ప వర్ణించడం అసాధ్యం. రీజనల్ ఆర్ట్ గ్యాలరీలో చిత్రలేఖనాలు మధుబని ఆర్ట్‌లో కృష్ణుడు, గోపికల ఘట్టాలు ఆసక్తికరంగా ఉన్నాయి. ఒక పటంలో ఒక గ్రంథం ఇమిడి ఉంటుంది. బొమ్మలు వేయడానికి చిత్రకారులు వాడిన బేసిక్ కలర్స్ నుంచి సెకండరీ కలర్స్ వాడకం వరకు చిత్రవర్ణాల పరిణామ క్రమం అర్థమవుతుంది. చిత్రాలను, శిల్పాలను పరిశీలించినప్పుడు అప్పటి కాలంలో చిత్రకళ కంటే శిల్పకళ ఉచ్ఛస్థితిలో పరిణతి చెందినట్లు అనిపించింది.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

మహాబలిపురం





శీతాకాలంలో చూడాల్సిన ప్రదేశాల్లో మహాబలిపురం ఒకటి. ఇది సముద్రతీరమే కానీ శిల్పాల సముదాయంగానే పర్యాటక ప్రాధాన్యం సంతరించుకుంది. మహాబలిపురాన్ని ప్రేక్షకులకు చూపించడం కోసం బ్లాక్ అండ్ వైట్ కాలంలో 'బాలరాజుకథ' పేరుతో ఒక సినిమానే వచ్చింది. బంగాళాఖాతం తీరాన తమిళనాడులో ఉంది ఈ ప్రదేశం. పేరులో బలి ఉన్నాడు కానీ ఇక్కడంతా ఉలి చేసిన నైపుణ్యమే కనిపిస్తుంది. ఈ ప్రదేశాన్ని పల్లవులు ఏలిన ఏడు, ఎనిమిది శతాబ్దం నాటి నిర్మాణాలివన్నీ. యునెస్కో ఈ ప్రదేశాన్ని వరల్డ్ హెరిటేజ్ సైట్‌గా గుర్తించింది. ఇక్కడ చూడాల్సినవన్నీ శిల్పాలే. అన్నీ మహా శిల్పాలు. నోరు తెరిచిన సింహాన్ని తలపించే టైగర్‌కేవ్, పాండవుల పంచరథాలు, తీరాలయం, గంగావతరణం, అర్జునుని రథం, వరాహ గుహాలయం, త్రిమూర్తి గుహ, గణేశరథాలయం వంటివన్నీ అద్భుతాలు. ఇక ఎవరూ చెక్కకుండా అలా వదిలేసిన పెద్ద బండరాయి ఏటవాలుగా ఉంటుంది. దానికి కృష్ణుని వెన్నముద్ద అని పేరు. ఇక ఇక్కడ తప్పకుండా చూడాల్సిన వాటిలో సీషెల్ మ్యూజియం, స్కల్ప్చర్ మ్యూజియం, క్రొకోడైల్ బ్యాంక్ ముఖ్యమైనవి.



క్రొకోడైల్ బ్యాంక్ అంటే ఇది మొసళ్ల సంరక్షణ కేంద్రం. ఇక్కడ రెండువేల ఐదు వందల మొసళ్లున్నాయి. సీషెల్ మ్యూజియాన్ని చూడడం ఒక ఎడ్యుకేషన్. ఇందులో తిమింగలం రెక్కలు, సొరచేప పళ్లతోపాటు అరుదైన శిలాజాలన్నీ కలిపి నలభై వేల వరకు ఉన్నాయి. స్కల్ప్చర్ మ్యూజియంలో పల్లవ, చోళుల నాటి గొప్ప శిల్పాలున్నాయి. ఇక మహాబలిపురంలో వీటన్నింటితోపాటు మర్చిపోకుండా ఆస్వాదించాల్సింది బంగాళాఖాతంలో ఎగిసిపడే అలల్ని లైట్‌హౌస్ నుంచి కూడా.

వారసత్వం

యునెస్కో సాంస్కృతిక ఫుడ్స్



అరబిక్ కాఫీ

యునెస్కో ప్రతి యేటా వివిధ దేశాల సాంస్కృతిక వారసత్వాలను, అక్కడి కళారూపాలను గుర్తించి మనముందుకు తీసుకువస్తుంది. ఈ యేడాది అత్యంత ప్రాచీనమైన వివిధ రుచికరమైన వంటకాల జాబితాను తీసుకొచ్చింది. వాటిలో...

అరబిక్ కాఫీ

అరబ్ ప్రపంచంలో కాఫీ తయారీ, దానిని అతిథులకు అందజేసే విధానం అత్యద్భుతంగా ఉంటుందట. ఈ విధానం కూడా వారి తరతరాల భాగస్వామ్యం ఉందని, దీనిని యునెస్కో జాబితాలో చేర్చింది.

జపాన్ వారి సాకె



రైస్‌వైన్‌గా గుర్తింపు పొందిన సాకె ను స్థానిక సాంస్కృతిక వేడుకలలో సేవిస్తారు. దీని తయారీ వెనక తరాలుగా వస్తున్న కుటుంబాల శ్రమ ఉంటుంది.



మలేషియన్ బ్రేక్‌ఫాస్ట్

వంటకాల రుచి గురించి చెప్పుకోవాలంటే ఉదయం అల్పాహారంగా మలేషియా 'నాసి లెమక్, రోటీ కనాయ్'ని ఈ దేశపు హిస్టరీగా చెప్పుకోవచ్చు. వందల ఏళ్ల ఈ ఆహార తయారీ ఫార్ములా వారికి మాత్రమే తెలుసు.

కొరియా జంగ్



కొరియా వంటకాలలో జంగ్ అనే వంటకం తయారీ, రుచి, దానిని నిల్వ చేసే పద్ధతులు శతాబ్దాలుగా ఒక తరం నుంచి మరో తరానికి వస్తున్నాయి.



అజెర్‌బైజాని బ్రెడ్

మనం ఇప్పటి వరకు ఎన్నో రకాల బ్రెడ్స్ చూసి ఉంటాయి. కానీ, అజెర్‌బైజాని బ్రెడ్ తయారీలో వారి సంస్కృతి పరమైన ప్రభావం ఎంతో ఉందంటున్నారు. ఈ బ్రెడ్ తయారీలో వాడే పదార్థాలు, తయారీ విధానంలో తరాల వారసత్వం ఉందని జాబితాలో పొందుపరిచారు.

ఆర్ట్

జైపూర్ వారసత్వం

వేడుకగా వింటర్ ఆర్ట్ వీక్



వింటర్ సీజన్ జైపూర్‌లో ఉండటానికి అద్భుతమైన సమయంగా చెప్పవచ్చు. ఉదయం పొగ మంచుతో, పగలంతా ఎండ, సాయంత్రం నగరం అందించే కళలను ఆస్వాదించడానికి తగినంత చల్లగా ఉంటుంది. అందుకు తగినవిధంగానే జైపూర్ ఈ వింటర్‌లో కళ, సంస్కృతి, వారసత్వ ఉత్సవాలకు ఆతిథ్యం ఇస్తోంది. 'కుంభ్ ఆఫ్ లిటరేచర్'గా పరిగణించబడే జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్‌లో రచయితల సెషన్ కళాత్మకంగా జరుగుతుంది. ఇక జైపూర్ ఆర్ట్ వీక్‌లో ఎగ్జిబిట్‌లు, ఇన్‌స్టాలేషన్‌ల ద్వారా వర్ధమాన కళాకారుల తెలుసుకోవచ్చు.

లిటరేచర్ ఫెస్టివల్ 2025

టీమ్‌వర్క్ ఆర్ట్స్ రచయితలు, ఆలోచనాపరులు, మానవతావాదులు, రాజకీయ నాయకులు, వ్యాపార దిగ్గజాలు, వినోదకులు, సాంస్కృతిక చిహ్నాల ఆసక్తిని పరిచయం చేస్తుంది. జైపూర్‌లోని క్లార్క్స్ అమెర్‌లోని ఐదు రోజుల ఉత్సవంలో నోబెల్ గ్రహీత వెంకీ రామకృష్ణన్ ఆతిథ్యం ఇవ్వనున్నారు.

దేశ విదేశాలకు చెందిన రచయితలు ఈ వేడుకలో పాల్గొనున్నారు. దీనిలో భాగంగా వివిధ కళారూపాల ప్రదర్శన కూడా ఉంటుంది. ప్రాంగణంలో జైపూర్ కళాకారులు చిత్రించిన కుండలు, అప్లిక్ ఎంబ్రాయిడరీ విశేషంగా ఆకట్టుకుంటాయి. వీటి తయారీ కళ, వాస్తుశిల్పం, జైఘర్, రాజస్థాన్ కోటల చరిత్ర, జైపూర్ నగర దృశ్యాలు, వారసత్వం, భారతదేశ అసంఖ్యాక చరిత్రలు, ప్రశంసలు పొందిన వక్తలు, రచయితలు, చరిత్రకారులతో కూడిన సెషన్‌లో కళలను ఆస్వాదించవచ్చు. ఈ ఏడాది డిసెంబర్ 27 నుంచి మూడు రోజుల పాటు ఈ ఫెస్టివల్ జరగనుంది.



జానపద కళా రూపాలు

ఆవాజ్ స్టూడియోచే నిర్వహించే ఆర్ట్స్, డిజైన్ ఈవెంట్ SHIFT. రాజస్థాన్‌లోని ఒక గ్రామంలో ఎదుగుతున్న అట్టడుగు నేపథ్యాలను అన్వేషించే పాటలకు ప్రసిద్ధి చెందిన ఇండీ కళాకారుడు రాహ్‌గిర్‌ను ప్రదర్శించే మూడు రోజుల పండుగ. డిసెంబర్ 20న ప్రారంభమవుతుంది. రెండు రోజుల పాటు జరిగిఏ ఈ వేడుకలో రాష్ట్రంలోని జానపద కథల పరిణామం ఇక్కడ చూడచ్చు. హ్యాండ్-బ్లాక్ ప్రింటింగ్, కుండల తయారీ, ఎంబ్రాయిడరీ వర్క్‌షాప్‌ల, మూడు రోజులలో రాజస్థాన్ హస్తకళల సొగసును చూడచ్చు. మాస్టర్ కల్బెలియా కళాకారులచే 500 మందికి పైగా జానపద నృత్యంలో పాల్గొంటున్నారు.

కళల ప్రదర్శన

పబ్లిక్ ఆర్ట్స్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా (PATI)చే నిర్వహించే, JAW 4.0 వారం రోజుల పాటు ఆర్ట్ వీర్ జరుగుతుంది. ఆ కార్యక్రమంలో ప్రదర్శనలు, వర్క్‌షాప్‌ల నిర్వహణ కోసం నగరంలోని వర్ధమాన కళాకారులు తమ చేయూతను అందిస్తున్నారు. దేవుళ్లు, రాక్షసులు, ఆలయ పెయింటింగ్‌లు, జానపద కథలను వీటిలో రూపొందించారు. ఆర్కిటెక్చరల్ ఆర్టిస్టుల బృందం ఆల్బర్ట్ హాల్ మ్యూజియంలో పెద్ద ఎత్తున ఇంటరాక్టివ్ ఇన్‌స్టాలేషన్‌ను ఆవిష్కరిస్తుంది. జనవరి 27 నుంచి ఫిబ్రవరి 3 వరకు ఈ ఆర్ట్ వీక్ జరుగుతుంది.

డ్యాన్స్

నృత్యం ద్వారా సేవ






18 ఏళ్ల నర్తకి విశాఖ విజన్ 2020కి సహాయం చేయడానికి ఈ యేడాది నవంబర్ చివరిలో ఆస్ట్రేలియాలో భరతనాట్యాన్ని ప్రదర్శించింది. విశాఖ ప్రస్తుతం ప్రతిష్ఠాత్మక WAAPA (వెస్టర్న్ ఆస్ట్రేలియన్ అకాడమీ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్)లో బ్యాచిలర్ ఆఫ్ డ్యాన్స్ అభ్యసిస్తోంది. భారతదేశంలో చిదంబరం ఖసురేష్, శ్రీజిత్ కృష్ణ, బ్రాగా బెస్సెల్‌ల వద్ద భరతనాట్యంలో శిక్షణ పొందింది.

ఆస్ట్రేలియాలో పుట్టిపెరిగిన విశాఖ భారతీయ నృత్యాన్ని జీవిత లక్ష్యంగా మార్చుకుంది. భారతీయ మూలాలుండటం వల్ల తనలో శాస్త్రీయ నృత్యం శ్వాసగా మారిపోయింది అంటోంది. 'భావోద్వేగ మేల్కొలుపు – నవరస మోహన' అనేది మన రోజువారీ పరస్పర చర్యలను ప్రభావితం చేసే, నిర్దేశించే భావోద్వేగాల తొమ్మిది వ్యక్తీకరణలపై ఆధారపడింది. వీటిని విశాఖ పుణికి పుచ్చుకుంది. సామాజిక మేల్కొలుపును కలిగించేలా 'నిస్వార్థ జీవి చెట్టు' గురించి తన ప్రదర్శనలో వర్ణించింది. 113 ఏళ్ల వృద్ధురాలు తిమ్మక్క, చెట్లతో ఆమెకు ఉన్న అనుబంధం ఈ కథనంలో అల్లుకుపోయింది. కళా ప్రక్రియలలో విస్తరించిన అద్భుతమైన భాగంగా దీనిని చెప్పవచ్చు. ఇది సామాజిక సందేశాన్ని దాని ప్రధాన భాగంలో ప్రసారం చేయడంలో శైలులు, భాష, ఫార్మాట్‌లను మిళితం చేసింది. ఆహ్లాదకరంగా ఉండటంతో పాటు ఆలోచింపజేసేటటువంటి, ప్రక్రియలో సరిహద్దులను చెరిపేసింది.

'భారతదేశంలో చెట్లను నాటడం ద్వారా పర్యావరణాన్ని కాపాడాలనే అవగాహన, ప్రతి వ్యక్తి సమాజానికి తిరిగి ఇవ్వాల్సిన అవసరం.. ఎప్పుడూ మా ఇంట్లో ఒక మంత్రంగా ఉంటుంది. అందువల్ల ఈ నృత్యం అందరినీ విశేషంగా ఆకట్టుకుంటుంది' అని చెబుతుంది విశాఖ.

భారతీయ–ఆస్ట్రేలియన్ యువ కళాకారిణిగా ఆమె జీవితంలో భరతనాట్యానికి ఎంతటి ప్రాముఖ్యత ఉందో ఈ సందర్భంగా వివరించింది. 'పాశ్చాత్య నృత్య సమాజంలో భరతనాట్య నర్తకిగా నన్ను బయటి వ్యక్తిగానే చూసేవారు. కానీ ఇప్పుడు అందరి చేత 'నృత్యం ఆత్మ ప్రదర్శించే భాష, ఇది కేవలం సమకాలీనమైనది కాదు, ఇది శరీరం, ఆత్మ కదలిక' అని చెబుతుంది విశాఖ.



విజయవంతమైన వ్యక్తులు ఎప్పుడూ ఇతరులకు సహాయం చేయడానికి అవకాశాల కోసం వెతుకుతూ ఉంటారు.
- బ్రియాన్ ట్రేసీ, కెనడియన్-అమెరికన్ మోటివేషనల్ స్పీకర్

బిజినెస్ రీల్

జీఎన్‌జీ ఎలక్ట్రానిక్స్ ఐపీవో బాట

సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు



న్యూఢిల్లీ: వినియోగించిన ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్‌లను పునరుద్ధరించే జీఎన్‌జీ ఎలక్ట్రానిక్స్ పబ్లిక్ ఇష్యూ బాటలో సాగుతోంది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా రూ. 825 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో 97 లక్షల ఈక్విటీ షేర్లను కంపెనీ ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 320 కోట్లు రుణ చెల్లింపులకు, మరో రూ. 260 కోట్లు వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు వెచ్చించనుంది. మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు కేటాయించనున్నట్లు ప్రాస్పెక్టస్‌లో పేర్కొంది. కంపెనీ ఎలక్ట్రానిక్స్ బజార్ బ్రాండుతో ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్, సర్వర్లు, ప్రీమియం స్మార్ట్‌ఫోన్ తదితరాల పునర్వినియోగానికి వీలైన వేల్యూ చైన్‌ను నిర్వహిస్తోంది. విక్రయాలు, అమ్మకాల తదుపరి సర్వీసులు, వారంటీ సేవలు అందిస్తోంది. కొత్త ప్రొడక్టులతో పోలిస్తే 35–50 శాతం తక్కువ ధరలకే అందిస్తోంది. భారత్‌సహా యూఎస్, యూరప్, ఆఫ్రికా తదితర ప్రాంతాలలో కార్యకలాపాలు విస్తరించింది.

రూ.459 కోట్లు సమీకరించిన సెంకో గోల్డ్



ముంబై: జ్యువెలరీ రిటైలర్ సెంకో గోల్డ్ క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ (క్యూఐపీ) పద్ధతిలో రూ.459 కోట్లు సమీకరించింది. ఇందుకోసం సంస్థాగత ఇన్వెస్టర్లకు ఒక్కొక్కటి రూ.1,125 చొప్పున మొత్తం 40.8 లక్షల ఈక్విటీ షేర్లను కేటాయించింది. ఈ మేరకు కంపెనీ ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇచ్చింది. డిసెంబర్ 11న ప్రారంభమైన ఇష్యూ 13న ముగిసింది. టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ 14.49%, టాటా మల్టీక్యాప్ ఫండ్ 8.77%, టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ ఎమర్జెన్సీ ఆపర్చునిటీస్ 6.40%, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ 6.54%, ఇతర ఫండ్ సంస్థలు మిగిలిన షేర్లను దక్కించుకున్నాయి. సమీకరించిన నిధులను వ్యాపార విస్తరణ ప్రణాళికలో భాగంగా ఈ ఏడాదిలో 20 స్టోర్ల ప్రారంభానికి వినియోగిస్తామని సెంకో తెలిపింది.

ఐపీఓకు ఎలిగంజ్ ఇంటీరియర్స్



న్యూఢిల్లీ: ఐపీఓ ద్వారా నిధులు సమీకరించేందుకు ఎన్ఎస్ఈ ఎమర్జ్ వద్ద ఎలిగంజ్ ఇంటీరియర్స్ ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది. ఇష్యూలో భాగంగా 60.05 లక్షల తాజా ఈక్విటీ షేర్లను జారీ చేస్తామని కంపెనీ తెలిపింది. ఐపీఓ అనంతరం షేర్లను ఎన్ఎస్ఈ ఎమర్జ్ ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్‌లో నమోదు చేస్తామని పేర్కొంది. సమీకరించిన నిధుల్లో రూ.25 కోట్లు రుణాలను చెల్లించేందుకు, రూ.30 కోట్లు మూలధన వ్యయానికి, మిగిలిన మొత్తాన్ని సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగిస్తామని వివరించింది. ఈ ఇష్యూకు విశ్రో ఫైనాన్షియల్ సర్వీసెస్ బుక్ రన్నింగ్ మేనేజర్‌గా, బిగ్‌షేర్ సర్వీసెస్ రిజిస్ట్రార్‌గా వ్యవహరిస్తున్నాయి. ఎలిగంజ్ ఇంటీరియర్స్ దేశవ్యాప్తంగా కార్పొరేట్, వాణిజ్య సంస్థలకు ఇంటీరియర్ ఫిట్ అవుట్ సేవలు అందిస్తోంది.

దేశ, విదేశీ ఆర్థికాంశాలే దిక్సూచి

- దేశీయంగా వాణిజ్యం, టోకు ధరలు కీలకం
- యూఎస్ క్యూ3 జీడీపీకి ప్రాధాన్యం
- ఫెడ్ వడ్డీ రేట్ల నిర్ణయాలపై ఆసక్తి
- దేశీ స్టాక్ మార్కెట్ల ట్రెండ్‌పై విశ్లేషకుల అంచనాలు

ఈ వారం పలు గణాంకాల వెల్లడి



ముంబై: ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లకు ప్రధానంగా దేశ, విదేశీ గణాంకాలు దిక్సూచిగా నిలిచే అవకాశముంది. దేశీయంగా టోకు ధరల ద్రవ్యోల్బణం, వాణిజ్యం తదితర గణాంకాలు వెల్లడికానున్నాయి. అంతర్జాతీయంగా యూఎస్ ఆర్థిక వ్యవస్థ పనితీరు, ఆ దేశ కేంద్ర బ్యాంకు పరపతి విధాన సమీక్ష కీలకంగా నిలవనున్నట్లు స్వస్తికా ఇన్వెస్ట్‌మార్ట్ సీనియర్ టెక్నికల్ విశ్లేషకులు ప్రవేష్ గౌర్ పేర్కొన్నారు. వీటికితోడు ముడిచమురు ధరలు, ప్రపంచ ప్రధాన కరెన్సీలతో డాలరు మారకం వంటి అంశాలకూ ప్రాధాన్యత ఉన్నట్లు విశ్లేషకులు తెలియజేశారు. సెప్టెంబర్, అక్టోబర్‌లో అమ్మకాలకే మొగ్గు చూపిన విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు(ఎఫ్ఐఐలు) ఇటీవల దేశీ స్టాక్స్‌లో కొనుగోళ్ల యూటర్న్ తీసుకున్న విషయం విదితమే. వెరసి విదేశీ పెట్టుబడులతోపాటు.. రాజకీయ భౌగోళిక అంశాలూ సెంటిమెంటును ప్రభావితం చేయనున్నట్లు తెలియజేశారు.

ఆర్థిక గణాంకాలు

నేడు(16న) దేశీయంగా నవంబర్ నెలకు టోకు ధరల ద్రవ్యోల్బణం(డబ్ల్యూపీఐ) వివరాలు వెల్లడికానున్నాయి. అక్టోబర్‌లో డబ్ల్యూపీఐ 2.36 శాతం పెరిగింది. ఇదే రోజు వాణిజ్య గణాంకాలు సైతం విడుదల కానున్నాయి. అక్టోబర్‌లో వాణిజ్య లోటు 24.1 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ఈ బాటలో హెచ్ఎస్‌బీసీ ఇండియా తయారీ, సర్వీసెస్ పీఎంఐ గణాంకాలు వెల్లడికానున్నాయి. అక్టోబర్‌లో తయారీ పీఎంఐ 57.5కు చేరగా, సర్వీసుల పీఎంఐ 58.5ను తాకింది.

గత వారమిలా

శుక్రవారం(13)తో ముగిసిన గత వారం దేశీ స్టాక్ ఇండెక్సులు భారీ ఆటుపోట్ల మధ్య స్వల్పంగా బలపడ్డాయి. సెన్సెక్స్ నికరంగా 424 పాయింట్లు(0.5 శాతం) పుంజుకుని 82,133 వద్ద ముగిసింది. నిఫ్టీ 91 పాయింట్లు(0.4 శాతం) మెరుగై 24,768 వద్ద స్థిరపడింది. బీఎస్ఈ మిడ్ క్యాప్ 0.2 శాతం బలపడితే.. స్మాల్ క్యాప్ ఇదేస్థాయిలో నీరసించింది.

గత వారం మార్కెట్ విలువరీత్యా టాప్–10 కంపెనీలలో 5 కంపెనీలు బలపడగా.. మరో 5 దిగ్గజాలు నీరసించాయి. దీంతో వీటి మార్కెట్ విలువ నికరంగా రూ. 1.13 లక్షల కోట్లమేర బలపడింది. ఎయిర్‌టెల్ మార్కెట్ క్యాప్ రూ. 47,837 కోట్లు, ఇన్ఫోసిస్ విలువ రూ. 31,827 కోట్లు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ విలువ రూ. 11,888 కోట్లు చొప్పున ఎగసింది. ఈ బాటలో ఐసీఐసీఐ బ్యాంక్ విలువకు రూ. 11,761 కోట్లు, టీసీఎస్‌కు రూ. 9,805 కోట్లు చొప్పున జమయ్యింది. అయితే ఆర్ఐఎల్ మార్కెట్ విలువ రూ. 52,032 కోట్లు, ఎల్ఐసీ విలువ రూ. 32,068 కోట్లు, హెచ్‌యూఎల్ విలువ రూ. 22,561 కోట్లు చొప్పున క్షీణించింది.

విదేశీ అంశాలు

యూఎస్ ఫెడరల్ రిజర్వ్ గురువారం(19న) పరపతి విధాన సమీక్షను చేపట్టనుంది. ద్రవ్యోల్బణం మందగించడం, ఉపాధి మార్కెట్ పటిష్టత నేపథ్యంలో వడ్డీ రేటులో 0.25 శాతం కోత విధించవచ్చని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. గత నెల 7న చేపట్టిన పాలసీ మినిట్స్ సైతం ఇందుకు మద్దతిస్తున్నట్లు రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా తెలియజేశారు. ఇక ఇదే రోజున ఈ ఏడాది మూడో త్రైమాసిక(జులై–సెప్టెంబర్) జీడీపీ గణాంకాలు విడుదలకానున్నాయి. ముందస్తు అంచనాల ప్రకారం యూఎస్ జీడీపీ 2.8 శాతం పుంజుకుంది. నేడు నవంబర్ నెలకు చైనా పారిశ్రామికోత్పత్తి, రిటైల్ అమ్మకాలు వెల్లడికానున్నాయి. రేపు(17న) యూఎస్ రిటైల్ సేల్స్, 18న జపాన్ వాణిజ్య గణాంకాలు తెలియనున్నాయి. వారాంతాన(20న) నవంబర్ ద్రవ్యోల్బణ రేటును జపాన్ ప్రకటించనుంది.

ఈ–టూవీలర్స్‌లోనూ పెద్ద కంపెనీలే

- దూసుకెళ్తున్న బజాజ్, టీవీఎస్
- పుంజుకున్న హీరో మోటోకార్ప్
- హోండాతో వేడెక్కనున్న మార్కెట్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హీరో మోటోకార్ప్, హోండా, టీవీఎస్, బజాజ్, సుజుకీ, యమహా.. భారత ద్విచక్ర వాహన మార్కెట్లో ఈ కంపెనీలదే రాజ్యం. మారుమూల పల్లెల్లోనూ ఈ బ్రాండ్ల వాహనాలే దర్శనమిస్తాయి. సువిశాల భారతావని అంతటా ఇవి తమ నెట్‌వర్క్‌ను దశాబ్దాలుగా పెంచుకున్నాయి. విక్రయ శాలలే కాదు సర్వీసింగ్‌ను కూడా కస్టమర్లకు చేరువ చేశాయి. మాస్ మార్కెట్‌ను పూర్తిగా ఇవి చేతుల్లోకి తీసుకున్నాయంటే ఆశ్చర్యంవేయక మానదు. ఇంత బలమున్న ఈ దిగ్గజాలు ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన రంగంలోనూ పాగా వేస్తాయనడంలో సందేహం లేదు. ఆలస్యంగా ఎంట్రీ ఇచ్చినప్పటికీ బజాజ్, టీవీఎస్ తమ సత్తా చాటుతున్నాయి. హీరో మోటోకార్ప్ క్రమక్రమంగా వేగం పెంచి నవంబర్‌లో టాప్–5 స్థానానికి ఎగబాకింది. పెద్ద కంపెనీలే ఈ–టూవీలర్స్‌లోనూ అడ్డా వేస్తాయని గణాంకాలు చెబుతున్నాయి. భారత ఈ–టూవీలర్స్ పరిశ్రమ ఈ ఏడాది నవంబర్ 11 నాటికే 10,00,000 యూనిట్ల మైలురాయిని దాటింది.

మళ్లీ హమారా బజాజ్..

2024 డిసెంబర్ తొలి వారంలో అమ్ముడైన ఎలక్ట్రిక్ టూ వీలర్స్‌లో టాప్–4 కంపెనీల వాటా ఏకంగా 82 శాతం ఉందంటే భవిష్యత్ ఎలా ఉండబోతోందో అర్థం చేసుకోవచ్చు. మిగిలిన 18 శాతం వాటా కోసం దేశవ్యాప్తంగా 200లకుపైగా బ్రాండ్లు పోటీ పడుతున్నాయి. భారత స్కూటర్స్ మార్కెట్లో ఒకప్పుడు రారాజులా వెలుగొందిన బజాజ్.. ఇప్పుడు ఎలక్ట్రిక్ చేతక్ రూపంలో స్కూటర్స్ విభాగంలోకి రీఎంట్రీ ఇచ్చి హమారా బజాజ్ అనిపించుకుంటోంది. డిసెంబర్ తొలివారంలో బజాజ్ 4,988 యూనిట్లతో తొలి స్థానంలో నిలిచింది. టీవీఎస్ మోటార్ కంపెనీ 3,964 యూనిట్లతో రెండవ స్థానంలో ఉంది. ప్రస్తుతం ఈ రెండు కంపెనీల మధ్యే పోటీ తీవ్రంగా ఉంది. ఓలా 3,351, ఏథర్ ఎనర్జీ 2,523 యూనిట్లతో ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఓలా అమ్మకాలు అక్టోబర్‌లో 41,775 యూనిట్ల నుంచి నవంబర్‌లో 29,191 యూనిట్లకు పడిపోయింది. దేశవ్యాప్తంగా ఈ కంపెనీ వాహనాల నాణ్యతపై ఫిర్యాదులు వెల్లువెత్తుతుండడం గమనార్హం.

పెద్ద కంపెనీల మధ్యే పోటీ..

తదుపరితరం చేతక్‌ను డిసెంబర్ 20న ప్రవేశపెట్టేందుకు బజాజ్ రెడీ అయింది. 2019–20లో కేవలం 212 యూనిట్లు విక్రయించిన బజాజ్.. 2020–21లో 1,395 యూనిట్లు, ఆ తర్వాతి ఏడాది 8,187, 2022–23లో 36,260 యూనిట్ల అమ్మకాలు నమోదు చేసింది. ఆ తర్వాతి ఆర్థిక సంవత్సరంలో 1,15,702 యూనిట్లను సాధించింది. 2024–25 ఏప్రిల్–నవంబర్‌లో 1,34,167 యూనిట్లు రోడ్డెక్కాయి. టీవీఎస్ మోటార్ కంపెనీ 2023 జనవరిలో 10,465 యూనిట్ల సేల్స్ నమోదు చేసింది. ఏడాదిలోనే ఈ సంఖ్య 47 శాతం పెరిగింది. 2024 నవంబర్‌లో ఈ కంపెనీ 26,971 యూనిట్ల అమ్మకాలను దక్కించుకుంది. ఈ నెలలోనే విదా వీ2 మోడల్‌ను ఆవిష్కరించిన హీరో మోటోకార్ప్ క్రమక్రమంగా ఈ–టూవీలర్స్‌లో పట్టు సాధిస్తోంది. ఈ కంపెనీ 2023 జనవరిలో 157 యూనిట్లు విక్రయించింది. 2024 జనవరిలో ఈ సంఖ్య 1,495కు చేరుకుంది. నవంబర్‌లో ఏకంగా 7,309 యూనిట్ల అమ్మకాలను సాధించి టాప్–5 స్థానాన్ని అందుకుంది.

క్యూలో మరిన్ని దిగ్గజాలు..

2025 తొలి త్రైమాసికం నుంచి నేను సైతం అంటూ హోండా మోటార్‌సైకిల్, స్కూటర్ ఇండియా రెడీ అవుతోంది. యాక్టివా–ఈ, క్యూసీ1 మోడళ్లను కంపెనీ భారత మార్కెట్లో ఇటీవలే ఆవిష్కరించింది. 2025 జనవరి 1 నుంచి బుకింగ్స్ స్వీకరిస్తారు. ఫిబ్రవరి నుంచి డెలివరీలు ప్రారంభం అవుతాయని కంపెనీ ప్రకటించింది. సంస్థకు దేశవ్యాప్తంగా 6,000 పైచిలుకు సేల్స్, సర్వీస్ టచ్‌పాయింట్స్ ఉన్నాయి. 2025లో 1,00,000 యూనిట్ల ఈ–స్కూటర్స్ తయారు చేయాలని లక్ష్యంగా చేసుకుందంటే కంపెనీకి ఉన్న ధీమా అర్థం చేసుకోవచ్చు. మరో వైపు సుజుకీ, యమహా ఎంట్రీ ఇస్తే ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన పరిశ్రమ సరికొత్త రికార్డుల దిశగా దూసుకెళ్లడం ఖాయంగా కనిపిస్తోంది. యమహా ఇప్పటికే హైబ్రిడ్ టూ వీలర్స్ తయారు చేస్తోంది. సుజుకీ నియో ఎలక్ట్రిక్ టూ వీలర్ కొద్ది రోజుల్లో రంగ ప్రవేశం చేయనుంది.

పాత విధానమా.. కొత్త విధానమా..

ఆర్థిక సంవత్సరం 2020–21 నుంచి కొత్త విధానం అమల్లోకి వచ్చింది. మీకు ఇష్టమైతే ఈ విధానాన్ని ఎంచుకోవచ్చు. గడువు తేదీలోపల ఎంపిక చేసుకోవచ్చు. ఆ తర్వాత అయితే, కొత్త విధానమే పాటించాలి. పాత విధానంలో మినహాయింపులు ఉన్నాయి. రేట్లు 10 శాతం, 20 శాతం, 30 శాతం.. ఇలా ఉన్నాయి. కొత్త విధానంలో మినహాయింపులు ఉండవు. రేట్లు 5,10, 15, 20, 30 శాతంగా ఉన్నాయి. పైన చెప్పినవన్నీ వ్యక్తులకు, హిందూ ఉమ్మడి కుటుంబాలకు వర్తిస్తాయి.

ఏ ప్రాతిపదికన ఎంచుకోవాలి?

- మీ ఆదాయ స్వభావం
- మీ ఆదాయం
- సేవింగ్స్
- పెట్టుబడులు
- సొంతిల్లు రుణం – రుణం మీద వడ్డీ
- మెడికల్ ఖర్చులు, కొన్ని జబ్బుల మీద ఖర్చులు
- జీతం మీద ఆదాయం ఒక్కటే ఉంటే ఒకలాగా ఆలోచించాలి
- జీతంతో పాటు ఇతర ఆదాయాలు ఉంటే మరొకలాగా ఆలోచించాలి



కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

- వ్యాపారస్తులు, వృత్తి నిపుణులు .. వారి ఇన్వెస్ట్‌మెంట్ విధానం
- ఉద్యోగస్తులు వారికి ఇష్టమైన విధానాన్ని ఎంచుకోవచ్చు. ప్రతి సంవత్సరం మార్చుకోవచ్చు.
- వ్యాపారస్తులకు అలా మార్చుకునే వెసులుబాటు లేదు
- ఒకరితో ఒకరు పోల్చుకోకండి. మీ విధానం మీదే. మీ ఆదాయం మీదే. మీ పన్నుభారం మీదే.

కింది ఉదాహరణలను గమనించండి.ఆర్థిక సంవత్సరం 2024-25

1వ కేసు

వివరాలు	పాత విధానం (రూ.లలో)	కొత్త విధానం (రూ.లలో)
జీతం	12,00,000	12,00,000
తీసివేత: స్టాండర్డ్ డిడక్షన్	50,000	75,000
	11,50,000	11,25,000
తీసివేత: సొంతింటి రుణంపై వడ్డీ	2,00,000	-
-	9,50,000	11,25,000
తీసివేత: 80సీ	1,50,000	-
80డీ	25,000	-
80జీ	50,000	-
నికర ఆదాయం	7,25000	11,25,000
పన్ను భారం	59,800	71,500

ఈ కేసులో పాత పద్ధతిలోనైతే పన్ను భారం రూ. 11,700 తక్కువగా ఉంటుంది.

ఇక, 2వ కేసులో ఎటువంటి సేవింగ్స్ గానీ మినహాయింపులు గానీ లేవనుకుందాం.

వివరాలు	పాత విధానం (రూ.లలో)	కొత్త విధానం (రూ.లలో)
స్థూల ఆదాయం	12,00,000	12,00,000
తీసివేత: స్టాండర్డ్ డిడక్షన్	50,000	75,000
నికర ఆదాయం	11,50,000	11,25,000
పన్ను భారం	1,01,400	71,500

ఎటువంటి సేవింగ్స్ లేకపోతే కొత్త పద్ధతిలో రూ. 29,900 పన్ను భారం తగ్గుతుంది. సుమారు రూ. 30,000 మిగులు. అయితే, మీ చేతిలో ఎంతో నిలవ ఉంటుంది. దీన్ని మీరు దేనికైనా ఖర్చు పెట్టుకోవచ్చు. మీరిచ్చే ప్రాధాన్యత, మీ అవసరం మొదలైన వాటి ప్రకారం మీ ఇష్టం.

మరో కేసులో కేవలం జీతం రూ. 7,00,000 కాగా సేవింగ్స్ లేవు అనుకుందాం. అప్పుడు..

వివరాలు	పాత విధానం (రూ.లలో)	కొత్త విధానం (రూ.లలో)
స్థూల ఆదాయం	7,00,000	7,00,000
తీసివేత: స్టాండర్డ్ డిడక్షన్	50,000	75,000
నికర ఆదాయం	6,50,000	6,25,000
పన్ను భారం	44,200	నిల్

కొత్త పద్ధతిలో ట్యాక్స్ పడదు. పాత పద్ధతిలో పడుతుంది. పాత పద్ధతిలో పన్ను పడకూడదంటే, ఆ మేరకు సేవింగ్స్ చేయాలి.

సేవింగ్స్ అంటే మీ ఫండ్స్ బ్లాక్ అవుతాయి. ఆటోమేటిక్‌గా అందరూ కొత్త దాని వైపే మొగ్గు చూపుతారు.

అయితే ఉద్యోగంలో కంపల్సరీగా పీఎఫ్ మొదలైన సేవింగ్స్ ఉంటాయి. ముందు జాగ్రత్తగా మనం సేవ్ చేస్తుంటాం. మన అవసరాలను, కలలను, ఆలోచనలను దృష్టిలో పెట్టుకోవాలి.

ఒకే కుటుంబంలో ఇద్దరు ఉద్యోగస్తులంటే, ఒకరు సేవ్ చేసి మరొకరు మానేసి.. ఇద్దరూ కొంత చేసి.. ఇలా ఎన్నో ఆలోచనలే మీ ట్యాక్స్ ప్లానింగ్‌కి దారి తీస్తాయి.



పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

దీర్ఘకాలంలో పెట్టుబడులకు అధిక విలువ

యూటీఐ వ్యాల్యూ అపార్చునిటీస్ ఫండ్

దీర్ఘకాల లక్ష్యాలకు ఈక్విటీ పెట్టుబడులు ఎంతో అనుకూలం. ఇతర సాధనాలతో పోల్చిచూసినప్పుడు మెరుగైన రాబడులు అందుకోవచ్చు. ఈక్విటీల్లో ప్రధానంగా వ్యాల్యూ ఇన్వెస్టింగ్, గ్రోత్ ఇన్వెస్టింగ్ గురించి చెబుతుంటారు. వ్యాల్యూ ఇన్వెస్టింగ్ విభాగంలో యూటీఐ వ్యాల్యూ అపార్చునిటీస్ ఫండ్ మంచి పనితీరు చూపిస్తోంది. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) ద్వారా ఈ పథకంలో పెట్టుబడులను ఇన్వెస్టర్లు పరిశీలించొచ్చు.



రాబడులు

గడిచిన ఏడాది కాలంలో ఈ పథకం పెట్టుబడులపై 34 శాతం రాబడులు అందించింది. ఇదే కాలంలో బెంచ్ మార్క్ సూచీ బీఎస్ఈ 100 టీఆర్ఐ రాబడి 23 శాతంగానే ఉంది. మూడేళ్ల కాలంలో చూసుకున్నా గానీ ఈ పథకం ఏటా 19 శాతానికి పైనే ప్రతిఫలాన్ని తెచ్చిపెట్టింది. ఇదే కాలంలో బీఎస్ఈ 100 టీఆర్ఐ వార్షిక వృద్ధి 15.58 శాతంగా ఉంది. ఇక ఐదేళ్ల కాలంలో 22 శాతం, ఏడేళ్ల కాలంలో 17 శాతం, పదేళ్లలో 13.64 శాతం చొప్పున వార్షిక రాబడి ఈ పథకంలో ఉండడాన్ని గమనించొచ్చు. బెంచ్ మార్క్ బీఎస్ఈ 100 టీఆర్ఐ కంటే ఈ పథకం పనితీరే మెరుగ్గా ఉన్నట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.



పెట్టుబడుల విధానం

ఈ పథకం అన్ని మార్కెట్ క్యాప్ విభాగాల్లోనూ ఇన్వెస్ట్ చేసే స్వేచ్ఛను కలిగి ఉంది. లార్జ్‌క్యాప్, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ విభాగాల్లో ఎక్కడ ఆకర్షణీయ, విలువైన అవకాశాలున్నా గుర్తించి ఇన్వెస్ట్ చేస్తుంది. టాప్ డౌన్, బోటమ్ అప్ పేరుతో రెండు విధానాలను పెట్టుబడులకు అనుసరిస్తుంది. మధ్య కాలానికి కంపెనీల వృద్ధి అవకాశాల ఆధారంగా, స్టాక్స్ విలువలపై ఒక అంచనాకు వస్తుంది. అధిక నిర్వహణ లాభాలు, దీర్ఘకాలంలో రిటర్న్ ఆన్ ఈక్విటీ ఎలా ఉందన్నది చూస్తుంది. యాజమాన్యం సామర్థ్యం, నిజాయితీ, కంపెనీ వ్యాపార నమూనా, పోటీతత్వాలను పరిశీలిస్తుంది. టాప్ 500 స్టాక్స్ నుంచి తనకు అనుకూలమైన వాటిని ఎంపిక చేసుకుంటుంది. విలువలు ఆకర్షణీయమని అనిపిస్తే గ్రోత్ స్టాక్స్‌ను సైతం ఎంపిక చేసుకుని ఇన్వెస్ట్ చేస్తుంది. రిటర్న్ ఆఫ్ క్యాపిటల్ ఎంప్లాయిడ్, రిటర్న్ ఆన్ ఈక్విటీ తక్కువగా ఉండి, వాటి దశ మారుతుందని గుర్తించినా పెట్టుబడులు పెడుతుంది.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడులు శాతం
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	9.55
ఐసీఐసీఐ బ్యాంక్	5.63
ఇన్ఫోసిస్	5.44
భారతీ ఎయిర్‌టెల్	3.68
యాక్సిస్ బ్యాంక్	3.24
ఎస్‌బీఐ	3.04
కోటక్ బ్యాంక్	3.04
టెక్ మహీంద్రా	3.03
రిలయన్స్ ఇండస్ట్రీస్	2.80
మహీంద్రా అండ్ మహీంద్రా	2.41

పోర్ట్‌ఫోలియో

ఈ పథకం నిర్వహణలో ప్రస్తుతానికి రూ.10,159 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో 98.79 శాతాన్ని ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసింది. మిగిలిన పెట్టుబడులు డెట్ సాధనాలు, నగదు రూపంలో కలిగి ఉంది. పోర్ట్‌ఫోలియోలో మొత్తం 60 స్టాక్స్ ఉన్నాయి. మొదటి పది స్టాక్స్‌లోనే 42 శాతం పెట్టుబడులు పెట్టింది. ఈక్విటీ పెట్టుబడులు గమనిస్తే.. 72 శాతం మేర లార్జ్‌క్యాప్ కంపెనీల్లోనే ఉన్నాయి. మిడ్‌క్యాప్ కంపెనీల్లో 22.62 శాతం, స్మాల్‌క్యాప్ కంపెనీల్లో 5.43 శాతం చొప్పున పెట్టుబడులు ఉన్నాయి. పెట్టుబడుల పరంగా బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్, టెక్నాలజీ, కన్జ్యూమర్ డిస్క్రీషనరీ, మెటీరియల్స్, హెల్త్‌కేర్ కంపెనీలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చింది. 83 శాతం పెట్టుబడులు ఈ రంగాలకు చెందిన కంపెనీల్లోనే ఉండడాన్ని గమనించొచ్చు.

ఆరోగ్య బీమాతో ఆదా..

ప్రియా దేశ్‌ముఖ్



హెడ్ (హెల్త్ ప్రొడక్ట్స్, ఆపరేషన్స్ - సర్వీసెస్)
ఐసీఐసీఐ లాంబార్డ్

ఆరోగ్యమే మహాభాగ్యం అంటారు. అయితే, ఆసుపత్రుల కార్పొరేటీకరణ కారణంగా దేశీయంగా ఆరోగ్య సంరక్షణ, వైద్య చికిత్స వ్యయాలు పెరిగిపోతున్నాయి. ఇటీవలి నివేదికల ప్రకారం ఆసియా మొత్తం మీద భారత్‌లో ఇందుకు సంబంధించిన ద్రవ్యోల్బణం అత్యధికంగా 14 శాతంగా ఉంది. ఈ నేపథ్యంలో పెరిగే వైద్య చికిత్స వ్యయాల భారాన్ని తట్టుకునేందుకు ఆరోగ్య బీమా అనేది ఎంతగానో ఉపయోగపడే సాధనంగా ఉంటోంది. ఆరోగ్యాన్ని సంరక్షించుకోవడం, ఆర్థికంగా ఆదా చేసుకోవడం రెండూ ఒకదానికి ఒకటి ముడిపడి ఉన్న అంశాలు. సమగ్రమైన ఆరోగ్య సంరక్షణ పథకాలు ఈ విషయంలో కీలక పాత్ర పోషిస్తాయి. పటిష్టమైన ఆరోగ్య బీమా పథకంలో ఇన్వెస్ట్ చేయడం ద్వారా పాలసీదారులు ఆర్థిక సమస్యల గురించి ఆందోళన చెందకుండా నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవలను అందుకోవచ్చు.

ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆధునిక ఆరోగ్య బీమా పథకాలు అనేక ప్రయోజనాలు అందిస్తున్నాయి. వాటిలో కొన్ని:

నగదురహిత చికిత్స: పాలసీదారులు పైసా కూడా చెల్లించాల్సిన అవసరం లేకుండా కేవలం తమ పాలసీ నంబరును ఇచ్చి, వైద్య చికిత్సలు పొందేందుకు ఇది ఉపయోగపడుతుంది. మెడికల్ ఎమర్జెన్సీల్లో పాలసీదారును ఇబ్బంది పెట్టకుండా బిల్లులను నేరుగా బీమా కంపెనీతో ఆసుపత్రి సెటిల్ చేసుకుంటుంది.

నో క్లెయిమ్ బోనస్: క్లెయిమ్‌లేమీ చేయని పాలసీదారులకు ప్రయోజనం చేకూర్చేందుకు చాలా కంపెనీలు నో–క్లెయిమ్ బోనస్‌ను ఆఫర్ చేస్తున్నాయి. తదుపరి సంవత్సరంలో ప్రీమియంను తగ్గించడమో లేదా సమ్ అష్యూర్డ్‌ను పెంచడం రూపంలోనో ఈ ప్రయోజనాన్ని అందిస్తున్నాయి. ఆరోగ్యకరమైన జీవన విధానానికి ప్రోత్సాహకాలు ఇస్తున్నాయి.

టాప్–అప్ మరియు సూపర్ టాప్–అప్ ప్లాన్లు: బేసిక్ సమ్ ఇన్సూర్డ్ పరిమితి అయిపోతే, అదనంగా కవరేజీని పొందేందుకు టాప్–అప్, సూపర్ టాప్–అప్ ఉపయోగపడతాయి. తక్కువ ఖర్చులో అదనంగా కవరేజీని పొందేందుకు ఇవి సహాయకరంగా ఉంటాయి.

వెల్‌నెస్, ప్రివెంటివ్ కేర్: బీమా సంస్థలు వెల్‌నెస్, ప్రివెంటివ్ కేర్‌పై మరింతగా దృష్టి పెడుతున్నాయి. పాలసీదారులు తీవ్రమైన ఆరోగ్య సమస్యల బారిన పడకుండా జాగ్రత్తపడేందుకు ఈ ప్రోగ్రాంల కింద ఉచితంగా హెల్త్ చెకప్‌లు, జిమ్ మెంబర్‌షిప్‌లు, డైట్ కౌన్సిలింగ్ మొదలైనవి అందిస్తున్నాయి. తద్వారా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని పాటించేలా బీమా సంస్థలు ప్రోత్సహిస్తున్నాయి.

అవసరాలకు అనుగుణంగా కవరేజీ: పాలసీదారులు తమ నిర్దిష్ట అవసరాలకు అనుగుణంగా కవరేజీని తీసుకునే విధంగా ఆధునిక హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్లు ఉంటున్నాయి. వీటికి అదనంగా రక్షణ కోసం రైడర్లను జోడించుకోవడం కావచ్చు లేదా నిర్దిష్ట కవరేజీ ఆప్షన్లను ఎంచుకోవడం కావచ్చు పాలసీదారులకు కొంత వెసులుబాటు ఉంటోంది.

63
భారత దేశవాళీ క్రికెట్‌లో ముంబై జట్టు గెలిచిన టైటిల్స్ సంఖ్య. రంజీ ట్రోఫీని 42 సార్లు నెగ్గిన ముంబై జట్టు ఇరానీ కప్‌ను 15 సార్లు దక్కించుకుంది. విజయ్ హజారే వన్డే ట్రోఫీలో 4 సార్లు విజేతగా నిలిచిన ముంబై జట్టు ముస్తాక్ అలీ ట్రోఫీ టి20 టోర్నీ టైటిల్‌ను రెండుసార్లు హస్తగతం చేసుకుంది.



రన్నరప్ తరుణ్

కటక్: ఒడిశా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–100 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో తెలంగాణ ప్లేయర్ తరుణ్ మన్నేపల్లి రన్నరప్‌గా నిలిచాడు. ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో పురుషుల సింగిల్స్ విభాగంలో భారత ప్లేయర్ రిత్విక్ సంజీవి సతీశ్ కుమార్ చాంపియన్‌గా అవతరించాడు. సహచరుడు తరుణ్‌తో జరిగిన ఫైనల్లో రిత్విక్ 21–18, 21–16తో విజయం సాధించాడు. గత నెలలో తెలంగాణ ఇంటర్నేషనల్ చాలెంజ్ టోర్నీలో విజేతగా నిలిచిన రిత్విక్ తాజా విజయంతో తన కెరీర్‌లో తొలిసారి ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య సూపర్–100 టోర్నీ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. రిత్విక్‌కు 7500 డాలర్ల (రూ. 6 లక్షల 35 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 5500 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. రన్నరప్ తరుణ్‌కు 3800 డాలర్ల (రూ. 3 లక్షల 22 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 4680 ర్యాంకింగ్ పాయింట్లు దక్కాయి. మహిళల సింగిల్స్‌లో భారత ప్లేయర్ తన్వీ శర్మకు నిరాశ ఎదురైంది. చైనా ప్లేయర్ కాయ్ యాన్ యాన్‌తో జరిగిన ఫైనల్లో తన్వీ 14–21, 16–21తో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచింది. తన్వీ శర్మకు 3800 డాలర్ల (రూ. 3 లక్షల 22 వేలు) ప్రైజ్‌మనీ, 4680 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

ఖోఖో ప్రపంచకప్‌లో 41 జట్లు

న్యూఢిల్లీ: భారత్ వేదికగా జరగనున్న ఖోఖో ప్రపంచకప్‌లో 41 జట్లు పాల్గొననున్నాయి. వచ్చే ఏడాది జనవరి 13 నుంచి 19 వరకు న్యూఢిల్లీ వేదికగా జరగనున్న ఈ టోర్నీలో అమెరికా, ఇంగ్లండ్, జర్మనీ, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, బ్రెజిల్ జట్లు కూడా పాల్గొంటున్నాయి. గత వారమే 24 జట్లు ఈ టోర్నీలో భాగస్వాములు అవుతున్నట్లు అధికారికంగా ప్రకటించగా... ఇప్పుడు మరికొన్ని దేశాలు తమ ఆసక్తిని వెల్లడించాయి.



ముంబైదే ముస్తాక్ అలీ ట్రోఫీ

ఫైనల్లో మధ్యప్రదేశ్‌పై ఘనవిజయం ● సూర్యాంశ్ ఆల్‌రౌండ్ ప్రదర్శన ● 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' రహానే

బెంగళూరు: దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ముంబై జట్టు విజేతగా నిలిచింది. టోర్నీ ఆసాంతం రాణించిన ముంబై జట్టు ఆదివారం జరిగిన ఫైనల్లో ఐదు వికెట్ల తేడాతో మధ్యప్రదేశ్‌ను ఓడించి రెండోసారి ట్రోఫీ చేజిక్కించుకుంది. సమష్టి ప్రదర్శనతో తుది పోరుకు చేరిన శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని ముంబై జట్టు చివరి మెట్టుపై కూడా ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన మధ్యప్రదేశ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 174 పరుగులు చేసింది. రజత్ పటిదార్ (40 బంతుల్లో 81 నాటౌట్; 6 ఫోర్లు, 6 సిక్స్‌లు) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో సత్తా చాటాడు. పేస్ ఆల్‌రౌండర్ వెంకటేశ్ అయ్యర్ (17; 1 ఫోర్, 1 సిక్స్) ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. ముంబై బౌలర్లలో శార్దుల్ ఠాకూర్, రాయ్‌స్టన్ డయాస్ రెండు వికెట్ల చొప్పున తీసుకున్నారు.

అనంతరం లక్ష్యఛేదనలో ముంబై 17.5 ఓవర్లలో 5 వికెట్లకు 180 పరుగులు చేసి గెలిచింది. 174 పరుగులతో స్కోరు సమమయ్యాక ముంబై బ్యాటర్ అథర్వ సిక్స్ కొట్టి మ్యాచ్‌ను ముగించాడు. టీమిండియా సారథి సూర్యకుమార్ యాదవ్ (35 బంతుల్లో 48; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) టాప్ స్కోరర్ కాగా... సీనియర్ ప్లేయర్ అజింక్యా రహానే (37; 4 ఫోర్లు) రాణించాడు. చివర్లో సూర్యాంశ్ షెడ్గే (15 బంతుల్లో 36 నాటౌట్; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), అథర్వ అంకొలేకర్ (6 బంతుల్లో 16 నాటౌట్; 2 సిక్స్‌లు) మెరుపులు మెరిపించారు. మధ్యప్రదేశ్ బౌలర్లలో త్రిపురేశ్ సింగ్ 2 వికెట్లు పడగొట్టాడు. సూర్యాంశ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', అజింక్య రహానేకు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు దక్కాయి. 2022లో రహానే సారథ్యంలో ముంబై జట్టు తొలిసారి ముస్తాక్ అలీ ట్రోఫీని సొంతం చేసుకుంది.

స్కోరు వివరాలు

మధ్యప్రదేశ్ ఇన్నింగ్స్: అర్పిత్ గౌడ్ (సి) అంకొలేకర్ (బి) శార్దుల్ 3; హర్ష్ (సి) సూర్యకుమార్ (బి) శార్దుల్ 2; సుబ్రాన్షు సింగ్ (సి) సూర్యకుమార్ (బి) దూబే 23; హర్‌ప్రీత్ సింగ్ (సి) సూర్యకుమార్ (బి) అంకొలేకర్ 15; రజత్ పాటిదార్ (నాటౌట్) 81; వెంకటేశ్ అయ్యర్ (సి) రహానే (బి) సూర్యాంశ్ 17; రాహుల్ బాథం (సి) సూర్యాంశ్ (బి) రాయ్‌స్టన్ 19; త్రిపురేశ్ (సి) హార్దిక్ తమోరె (సి) రాయ్‌స్టన్ 19; శివమ్ శుక్లా (రనౌట్) 1; కార్తికేయ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం** (20 ఓవర్లలో 8 వికెట్లకు) 174. **వికెట్ల పతనం:** 1-5, 2-6, 3-48, 4-54, 5-86, 6-142, 7-142, 8-156. **బౌలింగ్:** అథర్వ అంకొలేకర్ 4-0-19-1; శార్దుల్ ఠాకూర్ 4-0-41-2; రాయ్‌స్టన్ డయాస్ 3-0-32-2; తనుశ్ కొటియాన్ 2-0-17-0; శివమ్ దూబే 4-0-27-1; సూర్యాంశ్ షెడ్గే 3-0-32-1.

ముంబై ఇన్నింగ్స్: పృథ్వీ షా (సి) రాహుల్ (బి) త్రిపురేశ్ 10; రహానే (సి) రాహుల్ (బి) శ్రేయస్ (సి) రజత్ (బి) త్రిపురేశ్ 16; సూర్యకుమార్ (సి) అవేశ్ (బి) శివమ్ శుక్లా 48; శివమ్ దూబే (సి) రజత్ (బి) కార్తికేయ 9; అంకొలేకర్ (నాటౌట్) 16; సూర్యాంశ్ (నాటౌట్) 36; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం** (17.5 ఓవర్లలో 5 వికెట్లకు) 180. **వికెట్ల పతనం:** 1-15, 2-47, 3-99, 4-121, 5-129. **బౌలింగ్:** అవేశ్ ఖాన్ 2-0-18-0; త్రిపురేశ్ సింగ్ 2.5-0-34-2; శివమ్ శుక్లా 3-0-22-1; రాహుల్ 3-0-34-0; వెంకటేశ్ అయ్యర్ 3-0-29-1; కుమార్ కార్తికేయ 4-0-39-1.



హుమేరా ముందంజ

నవీ ముంబై: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ50 మహిళల టోర్నమెంట్‌లో హైదరాబాద్ క్రీడాకారిణులు హుమేరా బహార్మస్, స్మృతి భాసిన్ మెయిన్ 'డ్రా'కు అర్హత పొందేందుకు విజయం దూరంలో నిలిచారు. ఆదివారం జరిగిన సింగిల్స్ క్వాలిఫయింగ్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో హుమేరా, స్మృతి గెలుపొందారు. హుమేరా 6-3, 6-2తో వన్షిత పథానియా (భారత్)పై, స్మృతి 6-4, 6-1తో ఇషా మొహితె (భారత్)పై విజయం సాధించారు. మరోవైపు వేమూరి అపూర్వ, వేమూరి అభయ, రాచపూడి ప్రత్యూష తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. అపూర్వ 1-6, 2-6తో కనకో మొరిసాకి (జపాన్) చేతిలో, అభయ 1-6, 0-6తో హొనోకా కొబయాషి (జపాన్) చేతిలో, ప్రత్యూష 0-6, 3-6తో అన్రి నగాటా (జపాన్) చేతిలో ఓటమి చవిచూశారు. తెలంగాణకే చెందిన రష్మిక, సహజ యామలపల్లి నేరుగా మెయిన్ 'డ్రా'లో పోటీపడతారు.



ఇటీవల మూడు వారాల్లో వరుసగా మూడు అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) జూనియర్ బాలికల సింగిల్స్ టైటిల్స్ నెగ్గిన తెలంగాణ రైజింగ్ స్టార్ బసిరెడ్డి రషితా రెడ్డిని తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి సన్మానించారు. భవిష్యత్‌లో రషితా రెడ్డి మరిన్ని విజయాలు సాధించాలని ఈ సందర్భంగా శివసేనా రెడ్డి ఆకాంక్షించారు.

అర్జున్‌కు రెండో స్థానం

దోహా: ఖతర్ ఓపెన్ మాస్టర్స్ చెస్ టోర్నమెంట్‌లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్‌కు రెండో స్థానం లభించింది. తొమ్మిది రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో అర్జున్ అజేయంగా నిలిచాడు. రష్యా గ్రాండ్‌మాస్టర్ ఆంద్రీ ఎసిపెంకో 7.5 పాయింట్లతో చాంపియన్‌గా నిలిచాడు. అర్జున్ (భారత్), నొదిర్‌బెక్ అబ్దుసత్తారోవ్ (ఉజ్బెకిస్తాన్) 7 పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచారు. మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించారు. దాంతో అర్జున్‌కు రెండో స్థానం, నొదిర్‌బెక్‌కు మూడో స్థానం ఖరారయ్యాయి. ఈ టోర్నీలో అర్జున్ ఐదు గేముల్లో గెలిచి, నాలుగు గేమ్‌లను 'డ్రా' చేసుకున్నాడు. ఎసిపెంకోకు 25 వేల డాలర్లు (రూ. 21 లక్షల 20 వేలు), అర్జున్‌కు 15 వేల డాలర్లు (రూ. 12 లక్షల 72 వేలు), నొదిర్‌బెక్‌కు 10 వేల డాలర్లు (రూ. 8 లక్షల 48 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.




'అన్‌క్యాప్డ్'లకే అందలం

- సిమ్రన్‌కు అత్యధికంగా రూ. 1 కోటి 90 లక్షలు
- రూ. కోటికిపైగా దక్కించుకున్న కమిలిని, ప్రేమ
- విండీస్ ప్లేయర్ డియాండ్రాకు రూ. 1 కోటి 70 లక్షలు
- రెండు గంటల్లోపే ముగిసిన డబ్ల్యూపీఎల్ మినీ వేలం

షేక్ సిమ్రన్ బాను, కమిలిని, ప్రేమా రావత్ వీళ్ల పేర్లు మనకే కాదు... ప్రస్తుత భారత మహిళల జట్టు ప్లేయర్లకూ తెలియదు. ఎందుకంటే వీరెప్పుడు జాతీయ జట్టుకు ఆడలేదు. అసలు ఎంపికే కాలేదు. అలాగని జోనల్ ఈవెంట్లలో దంచేసిన రికార్డులేం లేవు. మైదానంలో పెద్దగా ఆడింది లేదు... 'కౌన్ బనేగా కరోడ్‌పతి'లో పాల్గొంది లేదు. అయినా సరే రెండు గంటల వేలంలో కోటీశ్వరులయ్యారు. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) విశ్లేషకులు సైతం నివ్వెరపోయేలా వారి కొనుగోలు జరిగింది.

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) మినీ వేలం ఆశ్చర్యంగా, అనూహ్యంగా జరిగిపోయింది. భారత జట్టు తరఫున ఆడిన క్రికెటర్లను పట్టించుకోని ఫ్రాంచైజీలు కనీసం దేశవాళీ క్రికెట్లోనూ కనిపించని ప్లేయర్లపై పెద్ద మొత్తంలోనే వెచ్చించాయి. 22 ఏళ్ల ముంబై బ్యాటర్ షేక్ సిమ్రన్ బానుకు రూ. 1 కోటీ 90 లక్షలు లభించాయి. మినీ వేలంలో మేజర్ అమౌంట్ ఆమెకే దక్కింది. గుజరాత్ జెయింట్స్ ఆమె కోసం అంతమొత్తం వెచ్చించింది. అలాగనీ ఆమె ఒక మెరుపు బ్యాటర్‌గానీ, నిప్పులు చెరిగే బౌలర్ కానీ కాదు. రెండేళ్ల క్రితం 2022 సీజన్‌లో యూపీ వారియర్స్ తరఫున పేలవంగా ఆడి నిరాశపరిచింది. 9 మ్యాచ్‌ల్లో 29 పరుగులే చేసింది. దీంతో తర్వాత రెండు రెండు సీజన్లకు పక్కన బెట్టారు. ఇప్పుడేమో జెయింట్స్ అక్కున పెద్దమొత్తానికి చేరింది. ముంబై ఇండియన్స్ కూడా 16 ఏళ్ల టీనేజ్ వికెట్‌కీపర్ బ్యాటర్ జి.కమలినిని రూ. 1 కోటి 60 లక్షలతో కొనుక్కుంది. తమిళనాడుకు చెందిన ఆమె భారత అండర్–19 జట్టు తరఫున అది కూడా వేలం జరిగిన రోజే (ఆదివారం కౌలాలంపూర్‌లో ఆసియా కప్ అండర్–19 టోర్నీ) ఒక మ్యాచ్ ఆడింది. 29 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో అజేయంగా 44 పరుగులు చేసింది. 23 ఏళ్ల ఉత్తరాఖండ్ లెగ్‌స్పిన్ ఆల్‌రౌండర్ ప్రేమా రావత్‌ను వేలంలో రూ. 1 కోటి 20 లక్షలకు పాడిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) దక్కించుకుంది. రూ. కోటి పైచిలుకు పలికిన ఈ ముగ్గురు క్రికెటర్ల బ్యాక్‌గ్రౌండ్ ఏమీ లేదు. కానీ మినీ వేలం వారి పాలిట మెగా జాక్‌పాట్‌గా మారింది. ఇక వెస్టిండీస్ స్టార్ ఆల్‌రౌండర్ డియాండ్రా డాటిన్ రూ. కోటి మార్క్ దాటిన ఏకైక విదేశీ ప్లేయర్. రూ. 1 కోటి 70 లక్షలకు


సిమ్రన్

ఆమెను గుజరాత్ జెయంట్స్ కొనుక్కుంది. 33 ఏళ్ల వెటరన్ కరీబియన్ క్రికెటర్ బేస్ ప్రైస్ రూ. 50 లక్షలు కాగా... యూపీ వారియర్స్, గుజరాత్‌లు పోటీపడ్డాయి. గతంలో ఆమెను (2023 సీజన్) రూ. 60 లక్షలకు గుజరాత్ జెయింట్స్ దక్కించుకున్నప్పటికీ ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. టీమిండియా ప్లేయర్లు స్నేహ్ రాణా, పూనమ్ యాదవ్‌లపై ఐదు ఫ్రాంచైజీలు కన్నెత్తి చూడలేదు. కనీస ధరకైనా ఎవరూ తీసుకోకపోవడంతో వీరంతా అన్‌సోల్డ్ (అమ్ముడుపోని) క్రికెటర్లుగా మిగిలిపోయారు.

వేలానికి ముందు 15 మందిని అట్టిపెట్టుకున్న యూపీ వారియర్స్ ముగ్గురు ప్లేయర్లను తక్కువ ధరకే తీసుకొని మినీ వేలంలో మమ అనిపించింది. అలనా కింగ్ (రూ. 30 లక్షలు), క్రాంతి గౌడ్ (రూ. 10 లక్షలు), ఆరుషి గోయెల్ (రూ. 10 లక్షలు)... ఈ ముగ్గురికి కలిపి రూ. అరకోటి మాత్రమే ఖర్చు చేసింది. మొత్తం పర్సు రూ. 15 కోట్లు కాగా... అందరికంటే తక్కువగా రూ. 11 కోట్ల 60 లక్షలు ఖర్చు చేసిన ఈ ఫ్రాంచైజీ అందరికంటే ఎక్కువ (రూ.3 కోట్ల 40 లక్షలు) మొత్తాన్ని మిగుల్చుకుంది. గుజరాత్ (రూ.14 కోట్ల 60 లక్షలు) ఎక్కువగా ఖర్చు చేసింది. ఆ ఫ్రాంచైజీ వద్ద కేవలం రూ. 40 లక్షలే మిగిలున్నాయి. ఆర్‌సీబీ రూ. 13 కోట్ల 25 లక్షలు వెచ్చించి రూ. 1 కోటి 75 లక్షలు మిగుల్చుకుంది. రూ. 13 కోట్ల 35 లక్షలు ఖర్చు చేసిన ఢిల్లీ ఖాతాలో రూ. 1 కోటి 65 లక్షలు మిగిలున్నాయి. ముంబై రూ. 14 కోట్ల 55 లక్షలు ఖర్చు పెట్టింది. కేవలం రూ. 45 లక్షలే ఆ ఫ్రాంచైజీ వద్ద ఉన్నాయి. ప్రతీ ఫ్రాంచైజీ కూడా గరిష్ట సభ్యుల సంఖ్య (18)ను భర్తీచేసుకున్నాయి.


డియాండ్రా

అమ్ముడైన క్రికెటర్లు వీరే...

(గరిష్టం నుంచి కనిష్ట వరుసలో)

- సిమ్రన్ బాను (రూ. 1.90 కోట్లు ; గుజరాత్)
- డియాండ్రా డాటిన్ (రూ. 1.70 కోట్లు : గుజరాత్)
- కమలిని (రూ. 1.60 కోట్లు: ముంబై)
- ప్రేమా రావత్ (రూ. 1.20 కోట్లు ; బెంగళూరు)
- శ్రీచరణి (రూ. 55 లక్షలు: ఢిల్లీ)
- నడిన్ డిక్లెర్క్ (రూ. 30 లక్షలు : ముంబై)
- డానియెల్లె గిబ్సన్ (రూ. 30 లక్షలు ; గుజరాత్)
- అలానా కింగ్ (రూ. 30 లక్షలు; యూపీ)
- అక్షిత (రూ.20 లక్షలు; ముంబై)
- రాఘవి బిస్త్ (రూ. 10 లక్షలు : బెంగళూరు)
- జాగ్రవి పవార్ (రూ. 10 లక్షలు. బెంగళూరు)
- సంస్కృతి (రూ. 10 లక్షలు; ముంబై)
- క్రాంతి గౌడ్ (రూ. 10 లక్షలు : యూపీ)
- అరుషి గోయెల్ (రూ. 10 లక్షలు; యూపీ)
- నందిన్ కశ్యప్ (రూ. 10 లక్షలు : ఢిల్లీ)
- రూ. నికీ ప్రసాద్ (రూ. 10 లక్షలు: ఢిల్లీ)
- సారా బ్రైస్ (రూ.10 లక్షలు: ఢిల్లీ)
- ప్రకాశిక నాయక్ (రూ. 10 లక్షలు; గుజరాత్)
- జోషిత (రూ. 10 లక్షలు: బెంగళూరు)

మూడు ముక్కల్లో...

ఇది వచ్చే 2025 సీజన్‌కు ముందు మినీ వేలం. 91 మంది భారతీయులు, 29 మంది విదేశీయులు కలిపి మొత్తం 124 మంది వేలానికి వచ్చారు. ఇందులో ఐదుగురు విదేశీ ప్లేయర్లు సహా 19 మంది క్రికెటర్లను ఫ్రాంచైజీలు రూ. 9.05 కోట్లకు కొనుక్కున్నాయి.

ఇంగ్లండ్ 143 ఆలౌట్

340 పరుగుల ఆధిక్యంలో న్యూజిలాండ్ ● రాణించిన హెన్రీ, రూర్కె, సాంట్నర్

హామిల్టన్: ఇంగ్లండ్‌తో తొలి రెండు టెస్టుల్లో ఘోర పరాజయాలతో ఇప్పటికే సిరీస్ కోల్పోయిన న్యూజిలాండ్ జట్టు... నామమాత్రమైన మూడో మ్యాచ్‌లో అదరగొడుతోంది. బ్యాటర్ల కృషికి బౌలర్ల సహకారం తోడవడంతో ఆఖరి టెస్టులో న్యూజిలాండ్ భారీ ఆధిక్యం సంపాదించింది. ఆదివారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 32 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 136 పరుగులు చేసింది. విల్ యంగ్ (85 బంతుల్లో 60; 9 ఫోర్లు), విలియమ్సన్ (58 బంతుల్లో 50 బ్యాటింగ్; 8 ఫోర్లు) హాఫ్ సెంచరీలతో రాణించారు.తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కలుపుకొని ప్రస్తుతం కివీస్ 340 పరుగుల ముందంజలో ఉంది. విలియమ్సన్‌తో పాటు రచిన్ (2 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 315/9తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్ చివరకు 97.1 ఓవర్లలో 347 పరుగులకు ఆలౌటైంది. సాంట్నర్ (76; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధశతకంతో ఆకట్టుకున్నాడు. ఇంగ్లండ్ బౌలర్లలో పాట్స్ 4, అట్కిన్సన్ 3 వికెట్లు పడగొట్టారు. గత రెండు మ్యాచ్‌ల్లో భారీ సెంచరీలు కొట్టిన ఇంగ్లండ్ బ్యాటర్లు ఈ మ్యాచ్‌లో పూర్తిగా విఫలమవడంతో స్టోక్స్ బృందం తొలి ఇన్నింగ్స్‌లో 35.4 ఓవర్లలో 143 పరుగులకు ఆలౌటైంది. దీంతో ఆతిథ్య కివీస్‌కు 204 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కింది. రూట్ (32), స్టోక్స్ (27), పోప్ (24), క్రాలీ (21) తలా కొన్ని పరుగులు చేశారు. హ్యారీ బ్రూక్ (0) 'గోల్డెన్ డకౌట్' అయ్యాడు. కివీస్ బౌలర్లలో మ్యాట్ హెన్రీ 4 వికెట్లు పడగొట్టగా... రూర్కె, సాంట్నర్ 3 వికెట్ల చొప్పున తీసుకున్నారు.


హెన్రీ


తమిళ్ తలైవాస్ ప్లేయర్ రెయిడింగ్

తమిళ్ తలైవాస్ అవుట్

- పీకేఎల్ ప్లే ఆఫ్స్ రేసుకు దూరం
- జైపూర్ పింక్ పాంథర్స్ చేతిలో పరాజయం

పుణే: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్‌లో తమిళ్ తలైవాస్ జట్టు ప్లే ఆఫ్స్ రేసు నుంచి బయటకు వచ్చింది. ఈ సీజన్‌లో వరుస పరాజయాలతో సతమతమవుతున్న తలైవాస్... ఆదివారం జరిగిన మ్యాచ్‌లో 27–34 పాయింట్ల తేడాతో జైపూర్ పింక్ పాంథర్స్ చేతిలో ఓడింది. తమిళ్ తలైవాస్ తరఫున హిమాన్షు, నితీశ్ కుమార్ చెరో 7 పాయింట్లతో రాణించగా... పింక్ పాంథర్స్ తరఫున అర్జున్ దేశ్వాల్, నీరజ్ నర్వాల్ చెరో 6 పాయింట్లు సాధించారు. ఓవరాల్‌గా ఈ మ్యాచ్‌లో పింక్ పాంథర్స్ 13 రెయిడ్ పాయింట్లు సాధించగా... తలైవాస్ 7 రెయిడ్ పాయింట్లకే పరిమితమై పరాజయం మూటగట్టుకుంది. తాజా సీజన్‌లో 19 మ్యాచ్‌లాడిన తలైవాస్ 6 విజయాలు, 12 పరాజయాలు, ఒక 'టై'తో 40 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో తొమ్మిదో స్థానానికి పరిమితమైంది. పీకేఎల్ ముగింపు దశకు చేరుకుంటుండగా... మిగిలిన అన్నీ మ్యాచ్‌ల్లో గెలిచినా... తలైవాస్ ప్లే ఆఫ్స్‌కు చేరే అవకాశం లేదు. జైపూర్ పింక్ పాంథర్స్ 19 మ్యాచ్‌ల్లో 10 విజయాలు, 7 పరాజయాలు, 2 'టై'లతో 59 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టిక ఆరో స్థానంలో కొనసాగుతోంది. మరో మ్యాచ్‌లో యూపీ యోధాస్ 30–27 పాయింట్ల తేడాతో యూ ముంబాపై విజయం సాధించింది. ఈ సీజన్‌లో 19 మ్యాచ్‌లాడిన యూపీ యోధాస్ 10 విజయాలు, 6 పరాజయాలు, 3 'టై'లతో 64 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో మూడో స్థానానికి ఎగబాకింది. నేడు జరగనున్న మ్యాచ్‌ల్లో దబంగ్ ఢిల్లీతో బెంగాల్ వారియర్స్ (రాత్రి 8 గంటలకు), పట్నా పైరేట్స్‌తో పుణేరి పల్టన్ (రాత్రి 9 గంటలకు) తలపడతాయి.

కేరళ ఘనవిజయం

సాక్షి, హైదరాబాద్: ప్రతిష్టాత్మక సంతోష్ ట్రోఫీ జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ (రెండో రౌండ్)లో కేరళ జట్టు తొలి విజయం నమోదు చేసుకుంది. హైదరాబాద్ వేదికగా జరుగుతున్న ఈ టోర్నీ గ్రూప్ 'బి'లో భాగంగా ఆదివారం జరిగిన పోరులో కేరళ జట్టు 4–3 గోల్స్ తేడాతో గోవా జట్టుపై గెలుపొందింది. కేరళ జట్టు తరఫున మొహమ్మద్ రియాజ్ (16వ నిమిషంలో), మొహమ్మద్ అజ్సల్ (27వ ని.లో), నసీబ్ రహమాన్ (33వ ని.లో), క్రిస్టీ డేవిస్ (69వ ని.లో) తలా ఒక గోల్ చేశారు. గోవా జట్టు తరఫున జోనస్ పెరీరా (78, 86వ నిమిషాల్లో) డబుల్ గోల్స్‌తో ఆకట్టుకోగా... ఫెర్నాండెస్ (2వ ని.లో) ఒక గోల్ చేశాడు. కేరళ స్ట్రయికర్ రియాజ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఆదివారమే జరిగిన మరో మ్యాచ్‌లో ఢిల్లీ 2–0 గోల్స్ తేడాతో ఒడిషాపై విజయం సాధించగా... తమిళనాడు, మధ్యప్రదేశ్ మధ్య పోరు 2–2 గోల్స్‌తో 'డ్రా'గా ముగిసింది. లీగ్‌లో భాగంగా సోమవారం పశ్చిమ బెంగాల్‌తో తెలంగాణ జట్టు తలపడనుంది.



మోడువారిన జీవితం
గోరింట సాక్షిగా!

విడాకుల వార్తను వినూత్నంగా చెప్పిన మహిళ



అరచేతిలో గోరింట ఎర్రగా పండితే మంచి మొగుడొస్తాడన్నది తెలుగిళ్లలో అనాదిగా ఉన్న నమ్మకం. కానీ తన సంసారం చట్టుబండలైన వైనాన్ని ఎర్రగా పండిన గోరింటాకు సాక్షిగా వినూత్నంగా చెప్పిందో మహిళ. తన వైవాహిక జీవితంలో ఎదురైన కష్టాలను, అనుభవించిన బాధలను మెహందీ ద్వారానే విడమరచి చెప్పింది. 'విఫల వివాహ విషాద గాథ'ను వివరిస్తూ ఆ మహిళ తన చేతిపై వేసుకున్న మెహందీ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. సదరు మహిళకు 'విడాకుల మెహందీ' వేసిన కళాకారిణి ఊర్వశీ ఓరా ఆ వీడియోను షేర్‌చేశారు. పెళ్లయ్యాక అత్తగారింట అడుగుపెట్టింది మొదలు ఇంట్లో బట్టలుతకడం, అత్తగారి దృష్టిలో పనిమనిషిలా పనులన్నీ చేయడం, భర్త నుంచి దేనికీ మద్దతు లేక దిగాలు పడటం, తరచూ మనస్పర్థలు, గొడవలు, ఒంటరితనం... ఇలా చివరకు విడాకుల దాకా తన వ్యథను మెహందీ ద్వారా వ్యక్తీకరించారు. ప్రేమ, ఆనందమయ క్షణాల్లో సంబరాలకు ప్రతీకగా నిలిచే మెహందీ ద్వారా ఇలా అంతులేని బాధను వ్యక్తం చేయొచ్చని నిరూపించారు. – న్యూఢిల్లీ

గ్లాసు వైన్ 5 లక్షల డాలర్లు!

అవున్నిజమే! మన రూపాయల్లో కోటి 24 లక్షల రూపాయల పైమాటే. అంత ఖరీదెందుకు, ఏమిటా వైన్ ప్రత్యేకత వంటి సందేహాలెన్నో వస్తున్నాయి కదా! ఆ వైన్ అంతరిక్ష కేంద్రంలో తయారవుతోంది మరి! ఇదంతా జపాన్‌కు చెందిన ప్రముఖ సేక్ (వైన్) బ్రాండ్ దస్సాయ్ తయారీ సంస్థ అసాహి షుజో ఆలోచనలో నుంచి పుట్టుకొచ్చింది. ముడి పదార్థాలను ఏకంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) పంపించి అక్కడ పులియబెట్టాలని యోచిస్తోంది. ఇది విజయవంతమైన మీదట కేవలం 100 మి.లీ. వైన్ బాటిల్‌ను ఏకంగా రూ.5.53 కోట్లకు అమ్మనుంది. ఈ ప్రయోగానికి జపాన్ ఏరోస్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ ఏజెన్సీకి కంపెనీ భారీ మొత్తమే చెల్లించింది. ఈ ప్రాజెక్టును 2025లో లాంచ్ చేయనుంది. అంతరిక్షంలో పులియబెట్టేందుకు కావాల్సిన పరికరాల తయారీలో బిజీగా ఉంది. అయితే గురుత్వాకర్షణ ఉండని అంతరిక్ష కేంద్రంలో పులియడానికి కావాల్సిన కిణ్వ ప్రక్రియ ఎలా జరుగుతుందన్నది చూడాలి.

చంద్రుడే లక్ష్యంగా..

ప్రయోగం గనుక సక్సెసైతే ఇదే అతి ఖరీదైన పానీయం అవుతుందని అసాహి షుజో కంపెనీ బ్రూవర్ ప్రాజెక్ట్ ఇన్‌చార్జి సొయా ఉట్సుకి చెప్పారు. ''అయితే ఈ పరీక్ష 100% విజయవంతమవుతుందని గ్యారంటీ లేదు. కాకపోతే మా ప్రయత్నం వెనుక కేవలం ఘనత కోసం కాదు. అంతరిక్షంలో కిణ్వ ప్రక్రియ ఏ మేరకు జరుగుతుందన్న దానిపై మా కంపెనీ దృష్టి పెట్టింది. జరిగితే ఏదో ఒకనాడు చంద్రుడిపైనా వైన్‌ను పులియబెట్టడం మా కంపెనీ లక్ష్యం. మున్ముందు మనుషులు చంద్రుడిపైకి స్వేచ్ఛగా ప్రయాణించే రోజు రానుంది. పర్యాటకులు చంద్రునిపై ఆహ్లాదకరమైన క్షణాలను ఆస్వాదించాలన్నది మా ఉద్దేశం. అంతేగాక పులియబెట్టిన ఆహారాన్ని ఇష్టపడే భావి అంతరిక్ష పర్యాటకులకు కూడా ఈ సాంకేతికత ఉపయోగపడుతుంది'' అని ఆశాభావం వ్యక్తం చేశారు. నాటో, మిసో వంటి జపనీస్ ఆహారాలు పులియబెట్టడం ద్వారానే తయారవుతాయి.

ఏమిటీ సేక్?

సేక్ ఒక రకమైన వైన్ లేదా సారాయి. జపనీస్ బియ్యం, నీరు, ఈస్ట్, కోజీ (ఒక రకమైన అచ్చు)తో తయారవుతుంది. నిర్దిష్ట సమయాల్లో పలు దశల్లో ఆవిరి పట్టడం, కదిలించడం, పులియబెట్టడం ద్వారా దీన్ని తయారు చేస్తారు. అందుకు 2 నెలలు పడుతుంది. ఇది జపాన్ సాంస్కృతిక వారసత్వ పానీయంగా యునెస్కో గుర్తింపు పొందింది. సేక్ బ్రాండ్లలో దస్సాయ్ అత్యంత ప్రాచుర్యం పొందింది.

– వాషింగ్టన్

ట్రాన్స్‌జెండర్‌తో మార్కెటింగ్...
గూగుల్ క్రిస్మస్ ప్రకటనపై వివాదం



మహిళల సంబంధ వస్తువులకు సంబంధించిన ప్రకటనను ట్రాన్స్‌జెండర్‌తో రూపొందించాలన్న టెక్ దిగ్గజం గూగుల్ 'వినూత్న' ఐడియా బెడిసికొట్టింది. దానిపై మహిళాలోకంలో ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. క్రిస్మస్ వేళ ఇలాంటి యాడ్ ఎందుకు తెచ్చారంటూ దుమ్మెత్తిపోశారు. అందమైన మహిళలే లేనట్టు ట్రాన్స్‌జెండర్‌తో యాడ్ చేస్తారా అంటూ నెటిజన్లు కూడా గూగుల్‌పై మండిపడుతున్నారు. క్రిస్మస్ సందర్భంగా గూగుల్ తన సొంత షాపింగ్ వేదిక 'గూగుల్ షాపింగ్'లో మహిళల ఉత్పత్తులను ప్రమోషన్‌కు ఒక యాడ్ సిద్ధం చేసింది. టిక్‌టాక్‌లో పేరొందిన సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్, కంటెంట్ క్రియేటర్ 30 ఏళ్ల సైరస్ వెస్సీని ప్రచారకర్తగా ఎంచుకుంది. చంపేసే చలిలో అత్యంత నాణ్యమైన మేకప్, చర్మ సంబంధ ఉపకరణాలు, దుస్తులను తక్కువ ధరకే కొనుక్కోండంటూ వెస్సీతో ఒక యాడ్ డిజైన్ చేసి ఆన్‌లైన్ ప్రసారాలు మొదలెట్టారు. కానీ అందులో ట్రాన్స్‌జెండర్ నటించడంతో ఆదరణ దేవుడెరుగు, విమర్శలు వెల్లువెత్తాయి. ''ఇది దారుణమైన అజెండాతో రూపొందించిన యాడ్. అమ్మాయిలను అవమానించాలని చేసినట్టుగా ఉంది'' అంటూ పలు ప్లాస్టిక్ సర్జరీలు చేయించుకున్న బ్రిటన్‌కు చెందిన ప్రముఖ వ్యాఖ్యాత ఓలీ లండన్ అన్నారు. దాంతో, మహిళలను కించపరచాలనే దురుద్దేశమేదీ లేదంటూ గూగుల్ వివరణ ఇచ్చింది. సోషల్ మీడియాలో పేరొందిన 'విభిన్న' వ్యక్తులతో యాడ్ చేద్దామనే ఉద్దేశంతోనే అలా రూపొందించినట్టు చెప్పుకొచ్చింది. – వాషింగ్టన్

మందుపాతర పేలి బీఎస్ఎఫ్ జవాన్‌కు గాయాలు

చర్ల: మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి ఓ బీఎస్ఎఫ్ జవాన్‌కు తీవ్ర గాయాలు కాగా ప్రత్యేక హెలికాప్టర్‌లో రాయ్‌పూర్‌కు తరలించిన ఘటన ఆదివారం ఛత్తీస్‌గఢ్‌లో చోటుచేసుకుంది. రాష్ట్రంలో రెండు రోజుల పర్యటనకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆదివారం తెల్లవారుజామున రాయ్‌పూర్‌కు చేరుకోగా ఆయన పర్యటన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పెద్ద ఎత్తున తనిఖీలు, కూంబింగ్ చేపట్టారు. ఈ క్రమంలో కాంకేర్ జిల్లాలోని పానీడోబీర్ క్యాంపునకు చెందిన బలగాలు హెటరాక్సాక ప్రాంతానికి వెళ్తుండగా.. రహదారిపై మావోయిస్టులు మందుపాతర ఏర్పాటు చేశారనే సమాచారంతో అక్కడకు చేరుకున్న బలగాలు దానిని గుర్తించి నిర్వీర్యం చేస్తుండగా ప్రమాదవశాత్తు పేలి బీఎస్ఎఫ్ జవాన్ ఈశ్వర్‌రావుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ప్రథమ చికిత్స నిర్వహించి ఉన్నతాధికారులకు సమాచారం అందించగా ప్రత్యేక హెలికాప్టర్‌లో రాయ్‌పూర్‌కు తరలించారు.

బంగ్లా ఇస్కాన్‌పై ఆరోపణలన్నీ అబద్ధాలే

కోల్‌కతా ఇస్కాన్ స్పష్టీకరణ

కోల్‌కతా: ప్రపంచవ్యాప్తంగా వైష్ణవ భక్తులతో కూడిన ఇస్కాన్ సంస్థపై తీవ్రవాద ముద్ర వేస్తూ బంగ్లాదేశ్‌లోని మత ఛాందసవాదులు, ప్రతిపక్ష బీఎన్‌పీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై ఇస్కాన్ కోల్‌కతా ఉపాధ్యక్షుడు రాధారమణ్ దాస్ సీరియస్‌గా స్పందించారు. అవన్నీ అబద్ధాలని, ప్రమాదకర పరిణామమని పేర్కొన్నారు. శాంతి, సహజీవనం, సౌభ్రాతృత్వం కోసం, ఆపన్నులను ఆదుకునే సదుద్దేశంతో ఏర్పాటైన సంస్థ అని ఆయన అన్నారు. గతంలో మాదిరిగానే మున్ముందు కూడా సామాజిక సేవకు కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. ఇస్కాన్ మందిరాలపై బాంబు దాడులు ఆగుతాయని, అరెస్టయిన చిన్మయ్ కృష్ణదాస్ త్వరలో విడుదలవుతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మైనారిటీల భద్రతకు యూనుస్ సారథ్యంలోని ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.



జారి పట్టుతప్పినా
పడిపోని ఒడుపు

జారినా నిలబడిన రోబోట్ • నెటిజన్ల సరదా స్పందనలు

పూటుగా తాగిన వ్యక్తి చెరువు గట్టు దిగుతుంటే తూలి పడటం సహజం. ఒకవేళ తూలిపడబోతుంటే తమాయించుకుని నిలబడగలిగితే భలేగా నిలబడ్డాడే అని పక్కన ఉన్నవాళ్లు నవ్వుకుంటూ మెచ్చుకోవడం సహజం. మానవులకు సాధ్యమయ్యే ఇలాంటి పనిని మరమనిషి సైతం సాధించి చూపించింది. మట్టిగట్టుపై నడుస్తూ కాలిజారి గబాలున పడబోతూ రోబోట్ వెంటనే తమాయించుకున్న వీడియో ఒకటి ప్రస్తుతం అధునాతన రొబోటిక్ సాంకేతికరంగంలో పెద్ద చర్చనీయాంశమైంది. మనిషికి సాధ్యమయ్యే అసంకల్పిత ప్రతీకార చర్యలు మరమనుషులకు సాధ్యమా? అనే చర్చ మొదలైంది. అయితే వీడియో చూసిన వాళ్లలో కొందరు నవ్వు తెప్పించే కామెంట్లు పెట్టారు. ''హ్యూమనాయిడ్ రోబోట్ ఆప్టిమస్ మనిషిలాగే నడవగలిగే సామర్థ్యం సాధించాలంటే ముందుగా మనిషిలాగా ఇలా జారాలి. వెంటనే సర్దుకొని నిలబడగలగాలి''అని కామెంట్ చేశారు. 'పార్టీకి వెళ్లొస్తూ తెల్లవారుజామున నాలుగు గంటలకు నేను ఇలాగే నడుస్తా'అని ఇంకొకరు వ్యాఖ్యానించారు. ''ఇప్పుడీ రోబోలు పిల్లాడిలా నడుస్తున్నాయిగానీ చూస్తుండండి త్వరలో ఇవి తుపాకులు పట్టుకుని మన వెంటే పడతాయి''అని ఇంకొకరు అన్నారు. ''విమానం మెట్ల మీద, సైకిల్ తొక్కుతూ తరచూ పడిపోయే అమెరికా వృద్ధ అధ్యక్షుడు బైడెన్ కంటే ఈ రోబో చాలా బెటర్. పట్టుతప్పినా పడిపోలేదు''అని ఇంకో వ్యక్తి కామెంట్ చేశారు. – న్యూయార్క్

3 నెలల వయసులో కిడ్నాపై...
26 సంవత్సరాలకు తల్లిదండ్రులను చేరి..

బాల్యంలో తప్పిపోవడం లేదా కిడ్నాప్‌కు గురవ్వడం.. పెద్దయ్యాక సంపన్నులైన తల్లిదండ్రులను కలవడం... ఎన్నో సినిమాల్లో మనం చూసిన కథే. కానీ ఆ సినిమా కథలను మించిన జీవిత కథ చైనాలో జరిగింది. మూడు నెలల వయసులో కిడ్నాప్‌కు గురైన పసిబాలుడు.. యువకుడిగా తల్లిదండ్రులను చేరాడు. ఆ తరువాత కథ మాత్రం సినిమాలను మించి పోయింది. అదేంటో చూద్దాం! ప్రస్తుతం 26 ఏళ్ల వయసున్న షి కిన్షుయ్ మూడు నెలల వయసులో కిడ్నాపయ్యాడు. తల్లిదండ్రులు దశాబ్దాలుగా అతని కోసం వెతుకుతూనే ఉన్నారు. కుమారుడి ఆచూకీ తెలుసుకోవడానికి ఆ కుటుంబం కోటి రూపాయలకు పైగా ఖర్చు చేసింది. రెండున్నర దశాబ్దాల తరువాత.. ఎట్టకేలకు ఆచూకీ కనుగొన్న తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేవు. డిసెంబర్ 1న కొడుకును ఇంటికి తీసుకొచ్చారు. ఆ సందర్భాన్ని ఘనమైన వేడుకలా చేసుకున్నారు. అంతేకాదు తమ ఐశ్వర్యాన్నంతా ముందు పెట్టారు. అనేక భవనాలు.. లగ్జరీ కార్లు.. విలాసవంతమైన బహుమతులెన్నో అందించారు. కానీ.. ఇక్కడే పెద్ద ట్విస్ట్. అప్పటిదాకా అనాథలా పెరిగిన షి.. ఆస్తులకు వారసత్వాన్ని పొందడానికి ఇష్టపడలేదు. తన భార్యతో కలిసి జీవించడానికి ఒక్క ఫ్లాట్‌ను మాత్రం తీసుకున్నాడు. ప్రస్తుతం తన లైవ్ స్ట్రీమింగ్ ఛానల్ ఆదాయంపైనే ఆధారపడి జీవిస్తున్న షి... తన సంపాదనతోనే జీవితాన్ని నిర్మించుకోవాలనుకుంటున్నానని చెప్పాడు. కోట్ల ఆస్తులను వదులుకుని నిరాడంబరుడిగా మిగిలిపోవాలనుకున్న అతని వార్త ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. అతని విలువలను కొందరు ప్రశంసిస్తుంటే.. సానుభూతి కోరుకుంటున్నారంటూ కొందరు విమర్శిస్తున్నారు. ఎవరేమనుకున్నా తనకు నచ్చినట్టుగా బతకాలనుకున్న షి నిర్ణయం అందరినీ ఆకట్టుకుంటోంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఖననంలోనూ పర్యావరణహితం

ఎకో ఫ్రెండ్లీ అంత్యక్రియలకు బ్రిటిషర్ల మొగ్గు • ముందుగానే శవపేటికల ఎంపిక



చనిపోకముందే సమాధులు కట్టించుకోవడం గురించి విన్నాం. పిల్లల్లేని వారు, పోయాక ఎవరూ పట్టించుకురని భావించేవారు ముందు చూపుతో అలా చేస్తుంటారు. ఈ ధోరణి బ్రిటన్‌లోనూ ఉంది. కాకపోతే అందులోనూ పర్యావరణ హితానికి వాళ్లు పెద్దపీట వేస్తుండటం విశేషం. యూకే వాసులు తమ అంత్యక్రియల కోసం ఎకో ఫ్రెండ్లీ శవపేటికలను ఎంచుకుంటున్నారు. యూకేలో అంత్యక్రియల్లో 80 శాతం దాకా ఖననాలే ఉంటాయి. అందుకు వాడే శవపేటికలు హానికర రసాయనాలతో తయారవుతున్నాయి. పైగా వాటిలో మృతదేహాల నిల్వకు వాడే ఫార్మాల్డిహైడ్ పర్యావరణానికి హానికారకమే. అది నేరుగా మట్టిలో కలుస్తుంది. కార్బన్ కన్సల్టెన్సీ సంస్థ ప్లానెట్ మార్క్ అధ్యయనం ప్రకారం ఒక్కో శవపేటిక నుంచి ఏకంగా లండన్-పారిస్ విమానం వదిలే కర్బన ఉద్గారాలకు సమానమైన ఉద్గారాలు వెలువడుతున్నాయి. శవపేటికను ఆరడుగుల లోతున పాతేస్తారు. ఇది మట్టిలో కలవడానికి వందేళ్లు పడుతోందట.

కళాకృతి నుంచి వ్యాపారం వైపు

బతికి ఉన్నప్పుడే కాదు చనిపోయిన తరువాత పర్యావరణానికి హాని కలగకుండా ఉండే విధానంపై బ్రిటన్‌వాసులు ఆసక్తి కనబరుస్తున్నారు. అందుకే ఎకోఫ్రెండ్లీ శవపేటికలను ఎంచుకుంటున్నారు. ప్రతి 10 మందిలో ఒకరు 'ఎకో ఫ్రెండ్లీ' అంత్యక్రియలను కోరుకుంటున్నట్లు ఇటీవల యూగవ్ నిర్వహించిన కో-ఆప్ ఫ్యునరల్ కేర్ సర్వేలో తేలింది. స్వతహాగా కళాకారిణి అయిన వెస్ట్ యార్క్‌షైర్‌లోని హెబ్డెన్ బ్రిడ్జికి చెందిన రేచల్ చావు, దుఃఖం, ప్రకృతి ఇతివృత్తంతో క్రియేటివ్‌గా శవపేటికను చేశారు. దాన్ని పర్యావరణహితంగా తీర్చిదిద్దారు. స్నేహితుడికోసం ఊలు, చెట్ల ఆకులు, నార, ఇతర పదార్థాలతో పర్యావరణహితమైన శవపేటికను తయారు చేయడంతో అది ఇప్పుడు వ్యాపారంగా మారిపోయింది.

యూకే అంతటా వ్యాపారం..

ఈ ఎకోఫ్రెండ్లీ శవపేటికలను కేవలం మూడు అడుగుల లోతులో మాత్రమే పాతేస్తారు. అయినా.. భూమి పైపొరల్లో ఉండే క్రిముల వల్ల, శవపేటికల్లో ఎలాంటి రసాయనాలు లేకపోవడంతో శరీరాలు కుళ్లిపోవడానికి 20 నుంచి 30 ఏళ్లు మాత్రమే పడుతుందట. అందుకే మరణానంతరమూ తమవల్ల భూమి కాలుష్యం కాకూడదనుకుంటున్న వ్యక్తులు వీటిని ఎంచుకుంటున్నారు. రేచల్ 2016లో ప్రారంభించిన ఈ వ్యాపారం విస్తరించింది. ఇప్పుడు యూకే అంతటా ఈ ఎకో ఫ్రెండ్లీ స్మశాన వాటికలున్నాయి. భూమికి మేలు చేయాలనుకునేవారు తమను సంప్రదిస్తున్నారని రేచల్ చెప్పారు. ఇతర పర్యావరణ అనుకూల పరిశ్రమల మాదిరిగా, సహజ సమాధులకు ఎక్కువ ఖర్చు అవుతుంది. ''ఈ భూమ్మీద నా చివరి చర్య కాలుష్య కారకమైనదిగా ఉండాలని నేను కోరుకోవడం లేదు. జీవితమంతా పర్యావరణహితంగా జీవించిన తాను.. మరణం కూడా అలాగే ఉండాలని కోరుకుంటున్న'' అని చెప్పే 50 ఏళ్ల రేచల్ సొంతంగా శ్మశానవాటికను తయారు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

పరువు నష్టం కేసులో రాజీ..
ట్రంప్‌కు రూ.127 కోట్లివ్వనున్న ఏబీసీ

న్యూయార్క్: పరువు నష్టం కేసులో కాబోయే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఏబీసీ న్యూస్ ఛానల్ రాజీ కుదుర్చుకోనుంది. ఇందులో భాగంగా సుమారు రూ.127 కోట్లు చెల్లించేందుకు అంగీకరించింది. పశ్చాత్తాపం వ్యక్తం చేస్తూ తమ వెబ్‌సైట్‌లో ఒక నోట్‌ను ఉంచేందుకు ముందుకొచ్చింది. ట్రంప్ తనపై అత్యాచారం చేశారంటూ రచయిత్రి జీన్ కరోల్ కోర్టు కెక్కారు. గతేడాది విచారణ చేపట్టిన న్యాయస్థానం లైంగిక దాడి, ప్రతిష్ఠకు భంగం కలిగించడం వంటి నేరాలకు రూ.42 కోట్లు ఆమెకు చెల్లించాలని ట్రంప్‌ను ఆదేశించింది. ఇదే కేసులో ఈ ఏడాది జనవరిలో మరికొన్ని ఆరోపణలపై మరో రూ.700 కోట్ల చెల్లించాలని తీర్పు వెలువరించింది. అయితే, ఈ రెండు సందర్భాల్లోనూ కోర్టు రేప్ అనే మాటను ఎక్కడా పేర్కొనలేదు. అయితే, ఏబీసీ న్యూస్ ఛానెల్ ప్రముఖ యాంకర్ జార్జి స్టెఫనోపౌలోస్ మార్చి 10వ తేదీన కాంగ్రెస్ సభ్యురాలు నాన్సీ మేస్‌తో జరిగిన ఇంటర్వ్యూ సందర్భంగా జీన్ కరోల్‌ను ట్రంప్ రేప్ చేసినట్లు రుజువైందంటూ పదేపదే వ్యాఖ్యానించారు. దీనిపై ట్రంప్ కోర్టులో పరువు నష్టం కేసు వేశారు.

టెక్కీ ఆత్మహత్య కేసు..
భార్య, ఆమె కుటుంబీకుల అరెస్ట్

బనశంకరి: బెంగళూరులో ఈ నెల 9న టెక్ ఎగ్జిక్యూటివ్ అతుల్ సుభాష్(34) ఆత్మహత్యకు పాల్పడిన కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. తన నుంచి వేరుగా ఉంటున్న భార్య, ఆమె కుటుంబీకులే కారణమంటూ అతుల్ సూసైడ్ నోట్‌లో పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బెంగళూరు పోలీసులు శనివారం అతుల్ భార్య నికితా సింఘానియాను గురుగ్రామ్‌లో అదుపులోకి తీసుకున్నారు. ఆమె తల్లి నిషా, సోదరుడు అనురాగ్‌ను ప్రయాగ్‌రాజ్‌లో అరెస్ట్ చేశారు. బెంగళూరుకు తీసుకువచ్చి ఆదివారం కోర్టులో హాజరుపరచగా జడ్జి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్‌కు ఆదేశించారన్నారు. సూసైడ్ నోట్‌తో మహిళలకు కల్పించిన హక్కుల దుర్వినియోగంతోపాటు పురుషుల హక్కులపై దేశవ్యాప్తంగా చర్చ మొదలైందని కర్ణాటక హోం మంత్రి పరమేశ్వర అన్నారు. అతుల్‌ను వేధింపులకు గురిచేసి, బలవన్మరణానికి కారకులైన వారికి కఠిన శిక్షలు పడేదాకా చితా భస్మం నిమజ్జనం చేయబోమని అతడి తండ్రి పవన్ కుమార్ చెప్పారు. కోడలి కుటుంబసభ్యులను అరెస్ట్ చేసిన పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. అతుల్ ఆఖరి కోరిక ప్రకారం మనవడిని తమకు అప్పగించాలని అధికారులను కోరారు.



టన్నెల్ ఊహాచిత్రం

ఒక సొరంగం..
రూ.16.96 లక్షల కోట్లు

• న్యూయార్క్, లండన్ మధ్య సముద్రంలో నిర్మించాలని యోచన

న్యూయార్క్: అమెరికాలోని న్యూయార్క్, యునైటెడ్ కింగ్‌డమ్‌లోని లండన్ నగరాల మధ్య దూరం 3 వేల మైళ్లు(4,828 కిలోమీటర్లు). విమానంలో కాకుండా సముద్రంలో నౌకలపై ప్రయాణించాలంటే రోజుల తరబడి సమయం పడుతుంది. కానీ, సముద్రంలో కేవలం గంట సమయంలో ప్రయాణించే అవకాశం వస్తే? నిజంగా అద్భుతం. ఇప్పుడు ఆ దిశగా అడుగులు పడుతున్నాయి. రెండు కీలక నగరాలను అనుసంధానించడానికి అట్లాంటిక్ మహాసముద్రంలో సొరంగం(టన్నెల్) నిర్మించాలన్న ఆలోచన తెరపైకి వచ్చింది. ఇది సాధారణ సొరంగం కాదు. వాక్యూమ్ ట్యూబ్ టెక్నాలజీతో నిర్మించే సొరంగం. ఈ ప్రాజెక్టుకు రూ.16.96 లక్షల కోట్లకుపైగా(20 ట్రిలియన్ డాలర్లు) ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. ఇది నిజంగా అమల్లోకి వస్తే ప్రపంచంలోనే అత్యంత పొడవైన సముద్ర గర్భ టన్నెల్‌గా రికార్డుకెక్కడం ఖాయం. ప్రస్తుతం ఉత్తర యూరప్‌లో ఫెమార్న్‌బెల్ట్ సొరంగం నిర్మాణ దశలో ఉంది. డెన్మార్క్, జర్మనీని అనుసంధానించే ఈ సొరంగం 2029లో అందుబాటులోకి రానుంది. ఇది ప్రపంచంలో అత్యంత పొడవైన రోడ్ అండ్ రైల్ టన్నెల్‌గా రికార్డు సృష్టించబోతోంది. మరోవైపు దక్షిణ యూరప్‌లోనూ భారీ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. గ్రీస్, టర్కీని కలిపేలా సముద్రంపై కొత్త వంతెన నిర్మించబోతున్నారు.

'బస్తర్'లో మావోయిజం ఖాళీ!

• ఛత్తీస్‌గఢ్‌లో వామపక్ష తీవ్రవాదం అధికంగా ఉన్న జిల్లాలో మావోయిజం పూర్తిగా తగ్గుముఖం
• ఐదు దశాబ్దాల తర్వాత బస్తర్‌తో పాటు కొండెగావ్‌లో ఈ ఏడాది ఒక్క మావో ఘటన లేదన్న కేంద్రం
• ఈ ఏడాది ఒక్క ఛత్తీస్‌గఢ్‌లోనే 208మంది హతం, 802 మంది లొంగుబాటు

ఒకప్పుడు పోలీసులపైకి మెరుపు దాడులు, మందుపాతరల పేలుళ్లు, తుపాకీ మోతలు, బుల్లెట్ల శబ్దాలు, వరుస ఎన్‌కౌంటర్‌లతో రక్తమోడిన ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లాలో వామపక్ష తీవ్రవాదం ఇప్పుడు పూర్తిగా కనుమరుగైందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. బస్తర్ పేరు చెబితేనే భయపడేంతగా గజగజలాడించిన మావోయిస్టులు ఇప్పుడు అక్కడ తమ పట్టును కోల్పోయారని కేంద్రం పేర్కొంది. ప్రాబల్యం తగ్గిపోవడం, పోలీసుల ముమ్మర ఏరివేత కార్యక్రమాలు, మరోవైపు పునరవాస కల్పనా చర్యలు, ఇంకోవైపు అభివృద్ధి కార్యక్రమాల కారణంగా ఇప్పుడు ఆ ప్రాంతంలో మావోయిజం పూర్తిగా కనిపించకుండా పోయిందని వెల్లడించింది.

కేంద్ర చర్యలతో ..

బస్తర్ డివిజన్‌లో బస్తర్, దంతెవాడ, బీజాపూర్, కంఖేర్, నారాయణపూర్, కొండగావ్, సుక్మా మొత్తంగా ఏడు జిల్లాలు ఉన్నాయి. వీటిల్లో మావోయిస్టుల ప్రభావం అత్యధికంగా ఉన్న జిల్లాగా బస్తర్ పేరొందింది. ముఖ్యంగా 2013 ఏడాది మే నెలలో కాంగ్రెస్ నేతలపై మావోలు జరిపిన మెరుపు దాడిలో 27 మందితో పాటు 10 మంది భద్రతా సిబ్బంది చనిపోయారు. ఈ దాడిలోనే కాంగ్రెస్‌కు చెందిన మాజీ మంత్రి మహేంద్ర కర్మ చనిపోయారు. ఆ తర్వాత సైతం ఈ జిల్లా పేరు చెబితేనే పోలీసుబలగాల్లోనూ వణుకు పుట్టేంతస్థాయిలో మావోల మెరుపుదాడులు కొనసాగాయి. 2014 తర్వాత మావోల ఆగడాలకు అడ్డుకట్టవేసేందుకు కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దూకింది. ఈ జిల్లావ్యాప్తంగా భద్రతా బలగాల సంఖ్యను విపరీతంగా పెంచింది. లొంగుబాట్లను ప్రోత్సహించింది. మౌలిక వసతుల కల్పన, అభివృద్ధిపై ప్రధానంగా దృష్టి పెట్టింది. దీంతో గడిచిన రెండేళ్లగా పోలీసులు, మావోలకు మధ్య పరస్పర కాల్పుల ఘటన ఒక్కటి కూడా నమోదు కాలేదు. పైగా జిల్లాలో ఇద్దరు కీలక నేతలు అరెస్ట్ కాగా, మరో 13 మంది కీలక సభ్యులు లొంగిపోయారు. ఈ ఏడాదిలో మావో సంబంధ ఘటన ఒక్కటి కూడా నమోదుకాలేదు. సమీప కొండగావ్ జిల్లాలోనూ ఒక్క ఘటన నమోదుకాలేదు. రెండు జిల్లాలకు పొరుగునే ఉన్న బీజాపూర్ జిల్లాలో 465 మంది, సుక్మా జిల్లాలో 253 మంది మావోలను పోలీసులు అరెస్ట్ చేశారు. నారాయణపూర్, బీజాపూర్ జిల్లాలో రెండేళ్లలో 100 మందికి పైగా మావోలు పోలీసుల ఎదురుకాల్పుల్లో ప్రాణాలు కోల్పోయారు. గత ఐదు దశాబ్దాలుగా మావోల కదలికలతో నిత్యం వార్తల్లో ఉండే బస్తర్ జిల్లాలో ఈ ఏడాది ఒక్కటంటే ఒక్క మావోయిస్టు దుశ్చర్యకు సంబంధించిన ఘటనలు జరగకపోవడం విశేషం. కొండగావ్‌లోనూ మావోల ఉనికి లేదని ఇటీవల ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి వ్యాఖ్యానించారు. ఈ ఏడాది ఛత్తీస్‌గఢ్‌లో పోలీసులు, మావోలకు మధ్య జరిగిన పరస్పర ఎదురుకాల్పుల్లో 208మంది మావోలు చనిపోయారు. బస్తర్, కొండగావ్ జిల్లాలో ఇలాంటి ఘటన ఒక్కటి కూడా జరగకపోవడం విశేషం. 802 మందికి పైగా మావోయిస్టులు లొంగిపోయారు. – సాక్షి, న్యూఢిల్లీ

బహుముఖ వ్యూహంతో ముందుకు

2026 నాటికి పూర్తిస్థాయిలో మావోలను ఏరివేయాలని లక్ష్యంగా పెట్టుకున్న కేంద్రం ప్రభుత్వం ఈ లక్ష్యసాధన కోసం బహుముఖ వ్యూహాన్ని అనుసరించింది. ఓవక్క భద్రతా చర్యలను పటిష్ఠం చేస్తూనే, మావోయిస్టుల ప్రభావిత గిరిజన, ఆదివాసీ ప్రాంతాలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించడంపై ప్రధానంగా దృష్టిసారించింది. మౌలిక వసతుల కల్పన, అభివృద్ధిపై దృష్టి పెట్టింది. చౌక ధరల దుకాణాలను పెంచడం, సమాచార వ్యవస్థల పటిష్ఠం, ఏకలవ్య పాఠశాలల ఏర్పాటు, రహదారులకు భారీగా నిధుల కేటాయింపు, లొంగిపోయే మావోలకు తక్షణ పునరావాస కార్యక్రమాలతో వారి ఉనికిని కట్టడి చేసే ప్రయత్నాలు చేస్తోంది.

విద్య, ఉద్యోగ సమాచారం

జాయింట్ సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ డిసెంబర్-2024

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) సీఎస్ఐఆర్-యూజీసీ నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్) డిసెంబర్-2024 నోటిఫికేషన్‌ను విడుదలచేసింది. ఈ పరీక్షను సైన్స్ సబ్జెక్టుల్లో పరిశోధనలకు అవకాశం కల్పించే జేఆర్ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, పీహెచ్‌డీల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తారు. ఈ పరీక్ష ద్వారా జేఆర్ఎఫ్ అర్హత పొందితే సీఎస్ఐఆర్ పరిధిలోని రీసెర్చ్ సెంటర్లల్లో, యూనివర్శిటీల్లో పీహెచ్‌డీకి దరఖాస్తు చేసుకోవచ్చు. జేఆర్ఎఫ్ అర్హత పొందితే యూనివర్శిటీలు లేదా డిగ్రీ కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎంపికకావచ్చు.

» **సబ్జెక్టులు:** కెమికల్ సైన్సెస్, ఎర్త్, అట్మాస్ఫియరిక్, ఓషన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్; లైఫ్ సైన్సెస్; మ్యాథమేటికల్ సైన్సెస్; ఫిజికల్ సైన్సెస్.
» **అర్హత:** కనీసం 55 శాతం మార్కులతో ఎమ్మెస్సీ తత్సమాన ఉత్తీర్ణులవ్వాలి లేదా నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఎస్-ఎంఎస్/బీఈ/బీటెక్/బీఫార్మసీ/ఎంబీబీఎస్ ఉత్తీర్ణులవ్వాలి. ఓబీసీ(ఎన్‌సీఎల్), ఎస్సీ, ఎస్టీ, థర్డ్‌జెండర్, దివ్యాంగ అభ్యర్థులు అర్హత పరీక్షలో కనీసం 50 శాతం మార్కులు పొందాలి.
» **వయసు:** జేఆర్ఎఫ్‌కు అర్హతకు సంబంధించి జనరల్ కేటగిరీ అభ్యర్థులకు ఫిబ్రవరి 2025 నాటికి 30 ఏళ్లు మించకుండా ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ(నాన్‌క్రిమీలేయర్)లకు మూడేళ్ల గరిష్ట వయోసడలింపు లభిస్తుంది. అసిస్టెంట్ ప్రొఫెసర్/పీహెచ్‌డీ ప్రవేశాలకు ఎలాంటి గరిష్ట వయోపరిమితి నిబంధన లేదు.
» **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష. పరీక్షను మొత్తం 200 మార్కులకు నిర్వహిస్తారు. మల్టిపుల్ ఛాయిస్ పద్ధతిలో ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం మూడు గంటలు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 09.12.2024.
» **దరఖాస్తు ఫీజు చెల్లింపుకు చివరితేది:** 31.12.2024.
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 01.01.2025 నుంచి 02.01.2025 వరకు
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.12.2024
» **పరీక్షల తేదీలు:** 16.02.2025 నుంచి 28.02.2025.
» **వెబ్‌సైట్:** https://csirnet.nta.ac.in

నేవల్ డాక్‌యార్డ్, విశాఖపట్నంలో 275 అప్రెంటిస్‌లు

విశాఖపట్నంలోని మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్(నేవీ) నేవల్ డాక్‌యార్డ్ అప్రెంటిస్ స్కూల్ వివిధ ట్రేడుల్లో అప్రెంటిస్ శిక్షణకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 275.
» **శిక్షణ వ్యవధి:** ఏడాది.
» **ట్రేడులు:** ఎలక్ట్రీషియన్, ఫౌండ్రీమ్యాన్, మెకానిక్ డీజిల్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, మెషినిస్ట్, మెకానిక్ మెషిన్ టూల్ మెయింటెనెన్స్, పెయింటర్(జనరల్), షీట్ మెటల్ వర్కర్, మెకానిక్, వెల్డర్(గ్యాస్-ఎలక్ట్రిక్), ఎలక్ట్రానిక్స్ మెకానిక్, షిప్‌రైట్(ఉడ్), ఫిట్టర్, పైప్ ఫిట్టర్, మెకానిక్ మెకాట్రానిక్స్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్(సీవోపీఏ).
» **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. కనీసం 65 శాతం మార్కులతో సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
» **వయసు:** కనిష్టంగా 14 ఏళ్లు, గరిష్ట వయోపరిమితి లేదు.
» **స్టైపెండ్:** నెలకు రూ.7,700 నుంచి రూ.8,050
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ, టెక్నికల్ స్కిల్ టెస్ట్‌లో వచ్చిన మార్కులు, సర్టిఫికేట్‌ల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 02.01.2025
» **రాతపరీక్ష తేది:** 28.02.2025.
» **వెబ్‌సైట్:** www.apprenticeshipindia.gov.in

ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్

» ఏఎఫ్‌క్యాట్(1)-2025 నోటిఫికేషన్ విడుదల
» ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ విభాగాల్లో 336 పోస్టులు
» రెండు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహణ
» ప్రారంభ వేతనం రూ.56,100-రూ.1,77,500

వైమానిక దళం.. భారత త్రివిధ దళాల్లో ఎంతో కీలకమైన విభాగం! ఇలాంటి వైమానిక దళంలో చేరాలనుకునే యువతకు చక్కటి మార్గంగా నిలుస్తోంది.. ఎయిర్ ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్ (ఏఎఫ్‌క్యాట్)! జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ పరీక్షలో స్కోరు, తర్వాత మలి దశలో నిర్వహించే ఎంపిక ప్రక్రియల్లో విజయం సాధిస్తే.. ఎయిర్‌ఫోర్స్‌లో ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ విభాగాల్లో ఉన్నత కొలువులు సొంతం చేసుకోవచ్చు! తాజాగా.. ఏఎఫ్‌క్యాట్(1)-2025 నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో.. ఏఎఫ్ క్యాట్‌తో భర్తీ చేసే పోస్టులు, అర్హతలు, ఎంపిక విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు..



ఏఎఫ్‌క్యాట్ 2025

బ్యాచిలర్ డిగ్రీ, బీటెక్ అర్హతలుగా ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ విభాగాల్లో షార్ట్ సర్వీస్ కమిషన్ విధానంలో పోస్టుల భర్తీకి సొంతగా నిర్వహించే ప్రక్రియే.. ఎయిర్ ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్(ఏఎఫ్‌క్యాట్). ఏటా రెండు సార్లు ఈ పరీక్షను ఎయిర్‌ఫోర్స్ నిర్వహిస్తుంది. తాజాగా ఏఎఫ్‌క్యాట్(1)-2025 ఎంపిక ప్రక్రియకు నోటిఫికేషన్ విడుదలైంది.

మొత్తం 336 పోస్టులు

ఏఎఫ్‌క్యాట్(1)-2025 ద్వారా మొత్తం 336 పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటిల్లో ఫ్లయింగ్ బ్రాంచ్, గ్రౌండ్ డ్యూటీ టెక్నికల్, నాన్‌టెక్నికల్ పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

- **ఫ్లయింగ్ బ్రాంచ్:** ఎంపీసీ గ్రూప్‌తో ఇంటర్మీడియెట్‌లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణతతోపాటు 60 శాతం మార్కులతో బీటెక్ ఉత్తీర్ణత ఉండాలి.
- **ఏరోనాటికల్ ఇంజనీర్(ఎలక్ట్రానిక్స్):** నిర్దేశిత బ్రాంచ్‌లతో 60 శాతం మార్కులతో బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి.
- **ఏరోనాటిక్ ఇంజనీర్ (మెకానికల్):** ఏరోస్పేస్, ఏరోనాటికల్, ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటనెన్స్, మెకానికల్, మెకానికల్ ఇంజనీరింగ్ అండ్ ఆటోమేషన్ తదితర విభాగాల్లో బీటెక్‌లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలి.
- **గ్రౌండ్ డ్యూటీ-వెపన్ సిస్టమ్స్:** ఎంపీసీ గ్రూప్‌లో 50 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణతతోపాటు 60 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- **గ్రౌండ్ డ్యూటీ-అడ్మినిస్ట్రేషన్ అండ్ లాజిస్టిక్స్:** 60 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
- **గ్రౌండ్‌డ్యూటీ-అకౌంట్స్:** 60శాతం మార్కులతో బీకాం లేదా బీబీఏ/బీబీఎం/ బీబీఎస్(ఫైనాన్స్ స్పెషలైజేషన్) లేదా సీఏ/సీఎంఏ/సీఎస్/సీఎఫ్ఏ పాసవ్వాలి.
- **గ్రౌండ్ డ్యూటీ ఎడ్యుకేషన్ బ్రాంచ్:** 50 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణత ఉండాలి.
- **గ్రౌండ్ డ్యూటీ మెటీయరాలజీ బ్రాంచ్:** 60 శాతం మార్కులతో బీఎస్సీ(ఫిజిక్స్, మ్యాథమెటిక్స్) ఉత్తీర్ణత లేదా నిర్దేశిత బ్రాంచ్‌లతో బీటెక్‌లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులవ్వాలి.
- **ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్(ఫ్లయింగ్ బ్యాచ్):** ఎన్‌సీసీ ఎయిర్‌వింగ్ సీనియర్ డివిజన్ 'సి' సర్టిఫికెట్ ఉన్న అభ్యర్థులకు అందుబాటులో ఉన్న అవకాశం ఇది. ఎన్‌సీసీ సర్టిఫికెట్‌తోపాటు 60 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ తప్పనిసరి. ఇంటర్ మ్యాథ్స్, ఫిజిక్స్‌ల్లో 60 శాతం మార్కులు సాధించాలి.

వయసు

- **ఫ్లయింగ్ బ్రాంచ్:** జనవరి 1, 2026 నాటికి 20-24 ఏళ్లు ఉండాలి. ఫ్లయింగ్ బ్రాంచ్‌కు సంబంధించి కమర్షియల్ పైలట్ లైసెన్స్ కలిగి ఉన్న వారికి గరిష్ట వయో పరిమితిలో రెండేళ్ల సడలింపు ఉంటుంది.
- **గ్రౌండ్ డ్యూటీ:** జనవరి 1, 2026 నాటికి 20-26 ఏళ్లు ఉండాలి.
- అన్ని విభాగాలకు అవివాహితులు మాత్రమే అర్హులు

ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ

ఏఎఫ్‌క్యాట్‌లో భాగంగానే ఫ్లయింగ్ బ్రాంచ్‌లో ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్ విధానాన్ని కూడా అమలు చేస్తున్నారు. కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్‌లో పేర్కొన్న ఖాళీలు, అదే విధంగా ఏఎఫ్‌క్యాట్‌లో పేర్కొన్న సీట్లకు పది శాతం చొప్పున ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్‌కు కేటాయిస్తారు. ఈ విధానంలో దరఖాస్తు చేసుకోవాలంటే.. ఎన్‌సీసీ ఎయిర్ వింగ్ విభాగంలో 'సి' సర్టిఫికెట్ పొంది ఉండాలి.

రెండు దశల ఎంపిక

ఏఎఫ్‌క్యాట్ ద్వారా ఎయిర్‌ఫోర్స్‌లో ఆయా పోస్టులను భర్తీ చేసే క్రమంలో రెండు దశల ఎంపిక ప్రక్రియ ఉంటుంది. ముందుగా ఎయిర్‌ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్‌ను నిర్వహిస్తారు. ఇందులో నిర్దేశిత కటాఫ్ మార్కులు సాధించిన వారికి మలి దశలో ఎయిర్‌ఫోర్స్ సెలక్షన్ బోర్డ్ పరిధిలో మరో ఎంపిక ప్రక్రియ ఉంటుంది.

నాలుగు విభాగాల్లో ఏఎఫ్‌క్యాట్

ఎంపిక ప్రక్రియలో తొలి దశగా నిర్వహించే ఏఎఫ్‌క్యాట్ మొత్తం 4 విభాగాల్లో (జనరల్ అవేర్‌నెస్, ఇంగ్లిష్ వెర్బల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ అండ్ రీజనింగ్, మిలిటరీ ఆప్టిట్యూడ్ టెస్ట్) 300 మార్కులకు ఉంటుంది. మొత్తం నాలుగు విభాగాల నుంచి 100 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు కేటాయిస్తారు. అదే విధంగా తప్పు సమాధానాలకు నెగెటివ్ మార్కింగ్ నిబంధన కూడా ఉంది. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. పరీక్షకు నిర్దేశించిన సమయం రెండు గంటలు.

టెక్నికల్ బ్రాంచ్(గ్రౌండ్ డ్యూటీ)లో పేర్కొన్న పోస్ట్‌లకు ఏఎఫ్‌క్యాట్‌తోపాటు ఇంజనీరింగ్ నాలెడ్జ్ టెస్ట్ నిర్వహిస్తారు.ఇందులో సంబంధిత సబ్జెక్ట్ నుంచి 50 ప్రశ్నలు అడుగుతారు. ప్రతి ప్రశ్నకు మూడు మార్కులు చొప్పున కేటాయిస్తారు. పరీక్షకు కేటాయించిన సమయం 45 నిమిషాలుగా ఉంటుంది.

ఏఎఫ్ఎస్‌బీ టెస్టింగ్

- ఎంపిక ప్రక్రియలో తొలి దశ ఏఎఫ్‌క్యాట్, ఇంజనీరింగ్ నాలెడ్జ్ టెస్ట్‌లలో విజయం సాధించిన వారికి రెండో దశలో ఎయిర్ ఫోర్స్ సెలక్షన్ బోర్డ్‌ల ఆధ్వర్యంలో ఏఎఫ్ఎస్‌బీ టెస్టింగ్ నిర్వహిస్తారు. ఈ ఎంపిక ప్రక్రియ మొత్తం మూడంచెల్లో ఉంటుంది. వివరాలు..
- **స్టేజ్-1:** ఆఫీసర్ ఇంటెలిజెన్స్ రేటింగ్ టెస్ట్, పిక్చర్ పర్సెప్షన్ టెస్ట్.
- **స్టేజ్-2:** సైకలాజికల్ టెస్ట్. ఇందులో భాగంగా అయిదు రోజులు పాటు పలు అంశాల్లో పరీక్షలు నిర్వహిస్తారు. అదే విధంగా పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటుంది.
- ఫ్లయింగ్ బ్రాంచ్ అభ్యర్థులకు ప్రత్యేకంగా కంప్యూటరైజ్డ్ పైలట్ సెలెక్షన్ సిస్టమ్ (సీపీఎస్ఎస్) విధానంలో ఇంకో పరీక్ష కూడా నిర్వహిస్తారు.
- ఎన్‌సీసీ ఎయిర్ వింగ్ 'సి' సర్టిఫికెట్ ద్వారా ఎన్‌సీసీ ఎంట్రీకి దరఖాస్తు చేసుకున్న వారికి ఏఎఫ్‌క్యాట్ నుంచి మినహాయింపు ఉంటుంది.
- ఏఎఫ్‌క్యాట్‌తో పాటు ఏఎఫ్ఎస్‌బీ ఎంపిక ప్రక్రియలో విజయం సాధించిన వారిని శిక్షణకు ఎంపిక చేస్తారు.

62, 52 వారాల శిక్షణ

- తుది విజేతలుగా నిలిచిన వారికి ఎయిర్‌ఫోర్స్ అకాడమీ(హైదరాబాద్)లో శిక్షణనిస్తారు. ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ-టెక్నికల్ విభాగాలకు ఎంపికైన వారికి 62 వారాలు, గ్రౌండ్ డ్యూటీ(నాన్-టెక్నికల్) బ్రాంచ్‌లకు 52 వారాల పాటు శిక్షణ ఉంటుంది. ఈ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి సంబంధిత విభాగాల్లో ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్‌గా కొలువు ఖరారు అవుతుంది. ప్రారంభంలో.. రూ.56,100-రూ.1,77500 వేతన శ్రేణితో నెల వేతనం అందిస్తారు. శిక్షణ సమయంలో నెలకు రూ.56,100 స్టయిఫండ్ ఇస్తారు.
- ఎయిర్‌ఫోర్స్‌కు ఎంపికైన వారికి షార్ట్ సర్వీస్ కమిషన్ విధానంలో పదేళ్ల పాటు విధులు నిర్వర్తించే అవకాశం కల్పిస్తారు. ఆ తర్వాత ఆసక్తి, ప్రతిభను అనుసరించి మరో నాలుగేళ్లపాటు పొడిగించుకునే అవకాశం ఉంటుంది. షార్ట్ సర్వీస్‌కమిషన్ విధానంలో మొత్తం 14 ఏళ్లు పూర్తి చేసుకున్న తర్వాత పర్మనెంట్ కమిషన్ హోదా పొందే అవకాశాన్ని కూడా ఎయిర్‌ఫోర్స్ కల్పిస్తోంది.

బెస్ట్ స్కోర్‌కు మార్గాలు

జనరల్ అవేర్‌నెస్

చరిత్ర, జాగ్రఫీ, పాలిటీ, ఎకానమీలతోపాటు జాతీయ, అంతర్జాతీయ ప్రాముఖ్యం సంతరించుకున్న అంశాలు, సంఘటనలు, సైన్స్ అండ్ టెక్నాలజీ తాజా పరిణామాలు, రక్షణ రంగంలోని పరిణామాలపై దృష్టి సారించాలి.

ఇంగ్లిష్

కాంప్రెహెన్షన్, ఇంగ్లిష్ గ్రామర్, సెంటెన్స్ కంప్లీషన్, సెంటెన్స్ ఫార్మేషన్, స్పాటింగ్ ద ఎర్రర్, యాంటానిమ్స్, సినానిమ్స్, క్లోజ్ టెస్ట్, ఇడియమ్స్, ఫ్రేజెస్, అనాలజీ, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూషన్‌లపై దృష్టి పెట్టాలి.

న్యూమరికల్ ఎబిలిటీ

టైమ్ అండ్ వర్క్, యావరేజెస్, ప్రాఫిట్ అండ్ లాస్, రేషియోస్, సింపుల్, కాంపౌండ్ ఇంట్రస్ట్, టైమ్ అండ్ డిస్టెన్స్, నంబర్ సిరీస్, పెరిమీటర్, ఏరియా, ప్రాబబిలిటీ అంశాలపై అవగాహన పొందాలి.

రీజనింగ్ అండ్ మిలటరీ ఆప్టిట్యూడ్ టెస్ట్

ఇందులో రాణించడానికి వెర్బల్, నాన్-వెర్బల్ రీజనింగ్ అంశాలతోపాటు.. సీటింగ్ అరేంజ్‌మెంట్, రొటేటెడ్ బ్లాక్స్, హిడెన్ ఫిగర్స్, అనాలజీపై అవగాహన పొందాలి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, డిసెంబర్ 31
- ఏఎఫ్‌క్యాట్ తేదీ: 2025 ఫిబ్రవరి 22, 23 తేదీలు
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://afcat.cdac.in

వార్ధక్యాన్ని నివారించే హార్మోన్ ఏది?


టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
బయాలజీ

మాదిరి ప్రశ్నలు

1. భూమిపై ఉన్న వృక్షాలన్నీ నశిస్తే జీవులన్నీ మరణిస్తాయి. కారణం? (సివిల్స్, 1988)
1) కార్బన్ డై ఆక్సైడ్ లేకపోవడం
2) ఆక్సిజన్ లేకపోవడం
3) 1, 2 4) ఏదీకాదు

2. మడ వృక్షాలు (మంగ్రూవ్ అడవులు) అంటే? (గ్రూప్-1, 1999)
1) నీటి మొక్కలు 2) ఉప్పునీటి వృక్షాలు
3) పండ్లనిచ్చే వృక్షాలు
4) ఆల్గే

3. హైడ్రోపోనిక్స్ అంటే ఏమిటి? (సివిల్స్, 2000)
1) ధ్వని తరంగాలతో నీటిని శుద్ధిచేయడం
2) వాతావరణం, నీరు అవసరం లేకుండా మొక్కలు పెంచే పద్ధతి
3) మృత్తిక అవసరం లేకుండా మొక్కలు పెంచే పద్ధతి
4) తడి గాలిని పంపి మొక్కలను పెంచే పద్ధతి

4. హెర్బేరియం అనేది ఒక.. ? (ఎఫ్ఆర్‌వో, 2005)
1) ఎండు ఔషధ మొక్కల సంకలనం
2) వివిధ ఔషధ మొక్కల తోట
3) విత్తనాలను నిల్వచేసే సంస్థ
4) ఎండు మొక్కల నమూనాలను భద్రపరిచే సంస్థ

5. కాఫీలో కలిపే చికోరి పొడర్‌ను మొక్క ఏ భాగం నుంచి గ్రహిస్తారు? (గ్రూప్-1, 2010)
1) కాండం 2) వేరు
3) ఆకులు 4) విత్తనాలు

6. 'రాడిష్' అనేది ఒక ..? (ఏఈఈ, 2009)
1) బల్బ్ 2) మొక్కజొన్న
3) మార్పుచేసిన వేరు
4) ట్యూబర్

7. వేరు బుడిపెలు ఉన్న పంటలను ఎక్కువగా సాగు చేస్తే నేలలో స్థాపితమయ్యే మూలకం ఏది? (వీడీవో, 1992)
1) కాల్షియం 2) పొటాషియం
3) భాస్వరం 4) నత్రజని

8. అల్లం అనేది ఒక ..? (గ్రూప్-1, 2003, గ్రూప్-4, 1996)
1) కండ కలిగిన వేరు
2) కండ కలిగిన కాండం
3) నిల్వచేసే వేరు
4) ఉపవాయుగత కాండం

9. 'జెనెటిక్స్' అనే పదాన్ని ప్రతిపాదించింది ఎవరు?
1) హ్యూగో డీవ్రీస్ 2) మెండల్
3) బేట్‌సన్ 4) సట్టన్-జొహెన్‌సన్

10. ఆకుల ద్వారా జరిగే ట్రాన్సిపిరేషన్ ప్రక్రియలో పాల్గొనే నిర్మాణాలేవి? (గ్రూప్-2, 2003)
1) క్యూటికిల్ 2) లెంటిసెల్స్
3) స్టొమాట 4) హైడథోడ్స్

11. కుంకుమపువ్వును మొక్క ఏ భాగం నుంచి సేకరిస్తారు? (గ్రూప్-1, 1999)
1) ఎండిన రక్షక పత్రాలు
2) ఎండిన పూమొగ్గలు
3) కీలాగ్రం 4) ఆకర్షణ పత్రాలు

12. కింద పేర్కొన్న పత్రరంధ్రాల ద్వారా నీరు బిందువుల రూపంలో స్రవితమవుతుంది. ఆ నిర్మాణాలను ఏమంటారు? (సివిల్స్, 1996)
1) లెంటిసెల్స్ 2) ఫయలోపోర్
3) హైడథోడ్స్ 4) స్టొమాట

13. పీచర్ ప్లాంట్‌లోని ఏ భాగం పీచర్‌గా మార్పు చెందుతుంది? (సివిల్స్, 2007; ఎఫ్ఆర్‌వో, 2009)
1) కాండం 2) ఆకు
3) స్టిప్యూల్స్ 4) పిటియోల్

14. కింది వాటిలో మాంసాహార మొక్క ఏది? (సివిల్స్, 1996)
1) నెపంథిస్ 2) డ్రాసిరా
3) డయోనియా 4) పైవన్నీ

15. జీవితకాలంలో కొన్ని మొక్కలు ఒకేసారి పుష్పిస్తాయి. వాటిని ఏమని పిలుస్తారు? (గ్రూప్-4, 2010)
1) మోనోకార్పిక్ 2) మోనోగామస్
3) మోనోజెనిక్ 4) మోనోమార్ఫిక్

16. అతిపెద్ద పుష్పం ఏది? (గ్రూప్-4, 2010)
1) క్రైసాంథిమమ్ 2) రఫ్లీషియా
3) సన్‌ఫ్లవర్ 4) జిన్నియా

17. ఆపిల్‌లో తినే భాగం ఏది? (గ్రూప్-4, 1998)
1) కార్పెల్ 2) థాలమస్
3) పెడిసిల్ 4) ఎండోకార్ప్

18. పప్పుధాన్యాల్లో ప్రధానంగా ఉండే పోషక విలువలేవి? (ఏఈఈ, 2009)
1) పిండి పదార్థాలు 2) విటమిన్లు
3) కొవ్వులు 4) మాంసకృత్తులు

19. సుగంధద్రవ్యంగా ఉపయోగపడే లవంగం అనేది ఒక..? (డీఎల్, 2012)
1) వేరు 2) ఫలం
3) ఎండిన విప్పారని పూమొగ్గ
4) కాండం

20. 'చందన వృక్షం' శాస్త్రీయ నామం? (గ్రూప్-4, 2002)
1) సాంటాలమ్ ఆల్బం
2) షోరియా రొబెస్టా
3) సిడ్రస్ డియోడరా 4) పైనస్ రాక్స్‌బర్గై

21. 'మార్ఫిన్'ను మొక్క ఏ భాగం నుంచి సేకరిస్తారు? (గ్రూప్-2 బ్యాక్‌లాగ్, 2003)
1) పుష్పం 2) ఆకు
3) పండు/కాయ లేటెక్స్ 4) కాండం

22. వృక్ష కణం, జంతు కణానికి మధ్య తేడా? (వాటర్‌వర్క్స్ మేనేజర్, 2008)
1) కేంద్రకం 2) ప్లాస్మాత్వచం
3) క్లోరోప్లాస్ట్ 4) మైటోకాండ్రియా

23. సూక్ష్మదర్శిని ద్వారా కణాన్ని పరిశీలించిన తొలి శాస్త్రవేత్త ఎవరు? (గ్రూప్-2 బ్యాక్‌లాగ్, 2000)
1) రాబర్ట్ హుక్ 2) ఎ.వి. లీవెన్‌హుక్
3) టి. ష్వాన్ 4) ఎం.జె. ష్లైడన్

24. కింది వాటిలో ప్రోకారియోటిక్ (కేంద్రక పూర్వ) కణం కానిది?
1) క్లోరెల్లా 2) ఈస్ట్
3) క్షయ బ్యాక్టీరియా 4) 1, 2

25. వాణిజ్యపరంగా 'కార్క్' అనేది ఏ వృక్షం నుంచి తీసిన బెండు?
1) ఎల్మ్ 2) విల్లో
3) ఆర్కిడ్ 4) ఓక్

26. 'ప్రతి జీవి దేహం కణాలతో నిర్మితమవుతుంది. జీవుల నిర్మాణాత్మక, క్రియాత్మక ప్రమాణం కణం' అని కణ సిద్ధాంతాన్ని వివరించినవారు? (సివిల్స్, 1998)
1) లూయిపాశ్చర్ 2) రాబర్ట్ హుక్
3) ష్లైడన్-ష్వాన్ 4) లీవెన్‌హుక్

27. జన్యువు (Gene) అంటే? (గ్రూప్-1, 1988)
1) ప్రోటీన్‌లోని అమైనో ఆమ్లం
2) ఆర్ఎన్ఏలో కొంత భాగం
3) డీఎన్ఏ ముక్క
4) సహలగ్న సముదాయం

28. అంతర్లీనంగా దాగి ఉండే లక్షణాన్ని ఏమంటారు? (గ్రూప్-4, 1989)
1) డామినెంట్ 2) F_1 జనరేషన్
3) రెసిసివ్ 4) పైవేవీకాదు

29. హరగోవింద్ ఖురానా చేసిన పరిశోధన ఏమిటి? (పాలిటెక్నిక్ లెక్చరర్, 2011)
1) నూతన కణాల గుర్తింపు
2) ప్రయోగశాలలో కృత్రిమ జన్యువు సృష్టి
3) మొక్కల్లో పరివర్తన
4) జన్యు మార్పిడి

30. 'జన్యువు' అని పేరు పెట్టినవారెవరు?
1) బేట్‌సన్ 2) మెండల్
3) జొహెన్‌సన్ 4) క్రిక్-వాట్సన్

31. జీవ పరిణామ సిద్ధాంతాన్ని తొలిసారిగా శాస్త్రీయంగా ప్రతిపాదించినవారు? (గ్రూప్-1, 1987-88)
1) లామార్క్ 2) డార్విన్
3) డీవ్రీస్ 4) మెండల్

32. 'ది ఆరిజన్ ఆఫ్ స్పీసీస్' గ్రంథకర్త? (గ్రూప్-1, 2003)
1) లామార్క్ 2) చార్లెస్ డార్విన్
3) డీవ్రీస్ 4) మెండల్

33. సముద్రంలో ఏర్పడిన, కిరణజన్య సంయోగ క్రియ జరిపే మొదటి జీవులేవి? (గ్రూప్-2, 2002)
1) శైవలాలు 2) సయనో బ్యాక్టీరియా
3) శిలీంధ్రాలు 4) మొక్కలు

34. ఉత్పరివర్తన పరిణామ సిద్ధాంతాన్ని ప్రతిపాదించినవారు? (సివిల్స్, 2006)
1) డార్విన్ 2) లామార్క్
3) మెండల్ 4) హ్యూగో డీవ్రీస్

35. 'ప్రోటీన్ల కర్మాగారాలు' అని వేటిని పిలుస్తారు?
1) పెరాక్సీజోమ్‌లు 2) రైబోజోమ్స్
3) హరితరేణువు 4) మైటోకాండ్రియా

36. మానవుడి శుక్రకణంలోని క్రోమోజోమ్‌ల సంఖ్య?
1) 46 2) 44+XX
3) 22 4) 23

37. కొబ్బరి అంకురచ్ఛద స్థితి?
1) ఏక స్థితికం 2) ద్వయ స్థితికం
3) త్రయ స్థితికం 4) బహు స్థితికం

38. సమ విభజనను పరిశీలించడానికి అనువైన స్థానం ఏది?
1) కాండం 2) ఉల్లి వేరుకొన
3) మొగ్గ 4) పుష్పంలోని పరాగకోశం

39. డీఎన్ఏ డబుల్ హెలిక్స్ నమూనాను ప్రతిపాదించినవారు?
1) ష్లైడన్ - ష్వాన్ 2) క్రిక్-వాట్సన్
3) బెంథమ్-హుకర్ 4) ఎంగ్లర్ ప్రాంటల్

40. అంటుకట్టడం, గాయాలు మానడంలో ఇమిడి ఉన్న ప్రక్రియ ఏది?
1) ద్విదావిచ్ఛిత్తి 2) బహుదావిచ్ఛిత్తి
3) సమ విభజన 4) క్షయకరణ విభజన

41. పాకిటీన్ ఉపదశ దేనిలో ఉంటుంది?
1) సమ విభజన 2) క్షయకరణ విభజన
3) అసమ విభజన 4) ఏదీకాదు

42. కిరణజన్య సంయోగక్రియ ఏ కాంతిలో ఎక్కువగా జరుగుతుంది?
1) నీలి కాంతి 2) సూర్య కాంతి
3) అరుణ కాంతి
4) అతినీలలోహిత కాంతి

43. క్లోరోఫిల్ అణువులో ఏ మూలకం ఉంటుంది? (గ్రూప్-1, 1999)
1) ఇనుము 2) మెగ్నీషియం
3) కోబాల్ట్ 4) కాల్షియం

44. మానవ నిర్మిత ధాన్యపు మొక్క (Man made cereal)?
1) ఓట్స్ 2) రెపానో బ్రాసికా
3) ట్రిటికేల్ 4) షర్బతి సానోరా

45. నీటిలో కరిగే వర్ణద్రవ్యాలు?
1) క్లోరోఫిల్స్ 2) కెరోటినాయిడ్స్
3) జాంతోఫిల్స్ 4) ఫైకోబిలిన్లు

46. శిలీంధ్రం నుంచి రూపొందించిన ఫైటోహార్మోన్ ఏది?
1) ఆక్సిన్ 2) జిబ్బరెల్లిన్
3) సైటోకైనిన్ 4) ఇథిలీన్

47. అగ్రాధిక్యతకు కారణమైన హార్మోన్ ఏది?
1) ఆక్సిన్ 2) జిబ్బరెల్లిన్
3) సైటోకైనిన్ 4) ఇథిలీన్

48. కింది వాటిలో జిబ్బరెల్లిన్ల చర్య ఏది?
1) మొక్కల పొడవు పెంచుతుంది
2) అన్ని రకాల మొక్కల పొడవు పెంచుతుంది
3) పొట్టి మొక్కల పొడవు మాత్రమే పెంచుతుంది
4) పొడవు మొక్కల పొడవు పెంచుతుంది

49. విత్తన రహిత ఫలాలు ఏర్పడటానికి దోహదపడే హార్మోన్ ఏది?
1) అబ్‌సైసిక్ ఆమ్లం 2) సైటోకైనిన్
3) ఆక్సిన్ 4) జిబ్బరెల్లిన్లు

50. ఫ్రూట్ రైపనింగ్ హార్మోన్ ఏది?
1) అబ్‌సైసిక్ ఆమ్లం 2) ఇథిలీన్
3) సైటోకైనిన్ 4) జిబ్బరెల్లిన్

51. వార్ధక్యాన్ని నివారించే హార్మోన్ ఏది?
1) ఆక్సిన్ 2) సైటోకైనిన్
3) ఇథిలీన్ 4) అబ్‌సైసిక్ ఆమ్లం

52. కణ విభజనను ప్రోత్సహించే హార్మోన్?
1) ఇథిలీన్ 2) సైటోకైనిన్
3) జిబ్బరెల్లిన్ 4) అబ్‌సైసిక్ ఆమ్లం

53. సుప్తావస్థను కలుగజేసే హార్మోన్ ఏది?
1) ఇథిలీన్ 2) సైటోకైనిన్
3) జిబ్బరెల్లిన్ 4) అబ్‌సైసిక్ ఆమ్లం

54. మొక్కల ఆకులు ఆకుపచ్చ రంగులో ఉండటానికి కారణం? (ఏఈ, 2009)
1) మెలనిన్ 2) టానిన్
3) క్లోరోఫిల్ 4) బ్యాక్టీరియా

55. మొక్కల పెరుగుదలకు కావాల్సిన ప్రధాన సమ్మేళనం ఏది? (ఏఈ, 2009)
1) సల్ఫర్ 2) సోడియం
3) కార్బన్ 4) నైట్రోజన్

56. క్వినైన్ దేని నుంచి లభిస్తుంది? (గ్రూప్-2, 2002)
1) మల్బరీ 2) కోకో
3) సింకోనా 4) యూకలిప్టస్

57. 'ద్వి ఫలదీకరణం' ఏ మొక్కల ముఖ్య లక్షణం? (ఎంపీడీవో, 1997)
1) శైవలాలు 2) బ్రయోఫైటా
3) వివృత బీజాలు 4) ఆవృత బీజాలు

58. లిట్మస్ పేపర్ తయారీకి ఉపయోగించే మొక్క ఏది?
1) శైవలాలు 2) శిలీంధ్రం
3) లైకేన్లు 4) ఫెర్న్

59. పిండి పదార్థాలను గుర్తించే రసాయనం?
1) కోబాల్ట్ క్లోరైడ్ 2) అయోడిన్
3) సోడియం హైడ్రాక్సైడ్
4) కాపర్ సల్ఫేట్

60. పాక్షిక స్వయం ప్రతిపత్తి ఉన్న కణాంగం?
1) హరిత రేణువు 2) మైటోకాండ్రియా
3) రైబోజోమ్స్ 4) 1, 2

61. జీవ పరిణామంలో ప్రకృతి ఎన్నిక సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన శాస్త్రవేత్త? (వీడీవో, 1988)
1) లామార్క్ 2) డార్విన్
3) డీవ్రీస్ 4) మెండల్

62. జీవుల్లో వంశపారంపర్య లక్షణాలు కలిగించేది ఏది? (గ్రూప్-2, 1991)
1) ఆర్ఎన్ఏ 2) ఏటీపీ
3) డీఎన్ఏ 4) హిమోగ్లోబిన్

63. క్రోమోజోమ్ సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది ఎవరు? (గ్రూప్-4, 1996)
1) డార్విన్ 2) మెండల్
3) సట్టన్-బవేరి 4) లామార్క్

64. శిశువు లింగ నిర్ధారణ ఎవరిపై ఆధారపడి ఉంటుంది?
1) తల్లి 2) తండ్రి
3) తల్లి, తండ్రి 4) పూర్వీకులు

65. డీఎన్ఏలోని క్రియాత్మక ప్రమాణం?
1) సిస్ట్రాన్ 2) రేకాన్
3) మ్యూటాన్ 4) ఏదీకాదు

66. ఏక సంకర సంకరణంలో F_2 సంతతి జన్యు రూప నిష్పత్తి?
1) 3 : 1 2) 9 : 3 : 3 : 1
3) 1 : 2 : 1 4) 1 : 3

68. ద్విసంకర సంకరణం F_2 తరం దృశ్య రూప నిష్పత్తి?
1) 3:1 2) 9:3:3:1
3) 1:2:1 4) 1:3

69. ఆధునిక జన్యుశాస్త్ర పితామహుడు?
1) మెండల్ 2) టి.హెచ్. మోర్గాన్
3) నిరెన్‌బర్గ్ 4) ఖురానా

70. ఒక జన్యువు - ఒక ఎంజైమ్ సిద్ధాంతం ప్రతిపాదించింది?
1) మెండల్ 2) టి.హెచ్.మోర్గాన్
3) బీడిల్-టాటమ్ 4) ఖురానా

సమాధానాలు

1) 2;	2) 2;	3) 3;	4) 4;	5) 2;
6) 3;	7) 4;	8) 2;	9) 3;	10) 3;
11) 3;	12) 3;	13) 2;	14) 4;	15) 1;
16) 2;	17) 2;	18) 4;	19) 3;	20) 1;
21) 3;	22) 3;	23) 1;	24) 4;	25) 4;
26) 3;	27) 3;	28) 3;	29) 2;	30) 3;
31) 2;	32) 2;	33) 2;	34) 4;	35) 2;
36) 4;	37) 3;	38) 2;	39) 2;	40) 3;
41) 2;	42) 3;	43) 2;	44) 3;	45) 4;
46) 2;	47) 1;	48) 3;	49) 4;	50) 2;
51) 2;	52) 2;	53) 4;	54) 3;	55) 4;
56) 3;	57) 4;	58) 3;	59) 2;	60) 4;
61) 2;	62) 3;	63) 3;	64) 2;	65) 1;
66) 3;	67) 3;	68) 2;	69) 2;	70) 3.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

ఉజ్వల పథకాన్ని ఎప్పుడు ప్రారంభించారు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఎకానమీ

పేదరిక, నిరుద్యోగ నిర్మూలన పథకాలు

1. కింది వాటిలో దేన్ని ప్రత్యేక ప్రాంతాల అభివృద్ధి పథకంగా భావించలేం?
ఎ) కరువు ప్రాంతాల అభివృద్ధి పథకం
బి) ఎడారి ప్రాంతాల అభివృద్ధి పథకం
సి) అటవీ ప్రాంతాల అభివృద్ధి పథకం
డి) గ్రామీణ యువతకు స్వయం ఉపాధిలో శిక్షణ

2. 'సరళీకరణ ఫలితాలు గ్రామీణ పేదలకు చేరడం లేదని, తద్వారా ఆదాయ అసమానతలు పెరుగుతున్నాయ'ని 2001 ఆగస్టు 15న ఎవరు అభిప్రాయపడ్డారు?
ఎ) రాజీవ్ గాంధీ బి) వి.పి.సింగ్
సి) అటల్ బిహారీ వాజ్‌పేయి
డి) దేవెగౌడ

3. వ్యవసాయరంగంలో కౌలు చట్టాలు, మిగులు భూమి పంపిణీ, కమతాల సమీకరణ మొదలైన వాటితో భూసంస్కరణలపై, వ్యవసాయదారులపై జాతీయ విధానం శ్రద్ధ వహించాలని ఎన్నో ప్రణాళిక ముసాయిదా పేర్కొంది?
ఎ) 9వ బి) 10వ సి) 11వ డి) 12వ

4. ఇందిరా ఆవాస్ యోజన ద్వారా భారత్‌లో ఏ ఏడాది నాటికి అందరికీ ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది?
ఎ) 2017 బి) 2020
సి) 2025 డి) 2026

5. ప్రజల భాగస్వామ్యంతో సంపూర్ణ గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా ప్రారంభించిన పథకం?
ఎ) సామాజిక అభివృద్ధి పథకం
బి) ఎడారి ప్రాంత అభివృద్ధి పథకం
సి) కనీస అవసరాల కార్యక్రమం
డి) కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్

6. ఉపాధి హామీ పథకాన్ని మొదటగా ఎప్పుడు ప్రారంభించారు?
ఎ) 1952 బి) 1972-73
సి) 1973-74 డి) 1975

7. భూగర్భ జలాల అభివృద్ధి లక్ష్యంగా ప్రారంభించిన పథకం?
ఎ) సామాజిక అభివృద్ధి పథకం
బి) కనీస అవసరాల కార్యక్రమం
సి) కరవు పీడిత ప్రాంతాల కార్యక్రమం
డి) ఎడారి ప్రాంత అభివృద్ధి పథకం

8. 'క్రాష్ స్కీమ్ ఫర్ రూరల్ ఎంప్లాయిమెంట్'ను ఎప్పుడు ప్రారంభించారు?
ఎ) 1955 బి) 1963
సి) 1970 డి) 1973

9. సాంకేతిక, విత్తపర సహాయం లక్ష్యంగా ప్రారంభమైన పథకం?
ఎ) ఉపాంత రైతులు, వ్యవసాయ కార్మికుల అభివృద్ధి ఏజెన్సీ
బి) ఉపాధి హామీ పథకం
సి) పనికి ఆహారపథకం
డి) ఆక్సిలరేటెడ్ రూరల్ వాటర్ సప్లయ్

10. 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమాన్ని ప్రకటించిందెవరు?
ఎ) మొరార్జీదేశాయ్ బి) ఇందిరా గాంధీ
సి) రాజీవ్ గాంధీ డి) వి.పి.సింగ్

11. ఎడారి ప్రాంత అభివృద్ధి కార్యక్రమాన్ని ఎప్పుడు ప్రారంభించారు?
ఎ) 1965 బి) 1972
సి) 1975 డి) 1977

12. చిన్న రైతుల అభివృద్ధి ఏజెన్సీ కింది ఏ ప్రణాళికలో ప్రారంభమైంది?
ఎ) 2వ బి) 3వ
సి) 4వ డి) 5వ

13. అభివృద్ధి పనుల్లో శ్రామికులకు ఆహార ధాన్యాలను వేతనాలుగా ఇవ్వడం లక్ష్యంగా ప్రారంభమైన పథకం?
ఎ) 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం
బి) పనికి ఆహార పథకం
సి) సమీకృత గ్రామీణాభివృద్ధి కార్యక్రమం
డి) పైవేవీకావు

14. స్వయం ఉపాధి పథకాల్లో గ్రామీణ ప్రాంత యువకులకు శిక్షణ ఎప్పుడు ప్రారంభించారు?
ఎ)1979 బి)1980
సి)1983 డి)1985

15. గ్రామీణ పేదల సంపూర్ణ అభివృద్ధి లక్ష్యంగా 1980లో ప్రారంభమైన పథకం?
ఎ) 20 సూత్రాల ఆర్థిక పథకం
బి) చిన్న రైతుల అభివృద్ధి ఏజెన్సీ
సి) సమీకృత గ్రామీణాభివృద్ధి కార్యక్రమం
డి) ఉపాధి హామీ పథకం

16. గ్రామీణ పేదలకు లాభదాయకమైన ఉపాధి లక్ష్యంగా 1980లో ప్రారంభమైన పథకం?
ఎ) సామాజిక అభివృద్ధి పథకం
బి) జాతీయ గ్రామీణ ఉపాధి కార్యక్రమం
సి) నేషనల్ ఫండ్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్
డి) పైవేవీకావు

17. పనికి ఆహార పథకాన్ని పునర్నిర్మించి ప్రారంభించిన కార్యక్రమం?
ఎ) మధ్యాహ్న భోజన పథకం
బి) విద్యావంతులైన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి
సి) జాతీయ గ్రామీణ ఉపాధి కార్యక్రమం
డి) ప్రధాన మంత్రి రోజ్‌గార్ యోజన

18. గ్రామీణ ప్రాంతాల్లో భూమిలేని పేదల కోసం ఉపాధి హామీ పథకాన్ని ఎప్పుడు ప్రారంభించారు?
ఎ) 1983 బి) 1985
సి) 1987 డి) 1989

19. గ్రామీణాభివృద్ధికి విత్త సహాయాన్ని అందించడం లక్ష్యంగా 1985లో ఏర్పాటు చేసింది?
ఎ) జవహర్ రోజ్‌గార్ యోజన
బి) నేషనల్ ఫండ్ ఫర్ రూరల్ డెవలప్ మెంట్
సి) నెహ్రూ రోజ్‌గార్ యోజన
డి) జాతీయ గ్రామీణ ఉపాధి కార్యక్రమం

20. గ్రామీణ ప్రాంతాల్లో స్వయం ఉపాధి లక్ష్యంగా 1982-83లో ప్రారంభమైన పథకం?
ఎ) డ్వాక్రా
బి)ఆర్.ఎల్.ఇ.జి.పి సి) ఎన్.ఆర్.ఇ.పి
డి) కనీస అవసరాల కార్యక్రమం

21. సబ్సిడీలు, బ్యాంకు విత్తం కల్పన లక్ష్యంగా 1986లో ప్రారంభమైన పథకం?



ఎ) డ్వాక్రా
బి) పట్టణ పేదలకు స్వయం ఉపాధి కార్యక్రమం
సి) మహిళా సమృద్ధి యోజన
డి) గంగా కల్యాణ్ యోజన

22. కింది వాటిలో దేన్ని వేతన ఉపాధి కార్యక్రమంగా భావించవొచ్చు?
ఎ) జవహర్ రోజ్‌గార్ యోజన
బి) సమీకృత గ్రామీణాభివృద్ధి కార్యక్రమం
సి) డ్వాక్రా
డి) మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం

23. ప్రధానమంత్రి సమీకృత పట్టణ పేదరిక నిర్మూలన పథకాన్ని ఎప్పుడు ప్రకటించారు?
ఎ) 1993 బి) 1995
సి) 1997 డి) 1999

24. కింది వాటిలో పట్టణ ప్రాంతాలకు సంబంధించిన వేతన ఉపాధి పథకం?
ఎ) నెహ్రూ రోజ్‌గార్ యోజన
బి) జవహర్ రోజ్‌గార్ యోజన
సి) కమాండ్ ఏరియా అభివృద్ధి కార్యక్రమం
డి) పైవేవీ కావు

25. స్పెషల్ గ్రూప్ ఆన్ టార్గెటింగ్ టెన్ మిలియన్ ఎంప్లాయిమెంట్ ఆపర్చునిటీస్ (2002) కమిటీ అధ్యక్షుడు?
ఎ) ఎస్.పి. గుప్తా బి) టెండూల్కర్
సి) విజయ్ కేల్కర్ డి) బరూచా

26. గ్రామీణ ప్రాంతాల్లో వంద రోజుల ఉపాధి కల్పన లక్ష్యంగా 1993లో ప్రారంభించిన పథకం?
ఎ) జవహర్ రోజ్‌గార్ యోజన
బి) నెహ్రూ రోజ్‌గార్ యోజన
సి) ఉపాధి హామీ పథకం
డి) మహిళా సమృద్ధి యోజన

27. పోస్టాఫీసుల్లో గ్రామీణ మహిళల పొదుపును ప్రోత్సహించడానికి ప్రారంభించిన పథకం?
ఎ) మహిళా సమృద్ధి యోజన
బి) గంగా కల్యాణ్ యోజన
సి) కనీస అవసరాల కార్యక్రమం
డి) రాజ రాజేశ్వరి మహిళా కల్యాణ్ యోజన

28. స్వర్ణ జయంతి శహరీ రోజ్‌గార్ యోజనను ఎప్పుడు ప్రారంభించారు?
ఎ) 1994 బి) 1995
సి)1996 డి) 1997

29. పేదల ఆహార భద్రత లక్ష్యంగా 2000 సంవత్సరంలో ప్రారంభించిన పథకం?
ఎ) ఆశ్రమ బీమా యోజన
బి) జనశ్రీ బీమా యోజన
సి) అంత్యోదయ అన్నయోజన
డి) అన్నపూర్ణ యోజన

30. 'రాజ రాజేశ్వరి మహిళా కల్యాణ్ యోజన (1998)' లక్ష్యం?
ఎ) మహిళలకు విద్యావకాశాల పెంపు
బి) మహిళలకు బీమా రక్షణ
సి) మహిళలకు ఆహార భద్రత
డి) గర్భిణుల సంరక్షణ

31. పెన్షన్ పొందని వృద్ధులకు 10 కిలోల బియ్యం లక్ష్యంగా ప్రారంభించిన పథకం?
ఎ) శిక్షా సయోగ్ యోజన
బి) జనశ్రీ బీమా యోజన
సి) భారత్ నిర్మాణ్
డి) అన్నపూర్ణ యోజన

32. ఇళ్లు, తాగునీరు, పరిశుభ్రత కల్పన లక్ష్యంగా 1999లో ప్రారంభించిన పథకం?
ఎ) భారత్ నిర్మాణ్
బి) స్వర్ణ జయంతి ఆవాస్ యోజన
సి) వందేమాతరం
డి) పైవేవీకావు

33. జవహర్ గ్రామీణ సమృద్ధి యోజనను ఎప్పుడు ప్రారంభంచారు?
ఎ) 1997 బి) 1998
సి) 1999 డి) 2000

34. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక అవసరాలు తీర్చడానికి ఉద్దేశించిన పథకం?
ఎ) ప్రధానమంత్రి గ్రామోదయ యోజన
బి) స్వర్ణ జయంతి గ్రామ స్వరోజ్‌గార్ యోజన
సి) వాల్మీకి అంబేద్కర్ ఆవాస్ యోజన
డి) సంపూర్ణ గ్రామీణ రోజ్‌గార్ యోజన

35. 'సంపూర్ణ గ్రామీణ రోజ్‌గార్ యోజన (2001)' లక్ష్యం?
ఎ) పేద వర్గాలకు బీమా
బి) ఉపాధి, ఆహారభద్రత
సి) గర్భిణుల సంరక్షణ
డి) బాలింతల సంరక్షణ

36. పేద జిల్లాల్లో ఉపాధి కల్పన లక్ష్యంగా 2001లో ప్రారంభించిన పథకం?
ఎ) జయప్రకాశ్ నారాయణ్ రోజ్‌గార్ గ్యారంటీ యోజన
బి) జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం
సి) జవహర్ గ్రామీణ సమృద్ధి యోజన
డి) నేషనల్ ఫుడ్ ఫర్ వర్క్ ప్రోగ్రామ్

37. అనుబంధ వేతన ఉపాధి లక్ష్యంగా 2004లో ప్రారంభమైన పథకం?
ఎ) జాతీయ పనికి ఆహార పథకం
బి) ఎన్ఆర్ఈపీ
సి) భారత్ నిర్మాణ్ డి) వందేమాతరం

38. సోషల్ సెక్యూరిటీ పైలెట్ స్కీం (2004) లక్ష్యం?
ఎ) అనుబంధ వేతన ఉపాధి
బి) అసంఘటిత రంగంలోని శ్రామికులకు బీమా, పెన్షన్, వైద్య సదుపాయాల కల్పన
సి) గర్భిణుల సంరక్షణ
డి) పేద జిల్లాల్లో ఉపాధి కల్పన

39. నేషనల్ సోషల్ అసిస్టెన్స్ ప్రోగ్రామ్‌ను ఎప్పుడు ప్రారంభించారు?
ఎ) 1992 బి) 1993
సి) 1994 డి) 1995

40. పక్కా రోడ్ల ద్వారా గ్రామాలను కలపడానికి ఉద్దేశించిన పథకం?
ఎ) ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన
బి) భారత్ నిర్మాణ్
సి) ఇందిరమ్మ
డి) సంపూర్ణ గ్రామీణ రోజ్‌గార్ యోజన

41. భూమి లేని వ్యవసాయ కార్మికులకు బీమా లక్ష్యంగా 2001లో ప్రారంభమైన పథకం?
ఎ) జనశ్రీ బీమా యోజన
బి) కేటీహార్ మజ్దూర్ బీమా యోజన
సి) జననీ సురక్ష యోజన
డి) శిక్షా సంయోగ్ యోజన

42. పట్టణ ప్రాంతాల్లోని మురికివాడల ప్రజలకు గృహ నిర్మాణానికి ఉద్దేశించిన పథకం?
ఎ) వాల్మీకి అంబేద్కర్ ఆవాస్ యోజన
బి) ఇందిరా ఆవాస్ యోజన
సి) జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం
డి) పీఎం గ్రామోదయ యోజన

43. గర్భిణుల సంరక్షణకు ఉద్దేశించిన పథకం?
ఎ) జననీ సురక్ష యోజన
బి) జనశ్రీ బీమా యోజన
సి) వందేమాతరం
డి) గంగా కల్యాణ్ యోజన

44. తల్లుల సంరక్షణ లక్ష్యంగా 2005లో ప్రారంభించిన పథకం?
ఎ) జననీ సురక్ష యోజన
బి) వందేమాతరం
సి) రాజ రాజేశ్వరి మహిళా కల్యాణ్ యోజన
డి) ఆశ్రయ బీమా యోజన

45. ఉపాధి కోల్పోయిన వారికి నష్ట పరిహారాన్ని అందించే ఆశ్రయ బీమా యోజన ఎప్పుడు ప్రారంభమైంది?
ఎ) 1997 బి) 1999
సి) 2001 డి) 2005

46. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎప్పుడు ప్రారంభమైంది?
ఎ) 2005 ఫిబ్రవరి 2
బి) 2006 ఫిబ్రవరి 2
సి) 2007 ఫిబ్రవరి 2
డి) 2008 ఫిబ్రవరి 2

47. 'ఉజ్వల' పథకాన్ని ఎప్పుడు ప్రారంభించారు?
ఎ) 2005 డిసెంబర్
బి) 2006 డిసెంబర్
సి) 2007 డిసెంబర్
డి) 2008 జనవరి

48. గ్రామీణ ప్రాంతాల్లో పట్టణ సౌకర్యాల కల్పనను 'పుర' పథకాన్ని ఎప్పుడు ప్రారంభించారు?
ఎ) 2002 బి) 2003
సి)2004 డి) 2005

49. సంపూర్ణ గ్రామీణ రోజ్‌గార్ యోజన, జాతీయ పనికి ఆహార పథకం కార్యక్రమాలు దేనిలో విలీనమయ్యాయి?
ఎ) జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం
బి) జె.ఆర్.వై. సి) ఎస్.ఆర్.వై.
డి) ఉజ్వల

50. 2007 అక్టోబర్ 2న ప్రారంభమైన పథకం?
ఎ) భారత్ నిర్మాణ్
బి) ఆమ్ ఆద్మీ బీమా యోజన
సి) నేషనల్ రెన్యువల్ ఫండ్
డి) నేషనల్ రూరల్ హెల్త్ మిషన్

సమాధానాలు

1) డి;	2) సి;	3) సి;	4) బి;
5) ఎ;	6) బి;	7) సి;	8) డి;
9) ఎ;	10) బి;	11) డి;	12) సి;
13) బి;	14) ఎ;	15) సి;	16) బి;
17) సి;	18) ఎ;	19) బి;	20) ఎ;
21) బి;	22) ఎ;	23) బి;	24) ఎ;
25) ఎ;	26) సి;	27) ఎ;	28) డి;
29) సి;	30) బి;	31) డి;	32) బి;
33) సి;	34) ఎ;	35) బి;	36) ఎ;
37) ఎ;	38) బి;	39) డి;	40) ఎ;
41) బి;	42) ఎ;	43) సి;	44) ఎ;
45) సి;	46) బి;	47) సి;	48) బి;
49) ఎ;	50) బి.		

India is younger than the world!



BANK EXAMS
General English

Directions (Q. No. 1-10): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence, mark the number of that part with error as your answer. Mark (5) as your answer, if there is 'No error'.

1. They're charging an exorbitant price (1)/ for fixing the car, (2)/ but they've get us over a barrel (3)/ because we can't do without it. (4)/ No error (5)
2. He accepted (1)/ her apology (2)/ very (3)/ graceful. (4)/ No error (5)
3. His words caused (1)/ a great deal (2)/ of dissension about (3)/ his followers. (4)/ No error (5)
4. The film was highly praised, (1)/ but is (2)/ not a (3)/ commercial success. (4)/ No error (5)
5. I didn't have (1)/ any money to give him; (2)/ the much I could do (3)/ was offer him my support. (4)/ No error (5)
6. He was asked (1)/ the same question so many time (2)/ that the answer (3)/ became mechanical. (4)/ No error (5)
7. An ounce in liquid (1)/ was different (2)/ from an ounce (3)/ in dry measure. (4)/ No error (5)
8. She was holding (1)/ the wheel with one hand (2)/ and waves (3)/ with the other. (4)/ No error (5)
9. It wasn't really (1)/ a propitiate moment (2)/ to raise the subject (3)/ of my pay rise. (4)/ No error (5)
10. Now that television has become (1)/ important in elections, (2)/ a new set off circumstances (3)/ has come into play. (4)/ No error (5)

Directions (Q. No. 11-20): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in **bold** to help you locate them while answering some of the questions.

In seven years, India will **surpass** China to become the world's most **populous** country and will have 1.7 billion residents by 2050, new projections from the United Nations show. Experts, however, caution that India might be lowering its fertility at a faster rate than what the U.N.'s projections indicate. The 2015 revision to the U.N.'s World Population Projections was released early on Thursday. The world population reached 7.3 billion as of mid-2015, adding approximately one billion people in the past 12 years. The world population, however, is growing slower now; 10 years ago, the growth rate was 1.24 per cent a year, while today, it is growing by 1.18 per cent or approximately, an additional 83 million people annually. It will take 15 years to add the next billion people, taking the world population to 8.5 billion in 2030. By 2050, the world will have 9.7 billion people and 11.2 billion by 2100. As a region, Africa will have its population - **propelled** to a large extent by Nigeria which will be the third largest populated country in the world in 2050 overtaking the U.S. — grow the fastest. The population of 48 countries, most of them in Europe and including Japan, will in contrast **shrink** between 2015 and 2050.

The median age of the global population — that is, the age at which half the population is older and half is younger — is 29.6. About one-quarter (26 per cent) of the world's people are under 15 years of age, 62 per cent are aged 15 to 59, and 12 per cent 60 or above. India is younger than the world; the median age is a full three years younger and 28.8 per cent are under the age of 15, while just 8.9 per cent are 60 or over. By 2050, India will have aged significantly, and the share of people over 60 will be twice as big, while the median age will be 37.3.

China's population will start declining by the 2030s, while India's is projected to **decline** only after 2069 when its population is around 1.75 billion. However, demographic experts say the U.N.'s projections may not be keeping pace with the speed at which India is reducing its fertility. As of 2013, India's Sample Registration System (SRS) — the official source of fertility statistics, which come from the Registrar-General's office — said the total fertility rate (average number of children per woman) was down to 2.3. However, the U.N. projects a rate of 2.34 for 2015-20. By the SRS rates, India could reach **replacement** fertility levels — when every woman has just enough children to replace the parents on average — by 2020, but the U.N. projections would see this happening around a decade later.

11. The concern expressed in the passage is
1) The growing age
2) World old age ratio
3) Exponential growth in population
4) Median age of people in Africa
5) Japan's mortality rate

12. The third largest populated country in the world is located in
1) Nigeria 2) Asia 3) Japan
4) Africa 5) Europe

13. India is younger than the world means:
1) India is a budding country
2) India is a developing nation
3) India is a country with lower fertility rate
4) Every woman has just enough children to replace the parents
5) The population of the younger folks is relatively high

14. What does the author say about the world population?
1) It is steadily making a progress
2) It is showing larger growth beyond control
3) It is difficult to control the population for the next ten years
4) It is growing slower now when compared with the last decade
5) The rise in population indicates rise of problems

Directions (Q. No. 15-17): Choose the word which is MOST SIMILAR in meaning to the word printed in bold.

15. Surpass
1) Beside 2) Besides 3) Exceed
4) Limit 5) Confide

16. Populous
1) Crowded 2) Demur 3) Protest
4) Cozy 5) Homely

17. Replacement
1) Postpone 2) Proxy 3) Privy
4) Pilferage 5) Procrastinate

Directions (Q. No.18-20): Choose the word which is OPPOSITE in meaning to the word printed in bold.

18. Decline
1) Refuse 2) Reject 3) Reflect
4) Rebuff 5) Recognize

19. Shrink
1) Shrivel 2) Shiver 3) Nurture
4) Wither 5) Smallest

20. Propel
1) Force 2) Boost 3) Vigor
4) Weakness 5) Energy

Directions (Q. No. 21-30): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

Former President, top scientist, Bharat Ratna, Missile Man of India.... These are just some of the ____ (21) that come ____ (22) the name of APJ Abdul Kalam who died in Shillong, collapsing in the middle of what he loved doing most - talking to students. He was 83. Born on 15th October 1931 in Rameswaram ____ (23) Tamil Nadu to humble parents - his father was a boat owner - APJ Abdul Kalam distributed newspapers at ____ (24) time to support his family and his education. He graduated with physics from the Madras University, went on to study aerospace engineering, wanted to be a fighter pilot but just missed that bus. But there was no stopping him. The DRDO, ISRO, chief scientific advisor to the prime minister in 1992, the Pokhran 2 nuclear tests... Abdul Kalam straddled them all, till he ____ (25) India's 11th President in 2002. It was the ____ (26) he will probably be most remembered for - a president who brought Rashtrapati Bhavan to the people.... earning him the tribute of the People's President. Signing the Office of Profit Bill was the toughest decision he had taken during his tenure - that's what Abdul Kalam himself was once quoted saying. There were also controversial decisions - his response to mercy petitions from death row ____ (27) and the imposition of President's Rule in Bihar in 2005. But what he will be ____ (28) for was his engagement with the people ____ (29) children - even after his presidency and the books that he wrote - India 2020 and, of course, Igniting minds. "If you want to shine like a sun, first burn like a sun," APJ Abdul Kalam ____ (30) in one of his inspirational speeches.

21. 1) titles 2) tag 3) names
4) identity 5) headings
22. 1) beside 2) before
3) besides 4) forefront
5) in front
23. 1) for 2) at 3) in
4) with 5) from
24. 1) an 2) the 3) previous
4) one 5) early
25. 1) elected 2) elect 3) is elected
4) has elected 5) was elected
26. 1) role 2) character
3) attitude 4) behavior
5) roll
27. 1) acquit 2) convicts
3) exonerates
4) release 5) guilty
28. 1) thought 2) taught
3) remembered 4) added
5) recollect
29. 1) special 2) specialty
3) specialist 4) especially
5) particular
30. 1) will say 2) says 3) has said
4) would say 5) had said

Answers

1. 3	2. 4	3. 3	4. 2	5. 3
6. 2	7. 2	8. 3	9. 2	10. 3
11. 3	12. 4	13. 5	14. 4	15. 3
16. 1	17. 2	18. 5	19. 3	20. 4
21. 1	22. 2	23. 3	24. 4	25. 5
26. 1	27. 2	28. 3	29. 4	30. 5